ఈనాడు

విజయవాడ 8-12-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 118
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



బ్రోచర్లు చూసి బోల్తా పడొద్దు

• అడ్వాన్సులు తీసుకుని బోర్డు తిప్పేస్తున్న మోసగాళ్లు • ఫ్లాట్లు, స్థలాలు కొనేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

విశాఖలో ఓ బిల్డర్ తాను చేపట్టబోయే ప్రాజెక్టుపై ఆకట్టుకునేలా బ్రోచర్ ముద్రించారు. ప్రాజెక్టులో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రచారం చేశారు. అనేకమంది అడ్వాన్సులు చెల్లించి ఫ్లాట్లు బుక్ చేసుకున్నారు. ప్రాజెక్టును అరకొరగా పూర్తిచేసి కొన్ని ఫ్లాట్లే కేటాయించారు. బ్రోచర్లలో చూపించిన సౌకర్యాలు కల్పించలేదేమని అడిగినా ఫలితం లేకపోవడంతో బాధితుల్లో 60% మంది గత ఏడాది ఏపీ రెరాను ఆశ్రయించారు. అడ్వాన్స్ సొమ్మును వడ్డీతో బాధితులకు తిరిగి చెల్లించాలని బిల్డర్‌ని రెరా ఇటీవల ఆదేశించింది.

ఈనాడు – అమరావతి

బ్రోచర్లు చూసి ఫ్లాట్లు కొనేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోపోతే తర్వాత నష్టపోయే ప్రమాదం ఉంది. కొన్ని సంస్థలు, వ్యాపారులు అడ్వాన్స్‌లు తీసుకున్నా, పనులు మాత్రం ప్రారంభించరు. ఇంకొందరు పనులు అసంపూర్తిగా నిలిపేస్తున్నారు. ఫ్లాట్లు చేతికి రాకపోగా అడ్వాన్స్‌గా ఇచ్చిన మొత్తాలు తిరిగి వసూలు చేసుకోడానికి తంటాలు పడాల్సి వస్తోంది. రాష్ట్ర స్థిరాస్తి వ్యాపార నియంత్రణ సంస్థ (రెరా)కు ఏటా వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా ఇలాంటివే ఉంటున్నాయి. విశాఖ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ప్రాజెక్టు పూర్తయ్యాకా ఫిర్యాదు చేయొచ్చు

- గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్లలోనూ.. బిల్డర్లు కల్పించే సదుపాయాల వివరాలు పొందుపరుస్తారు. ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తవుతుందో తెలుపుతారు. ఆ తేదీలోగా డెవలపర్లు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) తీసుకోవాలి.
- బిల్డర్లకు ఓసీ జారీచేసే ముందు ప్లానింగ్ అథారిటీతో పాటు మున్సిపల్, పంచాయతీ, పట్టణాభివృద్ధి సంస్థలు, రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తనిఖీలు చేస్తారు. రిజిస్ట్రేషన్‌లో ప్రస్తావించినట్లు సౌకర్యాలు, ఇతర హామీలు డెవలపర్లు కచ్చితంగా అమలుచేశారా? లేదా? అనేది పరిశీలిస్తారు.
- హామీలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే వాటిని పూర్తిచేయాలని బిల్డర్లను ఆదేశిస్తారు.
- ఓసీ ఇచ్చినా నిర్మాణ పనుల్లో లోపాలుంటే కొనుగోలుదారులు ఐదేళ్లలోపు రెరాలో ఫిర్యాదు చేయొచ్చు.

రెరా నకిలీ లోగోలతోనూ టోకరా

- గతంలో కొందరు రిజిస్ట్రేషన్ ఉన్నట్లుగా బ్రోచర్లు, ఫ్లెక్సీలపై రెరా నకిలీ లోగో ముద్రించి మోసగించారు. రెరా వెబ్‌సైట్‌ను పరిశీలిస్తే

(మిగతా 2లో)

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే..



➤ ఫ్లాట్ కొనేముందు బ్రోచర్లలో ముద్రించిన రెరా రిజిస్ట్రేషన్ నంబరు తనిఖీ చేయాలి. ఆ నంబరు ఆధారంగా రెరా వెబ్‌సైట్‌లో 18 రకాల వివరాలు చూసుకోవచ్చు.

➤ నిర్మాణ సంస్థలు, బిల్డర్లు తమ ప్రాజెక్టులను రెరాలో రిజిస్టర్ చేశాక ప్లానింగ్, ఇతర కాంపిటీటివ్ అథారిటీ అనుమతుల ప్రకారమే వెంచర్‌లో పనులు చేయాలి.

బ్రోచర్‌లో వివరాలకు విరుద్ధంగా చేపట్టే పనుల ద్వారా కొనుగోలుదారులకు నష్టం జరిగితే రెరా ద్వారా బిల్డర్ నుంచి పరిహారం కోరొచ్చు.

AP RERA

వందేమాతరంపై చర్చకు 10 గంటలు

- లోక్‌సభలో సమయం కేటాయింపు
- నేడు ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

8లో

పోర్టుల చెంత.. 8 నయా నగరాలు

- వాటికి 100 కి.మీ.ల పరిధిలో అనుబంధ క్లస్టర్లు
- రూ.10,522 కోట్లతో మౌలిక సదుపాయాలు
- ఉపాధి అవకాశాలు, సమగ్ర అభివృద్ధికి బాటలు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ఓడరేవుల వెంట 8 పారిశ్రామిక నగరాలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వినియోగంలో ఉన్న, కొత్తగా నిర్మాణంలో ఉన్న పోర్టుల పరిధిలో వీటిని మెరుగుపరచనుంది. ఆయా పోర్టులు, అవసరాలకు అనుగుణంగా క్లస్టర్ల ఏర్పాటుకు ఏపీ మారిటైం బోర్డు (ఏపీఎంబీ) ప్రతిపాదనలు సిద్ధం చేసింది. విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట, దుగరాజపట్నం, రాంబిల్లి, కృష్ణపట్నం పోర్టుల పరిధిలో వాటిని అభివృద్ధి చేయబోతోంది. పోర్టు నుంచి 100 కి.మీ.ల పరిధిని పోర్టు ప్రాక్సిమల్ ఏరియాగా గుర్తించి, తదనుగుణంగా ప్రణాళికలు, మాస్టర్ ప్లాన్‌ను ఏపీఎంబీ తయారుచేసింది. ఆ పరిధిని గోదాములు, నివాస ప్రాంతాలు, ఆఫీస్ స్పేస్, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుగుణంగా జోన్లుగా విభజించి, వాటి ఆధారంగా భవిష్యత్తులో వచ్చే ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వనున్నారు. దీనికోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఏపీఎంబీ ప్రణాళికలు రూపొందించింది.

క్రమానుగతంగా విస్తరణ: ఇప్పటికే ఉన్న సరకు రవాణా, పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలను వినియోగించుకోవడం ద్వారా పోర్టు ఆధారిత గ్రామాలను సమగ్ర ఆర్థికనగరాలుగా

(మిగతా 2లో)

క్లస్టర్లు.. ప్రత్యేకతలు

- **విశాఖపట్నంలో మెరైన్, ఫార్మా క్లస్టర్:** సముద్ర ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్, ఫార్మా, బయోటెక్ ఎగుమతులు
- **మూలపేట:** ఇంటిగ్రేటెడ్ సీఈటీపీలు, లాజిస్టిక్స్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు ద్వారా ఫార్మా, బయోటెక్, రసాయనాల ఎగుమతులకు అవకాశం
- **రాంబిల్లి:** నౌకాదళానికి అవసరమైన రక్షణ పరికరాల తయారీ జోన్, హై సెక్యూరిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
- **కాకినాడ:** పెట్రోలియం లాజిస్టిక్స్, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు
- **మచిలీపట్నం:** లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్‌తో ఈవీ, ఆభరణాల తయారీ సెజ్, ఆటో విడిభాగాల తయారీ
- **రామాయపట్నం:** ఈ ప్రాంతంలో చమురు నిల్వలు, మిశ్రమం, అంతర్గత పంపిణీ కనెక్టివిటీ బలోపేతం
- **దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్:** మెరైన్ సెజ్, రోబోటిక్ షిప్‌యార్డు, మాడ్యులర్ డ్రై డాక్‌యార్డులతో ఎకోసిస్టమ్ అభివృద్ధి
- **కృష్ణపట్నం ఎలక్ట్రానిక్స్, క్లీన్ ఎనర్జీ క్లస్టర్:** క్లీన్‌టెక్, ఎలక్ట్రానిక్స్ పార్క్, సౌర విద్యుత్, కార్ల ఎగుమతికి వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు

గాడిన పడుతున్న ఇండిగో

- ఎగిరిన 1650 విమానాలు • 650 ఫ్లైట్ల రద్దు
- పదో తేదీ నాటికి సాధారణ స్థితి
- రిఫండ్ల రూపంలో రూ.610 కోట్ల జారీ



ముంబయి: ఇండిగో విమానయాన సంస్థ పరిస్థితి క్రమక్రమంగా మెరుగుపడుతోంది. ఆదివారం ఆ సంస్థ 1650 విమానాలను నడిపింది. రద్దయిన విమానాల సంఖ్య శనివారం (800)తో పోలిస్తే ఆదివారం 650కి తగ్గాయి. నెమ్మదిగా గాడిలో పడుతున్నామని సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పీటర్ ఎల్బెర్స్ తెలిపారు. పదో తేదీకల్లా కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఎయిర్‌పోర్టులకు రావాల్సిన అవసరం లేకుండానే విమానాల రద్దు విషయాన్ని ముందస్తుగానే ప్రయాణికులకు తెలియజేస్తున్నామని చెప్పారు. సమయ పాలనా రేటు కూడా మెరుగుపడుతోందని, ఆరు మెట్రో నగరాల్లో శనివారానికి ఇది 20.7 శాతానికి చేరిందని ఇండిగో వర్గాలు తెలిపాయి. రద్దైన, తీవ్రంగా ఆలస్యమైన విమానాలకు సంబంధించి ఇప్పటివరకు రిఫండ్ల రూపంలో ఇండిగో.. రూ.610 కోట్లు విడుదల చేసిందని ప్రభుత్వం ఆదివారం వెల్లడించింది. మూడు వేల బ్యాగేజీలను కూడా ప్రయాణికులకు అప్పగించిందని తెలిపింది. మిగతా

(మిగతా 2లో)



'కోటి గీతా లేఖన యజ్ఞ' పుస్తకాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అందిస్తున్న సుగుణేంద్ర తీర్థ స్వామి

మన సంస్కృతిని ఎవరూ విచ్ఛిన్నం చేయలేరు

నా స్థైర్యానికి స్ఫూర్తి భగవద్గీతే

ఉడుపి క్షేత్రంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఉడుపి, న్యూస్‌టుడే: దేశ సాంస్కృతిక వ్యవస్థను పాశ్చాత్య స్వార్థపూరిత సమూహంతో సహా ఎవరూ విచ్ఛిన్నం చేయలేరని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 'కొందరు యూరోపియన్ల ఆలోచన ప్రక్రియలతో భారతీయులను బ్రెయిన్‌వాష్ చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. అయినా మనం

(మిగతా 2లో)

రాష్ట్రం.. స్పీడ్‌కు బ్రాండ్



- 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు
- 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం
- కష్టాల్లో మాకు ఎన్ఆర్ఐలు అండగా నిలిచారు
- డాలస్ తెలుగు డయాస్పొరాలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: 'వేగానికి ఏపీ బ్రాండ్‌గా నిలుస్తోంది. యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. పెట్టుబడుల కోసం అన్ని దేశాలకూ వెళ్తున్నాం. 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వాటిద్వారా సుమారు 16 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. పెట్టుబడుల ఒప్పందాలను రాబోయే మూడు నెలల్లో గ్రౌండింగ్ చేస్తాం' అని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి.. డాలస్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పొరా సమావేశంలో పాల్గొన్నారు.

(మిగతా 2లో)

నిర్లక్ష్యాగ్నికి నిండు ప్రాణాలు బలి

గోవా నైట్ క్లబ్‌లో సిలిండర్ పేలుడు • 25 మంది దుర్మరణం

ఊపిరాడకే ఎక్కువ మంది మృతి • రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి • అనుమతుల్లేని నిర్మాణం



అగ్నికి ఆహుతైన గోవాలోని నైట్ క్లబ్ లోపలి భాగం

పణజీ: నిర్లక్ష్యాగ్నికి గోవాలో 25 నిండు ప్రాణాలు బలయ్యాయి. అనుమతి లేకుండా నిర్మించిన ఇరుకైన ద్వారాలున్న భవనంలో ఏర్పాటు చేసిన నైట్ క్లబ్‌లో శనివారం రాత్రి సిలిండర్ పేలి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీనికి బాణసంచా తోడు కావడంతో తీవ్రత పెరిగింది. పణజీకి 25 కిలోమీటర్ల దూరంలోని అర్పోరాలో ఉన్న 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో రాత్రి 11.45 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. అగ్ని ప్రమాదం జరిగిన మొదటి అంతస్తు నుంచి అంతా గ్రౌండ్ ఫ్లోర్‌కు రాగా.. అక్కడా ఊపిరాడక ఎక్కువ మంది చనిపోయారు. చనిపోయిన వారిలో ఐదుగురు పర్యాటకులు, 20 మంది సిబ్బంది ఉన్నారు. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రధాని ప్రకటించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకున్నారు.

ఇరుకైన దారులతో..: ప్రాథమిక విచారణ ప్రకారం.. మొదటి అంతస్తులో సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.

(మిగతా 2లో)

నిర్లక్ష్యాగ్నికి నిండు ప్రాణాలు బలి



అగ్ని ప్రమాదం అనంతరం గోవాలోని నైట్ క్లబ్‌లో ఎగసిపడుతున్న మంటలు



నైట్ క్లబ్‌లో తగలబడిపోయిన బార్

(మొదటి పేజీ తరువాయి)

ఇరుకైన ద్వారాలు ఉండటంతో క్లబ్‌కు వచ్చిన వారు, సిబ్బంది వేగంగా బయటకు రాలేకపోయారు. కొంత మంది గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చినా అక్కడ ఊపిరాడక చనిపోయారు. ప్రమాద సమయంలో క్లబ్‌లో 100 మంది ఉన్నారు. కిచెన్ ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చినా చాలా మంది ప్రాణాలు కాపాడుకోలేకపోయారని హైదరాబాద్‌కు చెందిన ఫాతిమా షేక్ తెలిపారు. ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయని, దీంతో తాము క్లబ్ నుంచి పరుగెత్తుకుని బయటకు వచ్చామని, అప్పటికే క్లబ్ అంతా మంటల్లో చిక్కుకుందని ఆమె వివరించారు. వారాంతం కావడంతో క్లబ్ రద్దీగా ఉందని తెలిపారు. తాటాకులతో తాత్కాలిక నిర్మాణం ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయని వెల్లడించారు.

✦ నృత్యాలు చేస్తున్న సమయంలో బాణసంచా వినియోగంతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయని ఓ పర్యాటకుడు వెల్లడించారు.

✦ అగ్ని మాపక యంత్రాలు ప్రమాద స్థలికి చేరుకోవడానికీ అవకాశం లేకుండా పోయింది. 400 మీటర్ల దూరంలో నీటి ట్యాంకర్లను ఉంచి పైపుల ద్వారా సహాయక చర్యలు చేపట్టాల్సి వచ్చింది.

కూల్చివేతకు మోకాలడ్డు

ఉత్తర గోవాలోని అర్పోరా నది బ్యాక్ వాటర్‌లో ఉన్న ఈ క్లబ్ భవనానికి అనుమతి లేదు. ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు బాగా ఇరుకుగా ఉన్నాయి. వాస్తవానికి స్థానిక అధికారులు ఈక్లబ్ కూల్చివేతకు నోటీసులిచ్చారు. అయితే ఉన్నతాధికార గణం ఈ కూల్చివేతను అడ్డుకుంది.



అగ్నిప్రమాదం జరిగిన గోవాలోని 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్

నలుగురి అరెస్టు

క్లబ్ యజమానితోపాటు జనరల్ మేనేజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. ఇప్పటికే క్లబ్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజీవ్ మోదక్, జనరల్ మేనేజర్ వివేక్ సింగ్, బార్ మేనేజర్ రాజీవ్ సింఘానియా, గేట్ మేనేజర్ రియాంశు ఠాకుర్లను అరెస్టు చేశామని చెప్పారు. యజమానులు సౌరవ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తామని వెల్లడించారు. ప్రమాదం నేపథ్యంలో ముఖ్యమంత్రి వరుస సమీక్షా సమావేశాలను నిర్వహించారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50,000 చొప్పున అందిస్తామని తెలిపారు.

✦ క్లబ్‌ను సౌరవ్ లూథ్రా అనే వ్యక్తి నిర్వహిస్తున్నారని, ఆయనకు భాగస్వామి అయిన గౌరవ్ లూథ్రాతో విభేదాలున్నాయని అర్పోరా-నగోవా సర్పంచి రోషన్ రేడ్కర్ తెలిపారు. ఒకరిపై ఒకరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసుకున్నారని, తనిఖీ చేయగా క్లబ్ నిర్మాణానికి అనుమతి లేదని వెల్లడైందని వివరించారు. దీంతో కూల్చివేతకు నోటీసు ఇచ్చామని, కానీ డైరెక్టరేట్ ఆఫ్ పంచాయత్స్ ఉన్నతాధికారుల నుంచి కూల్చివేయవద్దని ఆదేశాలొచ్చాయని తెలిపారు.

✦ గోవా నైట్ క్లబ్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ డిమాండు చేశారు. ఇది కచ్చితంగా భద్రత, పాలనా వైఫల్యమేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండు చేశారు.

ముగ్గురి సస్పెన్షన్

అక్రమంగా నిర్మించిన గోవా నైట్ క్లబ్‌కు అనుమతులిచ్చిన అధికారులపై ఆదివారం సాయంత్రం వేటు పడింది. 2023లో అనుమతి ఇచ్చిన అప్పటి పంచాయత్ విభాగం డైరెక్టర్ సిద్ధి తుసార్ హర్లంకర్‌తో పాటు అప్పటి కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి షర్మిలా మోంటీరో, అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘువీర్ బాగ్‌కర్‌లను ప్రభుత్వం సస్పెండు చేసింది.

✦ క్లబ్‌కు వాణిజ్య లైసెన్సు ఇచ్చిన సర్పంచి రోషన్ రేడ్కర్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

చనిపోయిన పర్యాటకుల్లో నలుగురు దిల్లీకి, ఒకరు కర్ణాటకకు చెందినవారున్నారు. దిల్లీకి చెందిన సరోజ్ జోషి, అనితా జోషి, కమలా జోషి, వినోద్ కుమార్ మరణించారు. వీరిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు. కర్ణాటకకు చెందిన ఇషాక్ ఈ ఘటనలో మృతి చెందారు.

✦ చనిపోయిన సిబ్బందిలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఐదుగురు, నేపాల్‌కు చెందిన నలుగురు, ఝార్ఖండ్, అస్సాంలకు చెందిన ముగ్గురేసి, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఇద్దరేసి, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒకరున్నారు.

గాయపడిన వారికి గవర్నర్ పరామర్శ

గోవా నైట్ క్లబ్ ప్రమాదంలో గాయపడి గోవా వైద్య కళాశాల, ఆసుపత్రిలో (జీఎంసీహెచ్) చికిత్స పొందుతున్న బాధితులను గవర్నర్ అశోక్ గజపతిరాజు పరామర్శించారు. ఇదో దురదృష్టకర ఘటనని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించానని ఆసుపత్రి బయట ఆయన మీడియాకు తెలిపారు.

చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: గోవాలోని ఓ నైట్‌క్లబ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గాడిన పడుతున్న ఇండిగో

(మొదటి పేజీ తరువాయి)

దేశీయ విమానయాన సంస్థలన్నీ తమ కార్యకలాపాలను సాఫీగా నిర్వహిస్తున్నాయని, ఇండిగో పరిస్థితి కూడా మెరుగవుతోందని.. ఆ సంస్థ ఫ్లైట్ షెడ్యూళ్లు సాధారణ స్థితికి వస్తున్నాయని చెప్పింది.

✦ ఇండిగో సంస్థ, పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ అధికారులకు రవాణా, పర్యాటకంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం సమన్లు పంపే అవకాశం ఉంది. ఇండిగో సంక్షోభాన్ని తాము తీవ్రంగా తీసుకున్నామని స్థాయీ సంఘంలోని ఓ సభ్యుడు తెలిపారు. విమానాలు ఆలస్యం కావడంతో శీతాకాల పార్లమెంటు సమావేశాల కోసం దిల్లీకి వచ్చిన ఎంపీలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రయాణికులకు మానసిక క్షోభ: కేంద్ర మంత్రి

ఇండిగో కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఎంతో మానసిక క్షోభకు గురయ్యారని పౌరవిమానయానశాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ అన్నారు. వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. ఈ పరిస్థితులకు బాధ్యులు ఎవరో గుర్తించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఇండిగో సీఈవోకు మరింత గడువిచ్చిన డీజీసీఏ

విమాన సేవల అంతరాయాలపై ఆదివారం సాయంత్రం కల్లా సమాధానం చెప్పాలంటూ ఇండిగో సీఈవో పీటర్ ఎల్బెర్స్‌కు జారీ చేసిన నోటీసులపై డీజీసీఏ గడువును మరో 24 గంటలు పొడిగించింది. సోమవారం సాయంత్రం ఆరు గంటలకల్లా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇండిగో సీఈవోతో పాటు.. ఆ సంస్థ అకౌంటబుల్ మేనేజర్‌కు కూడా ఈ నోటీసులు డీజీసీఏ శనివారం జారీ చేసిన సంగతి తెలిసిందే.

ఎట్టకేలకు మోదీ సర్కార్ మేల్కొంది: చిదంబరం

ఎట్టకేలకు మోదీ సర్కార్ మేల్కొని, విమాన ఛార్జీలపై పరిమితులు విధించిందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. "ఎకానమీ క్లాస్ ఫ్లైట్ టికెట్ల ఛార్జీలపై పరిమితులు విధించింది. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. అయితే దేశీయ విమానయాన రంగంలో రెండు ప్రధాన సంస్థల గుత్తాధిపత్యం మాత్రమే కొనసాగుతున్నంత కాలం, ఎకానమీ క్లాస్ ఛార్జీలపై పరిమితులు తప్పనిసరిగా అమలులో ఉండాలి" అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

విశాఖలో తొమ్మిది విమానాల రద్దు

విశాఖ (ఎన్ఏడీ కూడలి), గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఇండిగో విమాన సర్వీసుల్లో నెలకొన్న సంక్షోభంతో విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో 9 సర్వీసులు రద్దయ్యాయని విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం ఆదివారం తెలిపారు. 11 విమానాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలోనూ ఇండిగోకు చెందిన పలు సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. అనివార్య కారణాలతో ముంబయి-విజయవాడ సర్వీసును రద్దుచేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది.

శంషాబాద్ విమానాశ్రయంలో సూట్‌కేసులు..ట్రాలీల మాయం

ఈనాడు, హైదరాబాద్-శంషాబాద్, న్యూస్‌టుడే: ఇండిగో ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్య వైఖరితో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు అనుభవిస్తున్న ఇక్కట్లకు మరిన్ని సమస్యలు తోడయ్యాయి. రీ-షెడ్యూల్ విమానాలు గంటలకొద్దీ ఆలస్యం కావడంతో కొందరు ప్రయాణికుల సూట్‌కేసులు, ట్రాలీబాగ్‌లు కనిపించకుండా పోతున్నాయి. ఈ మేరకు ఎక్స్ వేదికగా పలువురు ప్రయాణికులు ఆదివారం అసహనం వ్యక్తం చేశారు. నిష్క్రమణ ద్వారాల వద్ద భద్రతా సిబ్బందిని విచారిస్తే..వందలమంది సూట్‌కేసులు, ట్రాలీలతో వెళ్తున్నారని..వారిలో ఎవరు ఎవరివి తీసుకెళ్తున్నారో కనుక్కోవడం కష్టమని చెబుతున్నారు.



విమానాలు గంటలకొద్దీ ఆలస్యం కావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో పెద్దఎత్తున నిలిచిపోయిన ప్రయాణికుల లగేజీ

126 దేశీయ విమానాలు రద్దు

ఆదివారం రోజు ఇండిగో ఎయిర్‌లైన్స్ 126 దేశీయ విమానాలను రద్దు చేసింది. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన 66 విమానాలు, శంషాబాద్‌కు రావాల్సిన 60 విమానాలు రాలేదు. దీంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లేందుకు రైలు, బస్సు సర్వీసులను ఎంచుకున్నారు. విమానాల రద్దు నేపథ్యంలో 4 ప్రత్యేక రైళ్ల నడపాలని ద.మ.రైల్వే నిర్ణయించింది.

లక్షల మందితో గీతా పారాయణం



శ్రీకృష్ణుడి నామస్మరణ మధ్య లక్షల మంది భక్తులు కోల్‌కతాలోని బ్రిగేడ్ మైదానంలో ఆదివారం భగవద్గీతా పారాయణం చేశారు. కాషాయ వస్త్రాలు ధరించిన సన్యాసులు గీతా శ్లోకాలు పఠించారు. కార్యక్రమంలో పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు. 'ఐదు లక్షల గొంతుకలతో గీతా పఠనం' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. – కోల్‌కతా

మన సంస్కృతిని ఎవరూ విచ్ఛిన్నం చేయలేరు

(మొదటి పేజీ తరువాయి)

వారిని ప్రభావితం చేస్తాం. అది వేదజ్ఞానం, భగవద్గీతలతో పాతుకుపోయిన సనాతన ధర్మానికి ఉన్న శక్తి' అన్నారు. కర్ణాటక రాష్ట్రం ఉడుపి శ్రీకృష్ణ మఠంలో నెలరోజులుగా జరుగుతున్న లక్షకంఠ గీతాగాన కార్యక్రమం ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళూరు వరకు ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయన.. అక్కడి నుంచి రహదారి మార్గంలో ఇక్కడికి చేరుకున్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభాలతో మఠంలోకి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కనకన కిండి నుంచి కృష్ణుడిని దర్శించుకున్నారు. నవగ్రహ కిండి నుంచి మరో దర్శనం చేసుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని, ఉడుపిలోని దైవికశక్తే తనను ఇక్కడికి పిలిపించుకుందన్నారు. తాను నిష్కామ కర్మను అనుసరిస్తానని, గీత స్ఫూర్తితో స్థైర్యాన్ని పొందుతానని పవన్‌కల్యాణ్ తెలిపారు. తనకు ప్రతి శ్లోకానికీ అర్థం తెలియకపోయినా, గీతే తన జీవితాన్ని నడిపిస్తుందని దృఢంగా విశ్వసిస్తానని చెప్పారు. ఎన్నికలు తనను ప్రభావితం చేయవని, తన పోరాటం సత్యశక్తితో కొనసాగుతుందని తెలిపారు. నేటితరం యువత ఓదార్పు, ఆత్మవిశ్వాసం కోసం భగవద్గీతను దగ్గర ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి ఉడుపి ఆధ్యాత్మిక శక్తి కేంద్రమని అభివర్ణించారు. మధ్వాచార్యుడు, కనకదాసుల భక్తి సంపద.. కులాన్ని కూడా అధిగమిస్తుందని పేర్కొన్నారు. గీత ప్రపంచాన్ని తీర్చిదిద్దిన ఒక తత్వమని అభిప్రాయపడ్డారు. గీతను చేతితో రాసిన కోటిమందిని పవన్ అభినందించారు. గో సంరక్షణ భారతీయ సంప్రదాయంలో భాగమని, తాను 60 ఆవులతో గోశాలను నిర్వహిస్తున్నానని చెప్పారు. ద్వేషం లేకుండా సంస్కృతి కోసం స్వరాన్ని పెంచాలని తన విశ్వాసం నేర్పుతోందని తెలిపారు. ఇతరులు మన ధర్మం మీద దాడులు చేస్తున్నారనడం కంటే ముందు మన ధర్మాన్ని మనం పరిరక్షించుకోవాలి, ఇతరులు మనపై దాడిచేయకుండా గళమెత్తాలన్నారు. తమిళనాడులో మన ధర్మాన్ని మనం అనుసరించడం కోసం అక్కడివారు న్యాయపోరాటాలు చేయాల్సి వస్తోందని తెలిపారు. ఏపీలో ఎన్నికలకు ముందు కురుక్షేత్రంలో అర్జునుడిలాగే తనలోనూ చాలా సందేహాలొచ్చాయని, అప్పుడు భగవద్గీతను స్మరించుకుని, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని భావించి.. 21 స్థానాల్లోనే పోటీ చేసినట్లు చెప్పారు.



ఉడుపి క్షేత్రంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కంకణధారణ చేస్తున్న సుగుణేంద్ర తీర్థ స్వామి

త్యాగరాజ కీర్తనలు గుర్తించాలి..

అంతకుముందు పుత్తిగె విద్యాపీఠం 38వ స్నాతకోత్సవం, పడిగారు విద్యాపీఠం మొదటి స్నాతకోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. శంకర, రామానుజాచార్య, బసవణ్ణ, మధ్వాచార్యుల చరిత్రను ఆంధ్రప్రదేశ్‌లోని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, త్యాగరాజు రాసిన 24 వేల కీర్తనల్లో 700 అందుబాటులో ఉండగా, మిగిలిన వాటిని గుర్తించేందుకు ఒక సమితిని ఏర్పాటు చేయాలని మఠం ప్రతినిధులు పవన్‌ను కోరారు. గీతా సారాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ ఉపముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పవన్ కల్యాణ్‌కు 'అభినవ కృష్ణ దేవరాయ' అనే బిరుదును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తితిదే బోర్డు సభ్యుడు బి.ఆనంద్ సాయి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శక్తి పీఠం.. ఉడుపి

'భారతదేశ ఆధ్యాత్మిక శక్తి కేంద్రం ఉడుపి పవిత్ర భూమిలో ఉండడం నాకు చాలా ఇష్టం. ఇక్కడ శ్రీకృష్ణుడు శాశ్వత కృపతో.. ముఖ్యప్రాణ హనుమంతుడు శాశ్వత సంరక్షకుడిగానూ ఉంటారు. జగద్గురు శ్రీమధ్వాచార్యులు తన అపరిమితమైన జ్ఞానంతో అనేక తరాలను చైతన్యం చేస్తూ వస్తున్నారు' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

'సుగుణేంద్ర తీర్థస్వామి దార్శనిక మార్గదర్శకత్వంలో చేతితో రాసిన కోటి గీతల ప్రాజెక్టు నుంచి ఇప్పుడు లక్ష కంఠాలతో పారాయణం వరకు అన్ని కార్యక్రమాలూ ప్రపంచవ్యాప్తంగా భక్తులకు స్ఫూర్తినిస్తాయి. భగవద్గీత సందేశం మనకు మార్గనిర్దేశం చేస్తుంది. సమాజాన్ని బలోపేతం చేస్తూ, మన జాతీయ స్ఫూర్తిని పెంచుతుంది. జై శ్రీకృష్ణ. జై హనుమాన్. జైహింద్' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

రాష్ట్రం.. స్పీడ్‌కు బ్రాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'చంద్రబాబును వైకాపా ప్రభుత్వం 53 రోజులు అక్రమంగా జైలులో ఉంచినపుడు ప్రవాసాంధ్రులు మద్దతుగా నిలిచారు. మాకు అండగా నిలిచిన వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం' అని అన్నారు. 'చదువుకుని మంచి ఉద్యోగాల కోసం మీరు ఇంత దూరం వచ్చారు. కేవలం జాబ్ సీకర్స్‌గా మాత్రమే కాకుండా.. జాబ్ క్రియేటర్స్‌గా తయారుకావాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మీకు అండగా ఉంటుంది' అని లోకేశ్ అన్నారు. విదేశాల్లో చదువుకోవాలనుకునే వారికి వచ్చే ఏడాది నుంచి 'కలలకు రెక్కలు' పేరుతో అండగా నిలుస్తామని చెప్పారు.

'తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ దేశానికి చాటిచెప్పారు. అభివృద్ధి చేసి ఎన్నికల్లో విజయం సాధించవచ్చని చంద్రబాబు నిరూపించారు. చంద్రబాబు దార్శనిక నాయకుడు. గతంలో ఐటీ.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన స్పీడ్‌ను ఇప్పటికీ అందుకోలేకపోతున్నా' అని చెప్పారు. 'ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉంది. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. అన్ని ప్రాంతాలనూ సమగ్రాభివృద్ధి చేస్తున్నాం. గుజరాత్, ఒడిశాలలో కొన్నేళ్లుగా ఒకే ప్రభుత్వం ఉండటం వల్ల అభివృద్ధి సాధ్యమైంది. అలాగే ఏపీలోనూ ప్రభుత్వం కొనసాగింపు అవసరం. కలిసికట్టుగా పనిచేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పదేపదే చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 15 ఏళ్లు అధికారంలో ఉంటుంది' అని పేర్కొన్నారు.



డాలస్‌లో తెలుగు డయాస్పోరాకు హాజరైన మంత్రి లోకేశ్‌తో కరచాలనం చేస్తున్న స్థానిక తెలుగు ప్రజలు



డయాస్పోరాలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండ వేస్తున్న మంత్రి లోకేశ్, కోమటి జయరాం తదితరులు

వారిని వదలిపెట్టను

'వైకాపా హయాంలో మనమంతా విధ్వంసకర పాలన చూశాం. ఇంటినుంచి బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి. మెడపై కత్తి పెట్టినా జై తెలుగుదేశం అన్న చంద్రయ్య, స్థానిక సంస్థల ఎన్నికల్లో పుంగనూరులో ఎదురొడ్డి నిలబడ్డ అంజిరెడ్డి మనకు స్ఫూర్తి. ప్రజలను భయపెడుతూ వై నాట్ 175 అని వైకాపా అంటే.. వైనాట్ 11 అని ప్రజలే ఆ పార్టీని ప్రజలు భూస్థాపితం చేశారు. రెడ్‌బుక్ తనపని తాను చేసుకుపోతుంది. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదలిపెట్టం. నా తల్లిని అవమానించిన వారిని వదలిపెట్టను. స్త్రీలను గౌరవించాలనేది చంద్రబాబు విధానం' అని లోకేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షులు వేమూరు రవికుమార్, ఎన్ఆర్‌టీ తెదేపా యూఎస్ఏ సమన్వయకర్త కోమటి జయరాం, టెక్సస్‌లోని గార్లాండ్ నగర మేయర్ డైలాన్ హెడ్రిక్ పాల్గొన్నారు.

పోర్టుల చెంత.. 8 నయా నగరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతీకరించాలని అధికారులు ప్రణాళిక రచించారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ వ్యవస్థలు, ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్‌లు) ఏర్పాటు చేయడం ద్వారా వివిధ క్లస్టర్లు రూపుదిద్దుకుంటాయి. ఉదాహరణకు ఎంఎస్ఎంఈలు, నౌకానిర్మాణం, ఉక్కు పరిశ్రమలు, లాజిస్టిక్స్ సంస్థలు విస్తరిస్తాయి. తద్వారా తీరప్రాంతంలో పట్టణీకరణ, ఉపాధి అవకాశాలు, ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుంది.

ఏ పోర్టు పరిధిలో ఏ సౌకర్యాలు?

పోర్టు ప్రాక్సిమల్ ఏరియాలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.10,522.90 కోట్లతో పనులు చేపట్టాలని ప్రతిపాదనలు రూపొందించారు. సాగరమాల ఫేజ్-2 కింద ఈ ప్రాజెక్టులు సాధించేలా కేంద్రంతో రాష్ట్ర అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఇవీ ప్రతిపాదనలు..

మచిలీపట్నం పోర్టులో విద్యుత్ సరఫరా పనులకు: రూ.50 కోట్లు, ఇక్కడే నీటి సరఫరాకు: రూ.50 కోట్లు, పోర్టు పరిధిలో అభివృద్ధికి: రూ.2,089.48 కోట్లు

కృష్ణపట్నం పోర్టు పరిధిలో అభివృద్ధి పనులకు: రూ.1,376.62 కోట్లు

మూలపేట పోర్టు పరిధిలో: రూ.6,742.80 కోట్లు

రామాయపట్నం పోర్టు పరిధిలో రోడ్లకు: రూ.120 కోట్లు, విద్యుత్ సరఫరాకు: రూ.50 కోట్లు, నీటి సరఫరాకు: రూ.50 కోట్లు.

బ్రోచర్లు చూసి బోల్తా పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ ఉందో, లేదో తెలుసుకోవచ్చు.

■ పట్టణాభివృద్ధి సంస్థ (యూడీఏ) నుంచి లేఔట్‌కు, పుర, నగరపాలక సంస్థల్లో అపార్ట్‌మెంట్‌కు అనుమతులు ఉన్నాయని, రెరా రిజిస్ట్రేషన్ అవసరం లేదన్న వ్యాపారుల మాటల్లో నిజం లేదని కొనుగోలుదారులు గుర్తించాలి.

హెల్ప్ డెస్క్‌లో సంప్రదిస్తే..

–శివారెడ్డి, ఏపీ రెరా ఛైర్మన్

అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కొనేముందు ప్రాజెక్టుకు రెరా రిజిస్ట్రేషన్ ఉందో, లేదో తెలుసుకోవాలి. రెరా హెల్ప్‌డెస్క్‌లో (6304906011) సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. రెరా రిజిస్ట్రేషన్ లేకుండా బ్రోచర్లు ముద్రించి మార్కెటింగ్ చేయడం చట్టరీత్యా నేరం. కొనుగోలుదారులు ఇలాంటి విషయాలు విధిగా తెలుసుకోవాలి. అడ్వాన్సు తీసుకుని సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేయకపోయినా, మోసపోయినట్లు భావించినా రెరాలో ఫిర్యాదు చేయొచ్చు.



వీటిని బహుమతులుగా ఇద్దాం

మన బంధువులు, స్నేహితుల వివాహాలు, పుట్టినరోజు వంటి వేడుకలకు వారి ఆరోగ్యాన్ని పరిరక్షించే పరికరాలను బహుమతులుగా ఇచ్చే అలవాటు చేసుకుందాం. అలాంటి వస్తువుల్లో కొన్ని.. ✦ ఎయిర్ ఫిల్టర్లు. ✦ నాన్ టాక్సిక్ ఎయిర్ ఫ్రైయర్లు. ✦ న్యూబెల్ డంబెల్స్. ✦ షవర్ వాటర్ ఫిల్టర్లు. ✦ స్టెయిన్‌లెస్ స్టీల్ కుకింగ్ పాన్లు. ✦ ఆర్వో వాటర్ ఫిల్టర్లు. ✦ ఆర్గానిక్ దుస్తులు.

– డాన్ గో, ఫ్యాట్ లాస్ కోచ్

గ్రహం అనుగ్రహం

8–12–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
చవితి: రా. 9-20 తదుపరి పంచమి
పునర్వసు: ఉ. 9-25 తదుపరి పుష్యమి
వర్జ్యం: సా. 5-08 నుంచి 6-40 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-08 నుంచి 8-39 వరకు
తిరిగి రా. 2-23 నుంచి 3-56 వరకు
దుర్ముహూర్తం: మ. 12-13 నుంచి 12-57 వరకు
తిరిగి 2-26 నుంచి 3-09 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.22; సూర్యాస్తమయం: సా.5.22
సంకట హర చతుర్థి

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	15.8	30.7
విశాఖపట్నం	17.4	29.0
శ్రీకాకుళం	18.0	28.0
విజయనగరం	18.0	28.0
కడప	18.0	28.0
అనంతపురం	18.0	29.6
మహబూబ్‌నగర్	18.1	32.4
రాజమహేంద్రవరం	19.0	33.5
విజయవాడ	19.4	29.6
నరసాపురం	19.8	32.3
కర్నూలు	20.0	30.3
ఒంగోలు	21.5	30.5
గుంటూరు	22.0	28.0
నెల్లూరు	22.2	28.7
తిరుపతి	24.0	32.0

ఈ వరి.. పోషకాల సిరి

చిత్తూరు జిల్లాలో వందల ఏళ్లనాటి రకం సాగు ● సువాసన వెదజల్లే అన్నం.. తింటే ఎంతో ఆరోగ్యం

న్యూస్‌టుడే – పలమనేరు

చైనాలో ఒక రకం వరిని ఒకసారి నాట్లు వేసుకుంటే ఐదుసార్లు పంట తీసుకోవచ్చనేది ఇటీవల బాగా ప్రచారం పొందుతున్న అంశం. జన్యుమార్పిడి కారణంగా అలాంటి దిగుబడి వస్తుందట. వాటి కంటే ఆరోగ్యకరమైన సంప్రదాయ వరి వంగడం ఒకటి ఉత్తమమైనది చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన చందోల్ కుమార్‌రెడ్డి చెబుతున్నారు. 'తులసి-బాసో' అనే బెంగాల్ దేశీయ వరి రకాన్ని ఆయన సాగు చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నాటి అరుదైన ఈ వరి రకాన్ని ఆ రాష్ట్రంలోని రైతులు తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు 'విత్తన మేళా'లు జరిగిన చోట ఇలాంటి అరుదైన వరి వంగడాలను ఇచ్చి పుచ్చుకుంటున్నారు. అలా సేకరించిన వరి వంగడంతోనే కుమార్‌రెడ్డి ఈ 'తులసి-బాసో' రకాన్ని స్థానికంగా ఒక ఎకరాలో సాగు చేస్తున్నారు.


వరి పంట నూర్పిడి చేస్తున్న రైతులు

ప్రత్యేకతలు..

'తులసి-బాసో' వరి రకం పరిమళభరితమైంది. బెంగాల్‌లో దీనిని సెంటెండ్ రకం అని కూడా పిలుస్తారు. బాస్మతి లాగా సువాసన ఉండడంతో పాటు మన చిట్టిముత్యాల మాదిరిగా చిన్న గింజ ఉంటుంది. ఈ బియ్యంతో అన్నం వండుకుంటే మధురంగా ఉండటమే కాకుండా ఎక్కువగా తిన్నా భుక్తాయాసం రాదు. కార్బొహైడ్రేట్లు తక్కువ ఉంటాయని.. ప్రొటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. పోషకాలు తగిన మోతాదులో ఉండటం వల్ల ఇది లోగ్లైసిమిక్ ఇండెక్స్ ఉన్న బియ్యంగా గుర్తింపు పొందడంతో దేశీయ విత్తన మేళాలో ఈ రకం వంగడాలను ప్రదర్శిస్తుంటారు.


వరి కంకులు

పంట కాలం ఇలా..

135 రోజులు రోహిణి కార్తెలో వేస్తే మొదటి పంట 135 రోజులకు వస్తుంది.

రెండో పంట 60 నుంచి 70 రోజులు

మూడో పంట 45 నుంచి 50 రోజులు


మూడుమార్లు కూడా గింజ పరిమాణంలో మార్పు ఉండదు.

ఎకరాకు ఎంత పంట వస్తుంది..?

15 నుంచి 18 క్వింటాళ్లు వస్తుంది.

2వ కోతలో 6 నుంచి 8 క్వింటాళ్లు

3వ కోతలో 5 నుంచి 6 క్వింటాళ్లు


తులసి–బాసో వడ్లు

మార్కెటింగ్ కష్టంగా ఉంది



నేను ఎంఏ బీఈడీ చదివాను. అధ్యాపకుడిగా కొంతకాలం పని చేశా. సంప్రదాయ పంటలపై మక్కువతో ఈ వ్యవసాయం చేస్తున్నా. ఈ రకం వరిపై ప్రజల్లో అవగాహన లేనందున మార్కెటింగ్ కష్టంగా ఉంది. రాష్ట్రంలో ఒకరిద్దరు రైతులు మాత్రమే దీన్ని పండిస్తున్నారు. ప్రజల్లో అవగాహన పెరిగితే మార్కెటింగ్ బాగుంటుంది. ప్రస్తుతం నేను ఆన్‌లైన్ ద్వారా ఈ బియ్యం విక్రయిస్తున్నా. నేరుగా అయితే కిలో రూ.150 నుంచి రూ.180.. ఆన్‌లైన్ ద్వారా అయితే రూ.200కు అమ్ముతున్నా.

– చందోల్ కుమార్‌రెడ్డి, పలమనేరు

ఇవి సంప్రదాయ రకాలు

తులసి-బాసో సంప్రదాయ రకం వరి వంగడం. ఈ బియ్యం ఎంతో ఆరోగ్యకరం. ప్రభుత్వం కూడా ఇలాంటి వరి వంగడాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని చూస్తోంది.

– సంధ్య, ఏవో, పలమనేరు

చిరుధాన్యాల సాగుకు ఐఐఎంఆర్ ప్రోత్సాహకం


హైదరాబాద్‌లోనూ లంబసింగి ఉత్పత్తులు


సంచార వాహనం ప్రారంభోత్సవంలో లంబసింగి ఎఫ్‌పీవో సభ్యులతో ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, శాస్త్రవేత్తలు

చింతపల్లి, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగు వివిధ కారణాలతో కొంతకాలంగా తగ్గుముఖం పడుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) వివిధ రాష్ట్రాల్లో చిరుధాన్యాల సాగు విస్తరణకు ప్రోత్సాహం అందిస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పలు ప్రాజెక్టులను అమలు చేస్తోంది. ఆర్థిక తోడ్పాటుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది. వీటిని అందిపుచ్చుకుంటున్న ఎఫ్‌పీవోలకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని ఐఐఎంఆర్ శాస్త్రవేత్తలు సంకల్పించారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం రాజుపాకలు కేంద్రంగా చిరుధాన్యాల సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పనిచేస్తున్న లంబసింగి ట్రైబల్ ప్రొడక్ట్స్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌కు తమవంతు తోడ్పాటును అందించేందుకు ముందుకొచ్చారు. ఇటీవల హైదరాబాద్‌లో లంబసింగి ఎఫ్‌పీఓ సభ్యులు పండిస్తున్న చిరుధాన్యాలతోపాటు వాటితో తయారుచేసిన విలువ ఆధారిత ఉత్పత్తులను విక్రయించేందుకు వీలుగా సంచార విక్రయశాలను ఐఐఎంఆర్ డైరెక్టర్ తారా సత్యవతి ప్రారంభించారు. చిరుధాన్యాల శాస్త్రవేత్తలు సంగప్ప, రఫీ, శ్రీనివాసబాబు, ఐఐఎంఆర్ ప్రతినిధి రాజేష్, లంబసింగి ఎఫ్‌పీఓ డైరెక్టర్లు ఇందిర, సరోజ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తాం

నగర సుందరీకరణకు మరింత ప్రాధాన్యమిస్తాం: సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: విశాఖలో త్వరలో సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటుచేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. నగర సుందరీకరణ, ప్రజల జీవన ప్రమాణాల్ని మరింత మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉన్నామని ఎక్స్ వేదికగా ఆదివారం తెలిపారు. ''విశాఖలో ఏర్పాటుచేసిన ఫుట్‌పాత్‌లు, హరిత వాతావరణం స్థానికులతో పాటు సందర్శకులకు మరింత మెరుగైన అనుభవాలు ఇస్తున్నాయన్న విషయం నాకు ఆనందంగా ఉంది'' అని పేర్కొన్నారు. "ఫుట్‌పాత్‌ల ఏర్పాటు, మొక్కల పెంపకానికి బెంగళూరుతో పోలిస్తే విశాఖపట్నం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. ఇది చాలా ఆనందకరం. భవిష్యత్తు ఐటీ తరం పురోగతికి ఇది దోహదం చేస్తుంది. దయచేసి సైక్లింగ్ లేన్లను కూడా ఏర్పాటుచేయండి'' అని సివిక్ ఒపీనియన్ ఆఫ్ ఇండియా అనే ఎన్‌జీవో ఎక్స్‌లో ఉంచిన పోస్టుపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఆ పోస్టును తిరిగి పోస్ట్ చేశారు.

అప్పన్నకు సేవాభావంతో సాయం చేశా

జగన్ ఆరోపణలను ఖండించిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: అప్పన్న కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సేవాభావంతో తాను అతనికి రూ.50వేల చెక్కు ఇచ్చానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు నగరం కనుపర్తిపాడులో కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ తనపై అనవసరంగా ఆరోపణలు చేశారని, తానేంటో ఆయన ఆత్మకే తెలుసునన్నారు. ఎవరు చెబితే తాను ఆ చెక్కు ఇచ్చానో మీకు తెలియదా అని జగన్‌ను ప్రశ్నించారు. శ్రీకాకుళానికి చెందిన అప్పన్న పేదవాడు, జరుగుబాటు లేదని వైవీ సుబ్బారెడ్డి దగ్గర చేరితే.. ఆయన సహాయం చేయలేనని తనకు చెబితే.. సాయం చేశానన్నారు. ఇప్పటికీ చాలామందికి సహాయం చేస్తున్నానని వివరించారు.


ఎల్ఆర్ఎస్‌తో పాటే భూ వినియోగ మార్పిడి

పట్టణ ప్రణాళిక విభాగానికే బాధ్యత

ఈనాడు, అమరావతి: లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)లో భాగంగా ఇళ్ల స్థలాలకు భూ వినియోగ మార్పిడి ప్రక్రియనూ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులే చేపట్టనున్నారు. ప్రస్తుతం అనధికార లేఔట్లలో భూ వినియోగ మార్పిడి చేయకపోవడంతో వాటిలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించే క్రమంలో మార్పిడి తప్పనిసరని పట్టణ ప్రణాళిక అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం రెవెన్యూ కార్యాలయాలకు వెళితే నాలా చట్టం రద్దయినందున ఆ ప్రక్రియను చేయలేమనే సమాధానం అధికారుల నుంచి వస్తోంది. ఈ సమస్యలను పరిష్కరించాలని భావించిన ప్రభుత్వం.. పట్టణ ప్రణాళిక అధికారులే భూ వినియోగ మార్పిడి ప్రక్రియనూ పూర్తిచేసేలా ఉత్తర్వులిచ్చింది. ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో ఇందుకు సంబంధించిన మార్పులను చేపట్టారు.

రోజుకో స్కీం పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి: యూటీఎఫ్

ఈనాడు, అమరావతి: రోజుకో స్కీం పేరుతో ఆదివారాలు, రెండో శనివారాలు, పండుగ సెలవుల్లో ఉపాధ్యాయులతో ప్రభుత్వం పనిచేయిస్తూ ఒత్తిడి పెంచడాన్ని ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రసాద్ తెలిపారు.



ఆనందాన్ని అందించే అలవాట్లు

మన రోజువారీ అలవాట్లు కొన్ని మనకు జీవితాంతం ఆనందాన్ని కలిగిస్తాయి. అవి.. ✦ దేవుడిపై నమ్మకం లేదా తాత్విక చింతన. ✦ కుటుంబంతో ఎక్కువ సమయాన్ని గడపటం. ✦ తరచూ స్నేహితులను కలుస్తుండటం. ✦ ఇష్టమైన వ్యాపకాన్ని కలిగిఉండటం.

– ఆర్థర్ బ్రూక్స్, హార్వర్డ్ ప్రొఫెసర్

భూములు మావి.. వ్యాపారం మీది

- పీపీపీ విధానంలో మున్సిపల్ స్థలాలు, భూముల కేటాయింపు
- ఆరు పట్టణాభివృద్ధి సంస్థల్లో 685 ఎకరాలు సిద్ధం
- ఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తున్న పురపాలకశాఖ

ఈనాడు, అమరావతి: నిరుపయోగంగా ఉన్న పుర, నగరపాలక సంస్థలకు చెందిన విలువైన భూములు, స్థలాలు వినియోగంలోకి రానున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో వీటిని నివాస, వాణిజ్య అవసరాలకు కేటాయించి ఆదాయం పొందేలా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆరు పట్టణాభివృద్ధి సంస్థల్లో 685.81 ఎకరాల భూములు గుర్తించారు. వీటిలో వివిధ వ్యాపారాల నిర్వహణకు ఆసక్తి గల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నారు. నెలాఖరుకు మరో 10 పట్టణాభివృద్ధి సంస్థల్లో భూములు సిద్ధం చేయనున్నారు.

ఖాళీ స్థలాల గుర్తింపు

పట్టణ స్థానిక సంస్థలు ప్రభుత్వంపై ఆధారపడకుండా ఉన్న వనరుల సద్వినియోగం చేసుకుని ఆదాయం సాధించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు పుర, నగరపాలక, పట్టణాభివృద్ధి సంస్థలకు చెందిన వినియోగంలోలేని ఖాళీ స్థలాలు, భూములను గుర్తిస్తున్నారు. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలు, 17 పట్టణాభివృద్ధి సంస్థలకు వేల ఎకరాల్లో భూములు, భవనాలు ఉన్నాయి. ఇవి ఆక్రమణలకు గురవుతున్నాయి. భవనాలు నిర్వహణలేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిని గుర్తించి పీపీపీ విధానంలో కేటాయించనున్నారు.

తొలి దశలో సిద్ధం చేసిన భూముల వివరాలు

పట్టణాభివృద్ధి సంస్థ	సిద్ధం చేసిన భూమి (ఎకరాల్లో)
అనంతపురం	229.84
తిరుపతి	167.12
కడప	114.39
కాకినాడ	31.51
పలమనేరు	76.46
రాజమహేంద్రవరం	66.49

శివార్లలో లేఔట్లు... నగరాల్లో హోటళ్లు

పుర, నగరపాలక సంస్థల స్థలాలు, భూములు వివిధ వ్యాపారాల నిర్వహణకు కేటాయించనున్నారు. ప్రత్యేకించి శివారు ప్రాంత భూముల్లో రెసిడెన్షియల్ లేఔట్ల ఏర్పాటుకు అనుమతించనున్నారు. గోదాములు, పరిశ్రమలు, లాజిస్టిక్ హబ్‌లు, సోలార్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేయవచ్చు. నగరాలు, పట్టణాల మధ్యలోని విలువైన స్థలాల్లో పెట్రోలు బంకులు, హోటళ్లు, షాపింగ్ మాళ్లు, దుకాణాలు అభివృద్ధి చేసేందుకు కేటాయించనున్నారు. తద్వారా పట్టణ స్థానిక సంస్థలకు తగిన ఆదాయం రానుందని అధికారులు చెబుతున్నారు. అనంతపురం, తిరుపతి, కడప, కాకినాడలో గుర్తించిన స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. వీటిలో వ్యాపారాల నిర్వహణకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు తదితర నగరాల్లో రెండో విడతలో వివిధ ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్లు పిలవనున్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ ఎప్పుడు?

- శిక్షణ పూర్తయి 3 నెలలవుతున్నా.. అందని వైనం
- 54 వేల మంది మహిళల ఎదురుచూపు



ఈనాడు, అమరావతి: మహిళల స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత కుట్టు శిక్షణకు సంబంధించిన మిషన్ల పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంది. శిక్షణ పూర్తయి, మూడు నెలలు గడుస్తున్నా... ఇప్పటికీ లబ్ధిదారులకు మిషన్లు అందలేదు. గుత్తేదార్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కొనుగోలు ప్రక్రియ నిలిచింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన 54 వేల మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకుని, మిషన్ల కోసం ఎదురు చూస్తున్నారు. మహిళలకు ఇంటి వద్దే ఉపాధి కల్పించేందుకు వీలుగా ఈ ఏడాది రెండు విడతలుగా వారికి కుట్టు శిక్షణ ప్రారంభించారు. మొత్తం 680 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 90 రోజుల పాటు తర్ఫీదిచ్చారు. 75 శాతం హాజరు నిబంధనకు అనుగుణంగా 39,821 మంది బీసీలు, 14,695 మంది ఈడబ్ల్యూఎస్ వర్గానికి చెందిన మహిళలకు ఉచితంగా మిషన్లు పంపిణీ చేయాల్సి ఉంది. శిక్షణ, మిషన్ల పంపిణీ కోసం రూ.95 కోట్ల వరకు వ్యయం కానుంది. ఈ మేరకు చెల్లింపుల కోసం ఆర్థిక శాఖకు బీసీ, ఈడబ్ల్యూఎస్ అధికారులు నివేదించి నెలలు గడుస్తున్నా.. నిధులు విడుదల కాలేదు. దీంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రస్తుతం శిక్షణ తీసుకున్న వారిని మినహాయిస్తే.. ఇంకా దాదాపు రెండు లక్షల మంది ఉచిత కుట్టు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మత్తుకు బానిసలైతే భవిష్యత్తు అంధకారమే

ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ


సైకిల్ ర్యాలీలో ఐజీ రవికృష్ణ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. ఈగల్ విభాగం, జిల్లా పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అడవి తక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయం నుంచి నిర్వహించిన 'డ్రగ్స్ వద్దు బ్రో.. సైకిల్ తొక్కు బ్రో' కార్యక్రమాన్ని ఐజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనసు ప్రశాంతంగా ఉంటే డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా మాదక ద్రవ్యాలను అంతమొందించేందుకు 'సంకల్పం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని చెప్పారు. మత్తు వల్ల కలిగే అనర్థాల గురించి యువత, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా ఆ సమాచారం 1902కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. యువత సైకిల్ తొక్కడాన్ని నిరంతరం కొనసాగించాలని సూచించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, ఈగల్ ఎస్పీ నగేష్ బాబు, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. 'డ్రగ్స్ వద్దు బ్రో... సైకిల్ తొక్కు బ్రో' అంటూ యువకులు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: మార్చిలో జరిగే పదోతరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 9 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 12 వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 15 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 18వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని వివరించారు.

విశ్వ యవనికపై తెలంగాణ

- నేటి నుంచి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సంబరం
- రెండ్రోజుల సదస్సుకు ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న 44కు పైగా దేశాల ప్రతినిధులు


ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమిట్‌కు భారీస్థాయిలో ఏర్పాట్లు

ఈనాడు, హైదరాబాద్: విశ్వ యవనికపై తెలంగాణ ఖ్యాతిని చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు రంగం సిద్ధమైంది. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా.. విఖ్యాత కంపెనీలకు గమ్యస్థానంగా రాష్ట్రాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి వేదిక సన్నద్ధమైంది. అన్ని రకాల ఉత్పత్తులను మన రాష్ట్రంలోనే తయారుచేసేలా.. చైనా ప్లస్‌గా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి దిశానిర్దేశం చేసేందుకు. రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రంగారెడ్డి జిల్లా కందుకూరులోని ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల విస్తీర్ణంలో సోమ, మంగళవారాల్లో జరగనున్న ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవ్యాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు పాల్గొంటున్నాయి. అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు వస్తున్నారు. సోమవారం(8న) మధ్యాహ్నం ఒంటిగంటకు ఈ గ్లోబల్ సంబరాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభ వేడుకకు హాజరు కానుండడంతో.. అత్యాధునిక హంగులతో ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి వివరిస్తారు.

తొలిరోజు ఆర్థికవేత్తల ప్రసంగాలు

ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం.. సదస్సులో అంతర్జాతీయ ఆర్థికవేత్తలు, నిపుణులు మాట్లాడతారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఒకేసారి నాలుగు సమావేశ మందిరాల్లో వేర్వేరు అంశాలపై నాలుగు చర్చాగోష్ఠులు జరుగుతాయి. మొదటి రోజు సదస్సులో ప్రగతి, సంక్షేమ పథకాలు, అమలు తీరు, ఫలితాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళాభివృద్ధి, యువత, నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి .. తదితర అంశాలపై సంబంధిత రంగాల నిపుణులతో చర్చాగోష్ఠిలుంటాయి. మర్నాడు 9న ఉదయం 10 గంటల నుంచి సదస్సు ప్రారంభమవుతుంది.

గోదావరి మధ్యలో ఆగిన పంటు

ఆందోళనకు గురైన ప్రయాణికులు

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సఖినేటిపల్లి - పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మధ్య వశిష్ఠ గోదావరిలో ప్రయాణికులను చేరవేసే పంటు ఆదివారం సాంకేతిక లోపంతో నది మధ్యలో నిలిచిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వందమందికి పైగా ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. రెండు జిల్లాలకు చెందిన వేలమంది నిత్యం నీటిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం నరసాపురం నుంచి సఖినేటిపల్లి వైపు ప్రయాణికులను ఎక్కించుకుని పంటు బయలుదేరింది. గోదావరి మధ్యకు రాగానే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆగిపోయింది. బాగుచేయడానికి ప్రయత్నించినా ఫలించలేదు. అదే సమయంలో నదిలో ప్రవాహవేగం ఎక్కువగా ఉంది. దీంతో పంటు అంతర్వేది సాగర సంగమం వైపు వెళ్లిపోసాగింది. నిర్వాహకులు అప్రమత్తమై మరో పంటు సాయంతో ఒడ్డుకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


ఆగిపోయిన పంటును తాళ్లతో లాగుతూ ఒడ్డుకు తీసుకొస్తున్న మరో పంటు

ఈనాడు

కేంద్రం కొరడా ఝుళిపించాల్సిందే!

దేశీయంగా అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో నేరపూరిత నిర్లక్ష్యం ఎంతోమంది ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతోంది. 63శాతం మార్కెట్ వాటాతో భారతీయ పౌరవిమానయాన రంగంలో గుత్తాధిపత్యం చలాయిస్తున్న ఆ సంస్థ ముందస్తు సమాచారం లేకుండా అయిదారు రోజులుగా బోలెడు సర్వీసులను ఇష్టారీతిగా నిలిపేస్తూ ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. చెకిన్ అయ్యాక ఇండిగో విమానాల రద్దు సంగతి తెలియడంతో గత్యంతరం లేక ప్రయాణికులు గంటల తరబడి విమానాశ్రయాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రయాణ భద్రతను దృష్టిలో పెట్టుకుని పైలట్లు, సిబ్బంది విశ్రాంతికి ప్రాధాన్యమిస్తూ డీజీసీఏ నిరుడు జనవరిలోనే కొత్త నిబంధనలు జారీచేసింది. వాటికి తగినట్లు కొత్తవారిని నియమించుకోని ఇండిగో నిర్వాకం వల్లే ఎయిర్‌పోర్టుల్లో ఆవేదనాత్మక పరిస్థితులు నెలకొన్నాయి. ప్రయాణికులను అష్టకష్టాల పాల్జేసిన ఆ సంస్థ తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడి ప్రకటన కచ్చితంగా వాస్తవ రూపం దాల్చాలి. వినియోగదారుల పట్ల కనీస బాధ్యత కూడా చూపించని ఇండిగోపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి!

డీజీసీఏ ఉత్తర్వులను పెడచెవిన పెట్టి ప్రయాణికులకు చుక్కలు చూపించిన ఇండిగో పైకి క్షమాపణలు చెబుతూ మొసలికన్నీరు కారుస్తోంది. టికెట్ డబ్బులు వెనక్కి ఇస్తామంటూ చిలక పలుకులు పలుకుతోంది. అంతమాత్రాన తిండితిప్పలు లేకుండా పిల్లాపాపలతో విమానాశ్రయాల్లో పడిఉన్న పరమ చేదు అనుభవాలను ప్రయాణికులు మర్చిపోగలరా? అత్యవసర వైద్యచికిత్సలు, పెళ్లిళ్లు, పరీక్షలు, ఆఫీసు మీటింగులు, ఇతర తప్పనిసరి పనులకోసం ప్రయాణాలు పెట్టుకున్నవారి నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు? పైగా, వేచిఉన్నవారిని సత్వరం వారి గమ్యస్థానాలకు పంపాల్సిన ఇండిగో- గిరాకీని సొమ్ము చేసుకోవడం కోసం ఇతర సంస్థల్లా భారీ ధరలకు టిక్కెట్లు విక్రయించడం మరీ దారుణం! క్షమార్హం కాని దగాకోరుతనమిది! తన స్వార్థ ప్రయోజనాల కోసం దేశ పౌరవిమానయాన రంగాన్నే స్తంభింపజేసిన ఇండిగో చివరికి నియమాల అమలు విషయంలో డీజీసీఏనే దిగివచ్చేలా చేయడం వ్యవస్థలకే అవమానకరం. ఏ రంగంలోనైనా ఒకటి రెండు సంస్థలే గుత్తాధిపత్యం వహిస్తుంటే పరిస్థితి ఇలాగే అఘోరిస్తుంది. ఇలాంటి దయనీయావస్థ జన భారతానికి మరోమారు పట్టకుండా కాచుకోవడం కేంద్రం కర్తవ్యం!

దాదాపు ఇరవై ఏళ్ల కిందట ప్రారంభమైన ఇండిగో చౌక ధరలతో ప్రయాణికులకు చేరువైంది. అదే సమయంలో తనకున్న అరకొర సిబ్బందితో గొడ్డు చాకిరీ చేయిస్తుందన్న అపప్రథను మూటగట్టుకుంది. నాసిరకం సేవలు, ప్రయాణికులతో దురుసు ప్రవర్తనపైనా గతంలో ఆ సంస్థపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇప్పుడేమో రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటన వేళ అడ్డగోలు ప్రవర్తనతో దేశ ప్రతిష్ఠను గంగలో కలిపింది. నిబంధనల అమలు పట్ల ఇండిగో తలబిరుసుతనంపై యంత్రాంగం ముందే కొరడా విదిల్చి ఉంటే ఈ సంక్షోభం తప్పేది కదా! విశ్వవ్యాప్తంగా అయిదో అతిపెద్ద విమానయాన విపణిగా భారత్ నేడు వెలుగులీనుతోంది. నిరుడు ఇండియాలో 24 కోట్ల మంది విమానాల్లో పయనించారు. 2023తో పోలిస్తే ప్రయాణికులు 11శాతం పెరిగారు. దీనికి తగినట్లుగా ఆయా సంస్థలు పెద్ద సంఖ్యలో కొత్త విమానాలకు ఆర్డర్లు పెడుతున్నాయి. ఈ క్రమంలో ఇరవైవేల మంది పైలట్లు అదనంగా అవసరమవుతారన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇంకోపక్కేమో విమాన రద్దులు, ఎడతెగని ఆలస్యాలు ప్రయాణికులను బేజారెత్తిస్తున్నాయి. ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చే పౌర విమానయాన రంగం ఇంకా తేజరిల్లాలంటే- అందులోని సమస్యలను చక్కదిద్దాలి. కొత్త సంస్థలు నిలదొక్కుకుని నాణ్యమైన సేవలందించేలా ప్రభుత్వం తోడ్పడాలి.



చాలామంది నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. కానీ ఉద్యోగాలు సంపాదించడంలో, వాటిని నిలుపుకోవడంలో ఆ శిక్షణ తాలూకు ఫలితం కన్పించడం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ సమస్యమీద దృష్టి పెట్టాలి. నిజంగా నేర్చుకున్న నైపుణ్యాలన్నింటినీ ఉపయోగిస్తే పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

– గీతా గోపీనాథ్

కాలభైరవ తత్త్వం

కాలమే సృష్టిని నడిపేది, కాలమే జీవనాన్ని పరిపక్వం చేస్తుందని మహాభారతం చెబుతుంది. 'కాలం మహా గురువు, దాన్ని గౌరవించేవారికి జీవితసత్యాలను బోధిస్తుంది' అంటారు స్వామి వివేకానంద. కాలం జగత్తులోని అత్యంత గూఢమైన శక్తి. ఈ కాలతత్త్వానికి మూలస్వరూపమే కాలభైరవుడు.

'కాలస్య భైరవః శంభుః' అని శైవాగమాలు పేర్కొన్నాయి. కాలం స్వయంగా శంభుడి తేజస్సని భావన. దీనికి వేదాలు, పురాణాలు తదితరాలన్నీ బలమైన ఆధారాలు. వీటన్నింటిలో భైరవుణ్ని- శివుని ఉగ్రమూర్తిగా, జగద్రక్షకుడైన కాలాధిపతిగా వర్ణించారు. భారత ఆధ్యాత్మిక సంప్రదాయంలో కాలానికి అత్యున్నత స్థానం ఉంది. విశ్వం తన సృష్టి, స్థితి, లయ చక్రమంతటినీ కాలం ఆధారంగానే నడిపిస్తుందని వేదాలు స్పష్టం చేస్తాయి. ఋగ్వేదంలోని కొన్ని సూక్తుల్లో భైరవ స్వరూపాన్ని 'కాలో- రుద్రో భవతి' అన్న భావంతో వర్ణించారు. 'కాలో అశ్వో' అంటూ కాలాన్ని శక్తిరూపంగా చెప్పే వచనాలు భైరవుడి తత్త్వానికి మూలాలు. వేదాంతదృష్టిలో కాలాన్ని నియంత్రించేవాడు దానికి అతీతుడై ఉంటాడు. ఆ స్థితి పరబ్రహ్మ స్వరూపమైన శివుడిదే. శ్వేతాశ్వతర ఉపనిషత్తు రుద్రుణ్ని 'జగద్గురువు', 'భూతకర్త', 'కాలకాలుడి'గా ప్రకటించడం, భైరవుడి కాలాధిపత్య



భావనకు మరింత బలమిస్తుంది. ఉగ్రతతో కూడా రక్షణ ఉందని ఉపనిషత్తులు సూచిస్తాయి. అది కాలభైరవ తత్త్వ ముఖ్యస్వరూపం.

శివ, స్కంద, వాయుపురాణాల్లో భైరవుడి అవతార కథ ఉంది. బ్రహ్మ తన అయిదో శిరస్సుతో అహంకారాన్ని ప్రదర్శించిన సందర్భంలో, సృష్టిలో సమతుల్యతను కాపాడేందుకు శివుడు ఉగ్రరూపాన్ని సంతరించుకున్నాడని పురాణాలు తెలియజేస్తాయి. రుద్రుడు బ్రహ్మ అయిదో శిరస్సును తొలగించడంతో అహంకార నిర్మూలనకు ప్రతిరూపమే కాలభైరవుడు. అధర్మం ఎదురైనప్పుడు శివతత్త్వం ఉగ్రరూపం తీసుకుంటుందని ఈ కథ బోధిస్తుంది.

అంతర్యామి

భైరవుణ్ని అత్యంత శక్తిమంతమైన రక్షణదేవతగా కొలుస్తారు. కాల నియంత్రకుడు, కర్మఫలదాత, జ్ఞానప్రదాతగా సేవిస్తారు. తాంత్రిక సంప్రదాయంలో భైరవుడు మానసిక భయాలను, సంకల్ప దౌర్బల్యాలను, అజ్ఞానాన్ని దహించే దివ్యశక్తిగా కనిపిస్తాడు. అంతేకాక భైరవుడి ప్రధాన రూపాలైన అష్టభైరవులలో కాలభైరవుడు శ్రేష్ఠుడు. ఆయన చేతిలోని కాలదండం- సమయం, నిర్ణయం, శిక్ష, రక్షణ అనే నాలుగు పరమార్థాలను సూచిస్తుంది.

ఆదిశంకరాచార్యులు రచించిన కాలభైరవాష్టకంలో భైరవుణ్ని కాశీక్షేత్రపాలకుగా, మోక్షమార్గదర్శిగా, జ్ఞానమార్గాన్ని చూపించే పరమశక్తిగా వర్ణించారు. భైరవుడి రూపం శూలధారి, కపాలమాల, నీలవర్ణం, రౌద్రదృష్టి వంటి లక్షణాలతో కూడినప్పటికీ, ఇవన్నీ అనిత్యత్వ (మృత్యువు) నిర్భయ స్థితి ఆధ్యాత్మిక ప్రసాదాన్నే సూచిస్తాయి. ఆయన వాహనం శ్వానం(జాగిలం)- విశ్వాసం, అప్రమత్తత, ధర్మరక్షణకు ప్రతీక.

కాలభైరవ తత్త్వం మనిషికి మూడు ప్రధాన సందేశాలు అందిస్తుంది. అవి... కాలాన్ని గౌరవించాలి. సమయాన్ని సద్వినియోగం చేయాలి. జీవన పతనానికి మూలమైన అహంకారాన్ని వీడి ధర్మపరులుగా కావాలి.

– డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్

చదువుల్లో ముందుకు ఉద్యోగాల్లో వెనక్కి!

అమ్మాయిలు 'స్టెమ్' విద్యలో రాణిస్తున్నా, ఉద్యోగాల్లోకి అడుగుపెట్టే దశలో మాత్రం వెనకబడుతున్నారు. చదువుతో పాటు వారికి తగిన మద్దతు, సామాజిక అంగీకారం, వృత్తిపరమైన అవకాశాలు కల్పించడం అత్యావశ్యకం. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వాలు కలిసికట్టుగా కృషిచేస్తే అన్నిచోట్లా మహిళలు నిలదొక్కుకోగలుగుతారు. చదువుతోపాటు వృత్తి ఉపాధుల్లోనూ వారికి తగిన అవకాశాలు దక్కితేనే నిజమైన సమానత్వం, ప్రగతి సాధ్యమవుతాయి.

ఇది చదువుల యుగం. భారతీయ మహిళలు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (స్టెమ్) రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అమ్మాయిలు సైన్స్‌ను అధికంగా ఎంచుకుంటున్నారు. స్టెమ్ గ్రాడ్యుయేట్లలో సగానికిపైగా మహిళలే కావడం మనకు గర్వకారణం. కానీ వారి చదువు, ప్రతిభ అదేస్థాయిలో ఉద్యోగాల్లోకి మారిందా అన్నదే ప్రశ్న. ఈ విషయంలో నిరాశే ఎదురవుతోంది. చదువు ముగించిన తరవాత స్త్రీలు ఉద్యోగాల్లో ప్రవేశించడానికి, కొలువుల్లో కొనసాగడానికి అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నారు. వాటిని అధిగమించడమే ఇప్పుడు మన ముందున్న సవాలు. ఇటీవలి గణాంకాల ప్రకారం, దేశంలో స్టెమ్



గ్రాడ్యుయేట్లలో 40-43శాతం స్త్రీలే. గత పదేళ్లలో యూజీ స్థాయిలో అమ్మాయిల చేరికలు 46శాతం, పీజీ స్థాయిలో 55శాతం మేర పెరిగాయి. అయితే, ఉద్యోగ అవకాశాల్లోనూ ఇదే విధంగా మహిళల ప్రాతినిధ్యం కనపడకపోవడమే బాధాకరం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఇండియాలో స్టెమ్ రంగంలో పనిచేస్తున్న మహిళలు 27శాతమే. అంతర్జాతీయ సగటు(30శాతం) కంటే ఇది తక్కువ. గడచిన ఎనిమిదేళ్లలో బ్యాచిలర్ స్థాయిలో ఇంజినీరింగ్ చదివే అమ్మాయిల సంఖ్య కాస్త తగ్గింది. విజయవంతంగా చదువు పూర్తిచేసినా- స్టెమ్ ఉద్యోగాల్లో చేరే మహిళలు తక్కువగా ఉంటున్నారు. చేరినవారిలోనూ చాలామంది రకరకాల కారణాల వల్ల కెరీర్‌లో కొనసాగలేకపోతున్నారు. దాంతో భారీగా ఖర్చుపెట్టి ఇంజినీరింగ్ చదవడమెందుకనే భావన చాలామంది విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది.

ఏపీలో పరిస్థితేంటి?

స్టెమ్ విద్యలో అమ్మాయిల చేరికల విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్రంలో 12వ తరగతి వరకు పలు సైన్స్ సబ్జెక్టులు అందుబాటులో ఉంటున్నాయి. 70శాతానికి పైగా బాలికలు వాటిని ఎంపిక చేసుకుంటున్నారు. జాతీయ సగటుతో పోలిస్తే ఇది రెట్టింపు. కానీ, వారితో పాటు టెక్నాలజీ చదివిన మహిళలు కూడా ఉద్యోగాల దగ్గర ఆగిపోతున్నారు. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం- కొత్తగా 'ఐటీ అండ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల' ద్వారా ప్రతీ పట్టణంలో వర్క్ ఫ్రం హోమ్ కేంద్రాల ఏర్పాటుకు సంకల్పించడం మంచి పరిణామం.

ఇంజినీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ వంటి వాటిలో ప్రాతినిధ్యం పరంగా మహిళల నిష్పత్తిలో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. ఇంజినీరింగ్ ఫ్యాకల్టీలో మహిళలు 10శాతం లోపే ఉన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్‌లలోనూ వీరు 15శాతం మించరు. సాఫ్ట్ సైన్స్‌గా ముద్రపడిన జీవశాస్త్రాల్లో మాత్రం మహిళా బోధకులు 25శాతం వరకు ఉంటున్నారు. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఇంజినీరింగ్‌తో పోలిస్తే మెడిసిన్, బయోటెక్ వంటి కోర్సుల్లోనే అమ్మాయిలు ఎక్కువగా చేరుతున్నారు. 2024 నాటికి భారత ఐటీ రంగంలో మహిళా ఉద్యోగులు 21శాతానికి చేరారు. 2020లో ఇది ఎనిమిది శాతమే! ఇంతటి పురోగతి కనిపిస్తున్నా సీనియర్ స్థాయిలో వారి నిష్పత్తి 6-7 శాతానికే పరిమితమవుతోంది. నాయకత్వ స్థాయిలో వారు చాలా అరుదుగా కనిపిస్తున్నారు. పరిశోధక విద్యలోనూ ఇదే పరిస్థితి. దేశంలో సైన్స్ పీహెచ్‌డీ చేస్తున్నవారిలో సగం మహిళలే అయినా, సంబంధిత ఉద్యోగాల్లో వారు 20శాతం లోపే ఉంటున్నారు. ఆర్‌అండ్‌డీలోనూ మహిళల వాటా 19శాతానికి మించదు.

స్టెమ్ చదువుల్లో మేటి అయ్యుండి కూడా చాలామంది మహిళలు సంబంధిత ఉద్యోగాల్లో చేరకపోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. పెళ్లి, పిల్లల పెంపకం, కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగాల్లో ఎదురయ్యే ఇబ్బందుల వల్లే వారు కెరీర్‌ను కొనసాగించలేకపోతున్నారు. శాస్త్రవేత్త డాక్టర్ శోభన నరసింహన్ చెప్పినట్లు- సమాజం మహిళలను మొదట తల్లులుగా భార్యలుగా చూస్తుంది. ఆ తరవాతే శాస్త్రవేత్తలుగా చూస్తోంది. ఉద్యోగ నియామకాల్లో మహిళలను పక్కన పెట్టడం, దిగువస్థాయి ఉద్యోగాలే ఇవ్వడం, పదోన్నతుల్లో వంచన వంటివన్నీ సర్వసాధారణం అయిపోయాయి. నిజానికి బాల్యం నుంచే చదువుల విషయంలో అమ్మాయిలకు కష్టాలు మొదలవుతున్నాయి. స్టెమ్ కోర్సులకు భారీగా ఖర్చవుతుందన్న భావనతో తల్లిదండ్రులు అబ్బాయిలనే ఎక్కువగా ఆ కోర్సుల్లో ప్రోత్సహిస్తున్నారు.

అంతరాలను అధిగమించడమెలా?

దేశంలో, ముఖ్యంగా ఏపీలో మహిళల స్టెమ్ కెరీర్‌ను మెరుగుపరచేందుకు అవసరమైన పథకాలు ఉన్నాయి. సైన్స్ కోర్సుల్లో పాఠశాల విద్యార్థినులను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలో 'విజ్ఞాన్ జ్యోతి' పథకాన్ని తీసుకొచ్చారు. 'కిరణ్' ఫెలోషిప్‌ల ద్వారా మహిళా శాస్త్రవేత్తలకు ప్రయోజనం చేకూరుస్తున్నారు. అయితే, చదువు పూర్తయిన తరవాత వారిని కెరీర్‌లో ప్రోత్సహించడం ముఖ్యం. ఇందుకు ఐఐటీ-బాంబే సూచించినట్లు... మెటర్నిటీ లీవ్ తీసుకున్న మహిళలకు పదవీ విరమణ వయసులో మినహాయింపు ఇవ్వాలి. ఉద్యోగ అవకాశాలను పెద్దయెత్తున కల్పించాలి. ప్రాధాన్యం కలిగిన పోస్టులు ఇవ్వడం, మెంటారింగ్ వంటి చర్యలు అవసరం. పాఠశాల స్థాయిలో 'గణిత, రసాయన శాస్త్రాలు'గా కాకుండా 'సమస్యలను పరిష్కరించే ఆలోచనాశక్తి'గా వాటిని బోధించాలి. అప్పుడే బాలికలు వీటిని భయంతో కాకుండా, ఆసక్తితో నేర్చుకుంటారు. ఏపీలో కొత్త ఐటీ విధానంలో భాగంగా మహిళలకు వర్క్ ఫ్రం హోమ్ హబ్‌లు, కో-వర్కింగ్ కేంద్రాలు రానున్నాయి. ఇది కుటుంబ బాధ్యతల మధ్య కూడా కెరీర్‌ను కొనసాగించే అవకాశం కల్పిస్తుంది. వీటితో పాటు పిల్లలకు డే కేర్ ఏర్పాట్లు, కార్యాలయాల్లో మరింతగా స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు కృషి జరగాలి. ఇంజినీరింగ్ కళాశాలలు పరిశ్రమలతో కలిసి అమ్మాయిలకు ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఇవాళ బాలిక స్టెమ్ కోర్సు చదివితే, రేపు ఆమె ప్రయోగశాలలోనో, ఆఫీసులోనో కనిపించాలి. అప్పుడే నిజమైన సమానత్వం సాకారమవుతుంది! అందుకు గట్టి కృషి జరగాల్సి ఉంది.



డాక్టర్ మంగళంపల్లి కిరణ్
అసోసియేట్ ప్రొఫెసర్, నానో శాస్త్ర పరిశోధకులు
ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ, అమరావతి

'చాదస్తపు మొగుడు చెబితే వినడు..' అని సామెత. అటువంటివాళ్లు ప్రభుత్వాఫీసుల్లో ఎక్కువ. పెన్షన్ మంజూరు చేయాలంటే మనిషి జీవించి ఉన్నట్లు సర్టిఫికెట్ ఉండాలి. 'ఈ ఏడాది సర్టిఫికెట్ ఉంది సరే, నిరుటిది లేదే! అప్పుడు నువ్వు బతికున్నట్లు సాక్ష్యం ఎక్కడ?' అని ప్రభుత్వాధికారి అడిగినట్లు సినిమాల్లో హాస్య సన్నివేశాలు కల్పిస్తారు. మరీ ఇంత ఇదిగా కాకపోయినా, ఒక్కొక్కప్పుడు కొందరు ఆడిట్ వాళ్లు లేవనెత్తే అభ్యంతరాలు చూస్తే 'చాదస్తపు...' సామెతే గుర్తొస్తుంది. రూలు

చాదస్తపు మొగుళ్లు!



ప్రకారమే పోతాం అంటారు తప్ప కామన్‌సెన్స్ ఉపయోగించరు.

నేను గుంటూరు జిల్లా కలెక్టరుగా ఉండగా బలహీనవర్గాల సంక్షేమ పథకాల కింద పాడి గేదెలను ఇస్తున్నారు. 240 గేదెలు మంజూరయ్యాయి. గేదెలు సరే, వాటి సంతతి పెంచడానికి దున్నపోతులు కావాలిగా అని, కనీసం 30 దున్నపోతులైనా ఉండాలన్నారు అధికారులు. ప్రజలకు పాడి కావాలి, గేదెలుండాలి అనుకున్నారు తప్ప, గేదెలకు ఏం కావాలనేది పైవాళ్లు ఆలోచించలేదు. 30 దున్నపోతులకు రూ.2.40 లక్షలు అవుతుంది. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. అది శాంక్షన్ అవ్వాలంటే ఫైలు మీద చాలా తతంగం నడవాలి. ఈలోగా పుణ్యకాలం గడిచిపోతుందని సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి ఎస్.ఆర్.శంకరన్‌కి ఫోన్ చేశాను. నా కెరీర్ మొత్తంలో ఆయనంత అంకితభావం, పేద ప్రజలపట్ల సహానుభూతి ఉన్న అధికారిని చూడలేదు. అంత నిరాడంబరంగా ఉండే వ్యక్తి, నిర్ణయాలు తీసుకోవడంలో అమిత ధైర్యాన్ని ప్రదర్శిస్తారని ఎవరూ అనుకోరు. నేను సమస్య గురించి నోటిమాటగా చెప్పగానే ఆయన 'ఓకే శాంక్షన్డ్' అనేశారు. నేను 'వెంటనే కొనేయండి' అని రాసిచ్చేశాను. అవి వచ్చేశాయి. ఇదంతా ఫైలు మీద రాసేసి, పైకి పంపించేశాం. పోస్ట్ ఫాక్టో అనుమతివ్వాల్సిందిగా అభ్యర్థించాం. ఇది జరిగిన కొన్ని నెలలకే నాకు బదిలీ అయిపోయింది.

కానీ ఆడిట్ వాళ్లు అభ్యంతర పెట్టారట- శాంక్షన్ చేసిన ఆర్డర్ ఇర్రెగ్యులర్ అంటూ! దున్నపోతులు లేకుండా గేదెలు ఎలా మనగలుగుతాయనే కామన్‌సెన్స్ ఉపయోగిస్తే గొడవే ఉండదు. కానీ అన్నీ రూల్సు ప్రకారమే జరగాలనే చాదస్తం వాళ్లని అలా ఆలోచించనీయలేదు. పదేళ్ల తరవాత నేను రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్‌గా ఉన్నప్పుడు, శంకరన్ మళ్లీ సోషల్ వెల్ఫేర్ శాఖకు ప్రిన్సిపల్ సెక్రెటరీగా వచ్చారు. ఓ రోజు ఆయనతో కలిసి భోజనం చేస్తుండగా - 'మీ దున్నపోతుల వ్యవహారంపై ఆడిట్ అబ్జక్షన్ వ్యవహారం పదేళ్లుగా పెండింగులో ఉండిపోయింది. నేను ఇక్కడికి తిరిగొచ్చాక చూస్తే పెద్ద గ్రంథమే నడుస్తోంది. ఇవాళే ఫైలు నా దగ్గరకొచ్చింది. "దీన్ని ఫోన్లో శాంక్షన్ చేసింది నేనే. రెగ్యులరైజ్ చేసి అభ్యంతరం తీసేయండి" అని రాశాను' అని చెప్పారు. ఇన్నాళ్లు పెండింగులో ఉందా? అని ఆశ్చర్యపోయాను. అంటే దానిపై ప్రశ్నలు, జవాబులు, తిరిగి ప్రశ్నలు, మరిన్ని వివరణలు... ఇలా వ్యవహారం నడుస్తూ ఉందన్నమాట. శంకరన్ ఆనాటి సంభాషణ గుర్తుపెట్టుకుని ధైర్యంగా నిర్ణయం తీసుకోవడంతో దానికి తెరపడింది. ఆయనే లేకపోతే ఆ చాదస్తపు మొగుళ్లు ఇంకెంత కాలం సాగదీసేవారో తెలియదు!

– డాక్టర్ మోహన్ కందా
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి



దిగుమతుల భారం

ఇండియా-రష్యా ద్వైపాక్షిక వాణిజ్య విలువ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,870 కోట్ల డాలర్లకు చేరింది. 2030 నాటికి దాన్ని పదివేల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిశ్చయించుకున్నాయి. కానీ రష్యాకు ఇండియా జరుపుతున్న ఎగుమతుల కంటే, అక్కడి నుంచి తెప్పించుకుంటున్నవే ఎక్కువగా ఉంటున్నాయి. ముఖ్యంగా నాలుగేళ్లుగా రష్యా నుంచి ఇండియా చమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయి. దాంతో భారీగా వాణిజ్యలోటు నెలకొంటోంది. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో రష్యా నుంచి ఇండియా దిగుమతులు, అక్కడికి మన ఎగుమతుల విలువ...

(కోట్ల డాలర్లలో)

సంవత్సరం	దిగుమతులు	ఎగుమతులు
2019–20	709	302
2020–21	549	266
2021–22	987	325
2022–23	4,621	315
2023–24	6,143	426
2024–25	6,380	490

(ఆధారం: కేంద్ర వాణిజ్య విభాగం)

స్వయంసమృద్ధి సాధ్యమేనా?

పునరుత్పాదక ఇంధనాలు, విద్యుత్ వాహనాలు, రక్షణ, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలకు రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ కీలకం. వీటి విషయంలో స్వావలంబన దిశగా భారత్ తొలి అడుగువేసింది. అరుదైన లోహాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు తాజాగా రూ.7,280 కోట్ల పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇది సాకారమైతే చైనా వంటి దేశాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది.

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఇండియాలో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లకు అంతకంతకు గిరాకీ పెరుగుతోంది. వీటి కోసం కేంద్రం తీసుకొస్తున్న పథకం కింద అర్హత సాధించిన కంపెనీలు రెండేళ్లలో తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ తరవాతి అయిదేళ్లలో విక్రయాలపై ప్రోత్సాహకాల కింద ప్రభుత్వం రూ.6,450 కోట్లు అందిస్తుంది. మూలధన రాయితీగా మరో రూ.750 కోట్లను సమకూరుస్తుంది. ఏటా ఆరువేల మెట్రిక్ టన్నుల అరుదైన ఎర్త్ మ్యాగ్నెట్స్ తయారీ సామర్థ్యాన్ని సృష్టించడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. నిరుడు ఇండియా 53వేల మెట్రిక్ టన్నుల రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్‌ను దిగుమతి చేసుకోగా, వాటిలో చాలామటుకు చైనావే!

వనరులున్నా ఉత్పత్తి అంతంతే...

పీరియాడిక్ టేబుల్‌లోని 15 లాంథనైడ్స్ లోహాలతో పాటు స్కాండియం, ఎట్రియంను కలిపి అరుదైన లోహాలుగా చెబుతారు. అయస్కాంత, ఆప్టికల్, విద్యుత్ వాహక లక్షణాలు ఉండటం వీటి ప్రత్యేకత. అరుదైన లోహాలన్న పేరే కానీ, ఇవి అరుదుగా దొరికేవేమీ కావు. భూమి లోపలి పొరల్లో బాగానే లభ్యమవుతాయి. కాకపోతే, ఇవి ఇతర లోహాలతో కలిసిపోయి ఉంటాయి. రేడియోధార్మికత గుణాలుండే యురేనియం, థోరియంతో కలిసి ఉండటంతో వీటిని వేరుచేసి, బయటికి తీయడం కష్టమైన పని. అందుకు ఖర్చూ ఎక్కువే. పైగా రిఫైనింగ్, ప్రాసెసింగ్ సమయాల్లో ప్రమాదకర వ్యర్థాలు భారీగా వెలువడతాయి. అందుకనే ఈ వనరులున్నా, చాలా దేశాలు వీటి ఉత్పత్తి, ప్రాసెసింగ్ సాంకేతికతలపై పెద్దగా దృష్టి సారించడంలేదు. ప్రపంచవ్యాప్తంగా రేర్ ఎర్త్ వనరులు 90 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర ఉంటే, అందులో 44 మిలియన్ మెట్రిక్ టన్నులు ఒక్క చైనాలోనే లభిస్తున్నాయి. ఆ తరవాతి స్థానాల్లో బ్రెజిల్, భారత్, ఆస్ట్రేలియా, రష్యా, వియత్నాం ఉన్నాయి. భారత్‌లో సుమారు 6.9 మిలియన్ మెట్రిక్ టన్నుల రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ముడి వనరులు ఉన్నట్లు



అంచనా. ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ నిల్వలు ఎక్కువగా; రాజస్థాన్, బిహార్, ఝార్ఖండ్‌లలో పరిమితంగా ఉన్నట్లు చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అరుదైన లోహాలకు సంబంధించి 90శాతం మార్కెట్‌ను చైనాయే శాసిస్తోంది. గత నాలుగు దశాబ్దాలుగా అమలు చేసిన వ్యూహాలూ ప్రణాళికలే ఆ దేశాన్ని ఈ స్థాయికి చేర్చాయి. అరుదైన లోహాలకున్న ప్రాధాన్యాన్ని ముందుగానే గుర్తించి, భారీ పెట్టుబడులతో వాటి ఉత్పత్తిని చైనా ప్రోత్సహిస్తూ వచ్చింది. ఆధునిక సాంకేతికత ఉత్పత్తులకు అవసరమైన సెమీకండక్టర్ల దగ్గర నుంచి దేశభద్రతకు కీలకమైన జెట్ విమానాల వరకు అన్నింటికీ అరుదైన లోహాల అవసరం ఎంతగానో ఉంది. ముమ్ముందు ప్రపంచ వృద్ధిలో ఇవి మరింత కీలకం కానున్నాయి. అందుకే వాణిజ్య, దౌత్యపరమైన చర్చల సందర్భంలో తన గుత్తాధిపత్యాన్ని ఒక అస్త్రంగా డ్రాగన్ వాడుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే చైనా నుంచి ముప్పు తప్పదని ప్రపంచ దేశాలు భావించి అప్రమత్తమవుతున్నాయి. అరుదైన లోహాల ఉత్పత్తినీ, చైనాయేతర దేశాల నుంచి సరఫరానూ పెంచుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. భారత ప్రభుత్వం ఆమోదించిన రూ.7,280 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని కూడా ఇందులో భాగంగానే చూడాలి. విద్యుత్ వాహనాలు, సంప్రదాయేతర ఇంధన వనరులకు భారత్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున, 2030నాటికి దేశీయంగా రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్‌కు గిరాకీ రెట్టింపు కావొచ్చని అంచనా. మరోవైపు చైనా నుంచి ఈ లోహాల సరఫరాలోనూ అనిశ్చితి నెలకొంది. కాబట్టి, అరుదైన లోహాల ఉత్పత్తిని పెంచే ప్రణాళికలను భారత్ వేగవంతంగా అమలు చేయాలి.

ఎలాంటి వ్యూహాన్ని అనుసరించాలి?

అరుదైన లోహాల ఉత్పత్తిలో భారత్ స్వయంసమృద్ధి సాధించాలంటే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఒక్కటే సరిపోదు. ప్రస్తుతం దేశీయంగా అరుదైన లోహాల వెలికితీత, శుద్ధి, ప్రాసెసింగ్ సామర్థ్యాలు కొరవడుతున్నాయి. ఇతర లోహాల నుంచి అరుదైన లోహాలను వేరుచేసే సాంకేతికతల కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ సమస్యలను అధిగమించాలంటే పరిశోధన-అభివృద్ధికి పెద్దపీట వేయాలి. గనుల కార్యకలాపాల్లో ప్రభుత్వ రంగ సంస్థలే ఎక్కువగా నిమగ్నం కావడం- ఆవిష్కరణలు, పెట్టుబడులకు అవరోధంగా మారుతోంది. ప్రైవేట్ రంగ సంస్థలూ ఇందులోకి అడుగుపెడితే నిధుల కొరత తీరుతుంది. అరుదైన లోహాల మైనింగ్, ప్రాసెసింగ్ విభాగంలో నిపుణులు, కార్మికుల కొరతనూ అధిగమించాల్సి ఉంది. అయితే, ఇదంతా దీర్ఘకాల ప్రక్రియ. కాబట్టి, దేశీయ అవసరాలకు సరఫరాపరంగా ఇబ్బందుల్లేకుండా దౌత్యపరమైన చర్యలు తీసుకుంటూనే, స్థానికంగా ఉత్పత్తిని పెంచుకోవడం ప్రభుత్వ వ్యూహం కావాలి.

– నాసు నరేశ్

స్వేచ్ఛంటే...

'మీలో ఎవరైనా స్వేచ్ఛ అంటే ఏంటో చెప్పగలరా?' అని అడిగారు అప్పుడే క్లాస్‌లోకి వచ్చిన టీచర్. విద్యార్థులంతా ఏమై ఉంటుందని వాళ్లలో వాళ్లే గుసగుసలాడసాగారు. కానీ ఎంతసేపైనా ఎవరూ సమాధానం చెప్పలేదు. 'ఏంటి అందరూ మౌనంగా ఉన్నారు. మాట్లాడండి' అన్నారు టీచర్. 'స్వేచ్ఛంటే పరిమితులు లేకపోవడం. ఏ పనైనా నచ్చినట్లు చేయడం' అని జవాబిచ్చారు పిల్లలు. అవేవీ కాదన్నారు టీచర్. అప్పుడు.. 'ఇతరుల కోసం మన ఆలోచనని మార్చుకోకపోవడం, భయం లేకుండా ఉండటం' అన్నారు. దాంతో టీచర్ చిన్నగా నవ్వి.. 'మీకు బాగా నచ్చిన క్రికెటర్ పేరు చెప్పండి' అని అడిగారు. 'ధోని, విరాట్ కోహ్లీ..' అంటూ కొన్ని పేర్లు చెప్పారు. 'వాళ్లు అంత మంచి ప్లేయర్స్ ఎలా అయ్యారో చెప్పగలరా?' అని అడిగారు టీచర్. 'వాళ్ల తల్లిదండ్రులు ఎటువంటి హద్దులు పెట్టకుండా



వారికిష్టమైన ఆటను ఆడుకునే స్వేచ్ఛనిచ్చారు కాబట్టి క్రికెట్ బాగా ఆడుతూ వచ్చారు' అన్నారు విద్యార్థులు. 'నచ్చిన ఆటలు ఆడుకోవడం, నచ్చిన పనులు చేసే స్వేచ్ఛ అందరికీ ఉండాల్సిందే. కానీ దాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నాం అనేది అసలు విషయం. మనకు ఇష్టమైనవన్నీ ఎదురుగా ఉన్నా ఏది మంచిదో దాన్నే మనం ఎంచుకోవాలి. దాని వల్ల మన చుట్టుపక్కల ఉన్నవారికి ఎలాంటి ఇబ్బంది కలగకూడదు. స్వేచ్ఛ అంటే నచ్చిన వస్తువుల్ని ఇష్టానుసారం ఉపయోగించడం, నచ్చిన పనులు ఇష్టం వచ్చినట్లుగా చేయడం కాదు. దాని మీద గౌరవంతో ప్రవర్తించడం. హద్దుల్లో ఉంటూ పద్ధతిగా వాటిని ఉపయోగించుకోవడం. అది చెయ్యి.. ఇది చెయ్యొద్దని మన పక్కన చెప్పేవాళ్లు ఎవరూ లేకపోయినా జాగ్రత్తగా నడుచుకోవడమే నిజమైన స్వేచ్ఛ. అలా ఉన్నప్పుడే.. మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం. అందుకే మీకు చెప్పిన క్రికెటర్లు కూడా ఉన్నత స్థానాల్లో ఉన్నారు' అని చెప్పారు టీచర్. 'ఇప్పుడు చాలా బాగా అర్థమైంది టీచర్' అంటూ బదులిచ్చారు విద్యార్థులు.

– కె.వి.సుమలత



ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

సోమవారం డిసెంబరు 8, 2025

కాలువ కట్టు.. కన్నీరు తుడిచేట్టు

రూ.600 కోట్లతో వరదనీటి డ్రెయిన్లకు డీపీఆర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగరంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థ(ఎస్‌డబ్ల్యూడీ)ను అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఆయా డ్రెయిన్ల నిర్మాణ పనులను పట్టాలెక్కించనున్నారు. వీటికి రూ.600 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో సీఆర్‌డీఏ, యూఎల్‌బీల వాటాగా రూ.300 కోట్లు భరించాలి. ఆ మేరకు ఇంజినీర్-ఇన్-చీఫ్(అమరావతి) తాజాగా మెమో జారీచేశారు. విజయవాడ కార్పొరేషన్ భరించాల్సిన రూ.150 కోట్లకు కౌన్సిల్ ఆమోదం తెలపాల్సి ఉంది. ప్రభుత్వం రూ.300 కోట్లు రాయితీగా సమకూర్చుతుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు సమగ్ర నివేదిక సిద్ధమైంది. కౌన్సిల్ ఆమోదం తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు.



అప్పటి ప్రభుత్వం వాడేసుకుంది

వర్షపు నీటి డ్రెయిన్ల నిర్మాణానికి గతంలో కేంద్రం రూ.461.04 కోట్లు విడుదల చేసింది. ఇంజినీరింగ్ ఇన్ పబ్లిక్‌హెల్త్ ఆధ్వర్యంలో 2019 వరకు ఆయా పనులు జరిగాయి. అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుత్తేదారు సంస్థకు బిల్లుల చెల్లింపు నిలిపేసింది. ఎస్క్రో ఖాతాను సైతం మూసేసింది. దీంతో పనులు ఆగిపోయాయి. అనంతరం అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టక పోగా.. కేంద్రం విడుదల చేసిన నిధుల్లో రూ.289.04 కోట్లు నాటి ప్రభుత్వం వాడేసుకుంది. ఆ నిధులను తిరిగి రప్పించడంలో పాలకపక్షం ఏమాత్రం ప్రయత్నించలేదు. కనీసంగా ఒక్క లేఖ కూడా ప్రభుత్వానికి రాయలేదు. అయితే వైకాపా కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లలో మాత్రం రూ.21.03 కోట్లతో కొన్ని పనులు జరిగాయి.

నిధులను బట్టి..

నగరంలోని 64 డివిజన్లలో 443.71 కిలోమీటర్ల మేర వర్షపునీటి డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇందులో మేజర్ 77.92, మైనర్ 113.61 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. వీటితో పాటు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అదనంగా డ్రెయిన్లు నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేసే నిధులను బట్టి ఆ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.


బాల్యమిత్రులం.. 54 ఏళ్లకు కలిశాం..



వారంతా పది విద్యార్థులు. 54 ఏళ్ల తర్వాత కలిశారు. ఆనాటి ముచ్చట్లను మళ్లీ గుర్తుచేసుకుని సందడిగా గడిపారు. మైలవరంలో గతంలో ఉన్న బాపూజీ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1971లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం స్థానిక శిరిడీసాయిబాబా అనుదాన మందిరంలో శనివారం నిర్వహించారు. దీనికి 33 మంది హాజరయ్యారు. తమ వంతుగా నాటి సహచర విద్యార్థులకు చేదోడుగా ఉండాలని తీర్మానించారు.

- మైలవరం, న్యూస్‌టుడే

ఫలం.. పుష్పం.. పర్యావరణ హితం





నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో రోజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫల, పుష్ప ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఆదివారం ఏకో ఫ్రెండ్లీ అంశంపై జరిగిన కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈనాడు, అమరావతి- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే


కొండపల్లి కోన.. జలపాతాల వీణ

ఈనాడు, అమరావతి

విజయవాడకు పది కి.మీ దూరంలో ఉండే దట్టమైన కొండపల్లి అటవీ ప్రాంతంలో మనసు దోచే జలపాతాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. దట్టమైన పచ్చని చెట్లు.. కొండలు.. పక్షుల కిలకిలారావాలు.. సీతాకోక చిలుకల వయ్యారాల నడుమ ఇవి చూడముచ్చటగా ఉంటాయి. వీటిలో ప్రధానమైన 12 జలపాతాలను గత తెదేపా ప్రభుత్వ హయాంలో కలెక్టర్‌గా లక్ష్మీకాంతం పనిచేసిన సమయంలో గుర్తించి అధికారికంగా పేర్లు పెట్టారు.

ఒక్కోదానికీ ఒక్కో పేరు

ఛత్తీస్‌గఢ్‌లోని చిత్రకూట్ జలపాతాన్ని పోలి ఉండే జలపాతానికి బేబీ చిత్రకూట్, రెండు జలధార పోలినట్టుగా ఉండే రెండు పాయల జలపాతానికి జడల కొలను, అడవి లోపలికి వెళ్లే వారికి ఆత్మీయ స్వాగతం పలికేలా దర్శనమిచ్చేదానికి వనమాలి, రెండు కొండల మధ్య దీర పరిరిసట్లుగా కనిపించే జలపాతానికి కొంగుదార, సీతాకోక చిలుకలు కనిపించేచోట సీతాకోకల గుండం అని నామకరణం చేశారు. ✦ శేషాచలం అడవుల్లో ఉండే తుంబురు కోన జలపాతాన్ని పోలి ఉండేదానికి.. చిట్టి తుంబురుకోన, మాదుమ్ము ఆలయానికి సమీపంలోని దానికి మాదుమ్ము తీర్థం, ఏడుపాయలుగా వీలి కిందకు పారే జలపాతానికి సప్తస్వరాలు, 30 అడుగుల ఎత్తునుంచి జలధార జారి కింద ఉన్న ఓ రాతిపై పడి.. శివ లింగానికి అభిషేకం చేసినట్టుగా కనిపిస్తుండడంతో.. క్షీరలింగ జలపాతం, నెమళ్లు తిరిగే ప్రాంతంలో ఉండేదానికి.. నెమలిధార, కుడి, ఎడమల జలపాతం, కలెక్టర్ జలపాతం.. ఇలా 12 పేర్లను అధికారికంగా పెట్టారు.



మూలపాడులో..

అధికారికంగానే 12 గుర్తించి నామకరణం



దొనబండలో..

ఘాట్ రోడ్డు నుంచి.. ఇవన్నీ అడవిలోకి వెళ్లాక కొండపల్లి ఘాట్‌రోడ్డుకు రెండు నుంచి నాలుగైదు కి.మీ దూరంలోనే అధికంగా ఉన్నాయి. కొన్ని మూలపాడుకు 16-18 కి.మీ, మరికొన్ని దొనబండ గ్రామానికి 11-12 కి.మీ దూరంలో ఉన్నాయి. ఒక్కో జలపాతం కనీసం 30 నుంచి 120 అడుగుల ఎత్తు నుంచి కిందకు జాలువారుతున్నాయి.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

కొండపల్లి, దొనబండ, మూలపాడు ప్రాంతాల మీదుగా కొండపల్లి అటవీ ప్రాంతంలోకి వెళితే జలపాతాలు కనువిందు చేస్తాయి. జులై నుంచి అక్టోబరు వరకు నాలుగు నెలలు నీటితో కళకళలాడుతుంటాయి. నవంబరు నుంచి జనవరి వరకూ నీటి ధార తగ్గిపోతుంది. కింది భాగంలో ఈ నీటి వల్ల ఏర్పడిన కొలను ఉంటాయి. ఫిబ్రవరి తర్వాత వేసవిలో పూర్తిగా నీరు ఎండిపోతుంది. మళ్లీ జల కళ రావడానికి వర్షాకాలం వరకూ ఆగాల్సిందే. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే విశేషంగా ఆకట్టుకుంటాయి.

సౌకర్యాలు సరే.. సంతృప్తి చూడరే!

ఇబ్బందికర తీరుతో భక్తుల మనసు చివుక్కు

ఈనాడు, అమరావతి



అన్నప్రసాదం

విజయవాడ దుర్గగుడిలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంస్కరణలు చేపట్టారు. అయితే భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కొన్ని సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదు. అందుకే భక్తుల మన్ననలు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవాలయమైన దుర్గగుడిలోని భక్తుల సేవల్లో గత కొన్ని నెలల్లో అనేక మార్పులు చేశారు. ఐదేళ్ల వైకాపా హయాంతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో సౌకర్యాలు కల్పించారు. అయినా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకుల్లో దుర్గగుడి ఏడో స్థానంలో నిలవడం భక్తుల అసంతృప్తి స్థాయికి ప్రత్యక్ష నిదర్శనం.

★ అమ్మవారి ప్రసాదాలైన చక్రపొంగలి, పులిహోర, లడ్డూ.. మిగతా ఆలయాలతో పోలిస్తే రుచిగా, నాణ్యంగా ఉండేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులకు శుద్ధిచేసిన తాగునీరు అందిస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4వరకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. రాత్రివేళ 800 నుంచి వెయ్యి మందికి భోజన వసతి కల్పిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులకు బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆధునికీకరించారు. ఆధునిక అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు.

దురుసు ప్రవర్తన..అధిక వసూళ్లు..

★ ఆలయానికి వచ్చే భక్తుల మనసు చివుక్కుమనేలా కొన్ని ఘటనలు జరుగుతున్నాయి. నైపుణ్యం లేని భద్రత సిబ్బంది, టోల్‌గేట్ వద్ద ప్రైవేటు వ్యక్తుల దురుసు ప్రవర్తన, కొండపైన, దిగువన పూజా సామగ్రి విక్రయించే దుకాణాల్లోని వారి ఇబ్బందికరమైన తీరు, కొబ్బరికాయలు, పూజాద్రవ్యాల అధిక ధరలతో భక్తులను ఇబ్బంది పెడుతున్నారు. ★ చెప్పుల స్టాండ్, లగేజీ క్లోక్‌రూం, సెల్‌ఫోన్ కౌంటర్లలో నిర్ణయించిన ధరల బోర్డులు కనిపించకుండా చేసి మరీ ప్రైవేటు వ్యక్తులు రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారు. ★ దేవస్థానం క్యాలెండర్లు, ల్యామినేషన్ ఫొటోలు అమ్మే కౌంటర్లలో అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కొబ్బరికాయలు కొట్టేచోట గుత్తేదారు మనుషులు డబ్బులు వసూలు చేస్తున్నారు.

★ కేశఖండనశాలలో భక్తుల నుంచి టిక్కెట్ రుసుం కాకుండా అదనంగా వసూళ్లు చేస్తున్నారు. కౌంటర్లలో నుంచి వారికి రూ.5 చిల్లర కూడా ఇవ్వడం లేదు. ప్రసాదాల కౌంటర్లు, దేవస్థానం బస్సుల్లోనూ ఇదే జరుగుతోంది. ★ వీటిపై అధికారులు దృష్టి సారించకపోతే భక్తుల సంతృప్తి స్థాయిని అందుకోలేరు.

భాషపై మమకారం.. సాహిత్య సహకారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే



ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్న చింతలపాటి

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు ఎందరో కృషి చేస్తుంటారు. కానీ మచిలీపట్నానికి చెందిన డా.చింతలపాటి మోహన మురళీకృష్ణ ఉద్యోగాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు తెలుగులో ఎంఏ చేసేలా ప్రోత్సహిస్తున్నారు. 50 ఏళ్లుగా వందలాది సాహిత్య సభలు నిర్వహిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులకు అమ్మ భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని వాఙ్మయి పేరిట అంతర్జాతీయ తెలుగు సాహితీ వేదిక ఏర్పాటు చేశారు. దీని ద్వారా తనతో పాటు పండితులు మేడసాని మోహన్, ఆర్.అనంత పద్మనాభరావు, ధూళిపాళ మహదేవమణి, కడిమెల్ల వరప్రసాద్, పాలపర్తి శ్యామలానందప్రసాద్, వోలేటి పార్వతీశం, రఘునాథశర్మ లాంటి వందమంది పండితులతో తెలుగు భాషా సాహిత్యాలపై ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆస్ట్రేలియా, సింగపూర్, న్యూజిలాండ్, మలేషియా తదితర దేశాల్లోని ప్రవాస భారతీయులు, వారి పిల్లలకు తెలుగులో పద్యాలు, చందస్సులులపై శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేక అవకాశం కల్పించి.. ఈయన చొరవతో ప్రస్తుతం 40 మంది ప్రవాస భారతీయులు ఆంధ్రా విశ్వవిద్యాలయం ద్వారా ఎంఏ తెలుగు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం విశ్వవిద్యాలయ ప్రతినిధులతో చింతలపాటి మాట్లాడి ప్రత్యేక అవకాశం కల్పించారు. ఉపాధ్యాయుడిగా పని చేసిన ఈయన 5వేల పద్యాలతో 25 పద్యగ్రంథాలు రచించి రచయితగా, కవిగా రాణిస్తున్నారు. కావ్య కళా ప్రవీణ, సిరి కవి, సహజ కవితా కళాభిజ్ఞ లాంటి బిరదులు, ప్రభుత్వ పరంగా ఉగాది పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

ఆత్మవిశ్వాసమే నడిపిస్తోంది..



విధి వక్రించినా ఆత్మవిశ్వాసం నింపుకొని ఒంటి చేత్తో ట్రాక్టరును నడుపుతూ స్ఫూర్తిగా నిలిచాడు ఆ యువకుడు. నందిగామ మండలం మాగల్లు గ్రామానికి చెందిన యలమందల నాగేశ్వరరావు ట్రాక్టర్ డ్రైవర్. ఏడాది కిందట వరిగడ్డిని చుట్టే యంత్రంలో ప్రమాదవశాత్తూ చేయిపడింది. వెంటనే ఆసుపత్రికి వెళ్లినా వైద్యులు భుజం వరకు ఆయన ఎడమ చేయిని తొలగించి శస్త్రచికిత్స చేశారు. ప్లాస్టిక్ చేయి పెట్టినా అది పనిచేయక ఇబ్బందిపడ్డారు. గతంలో పనిచేసిన యజమాని వద్దే ప్రస్తుతం వరిగడ్డిని చుట్టే యంత్రం ఉన్న ట్రాక్టరును ఒంటి చేత్తో నడుపుతున్నారు. గతంలో డ్రైవర్‌గా పనిచేసిన అనుభవం, ఆత్మవిశ్వాసంతో ట్రాక్టరు నడుపుతూ బతుకు బండి లాగుతున్నారు. ఆయన భార్య భవానీ హోటల్ నడుపుతుండగా.. ఆమెకు హోటల్ పనుల్లో సైతం సాయపడుతూ వైకల్యాన్ని జయించారు.

- మాగల్లు(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే

నేడు రాజధానిలో బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటన

తుళ్లూరు: అమరావతిలో సోమవారం ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ప్రతినిధుల బృందం పర్యటించనుంది. రహదారులు, భవన నిర్మాణాలు, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి, ఎల్‌పీఎస్ లేఔట్లు, రిజర్వాయర్ నిర్మాణ పనులు పరిశీలించనున్నారు. హైకోర్టు, ఎన్‌జీవో భవన సముదాయాలు, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తారు.

ధనుర్ధారి తపోస్థలం.. పార్థీశ్వరాలయం

ఇంద్రకీలాద్రిపై ద్వాపర యుగంలో అర్జునుడు పాశుపతాస్త్రం కోసం శివ తపస్సు చేసినట్లు చరిత్ర. అర్జునుడిని పరీక్షించేందుకు కిరాత రూపంలో శివుడు ఇంద్రకీలాద్రిపై ప్రత్యక్షమయ్యాడు. ఆ సమయంలో అర్జునుడు వేసిన బాణానికి చనిపోయిన వరాహం తనదని కిరాత రూపంలో ఉన్న శివుడు అర్జునుడితో యుద్ధం చేస్తాడు. అర్జునుడి తపస్సు, పరాక్రమానికి శివుడు మెచ్చి ప్రత్యక్షమై పాశుపతాస్త్రాన్ని ప్రసాదించినట్లు మహాభారతంలోని అరణ్య పర్వంలో ఉంది. అర్జునుడు తపస్సు చేసిన చోట శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడు. ఆ ప్రాంతమే పార్థీశ్వరాలయం. కాలక్రమంలో విష్ణువర్ధన మహారాజు ఆస్థానంలో పని చేసే ఉద్యోగి ఆలయం నిర్మించినట్లు చరిత్ర తెలియజేస్తుందని ఆర్కియాలజిస్టు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. ఆదరణ కరవై పార్థీశ్వరాలయం జీర్ణావస్థకు చేరిందని చెప్పారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



జీర్ణావస్థలోని పార్థీశ్వరాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్కియాలజిస్టు ఈమని శివనాగిరెడ్డి

పండగ పూట.. పప్పన్నం లేదా?


కూటమి సర్కారు అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా కందిపప్పు ఊసే లేకపోవడంపై కార్డుదారులు పెదవి విరుస్తున్నారు. వైకాపా అరకొరగా కందిపప్పు సరఫరా చేయడంతో కూటమి సర్కారు వస్తే నిరవధికంగా కందిపప్పు వస్తుందని భావించినా నిరాశే మిగిలింది. ఇప్పటిదాకా లేకున్నా పెద్ద పండగ నాటికైనా అందుబాటులోకి వస్తుందా అంటూ రేషన్ డీలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఆర్థిక భారం పడుతోందని పేదలు వాపోతున్నారు.

– ఈనాడు, అమరావతి

- ✧ ఉమ్మడి జిల్లాలో కార్డులు: 11,07,933
- ✧ మొత్తం రేషన్ దుకాణాలు: 2,016
- ✧ ఎంఎల్ఎస్ పాయింట్లు: 14
- ✧ సరఫరా చేయాల్సింది: 1,108 మె.ట
- ✧ రేషన్ దుకాణంలో కేజీ కందిపప్పు: రూ.60
- ✧ మార్కెట్‌లో కందిపప్పు ధర: రూ.120

మార్కెట్‌లో రెట్టింపు ధర..

గత తెదేపా పాలనలో ప్రతి నెలా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, వంటనూనె, చింతపండు, సబ్బులు, రాగి పిండి ఇలా చాలా వస్తువులు సరఫరా చేసేవారు. వైకాపా వచ్చాక ఈ విధానాన్ని పూర్తిగా నీరుగార్చింది. కూటమి సర్కారు వచ్చాక తిరిగి ప్రారంభించలేదు. రేషన్‌లో ఇచ్చే బియ్యం, కందిపప్పు, పంచదారపై ఆధారపడే కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వీరందరూ అధిక మొత్తానికి బయట కందిపప్పు కొనుగోలు చేస్తున్నారు. చౌక దుకాణాల్లో సరఫరా చేసే కందిపప్పు కేజీ రూ.60కి మించి ఉండదు. బయట మార్కెట్‌లో రూ.120 పైమాటే. కార్డుదారులకు రెట్టింపు భారం పడుతోంది. కందిపప్పు సరఫరా విషయంపై చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేసే గుత్తేదారుడి కోసం అన్వేషిస్తున్నారు. ఈ అంశంపై ఎన్టీఆర్, కృష్ణా డీఎస్వోలు పాపారావు, మోహన్‌రావు మాట్లాడుతూ..ప్రభుత్వం సరఫరా చేస్తే పంపిణీ చేస్తామని తెలిపారు.



సాంకేతిక ఆధారాలతో చిక్కారు

- సీడీఆర్ విశ్లేషణలో నిందితుల మధ్య భారీగా కాల్స్
- నకిలీ మద్యం కేసులో కీలకంగా మారిన వైనం

ఈనాడు, అమరావతి



నకిలీ మద్యం కేసులో సాంకేతిక ఆధారాలు కీలకంగా మారాయి. నిందితుల పాత్రను నిరూపించే పలు ఆధారాలు వారి ఫోన్లలోనే లభించాయి. వారి మధ్య సాగిన చెల్లింపులు, వాటి తాలూకా స్క్రీన్‌షాట్లు, లేబుళ్ల డిజైన్లు, సంభాషణలు పక్కాగా దొరికాయి. నిందితులు ఉపయోగించిన ఫోన్‌నంబర్ల తాలూకు సీడీఆర్ (కాల్ డీటెయిల్ రికార్డ్స్)లు, టవర్ లొకేషన్లను సిట్, ఎక్సైజ్ అధికారులు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ల నుంచి సేకరించారు.

● **ఇబ్రహీంపట్నంలో కుట్రకు శ్రీకారం:** ఇబ్రహీంపట్నంలోనే అక్రమ, నకిలీ మద్యం కుట్రకు బీజంపడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ1) ఫోన్ నంబరు లొకేషన్ ఇబ్రహీంపట్నంలోనే 549 రోజులు చూపించింది. ఈ రోజుల్లో 31వేలు పైగా కాల్స్ ఉన్నట్లు గుర్తించారు. మరో నంబరు 14వేలకు పైగా కాల్స్ ఉన్నాయి. ఈ లొకేషన్ 522 రోజులు ఇక్కడే ఉన్నట్లు చూపించింది. అద్దేపల్లి జగన్మోహన్‌రావు (ఏ2) ఫోన్ నుంచి 36వేల కాల్స్ ఉన్నాయి. 684 రోజులు ఇదే లొకేషన్ చూపించింది. ఇక్కడి నుంచే కుట్ర సాగిందనడానికి ఇవి కీలకంగా తోడ్పడ్డాయి. క్షేత్రస్థాయిలో రవాణా పరంగా కట్టా రాజు (ఏ6) ప్రధాన భూమిక పోషించాడు. ప్రదీప్‌దాస్ (ఏ8), మిథున్‌దాస్ (ఏ9)లు సామగ్రిని అందుకోవడం, నకిలీ సరకు రవాణాలో క్రియాశీలకంగా వ్యవహరించారు. వీరితో పాటు ఎన్.రవి (ఏ4), సయ్యద్ హాజీ (ఏ5) లొకేషన్లూ ఎక్కువ రోజులు ఇబ్రహీంపట్నంలోనే చూపించాయి. స్పిరిట్‌ను సరఫరా చేసిన బాలాజీ (ఏ3)నంబరు.. 34రోజులు, 124 కాల్స్, మరో నంబరు 23రోజులు, 49 కాల్స్ నమోదయ్యాయి. అంతదాస్ (ఏ10), కల్యాణ్ (ఏ12), శ్రీనివాస్‌రెడ్డి (ఏ11) వివరాలు సీడీఆర్ విశ్లేషణలో దొరికాయి. వీరంతా తరచూ ఒకే టవర్ లొకేషన్ పరిధిలోకి రావడం కుట్రలో వీరి పాత్రను తేటతెల్లం చేస్తోంది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులోనూ జనార్దన్‌రావు, రాజు, హాజీ, రవి, బాలాజీ, సుదర్శన్ తదితరుల టవర్ లొకేషన్లు చూపించాయి.

జనార్దన్‌రావు నుంచి ఎన్.రవి, హాజీ, కట్టా రాజు, అంగలూరు వెంకట కల్యాణ్, చెక్కా సతీష్, జోగి రాము, సుదర్శన్ తదితరుల మధ్య చాలా కాల్స్ ఉన్నాయి. పలు దఫాలు నకిలీ మద్యం వ్యవహారంపై సంభాషణలు సాగించినట్లు వెలుగులోకి వచ్చింది. జగన్మోహన్‌రావు ఫోన్ల నుంచి బాలాజీ, రవి, హాజీ, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, చెక్కా సతీష్, జోగి రాము, సుదర్శన్‌లకు ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్ ఉన్నాయి. వీటి ఆధారంగా నకిలీ మద్యం వ్యవహారంలో ప్రధాన కుట్రదారుడిగా జనార్దన్‌రావుగా తేలింది. మిగిలిన నిందితులతో సమన్వయం చేసుకోవడం, వ్యవహారాన్ని అమలుచేయడంలో జగన్మోహన్‌రావు పాత్ర ఉన్నట్లు తేలింది. 2023 అక్టోబరు 10 నుంచి 2025 సెప్టెంబరు 29 వరకు నిందితుల సీడీఆర్‌ల విశ్లేషణలను పరిశీలిస్తే.. ఏ1 పలు దఫాలు హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. అక్రమ మద్యం, ఈ7 బార్ నిర్వహణ, తదితర పనులకు సంబంధించి వెళ్లినట్లు తేలింది. లేబుళ్లు, మూతలు, హోలోగ్రామ్‌లు, ఇతర ప్యాకేజింగ్ సామగ్రినీ హైదరాబాద్‌లోనే సమకూర్చుకున్నాడు.

దుకాణం పెట్టనివ్వరు.. మద్యం ముట్టనివ్వరు!

అవకాశం వస్తే మద్యం దుకాణాలకు పోటీపడి ఆదాయం పొందేందుకు తీవ్రంగా ప్రయత్నించే వారిని చూశాం. కానీ కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామం ఇందుకు పూర్తి భిన్నం. అక్కడ పెద్దలు.. ప్రజారోగ్యం, గ్రామాభివృద్ధికి దోహదపడే ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం విక్రయాలు కానీ, గొలుసు దుకాణాలు కానీ లేకుండా ఉండేలా అందరూ కలిసి కట్టుబాటు చేసుకున్నారు. ఏళ్లుగా ఈ నిర్ణయాన్ని పక్కాగా అమలు చేస్తూ స్ఫూర్తిబాటలో నడుస్తున్నారు. ఈ గ్రామ జనాభా 15వేలకు పైనే. అత్యధికులు చిరు వ్యాపారులే. గతంలో మద్యం తాగిన వారికి జరిమానా కూడా విధించిన సందర్భాలున్నాయని, ఏళ్లుగా మద్యం అమ్మకాలను మాత్రం అనుమతించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని గ్రామస్థులంతా ఒకే మాటగా పాటిస్తున్నారని సర్పంచి షేక్ షబ్బీర్ తెలిపారు.

– పెండ్యాల(కంచికచర్ల), న్యూస్‌టుడే

కొనసాగుతున్న సాగునీటి విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వివిధ పంటల అవసరాల నిమిత్తం నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీటి విడుదల కొనసాగుతోంది. రానున్న జనవరి 15వ తేదీ వరకు వ్యవసాయానికి నీటి అవసరాలు ఉంటాయని జలవనరుల శాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 5,307 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 3,211, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 2,010, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 2,306, కేఈబీ (దివిసీమ) 403, ఏలూరు 401, బందరు కాలువకు 101 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

వాగు పోయే.. వాడ వచ్చే..



విజయవాడ వన్‌టౌన్ ప్రాంతమంతా పూర్వం వాగులు, వంకలు, చెరువులు, కొండలతో దర్శనమిచ్చేది. అక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకున్న కుమ్మరి కుటుంబాలు కుండలు తయారు చేయడానికి మట్టి తీసే క్రమంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని తవ్వేవారు. కాలానుగుణంగా అది కాస్తా చెరువుగా మారింది. చిట్టినగర్ సెంటర్ నుంచి కొత్తపేట పోలీస్‌స్టేషన్ వరకు ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని వాగు సెంటర్‌గా పిలిచేవారు. 1916లో వీరాంజనేయ స్వామి ఆలయం నిర్మించడంతో ఆ ప్రాంతాన్ని ఆంజనేయ వాగు సెంటర్‌గా పిలవడం మొదలు పెట్టారు. గతంలో వర్షం పడినప్పుడు ఈ వాగు ఉధృతంగా ప్రవహించేది. 1947లో రజాకారుల గొడవలు కారణంగా ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి నిర్వాసితులు బెజవాడకు తరలివచ్చారు. వారందరూ ఆంజనేయస్వామి ఆలయం పక్కన కనిపించిన ఖాళీ ప్రదేశంలో, కాలానుగుణంగా కొండలపై ఇల్లు నిర్మించుకున్నారు.

- చిట్టినగర్, న్యూస్‌టుడే

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఈ నెల 8న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ ఎస్.ఇలక్కియా తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా విజయవాడ

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా విజయవాడ ఎదుగుతోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. దేశంలోనే ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతికంగా ఇది సుసంపన్నమైన నగరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 'కృష్ణవేణి సంగీత నీరాజనం-2025' ముగింపు వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సంగీత ఉత్సవాలతో విజయవాడ దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రంగా మరింత ఉన్నత స్థానానికి చేరిందన్నారు. 'ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ.. చెందిన కళాకారులు పాల్గొని అద్భుత సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యం, నాటకం, సంగీతం సహా అన్ని కళలకు నిలయం ఆంధ్రప్రదేశ్. ప్రపంచానికి కూచిపూడి శాస్త్రీయ నృత్యాన్ని బహూకరించిన నేల ఇది. దక్షిణ భారత సంగీతంలో ప్రముఖ రచనలు చేసిన వారు ఆంధ్రులే. జానపద కళారూపాలలో.. బుర్రకథ, కోలాటం, వీరనాట్యం, బుర్ర కథ, తోలు... ఇవన్నీ ఇక్కడ అత్యంత ప్రజాదరణ పొందినవే..' అని గవర్నర్ పేర్కొన్నారు. ఇలాంటి అనేక అద్భుత కళారూపాలు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని సుసంపన్నం చేశాయన్నారు.



'సంగీత నీరాజనం' చిత్రపటం ఆవిష్కరించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, పక్కన మల్లాది రవికుమార్, జేసీ ఇలక్కియా, మల్లికార్జునరావు, వెంకటరామన్ హెగ్డే

పర్యాటకాభివృద్ధికి కళలు దోహదం

కేంద్ర పర్యాటక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ వెంకటరామన్ హెగ్డే మాట్లాడుతూ.. సాహిత్య కళలు పర్యాటకాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని చెప్పారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో ఎంతో మంది ప్రముఖ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. ప్రజల నుంచి చక్కని స్పందన లభించిందన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఐదు ఈవెంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో ఉత్సవం మూడోదని తెలిపారు. వైద్యం, వ్యాపారం, 'హెరిటేజ్-కల్చర్, ఆధ్యాత్మిక యాత్రలు తదితరాలను కేంద్రం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఇలక్కియా, సాంస్కృతిక సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, సంగీత విద్వాంసులు మల్లాది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రుక్మిణి శ్రీకృష్ణ సంగీత విభావరి కార్యక్రమం

అనుభవాల్లోంచే.. కథలు పుట్టుకొస్తాయ్

కాలంతో పాటే కొత్తగా.. విభిన్న కోణాల్లో రచనలు

'కథ 2024' సంకలనం ఆవిష్కరణలో సాహితీవేత్తలు



కథ 2024 పుస్తకంలో ప్రచురితమైన కథలు రచించిన రచయితలతో ముఖాముఖీ కార్యక్రమం

ఈనాడు, అమరావతి - విజయవాడ సాంస్కృతికం, కానూరు, న్యూస్‌టుడే

'జీవిత అనుభవాలు, ఆలోచనల్లో నుంచే కథలు పుట్టుకొస్తాయి. కాలంతో పాటే కొత్త కథలు బలపడుతున్నాయి. సామాజిక రీతులను ప్రతిబింబిస్తూ విభిన్న కోణాలు ఆవిష్కృతమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల జోరు పెరిగినా సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమైనా.. కథల విస్తృతి పెరుగుతుందే తప్ప తగ్గలేదు.' అంటూ పలువురు సాహితీవేత్తలు, రచయితలు అభిప్రాయపడ్డారు. విజయవాడ పి.బి.సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన కథ-2024 సంకలనం ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో సాహితీ వేత్తలు తరలివచ్చారు. అనంతరం కథాసాహితీ సహాయ సంపాదకులు ఎ.వి.రమణమూర్తి, కప్పర్తి రాంబాబు ఆధ్వర్యంలో.. సంకలనంలో ప్రచురితమైన కథల రచయితలతో ముఖాముఖి నిర్వహించారు. రచయితలు పతంజలిశాస్త్రి, కొట్టం రామకృష్ణారెడ్డి, జి.లక్ష్మి, శీలం సురేంద్ర, అశ్వనీకుమార్, శ్రీనివాసమూర్తి, డాక్టర్ కె.వి.రమణారావు, సుజాత వేల్పూరి, పాలగిరి విశ్వప్రసాద్, జి.ఉమామహేశ్వర్, పలాస సినిమా దర్శకుడు, రచయిత కరుణకుమార్.. తదితరులు తాము రాసిన కథా నేపథ్యాలను వివరించారు.

కథతో ఇష్టంగా 35ఏళ్ల ప్రయాణం..




కథ సంకలనం 1990లో ప్రారంభించాం.. 1991లో మొదటి పుస్తకం ప్రచురితమైంది. పుస్తక రచయిత 1991 డిసెంబరు నెలలో హైదరాబాద్‌లోని ద్వారకా హోటల్‌లో చేరి రామారావు ఆవిష్కరించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు, కుమార్తె రావడం ఆనందంగా ఉంది. గత 35 ఏళ్లుగా కథలతో మా ప్రయాణం చాలా ఇష్టంగా చేస్తున్నాం. మూడున్నర దశాబ్దాలుగా తెలుగులో ఇన్ని సంకలనాలు మరేవీ లేవు. **-వాసిరెడ్డి నవీన్, కథాసాహితీ సంపాదకులు**

కథల్లోని పాత్రలు వెంటాడుతున్నాయి..



కథ 2024 పుస్తకంలోని 17 కథలు చదివిన తరువాత పుస్తకం మూసేసినా కొన్ని పాత్రలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రతి కథలోని పాత్ర నిర్మాణం చాలా చక్కగా ఉంది. కొన్ని కథల్లోని పాత్రలు.. ప్రస్తుత సమాజంలోని పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. అన్ని కథలు చదివించేలా ఆసక్తిని పెంచేలాగే ఉన్నాయి. **-ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, రచయిత, సమీక్షకులు**

కొత్త కథలు విభిన్నంగా ఉన్నాయ్..



కథలన్నీ చదివిన తరువాత సంకలనానికి కథాసాహితీపై మరింత గౌరవం పెరిగింది. 35 ఏళ్లుగా ఈ పుస్తకాన్ని తీసుకురావడం ఆనందంగా ఉంది. కొత్త, యువ రచయితలు రాసిన కథలు చాలా ఆసక్తిని పెంచుతున్నాయి. కథలు ఎంచుకునే విషయంలో విభిన్నం, వైవిధ్యం చూపుతున్నారు. కార్యక్రమానికి సహకరించిన సిద్ధార్థ కళాపీఠానికి నా కృతజ్ఞతలు. **- పాపినేని శివశంకర్, కథాసాహితీ సంపాదకులు**

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయ ప్రాంగణంలో రద్దీ



కనకదుర్గానగర్ మార్గంలో..

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. భవానీ దీక్షల విరమణ నిమిత్తం క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో వాహనాలను నిలపడం సమస్యగా మారింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని అమ్మవారి నివేదన సమయంలో వీఐపీ టికెట్లు, అంతరాలయ దర్శనాన్ని నిలిపి వేయడంతో రూ.100, రూ.300 దర్శనం టికెట్ల విక్రయాలు పెరిగాయి. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. దేవస్థానం ఈవో శీనానాయక్ క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు పేర్కొన్నారు. - **ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే**

పది మంది ఎస్సైల బదిలీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ నగర పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డ్ శనివారం సమావేశమై.. బదిలీలకు ఉత్తర్వులు జారీ చేశారు. పది మంది ఎస్సైలను శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. కాగా.. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించిన నూతన ప్రొబేషనరీ ఎస్సైలకు ఈ బదిలీల్లో పోస్టింగ్‌లు దక్కాయి. మొత్తం 49 మంది ఎస్సైలను శిక్షణ నిమిత్తం నగరంలోని పోలీస్‌స్టేషన్లకు కేటాయించారు. అక్కడ శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత వారిని కేటాయించిన పోలీస్ స్టేషన్లకు పంపిస్తారు.

'పరకామణి కేసుపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు'

పటమట, న్యూస్‌టుడే: భక్తుల మనోభావాలు పట్టించుకోకుండా పరకామణి చోరీ కేసు చాలా చిన్నదంటూ మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరకామణి చోరీ కేసులో నిందితుడు రవికుమార్ తాను మహాపాపం చేశానని అంగీకరిస్తే.. రూ.లక్షల కోట్లు దోచుకున్న జగన్‌కు మాత్రం అది చిన్న కేసుగా కనిపిస్తోందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యాపారం ద్వారా అన్ని రూ.కోట్లు సంపాదించిన రవికుమార్‌కు పరకామణి చోరీ చేయాల్సిన అవసరం ఎందుకు ఉంటుందని, దీని వెనుక పెద్ద కుట్రకు పథకం రూపొందించారని ఆరోపించారు. పరకామణి కేసులో తాడేపల్లి ప్యాలెస్‌కు ఉన్న లింకులు త్వరలోనే బయటపడతాయన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన జగన్, మోకాళ్లపై కూర్చొని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ఇంకోసారి చేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.



ఇటీవల నిర్వహించిన కృతజ్ఞత సభ క్లిప్పింగ్స్‌ను సీఎంకు చూపిస్తున్న వెంకటేశ్వరరావు మాదిగ

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. వర్గీకరణ చేసి 59 కులాలకు సామాజిక న్యాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం ఆయన సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. సంక్షేమ పథకాల అమలులో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరినట్లు వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు.

9 నుంచి అమరావతి బాలోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: అమరావతి బాలోత్సవం-8.. ఈ నెల 9వ తేదీ నుంచి 11 వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావులు తెలిపారు. ఈ కార్యక్రమ గోడప్రతులను ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పిల్లల పండగను పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవం కోసం అనే నినాదంతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 43 అకడమిక్, 17 కల్చరల్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు ప్రాంగణాలు, 5 గదులు మొత్తం 15 చోట్ల ఒకేసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి 12 వేల మంది పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, బాలోత్సవాల వ్యవస్థాపకులు, కొత్తగూడెం బాలోత్సవం కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, బెంగళూరుకు చెందిన నవస్కంద హూమ్ ఫర్ జనరేషన్స్ ప్రతినిధి కె.యతిరాజులు నాయుడు హాజరవుతారని తెలిపారు. గోడప్రతుల ఆవిష్కరణలో ఆఫీస్ బేరర్స్ సాంబిరెడ్డి, పిన్నమనేని మురళీకృష్ణ, ఎన్.విద్యాకన్నా, యువీ రామరాజు, వల్లభరావ్, వై.సుబ్బారావు, డీవీ రాజు, టి.క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న రామరాజు, సాంబిరెడ్డి, కొండలరావు, రామరాజు, విద్యాకన్నా తదితరులు

వాజ్‌పేయీ సేవలు దేశాభివృద్ధికి దోహదం

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతి ఉత్సవాల కార్యక్రమం నిర్వహణకు సంబంధించి విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో వార్ రూమ్‌ను మాధవ్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ తేదీ ధర్మవరంలో నిర్వహించే బహిరంగ సభకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించినట్లు తెలిపారు. ఏపీ అభివృద్ధికి వాజ్‌పేయీ ఆద్యుడని.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. టెలికం రంగం అభివృద్ధికి నాంది పలికారని వెల్లడించారు. యాత్ర రాష్ట్ర కన్వీనర్‌గా నాగోతు రమేష్‌నాయుడు, విభాగాల వారీగా నాయకులను నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాగోతు రమేష్‌నాయుడు, అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, నాయకులు ఎస్.కె.బాజీ, బి.నాగలక్ష్మి, గోపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వార్‌రూమ్ ప్రారంభిస్తున్న మాధవ్, పక్కన రమేష్‌నాయుడు, యామిని శర్మ

బీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం నగరంలోని ఓ హాలులో రాష్ట్ర అధ్యక్షుడు బొల్లిపో మనోజ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. సంఘ నిర్మాణం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా భూపతి రామారావు, ప్రధాన కార్యదర్శిగా చిట్టేటి రమేష్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా కె.మోహనరావు, అసోసియేట్ అధ్యక్షులుగా పర్రె వెంకటరావు, పల్లం వేణుగోణుగోపాల్, బొల్లిపో మనోజ్‌కుమార్, కోశాధికారిగా ఎం.ఆర్.చక్రవర్తి, మహిళా కార్యదర్శిగా వి.మేరీతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నూకలపాటి రమణయ్య, పరిశీలకుడు జి.ఆంజనేయులు ప్రకటించారు.

పోలీసుల అదుపులో రౌడీషీటర్ సాయి

సస్పెక్ట్ షీటర్ నవీన్ హత్య కేసు దర్యాప్తు వేగవంతం



పిల్ల సాయి

నందిగామ, జగ్గయ్యపేట(న్యూస్‌టుడే): జగ్గయ్యపేటలో సంచలనం సృష్టించిన సస్పెక్ట్‌షీటర్ నవీన్‌రెడ్డి హత్య కేసులో నిందితుడైన రౌడీషీటర్ పిల్ల సాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుడిని పట్టుకునే క్రమంలో పోలీసుల పైనే దాడికి యత్నించగా అతికష్టం మీద అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విజయవాడలో పలు కేసుల్లో ఉండడంతో ఇతడిపై రౌడీషీట్ తెరిచారు. మూడు రోజుల క్రితం జన్మదిన వేడుకల్లో బీరు సీసాలతో పరస్పరం దాడి చేసుకోగా సస్పెక్ట్‌షీటర్‌ను పిల్ల సాయి హత్య చేసిన సంగతి తెలిసిందే.

చిల్లకల్లుకు చెందిన అన్వేష్‌కు కుమార్తె జన్మించడంతో మూడు రోజుల కిందట స్నేహితులకు మందు పార్టీ ఇచ్చాడు. దీనిలో చిల్లకల్లుకు చెందిన ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నారు. మత్తులో నవీన్‌రెడ్డి, సాయిలు వాగ్వాదానికి దిగారు. ముందుగా నవీన్‌రెడ్డి బీరు సీసాతో దాడి చేయడంతో సాయికి ఎడమ చేతికి గాయమైంది. అనంతరం సాయి దాడి చేసి నవీన్‌రెడ్డిపై బీరుసీసాతో పొడవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్కూటీపై నందకిషోర్, అన్వేష్‌లు వైద్యశాలకు తరలించగా అప్పటికే నవీన్‌రెడ్డి మృతి చెందాడు.

ఆ ఐదుగురి నుంచి వివరాల సేకరణ

గత మూడు రోజుల నుంచి పార్టీకి హాజరైన ఐదుగురు వ్యక్తులను పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఏ సందర్భంలో అందరూ కలిసి పార్టీ చేసుకున్నారు. అక్కడ ఎన్ని గంటలకు కలిశారు. బీరు సీసాలతో దాడి చేసుకోవడానికి దారితీసిన కారణాలు గురించి లోతుగా విచారించారు. పార్టీకి అవసరమైన డబ్బులు ఎవరు ఖర్చు చేశారు? దీనిలో అన్వేష్ పార్టీ ఇచ్చి డబ్బులు ఖర్చు చేసినట్లు భావిస్తున్నారు. ముందుగా చిల్లకల్లులో కలిసిన తర్వాత హత్య స్థలానికి ఏ సమయానికి వెళ్లారని ప్రశ్నించినట్లు తెలిసింది.

సీన్ రీకన్‌స్ట్రక్షన్ : ఎంసీఎల్ కర్మాగారానికి సమీపంలో ఉన్న ఘటనా స్థలానికి పార్టీకి హాజరైన ఐదుగుర్ని పోలీసులు తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. అలాగే చిల్లకల్లు, జగ్గయ్యపేట ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించారు. ఏడుగురు ఎన్ని గంటలకు కలిశారు? తర్వాత ఎక్కడికి వెళ్లారు? గాయాలైన సస్పెక్ట్‌షీటర్‌ను దేనిపైన వైద్యశాలకు తీసుకెళ్లారనే విషయాలు సీసీ కెమెరాల ఫుటేజీలో నమోదై ఉండడంతో వాటిని పరిశీలిస్తున్నారు. దీని ప్రకారం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దీనిలో హత్యకు పాల్పడిన రౌడీషీటర్ పైనే పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతానికి ఒక్కరినే నిందితుడిగా చేర్చారు. మిగిలిన ఐదుగురు ఘటనా స్థలంలో ఉండడంతో విచారిస్తున్నారు. వీరిలో ఇద్దరు నవీన్‌రెడ్డి ప్రాణాలు కాపాడేందుకు జగ్గయ్యపేట ప్రభుత్వ వైద్యశాల వరకు స్కూటీపై తీసుకెళ్లారు. వీరందర్నీ సాక్షులుగా పరిగణిస్తున్నట్లు సమాచారం. ఎంతకాలం నుంచి చిల్లకల్లులో నవీన్‌రెడ్డి, నిందితుడు ఉంటున్నారు? ఇక్కడ ఏమి చేస్తున్నారనే విషయాలను సేకరిస్తున్నారు. ఇక్కడే ఎందుకు ఉంటున్నారనే కోణంలోనూ జగ్గయ్యపేట పోలీసుల దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం.

తిరుపతమ్మ ఆలయంలో సౌకర్యాల కల్పనకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో భక్తులకు సౌకర్యాలు మెరుగు పర్చేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 5న 'ఈనాడు'లో 'తిరుపతమ్మా.. తిప్పలు తప్పించమ్మా' శీర్షికతో వచ్చిన కథనానికి ఆలయ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి స్పందించారు. ఆదివారం ఆలయం వద్ద అమ్మవారి దర్శనం, ప్రసాదాలు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై భక్తులను అడిగి వివరాలు సేకరించారు. దర్శనం చేసుకున్న వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఉద్యోగులతో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. లడ్డూలు తెప్పించి భక్తులకు ఇచ్చి ఎలా ఉందో చూడాలని కోరారు. లడ్డు తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు దగ్గరి దారిలో ఆలయంలోకి వెళ్లేలా క్యూలైన్‌లో మార్పులు చేయలని ఆలయ ఈఈ రమాను ఆదేశించారు. అనంతరం క్యూలైన్లు పరిశీలించారు. చంటి పిల్లలతో వచ్చే తల్లులకు తొందరగా దర్శనం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.



భక్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి

జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు సీఎం కృషి



లోగో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ప్రసాద్, అంకమ్మ చౌదరి, కిదాంబి శ్రీకాంత్, రవినాయుడు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు యోనెక్స్-సన్‌రైజ్ 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లోగో, పోస్టర్‌ను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, స్టార్ బ్యాడ్మింటన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి, శాప్ మాజీ ఛైర్మన్ పి.అంకమ్మ చౌదరిలతో కలిసి ఎంపీ శనివారం విజయవాడలోని ఒక హోటల్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ క్రీడల నిర్వహణ కోసం కావాల్సిన అన్ని క్రీడా మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నామని, విజయవాడలో పోటీల నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర రాజధానిలో క్రీడా వర్సిటీ, స్టేడియం ఏర్పాటు కానుందన్నారు. ఐజీఎంసీ స్టేడియం ఆధునికీకరణ పనులకు ప్లాన్ సిద్ధమైందని, త్వరలోనే సీఎం చంద్రబాబును కలిసి వివరాలను తెలియజేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. జింఖానా, విద్యాధరపురం మైదానాలను జాతీయ క్రీడల నిర్వహణకు అనుకూలంగా తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ విజయవాడలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనుండడం హర్షణీయమన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో మాట్లాడి రాష్ట్రంలో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. తిరుపతిలో కిడాంబి శ్రీకాంత్‌కు, విశాఖలో పీవీ సింధు, అమరావతిలో గోపీచంద్‌కు అకాడమీల ఏర్పాటుకు స్థలాలు కేటాయించామన్నారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఎంఎస్ఎన్ ప్రసాద్‌తో పాటు రాష్ట్ర, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

ధర వరలు

వంకాయలు-20/28, టమాటా-38, బెండ-42, పచ్చిమిర్చి-40, కాకర-36, బీర-40/44, క్యాలీ ఫ్లవర్-20/22, క్యాబేజి-24, క్యారెట్-42, దొండ-28, బంగాళదుంప-29, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-46, దోస-28, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-80, మునగ-20/18, ఆకు కూరలు (కట్ట)-3/7, కంద-40, బీట్‌రూట్-44, కీరదోస-32, బీన్స్-80/70, క్యాప్సికమ్-74, చింతకాయలు-60, నిమ్మ (డజను)-24/18, కొత్తిమీర-8/15, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/15 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

పెనాల్టీల జీవో రద్దుకు డిమాండ్

గాంధీనగర్: జీవో నంబరు-21 ద్వారా పెనాల్టీలు పదుల రెట్లలో పెంచేశారని.. ఆ జీవోను రద్దు చేయాలని ఏపీ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారీ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15ఏళ్లు దాటిన ఆటోలకు రూ.3500, 20ఏళ్లు దాటిన వాటికి రూ.7వేల ఫీజు పెంచారని పేర్కొన్నారు. చాలీచాలని ఆదాయంతో రూ.వేలకు వేలు చలానాలు కట్టలేరని చెప్పారు. జీవో 21ని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. డి.శ్రీధర్‌బాబు, వై.అప్పారావు, రఫి, వలీ, సి.హెచ్.సుబ్బారావు, సుమన్, శివరామ్, అప్పలస్వామి పాల్గొన్నారు.

నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నందిగామ గ్రామీణం: నందిగామ శ్రీ అక్షర జూనియర్ కళాశాలలో ఆదివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్ విద్యార్థులకు 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అన్న అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో కళాశాల ఇంటర్ విద్యార్థులు ఆర్. హేమచంద్రస్వామి, కె.సాయిశ్రీనివాస్, పవిదకామేశ్వరులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ గడుపూడి కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ కొణకంచి కిరణ్‌లు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.


విజేతలతో శ్రీఅక్షర కళాశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ కిరణ్

సైనికులకు రుణపడి ఉన్నాం


విరాళం ఇస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: సరిహద్దుల్లో ఉంటూ దేశాన్ని కాపాడుతున్న సైనికులకు అందరూ రుణపడి ఉంటారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భంగా విరాళాల సేకరణ చేపట్టారు. మాజీ సైనికులు, వారి పిల్లల సంక్షేమానికి సౌమ్య విరాళం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సైనిక సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వడం సామాజిక బాధ్యత అని అన్నారు. దేశ రక్షణలో గాయపడిన సైనికులు, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని చెప్పారు. మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

★ నందిగామ నుంచి అనాసాగరం గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్‌కు నాలుగు చోట్ల లీకులయ్యాయి. ఈ విషయాన్ని మున్సిపల్ ఏఈ పవిత్రశ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి మరమ్మతులు చేయించారు. ★ స్థానిక ముక్కపాటి కాలనీలో రెండు చోట్ల వీధి దీపాలు వెలగట్లేదు. దీనివల్ల రాత్రివేళ వీధుల్లో చీకటిగా ఉండడం వల్ల ఇబ్బందిపడుతున్నట్లు స్థానికులు మున్సిపల్ వైస్ పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి మరమ్మతులు చర్యలు తీసుకున్నారు. ★ స్థానిక 19, 20వ వార్డుల్లో కాలువల నుంచి తీసిన పూడిక మట్టిని అక్కడే వదిలేశారని స్థానికులు.. కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపి పూడిక తీయించి శుభ్రం చేయించారు. ★ స్థానిక ఒకటో వార్డులో డ్రెయినేజీ పూడిక పేరుకుని మురుగునీరు దిగువకు వెళ్లట్లేదని దీనివల్ల దుర్గంధం వస్తోందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయినేజీ శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, నందిగామ**

చిల్లకల్లు ఎస్సై-2గా సాయి మణికంఠ



జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు పోలీస్ స్టేషన్ ట్రైనీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సాయి మణికంఠ ఆదివారం చిల్లకల్లు ఎస్సై-2గా బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఈఈగా రవికిషోర్ బాధ్యతల స్వీకరణ

ఇబ్రహీంపట్నం: విజయవాడ రూరల్ డిస్కం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా రవికిషోర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ విధులు నిర్వహించిన వసంతరావు పదవీవిరమణ పొందడంతో విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎగ్జిక్యూటివ్ రెగ్యులర్ పోస్టు నియామకం జరిగే వరకూ రవికిషోర్ ఇన్‌ఛార్జిగా ఉంటారని ఆదేశాలు జారీ అయ్యాయి.

బాలింతలు.. గర్భిణులకు వరం

పీఎం మాతృవందన యోజనలో ప్రోత్సాహకాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

బాలింతలకు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన ద్వారా నగదు ప్రోత్సాహకాలు మంజూరు చేస్తున్నారు. మొదటి, రెండు కాన్పులకు ఈ అవకాశం కల్పించారు. మొదటి కాన్పులో మగబిడ్డ, ఆడ బిడ్డ ప్రభుత్వాసుపత్రిలో ప్రసవిస్తే రూ.6 వేలు, ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవిస్తే రూ.5 వేలు ప్రోత్సాహకం మంజూరు చేస్తారు. రెండో కాన్పులో కేవలం ఆడ బిడ్డ జన్మిస్తేనే ఈ పథకం ద్వారా ప్రభుత్వాసుపత్రిలో ప్రసవానికి రూ.6 వేలు, ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవిస్తే రూ.5 వేలు వంతున ఆర్థికసాయం మంజూరవుతుంది. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల ప్రోత్సాహకానికి, గర్భిణులు పోషకాహారం తీసుకోడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా ఈ సాయం అందజేస్తోంది. దీనికి గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేస్తారు. నందిగామ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో మొదటి కాన్పులో 343 మంది బాలింతలు, రెండో కాన్పులో 45 మంది బాలింతలు ఈ పథకంలో అర్హులుగా నమోదయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులుగా నమోదు చేయించుకోవాలి. గర్భిణి రెండు టీటీ ఇంజిక్షన్లు చేయించుకున్నాక రూ. 3 వేలు, రోగనిరోధక టీకాలు వేయించాక రూ. 2 వేలు, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవిస్తే రూ.వెయ్యి వంతున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. రెండో కాన్పులో ఆడ బిడ్డను ప్రసవిస్తే మూడు టీకాలు వేయించుకున్నాక రూ.5 వేలు, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం అయితే రూ.వెయ్యి వంతున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. మొదటి కాన్పులో ఆడ/మగ బిడ్డను జన్మనిచ్చినా ఈ సాయం ఇస్తారు. రెండో కాన్పులో కేవలం ఆడబిడ్డను కంటేనే ఈ సాయం మంజూరవుతుంది.


పోషకాహార కిట్లతో గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

నియోజకవర్గంలో అర్హులు..

మండలం	కాన్పు 1	కాన్పు 2
నందిగామ పట్టణం	27	3
నందిగామ గ్రామీణం	55	6
చందర్లపాడు	93	27
కంచికచర్ల	103	5
వీరులపాడు	65	4

పేర్లు నమోదు చేయించుకోవాలి

గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకుంటేనే సాయం మంజూరవుతుంది. ఒకవేళ నమోదు చేయించుకోకపోతే పథకంలో ప్రసవం అయిన ఆడ బిడ్డను ప్రసవిస్తే ముందుగా నమోదు చేయించుకోవాలి. గతంలో పీహెచ్‌సీల్లో నమోదు చేసేవారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఐసీడీఎస్‌కు బాధ్యత అప్పగించారు. పేదలు గర్భిణులుగా ఉన్న సమయంలో పోషకాహారం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ప్రోత్సాహం అందజేస్తోంది. **- లక్ష్మీభార్గవి, సీడీపీవో**

నైపుణ్యాలు పెంపొందించుకుంటే విజయం

కానూరు, న్యూస్‌టుడే: న్యాయ విద్యార్థులు జ్ఞానసముపార్జన ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు అన్నారు. వీఆర్‌సిద్ధార్థ న్యాయ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జస్టిస్ చల్లాకొండయ్య మెమోరియల్ సిద్ధార్థ 4వ నేషనల్ మూట్ కోర్టు ఫెస్ట్-2025 ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం మూట్ కోర్టు పోటీల్లో ప్రథమ స్థానం పొందిన కర్ణాటకలోని మంగళూరు ఎస్‌డీఎం లా కాలేజీ విద్యార్థులకు, ద్వితీయ స్థానంలో నిలిచిన కేరళలోని కోజికోడ్ గవర్నమెంట్ లా కాలేజీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. లీగల్ క్విజ్‌లో ప్రథమ బహుమతిని సిద్ధార్థ లా కాలేజీ, స్కూల్ ఆఫ్ లా విత్ ఏపీ యూనివర్సిటీ అమరావతిలు సంయుక్తంగా, ద్వితీయ బహుమతిని కేఎల్‌ఈఎఫ్ కాలేజీ ఆఫ్ లా విద్యార్థులు అందుకున్నారు. బెస్టు మూటర్ ఇన్ కోర్టుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన గవర్నమెంట్ లా కాలేజీ, బెస్ట్ మెమోరియల్ ఇన్ మూట్ కోర్టు, బెస్ట్ రీసెర్చర్ ఇన్ మూట్‌కోర్టుగా తమిళనాడులోని అంబేడ్కర్ లా యూనివర్సిటీ విద్యార్థులు నిలిచారన్నారు.

బోద వ్యాధి నిర్ధారణ పరీక్షలు

చందర్లపాడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం నుంచి బోదకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి సుమనిరూత్ తెలిపారు. 8వ తేదీన పొక్కునూరు, 9న కాసరబాదలో రాత్రి సమయంలో రక్త పరీక్షలు చేస్తామన్నారు. గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుపతమ్మ ఆలయాభివృద్ధికి సహకరించండి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మాజీ ఎంపీపీ వేగినేటి గోపాల కృష్ణమూర్తి కోరారు. ఈమేరకు తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు తొండపు దశరథ జనార్దన్‌తో కలిసి మంత్రిని శనివారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదాయ పరంగా రెండోస్థానంలో ఆర్‌జేసీ అధికారి స్థాయి హోదాలో ఉన్న ఆలయాన్ని గత వైకాపా ప్రభుత్వం డిప్యూటీ కమిషనర్ స్థాయికి తగ్గించారని వివరించారు. గత ప్రభుత్వంలో అమ్మవారి ఆదాయంతో పలు అక్రమ నిర్మాణాలు నిర్మించారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మునేరు అవతలి వైపున అమ్మవారి మామిడితోటలో రూ.3 కోట్లతో ఏసీ కల్యాణ మండపాన్ని నిర్మించారని.. దీనిలో భోజన శాల ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆలయానికి ప్రతి శుక్ర, ఆదివారాల్లో వేలాది మంది భక్తులు వస్తున్నారని గ్రామంలో ట్రాఫిక్ సమస్య వస్తుందని చెప్పారు. దీన్ని నివారించేందుకు గ్రామంలోకి వాహనాలు రాకుండా మైత్రీ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. వీటిపై మంత్రి ఆనం సానుకూలంగా స్పందించారని ఆదివారం పెనుగంచిప్రోలులో విలేకరుల సమావేశంలో గోపాల కృష్ణమూర్తి తెలిపారు.


మంత్రి రామనారాయణ రెడ్డికి సమస్యలు వివరిస్తున్న మాజీ ఎంపీపీ వేగినేటి పక్కన టీడీ జనార్దన్

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : తిరువూరులో జరిగిన ఎస్ఎఫ్ఐ 53వ జిల్లా మహసభల్లో జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారని నూతన అధ్యక్షుడు టి.కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని తదితర సమస్యలపై భవిష్యత్తు కార్యచరణ రూపొందించామని చెప్పారు. కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వరావు, కుమార్ నాయక్, ప్రణీత, ప్రణయ్, కాజు, యాదవ్, ఉష, యశస్విని తదితరులను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

సజావుగా జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం నేషనల్ మీన్స్‌కోమెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తిరువూరు ఎంఈవో-1, డీవైఈవో(నందిగామ) శ్యామ్ సుందరావు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అందించే ఈ స్కాలర్‌షిప్‌నకు ప్రతి ఏడాది వేలాది మంది పోటీ పడుతుంటారని చెప్పారు. ఈ పరీక్షకు సుమారు 500 వందల మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

చంద్రమౌళీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ఉదయభాను దంపతులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పురాతన చంద్రమౌళీశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, విమలాదేవి దంపతులు పాల్గొన్నారు. వారికి ఆలయ స్థానాచార్యులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ, ప్రధానార్చకుడు పల్లికూన కేశవప్రసాద్ తదితరులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు సమర్పించారు.

సేవలు అభినందనీయం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ మహంకాళి వెంకన్నగురుస్వామి పీఠంలో అయ్యప్ప మాలధారుల మండల దీక్షలు ఆదివారం ముగిశాయి. మున్సిపల్ కమిషనర్ లోవరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టరు ఏచూరి రాము, కుంచం సుజిత్, అయ్యప్ప మాలధారులు గురుస్వామి వెంకన్నను సన్మానించారు. గత 38 సంవత్సరాలుగా అయ్యప్ప సేవా సమితి ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అయ్యప్ప శరణు ఘోషతో ఆ ప్రాంగణం మార్మోగింది.


రాఘవాపురం: పుష్పాలంకరణలో రామలింగేశ్వరస్వామి


వెంకన్న గురుస్వామిని సన్మానించిన కమిషనర్ లోవరాజు, రాము, మాలధారులు

✦ మండలంలోని దాములూరు శివారు కూడలి శివాలయంలో సంగమేశ్వరస్వామికి, గోళ్లమూడి శివాలయంలో శంభులింగేశ్వరస్వామికి, రాఘవాపురం శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాభిషేకం నిర్వహించారు.

252 మందికి కంటి పరీక్షలు


శిబిరంలో తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, వెంకట నరసింహారావు తదితరులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని కొణకంచి, తోటచర్ల, నవాబుపేట గ్రామాల్లో జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో వైద్యులు కంటి వైద్య పరీక్షలు చేశారు. వైద్యశిబిరాన్ని తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ పరిశీలించారు. 40 రోజుల కిందట ఆయా గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించి 90 మందికి శంకర నేత్రాలయంలో శుక్లాల శస్త్ర చికిత్సలు చేయించారు. ఆదివారం వారికి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కొణకంచిలో 117, తోటచర్ల, నవాబుపేటలో 135 మందికి కంటి పరీక్షలు చేశారు. 67 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయాలని.. 166 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామని ఫౌండేషన్ తరపున పంపిణీ చేస్తామని కోఆర్డీనేటర్ కట్టా వెంకట నరసింహరావు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నెట్టెం దుర్గాభవానీ, కసుకుర్తి దశరథ రామారావు, సి. హెచ్. వెంకటేశ్వరరావు, జి. ఆనందరావు, సి. హెచ్. క్రాంతి, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యపై పోరాటం


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వీరులపాడు, న్యూస్‌టుడే: ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ పోరాటాలు చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి 2026 జనవరి 4 వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహా సభలు విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని జుజ్జూరు, అల్లూరు, పెద్దాపురం, జయంతి, దొడ్డదేవరపాడు, వీరులపాడు గ్రామాల్లో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు గోడ ప్రతులు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

దారుల దశ మారేదెప్పుడో?

కంచికచర్ల, న్యూస్‌టుడే

మండలంలోని పలు రహదారులు వాహనదారులకు నిత్యనరకం చూపిస్తున్నాయి. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం వీటి అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. అనంతరం వచ్చిన కూటమి సర్కారు పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. దీంతో కంచికచర్ల-మున్నలూరు రహదారి అడుగడుగునా భారీ గుంతలతో అధ్వానంగా మారింది. ఇక్కడ గుంతల నడుమ రహదారిని వెతుక్కోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

★ కీసర-గండేపల్లి రహదారిలో నిత్యం స్థానిక ప్రైవేటు కర్మాగారానికి వచ్చి పోయే భారీ వాహనాల కారణంగా రహదారి ధ్వంసమైంది. ఈ మార్గంలో గుంతల కారణంగా నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ★ కంచికచర్ల-వేములపల్లి రహదారి రాళ్లు తేలి రాకపోకలకు అనువుగా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

★ మోగులూరు రహదారిలో భారీ గుంతలు వాహనదారులకు ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. ★ ఇవేకాక పలు అంతర్గత రహదారులు సైతం అధ్వానంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ఆసుపత్రికి వచ్చే రోగులు, రోగుల బంధువులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

★ గొట్టుముక్కల ప్రధాన సెంటరులో దారి మొత్తం కంకర తేలి ప్రమాదకరంగా మారింది.


భారీ గుంతలతో మున్నలూరు రోడ్డు

బాల చైతన్య స్ఫూర్తి క్రీడా ఉత్సవానికి ఏర్పాట్లు


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలో కొనసాగుతున్న బాల చైతన్య స్ఫూర్తికి 14 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభిస్తున్న క్రీడా ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. విద్యా సంస్థలు పాల్గొనాలని సూచించారు. బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో క్రీడోత్సవం ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ.. తాత్వికులు గెంటేల వెంకటరమణ స్ఫూర్తితో ప్రారంభించిన బాల చైతన్య స్ఫూర్తిని ముమ్ముందు మరింత ఉత్సాహ భరితంగా, ఇతర అంశాలకు కూడా విస్తరించి నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడలు, నైతిక విలువలపై బాల చైతన్య స్ఫూర్తి ద్వారా దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నూకల కుమార రాజా, నాయకులు మన్నె నారాయణరావు, ఎం.శ్రీనివాసరావు, పీఈటీలు పాల్గొన్నారు.

రైతుల ఇళ్ల వద్ద పత్తి కొనుగోలు

నందిగామ, నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మునగచర్ల గ్రామంలో ఆదివారం నందిగామ ఏఎంసీ వైస్ ఛైర్మన్ అమ్మినేని జ్వాలాప్రసాద్, సీసీఐ బయ్యర్లు జానకీరామయ్య, సంపత్ రైతుల ఇళ్ల వద్ద పత్తి నాణ్యత పరిశీలించి క్వింటా రూ. 7750 నుంచి రూ. 8110 వంతున కొనుగోలు చేశారు. మిగిలిన గ్రామాల్లోనూ రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సీసీఐ కేంద్రానికి రైతులు పత్తిని తీసుకువచ్చాక నాణ్యత లేదని తిరస్కరిస్తే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో రైతుల వద్దకు వెళ్లామని ఏఎంసీ వైస్ ఛైర్మన్ తెలిపారు. రైతులు యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని పత్తి విక్రయించుకోవచ్చని అన్నారు. నందిగామ ఏఎంసీ కార్యదర్శి వెంకటేశ్వరరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.


పత్తిని పరిశీలిస్తున్న జ్వాలాప్రసాద్, సీసీఐ బయ్యర్

రాజధానిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : వ్యాపారుల వ్యాపారాభివృద్ధి కోసం రాజధాని అమరావతిలో ఏపీ ట్రేడ్ హబ్ నిర్మాణానికి ఔటర్‌రింగ్ రోడ్డు పక్కన స్థలాం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ వక్కలగడ్డ భాస్కరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో ఫెడరేషన్ తమ వంతు సహకారం అందిస్తుందని చెప్పారు. రాజధాని రాకతో వ్యాపారాలు మరింత ఊపందుకుంటాయని పేర్కొన్నారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని చెప్పారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ప్రధాన కార్యదర్శి పి. ఎస్. ఎల్. ఎన్. వరప్రసాద్, ఉపాధ్యక్షులు వంకాయల రామకృష్ణ, బొప్పిడి రామకృష్ణ, ఐ. విజయ్‌కుమార్‌రెడ్డి, తాళ్లూరి సత్యనారాయణ, ఎం. సత్యకుమార్, నందేపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు సత్ప్రవర్తనపై అవగాహన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను డీసీపీ బి.లక్ష్మీ నారాయణ హెచ్చరించారు. జగ్గయ్యపేట, వత్సవాయి, చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు సర్కిల్ పోలీసులు ఆదివారం చిల్లకల్లు జడ్పీ స్కూల్లో సత్ప్రవర్తనపై ఆయన అవగాహన కల్పించారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. నేర ప్రవర్తనను మార్చుకొని సమాజంలో నూతన అడుగులు వేస్తే ఎలా జీవితాలు మారుతాయో వివరించారు. ఎస్సైలు రాజు, సూర్యశ్రీనివాస్, ఉమామహేశ్వర రావు, ట్రైనీ ఎస్సైలు సాయి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: రౌడీ షీటర్లు గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఏసీపీ బాల గంగాధర్ తిలక్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా మంచిగా జీవిస్తున్న వారిపై ఉన్న రౌడీ షీట్లు పరిశీలించి ఎత్తివేస్తామన్నారు. నేర ప్రవృత్తిని మానుకుని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని చెప్పారు. సీఐ వైవీవీఎల్ నాయుడు, ఎస్సైలు శాతకర్ణి, సూర్యవంశీ తదితరులు పాల్గొన్నారు. వీరులపాడు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్ప్రవర్తతో మెలగాలని ఎస్సై బి.అభిమన్యు హెచ్చరించారు. వీరులపాడు పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్సై కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఉపేక్షించేది లేదన్నారు. శిక్షణ ఎస్సై కిరణ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ

కృష్ణలంక పీఎస్‌కు ముగ్గురు ఎస్సైలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: శాంతి భద్రతలను మరింత బలోపేతం చేసే క్రమంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు ముగ్గురు ఎస్సైలను కేటాయిస్తూ నగర పోలీస్ కమిషనర్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణలంక స్టేషన్‌లో ట్రైనీ ఎస్సైలుగా ఉన్న ఎన్. వెంకటలక్ష్మి, ఎస్. గిరిధర్‌బాబులకు ఇక్కడే పోస్టింగ్‌లు ఇవ్వగా.. జగయ్యపేట నుంచి సత్యనారాయణను కృష్ణలంకకు బదిలీ చేశారు. కృష్ణలంకలో ఎస్సైగా పనిచేస్తున్న ఎ. మణి మహిళా పీఎస్‌కు బదిలీ అయ్యారు.

కీసర టోల్‌ప్లాజా వద్ద భయం భయం

కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే

కీసర స్వర్ణ టోల్ ప్లాజా ప్రాంతం రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గత ఆగస్టు 22న టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకున్న రహదారి ప్రమాదంలో తల్లితో పాటు మూడు నెలల బాలుడు మరణించడంతో అక్కడ రహదారి భద్రతపై విమర్శలు వ్యక్తమయ్యాయి. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి.

కారణాలు ఇవీ.. : కీసరకు రెండు వైపులా ఉన్న గండేపల్లి, పెండ్యాల గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనాలు టోల్ ప్లాజాకు అత్యంత చేరువలోనే కీసరకు చేరుకోవడం. *ఆయా గ్రామాల నుంచి వచ్చే వాహనాలకుతోడు జాతీయ రహదారిపై మునేటి మీద నిర్మించిన వంతెనపై నుంచి వచ్చే వాహనాలు వేగంగా అదే సెంటరుకు చేరుకోవడం. ఇంత రద్దీగా ఉండే సెంటరులో జాతీయ రహదారిపై భద్రతా చర్యలు పాటించకపోవడం, టోల్ ప్లాజాకు ఇరువైపులా జాతీయ రహదారిపై ఆక్రమణలు, అక్కడే ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు నిలిపి ఉంచడం, అన్ని వైపులా నుంచి ఇష్టారీతిన వాహనాలు దూసుకురావడం ఈ ప్రమాదాలకు కారణంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు టోల్ ప్లాజా వద్ద ప్రమాదాలు జరుగకుండా శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


రహదారిపై నిలిపిన ఆటోలు

కార్యాలయ ఆవరణలో మద్యం సీసాలు

కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ తహసీల్దారు కార్యాలయం, పోలీస్ స్టేషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, సచివాలయం, గృహ నిర్మాణ శాఖ, వెలుగు తదితర కార్యాలయాలున్నాయి. ఆఫీసు పని గంటలు ముగిసిన తరువాత ఆవరణలో చీకటిగా ఉండడంతో పాటు కార్యాలయాల భవనాలు అడ్డంగా ఉండడంతో కొంతమంది అక్కడకు చేరి మద్యం తాగుతున్నారు. ఇదే ఆవరణలో అసంపూర్తిగా ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటరు, అన్న క్యాంటీన్ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **-కంచికచర్ల, న్యూస్‌టుడే**



పీఏసీఎస్ ఉద్యోగుల ధర్నా నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సహకార బ్యాంకుల వద్ద ధర్నా నిర్వహిస్తామని జేఏసీ నాయకుడు బొల్లినేని రఘురాం ఆదివారం తెలిపారు.

తండ్రిని చంపిన ఆలయ ఏనుగుకు ఆకలి తీర్చిన మావటి కుమార్తెలు

తమిళనాడులోని ప్రఖ్యాత తిరుచెందూర్ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఏనుగు ఏడాది కిందట మావటిని చంపగా.. ఆదివారం గుడికి వచ్చిన ఆయన కుమార్తెలు ఆ ఏనుగుకు పండ్లు తినిపించి భక్తుల ప్రశంసలు అందుకొన్నారు. గుడిలోని రాజగోపుర ప్రాంతంలో 'దేవనాయ్' (26) అనే ఈ ఆడ ఏనుగుకు ప్రత్యేక ఆవాస ఏర్పాట్లు చేశారు. 2006 నుంచి ఆలయంలో ఉంటున్న దేవనాయ్ గతేడాది నవంబరులో అకస్మాత్తుగా దాడికి దిగి మావటి ఉదయ్‌కుమార్‌తోపాటు మరో వ్యక్తిని చంపింది. దాడి తర్వాత అటవీశాఖతోపాటు పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి సాధారణ స్థితికి వచ్చిన ఏనుగును మళ్లీ



ఆలయంలో వదిలారు. ఈ నేపథ్యంలో సుబ్రహ్మణ్య స్వామి దర్శనానికి వచ్చిన ఉదయ్‌కుమార్ కుమార్తెలు అక్షర, అక్ష్య ఏనుగు వద్దకు వెళ్లి పుచ్చకాయ, పనస వంటి పండ్లతోపాటు చెరకు గడలను తినిపించారు. పండ్లు ఆరగించిన తర్వాత ఏనుగు తన తొండంతో ఇద్దరు అమ్మాయిలను ఆశీర్వదించడాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

ఇప్పటికింకా నా వయసు 64 ఏళ్లే!


మహారాష్ట్రకు చెందిన అశోక్ దీక్షిత్ ఇటీవల శ్రీలంకలో జరిగిన ప్రపంచ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 64 ఏళ్ల వయసులో రెండు బంగారు పతకాలను గెలుచుకున్నారు. థాణె జిల్లా కల్యాణ్‌కు చెందిన అశోక్ దీక్షిత్ ఇప్పటి దాకా సాధించిన మొత్తం పతకాల సంఖ్య 164కు చేరింది. 202 పోటీల్లో పాల్గొని మొత్తం 113 బంగారు, 24 వెండి, పలు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. పాఠశాల స్థాయి నుంచి పవర్ లిఫ్టింగుపై ఆసక్తి ఉన్న అశోక్ కామర్స్‌లో పీజీ చేశాక 44 ఏళ్లుగా పవర్ లిఫ్టింగ్ సాధన చేస్తున్నారు. కెనరా బ్యాంకు ఉద్యోగిగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్



పోటీల్లో పాల్గొన్నారు. 2002లో అర్జెంటీనాలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలో అశోక్ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్' గుర్తింపు కూడా లభించిన అశోక్‌ను ఈ ఏడాది ఏప్రిల్‌లో కల్యాణ్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 'స్ట్రాంగ్ మ్యాన్' బిరుదుతో సత్కరించారు.

బాలీవుడ్ దర్శకుడు విక్రం భట్ అరెస్టు

ముంబయి: బాలీవుడ్ దర్శక నిర్మాత విక్రం భట్, ఆయన సతీమణి శ్వేతాంబరిని ఆదివారం ముంబయిలో పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరు మరో ఆరుగురితో కలిసి రాజస్థాన్‌కు చెందిన ఇందిరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ అజయ్ మర్దియాను



రూ.30 కోట్లకు మోసం చేశారనే ఆరోపణలపై వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఉదయ్‌పుర్ పోలీసులు ముంబయి వచ్చి అరెస్టులు చేశారు. 'ఇందిరా ఐవీఎఫ్ ఆసుపత్రి యజమాని అయిన మర్దియా.. తన భార్య జీవిత చరిత్రను సినిమాగా తీయాలని విక్రం భట్‌ను సంప్రదించారు. దీన్ని అవకాశంగా మార్చుకున్న భట్.. రూ.47 కోట్లు పెట్టుబడి పెడితే 4 సినిమాలు తీస్తానని, రూ.200 కోట్ల లాభం వస్తుందని నమ్మించారు. రూ.30 కోట్లు తీసుకుని రెండు పూర్తి చేశారు. మిగిలినవి తీయలేదు. దీంతో మర్దియా ఫిర్యాదు చేశారు' అని పోలీసులు వెల్లడించారు.



క్యాన్సర్ రాకుండా వీటిపై దృష్టిపెట్టండి

క్యాన్సర్ బాధితుల్లో ఎక్కువశాతం మందిలో ఉండే కొన్ని లక్షణాలు.. విటమిన్ డీ లోపం, తక్కువ ప్రొజెస్టిరోన్, ఎక్కువ కాలం మానసిక ఒత్తిడి, బరువు కోల్పోవడం, సీవో2 స్థాయిలు తక్కువగా ఉండటం, థైరాయిడ్ పనితీరు మందగించడం, బీ విటమిన్ లోపం, ఎక్కువ కార్టిసాల్, ఎక్కువ సీఆర్‌పీ, అధిక స్థాయి మధుమేహం. వీటిని ఆరోగ్య పరీక్షల్లో గమనించుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా క్యాన్సర్ బారినపడకుండా జాగ్రత్తపడొచ్చు.

– లీ ఎరిన్ కొనేలీ, క్యాన్సర్ డాక్టర్

వందేమాతరంపై చర్చకు 10 గంటలు

- లోక్‌సభలో సమయం కేటాయింపు

దిల్లీ: 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరగనుంది. లోక్‌సభలో సోమవారం ప్రధాని మోదీ దాన్ని ప్రారంభిస్తారు. అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తారు. మొత్తంగా ఈ చర్చ కోసం దిగువ సభలో 10 గంటల సమయాన్ని కేటాయించారు. విపక్ష కాంగ్రెస్ తరఫున 'వందేమాతరం'పై లోక్‌సభలో పార్టీ ఉప నేత గౌరవ్ గొగొయ్, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా తదితరులు మాట్లాడతారు. రాజ్యసభలో వందేమాతరంపై చర్చను కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం ప్రారంభిస్తారు. ఆయన తర్వాత కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా ప్రసంగిస్తారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభ మంగళ, బుధవారాల్లో చర్చిస్తుంది. అందులో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), ఓటర్ల జాబితా సహా పలు అంశాలు ఉంటాయి. లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ వాటిపై మాట్లాడతారు. ఎన్నికల సంస్కరణలపై ఎగువ సభలో బుధ, గురువారాల్లో చర్చ జరుగుతుంది.



'విప్' నుంచి విముక్తి కోసం ప్రైవేటు బిల్లు

ప్రభుత్వ స్థిరత్వాన్ని ప్రభావితం చేసేవి మినహా ఇతర బిల్లులు, తీర్మానాలపై పార్లమెంటులో స్వతంత్రంగా ఓటు వేసే హక్కును ఎంపీలకు కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ లోక్‌సభలో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టారు. పార్లమెంటు సభ్యులను 'విప్' నిరంకుశత్వం నుంచి విముక్తులను చేసి.. మంచి చట్టాలను ప్రోత్సహించే వీలు కల్పించాలని అందులో కోరారు. ఈ మేరకు ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించాలని విన్నవించారు. తివారీ 2010, 2021ల్లోనూ ఇదే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం గమనార్హం.

ఆధార్ ధ్రువీకరణ కావాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- సంస్థలకు ఉడాయ్ స్పష్టీకరణ

దిల్లీ: వ్యక్తిగత ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులను ఇక నుంచీ హోటళ్లు, ఈవెంట్ సంస్థల వంటివి ఎడాపెడా తీసుకోవడానికి వీల్లేదు. ఒకవేళ అలా తీసుకోవాలనుకుంటే ఆయా సంస్థలు.. ఉడాయ్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇక నుంచీ ఆధార్ ధ్రువీకరణకు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నామని, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంద్వారాగానీ, కొత్త ఆధార్ యాప్‌లోగానీ ధ్రువీకరించుకోవాల్సి ఉంటుందని, జిరాక్స్ పత్రాలను అడగకూడదని ఉడాయ్ సీఈవో భువనేశ్ కుమార్



స్పష్టం చేశారు. జిరాక్స్ పత్రాలే కావాలనుకున్న సంస్థలు రిజిస్టరు చేసుకోవాల్సిందేనని తెలిపారు. ఈ కొత్త నిబంధనను ఆధార్ అథారిటీ ఆమోదించిందని, త్వరలో నోటిఫికేషన్ వెలువడనుందని పేర్కొన్నారు.

మూలాలు వెదుక్కొంటూ ఫిజీ నుంచి భారత్‌కు..

ఈటీవీ భారత్: ఫిజీ నుంచి ఓ జంట తమ పూర్వీకుల మూలాలను వెదుక్కొంటూ శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని బస్తీకి చేరుకొంది. ఇలా వచ్చిన రవీంద్ర దత్, కేశ్నీ హరే జంట 115 ఏళ్ల ఎడబాటును అధిగమించి తమ పూర్వీకుల ఇళ్లను, వారసులను ఎట్టకేలకు చేరుకోగలిగింది. 1910లో బ్రిటిషర్లు చాలామంది భారతీయులను ఒప్పంద కార్మికులుగా ఫిజీకి పంపారు. ఈ విధంగా వెళ్లినవారిలో రవీంద్ర దత్ ముత్తాత గరీబ్‌రామ్



తమ పూర్వీకుల ఇంటిలో రవీంద్ర దత్ దంపతులు (మధ్యలో)

ఒకరు. ఆ తర్వాత అక్కడి నుంచి మాతృభూమికి వెనక్కు వచ్చేందుకు వీరిని అనుమతించకపోవడంతో గత్యంతరం లేక అక్కడే స్థిరపడాల్సి వచ్చింది. ఫిజీ జనాభాలో ఇప్పటికీ దాదాపు 37 శాతం భారతీయులు ఉన్నారు. తన ముత్తాత ఇమిగ్రేషన్ పాసు కనుగొనడానికి రవీంద్రకు విస్తృతమైన పరిశోధన చేయాల్సి వచ్చింది. ఈ సమాచారం ఆధారంగా 2019లో ఓమారు భారత్‌కు వచ్చిన రవీంద్ర తమ పూర్వీకుల వివరాలు ఆరా తీశారు. ఆ తర్వాత అయోధ్య రామ మందిరాన్ని సైతం సందర్శించి చెల్లాచెదురైన తమ కుటుంబాలను ఒకటి చేయాలని ప్రార్థించారు. ఆన్‌లైను ద్వారా కూడా పలువురితో సంప్రదింపులు జరిపాక బస్తీకి వచ్చిన రవీంద్ర ముత్తాత గరీబ్‌రామ్ మనవళ్లు భోలా చౌదరి, గోరక్‌నాథ్, విశ్వనాథ్, దినేశ్, ఉమేశ్, రాముగ్రహలతోపాటు ఇతర కుటుంబసభ్యులను కలుసుకొన్నారు. అందరూ కన్నీటిపర్యంతం అయ్యారు.

గల్వాన్‌లో యుద్ధ స్మారకం

- ఆవిష్కరించిన రాజ్‌నాథ్ సింగ్

ఇంటర్నెట్‌డెస్క్: ప్రపంచంలో అత్యధిక ఎత్తులో నిర్మించిన యుద్ధస్మారకాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఆవిష్కరించారు. దీనిని గల్వాన్ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన భారత



వీరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. లద్దాఖ్‌లోని ష్యోక్-దౌలత్‌బేగ్ ఓల్డీ మార్గంలో కేఎం-120 పోస్టు వద్ద దీన్ని నిర్మించారు. ప్రపంచంలో సైనిక మోహరింపులు జరిగే అత్యంత కఠినమైన ప్రాంతంగా దీనికి పేరుంది. సున్నా డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉండే ఈ ప్రాంతంలో దీన్ని 'భారత్ రణ్‌భూమి దర్శన్' కార్యక్రమం కింద నిర్మించారు. ఈ ఏడాది ఆర్మీ దినోత్సవం నాడు దీనికి సంబంధించిన ప్రకటన వెలువడింది. ఈ యుద్ధ స్మారకాన్ని ఎరుపు-నలుపు రంగు గ్రానైట్ రాళ్లతో నిర్మించారు. ఇవి త్యాగం, వీరత్వానికి చిహ్నంగా నిలిచాయి. త్రిశూలం-డమరుకం మోడల్‌లో ఇవి ఉన్నాయి. దీంతోపాటు అమరవీరులకు గుర్తుగా కాంస్యంతో చేసిన 20 బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇక ఈ యుద్ధ స్మారకం కాంప్లెక్సులో మ్యూజియం, గల్వాన్ ఘటనను తెలియజేసే డిజిటల్ గ్యాలరీ, లద్దాఖ్ సైనిక చరిత్రను తర్వాత తరాలకు తెలియజేసేలా ఏర్పాటు చేశారు. 2020 జూన్ 15న రాత్రి భారత్-చైనా దళాల మధ్య గల్వాన్‌లో భీకర ఘర్షణ చోటుచేసుకొంది. ఇరు దేశాల మధ్య దాదాపు కొన్ని దశాబ్దాల తర్వాత చోటుచేసుకొన్న రక్తపాతం ఇది.

మధ్యప్రదేశ్‌లో 10 మంది మావోయిస్టుల లొంగుబాటు

బాలాఘాట్: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో 10 మంది మావోయిస్టులు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సమక్షంలో లొంగిపోయారు. వీరందరూ సీపీఎం(మావోయిస్టు)కు చెందిన భోర్మదేవ్ ఏరియా కమిటీ సభ్యులని, వారిపై మొత్తంగా రూ.2.36 కోట్ల రివార్డు ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఏకే-47, ఇన్సాస్ రైఫిళ్ల సహా అత్యాధునిక ఆయుధాలను వారు అప్పగించినట్లు వివరించారు. లొంగిపోయిన వారిలో నలుగురు మహిళలు కూడా ఉన్నట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని మండలా జిల్లాతోపాటు సరిహద్దు ప్రాంతాలైన మహారాష్ట్రలోని గోండియా జిల్లా, ఛత్తీస్‌గఢ్‌లోని కవర్ధా జిల్లాలో వారు మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు వివరించారు. వీరి లొంగుబాటుతో డిండోరీ, మండలా జిల్లాలు మావోయిస్టుల ప్రభావం నుంచి పూర్తిగా బయట పడినట్లు సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా విధించిన లక్ష్యానికి అనుగుణంగా మధ్యప్రదేశ్‌ను మావోయిస్టు



రహిత రాష్ట్రంగా మార్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

లొంగిపోయిన వారి జాబితా

■ సుందర్ అలియాస్ కబీర్ అలియాస్ సోమా ■ రాకేశ్ ఓడో అలియాస్ బీమా ■ సమర్ అలియాస్ సమ్రూ అలియాస్ రాజు ■ సలితా అలియాస్ సవిత ■ విక్రమ్ అలియాస్ హిడ్మా ■ లాల్‌సింగ్ మాడవి అలియాస్ సీంగూ ■ శిల్ప ■ జరీనా అలియాస్ జోగి ■ జయశీల ■ నవీన్ అలియాస్ హిడ్మా

సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే.. మళ్లీ రాజకీయాల్లోకి సిద్ధూ..

- ఆయన సతీమణి నవ్‌జోత్ కౌర్ వ్యాఖ్య

చండీగఢ్: మాజీ క్రికెటర్ నవ్‌జోత్ సింగ్ సిద్ధూ తిరిగి రాజకీయాల్లో పనిచేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పంజాబ్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటారని ఆయన సతీమణి నవ్‌జోత్ కౌర్ సిద్ధూ పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలకు చెల్లించేందుకు తమ వద్ద నిధులు లేవని ఆమె తెలిపారు. కానీ, తాము అధికారంలోకి వస్తే మాత్రం పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మారుస్తామని వెల్లడించారు. "మేము ఎప్పుడూ పంజాబ్, పంజాబియత్ కోసం గళం విప్పుతాం. కానీ, ముఖ్యమంత్రి సీట్లో కూర్చోవడానికి రూ.500 కోట్లు చెల్లించే స్థోమత లేదు" అంటూ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దిగజా



రడంపై గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను కలిసిన అనంతరం కౌర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే.. తమను డబ్బు ఎవరు డిమాండ్ చేశారో మాత్రం వెల్లడించలేదు. "రూ.500 కోట్లు ఇచ్చిన వ్యక్తి మాత్రం సీఎం అవుతాడు" అని వ్యాఖ్యానించారు. పంజాబ్ కాంగ్రెస్ శాఖలో అంతర్గత పోరు గురించి మాట్లాడుతూ.. "ఇప్పటికే ముఖ్యమంత్రి పదవికి ఐదుగురు నాయకులు బరిలో ఉన్నారు. వారు సిద్ధూను ముందుకు రానివ్వరు." అని ఆమె అన్నారు. సిద్ధూకు ఏ పార్టీ అవకాశం ఇచ్చినా.. రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తారని వెల్లడించారు.

మూడేళ్లుగా కరెంటు బిల్లు కట్టని తేజ్‌ప్రతాప్ యాదవ్

ఇంటర్నెట్‌డెస్క్: ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌నకు చెందిన ఇంటి కరెంటు బిల్లు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం



తేజ్‌ప్రతాప్ ప్రభుత్వ నివాసంలో ఉంటున్నారు. అయితే, పట్నాలో ఆయనకు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి చివరిసారిగా 2022 జులైలో కరెంటు బిల్లు చెల్లించారు. గత మూడేళ్లుగా దీనికి సంబంధించిన బకాయిలు పేరుకుపోయాయి. జరిమానాలతో కలిపి ఇప్పుడా మొత్తం కరెంటు బిల్లు రూ.3,61,000కు చేరింది. ఇక తేజ్‌ప్రతాప్ పేరు మీద మరో కరెంట్ కనెక్షన్ ఉన్నట్లు విద్యుత్తు శాఖ డేటా వెల్లడిస్తోంది. దీనికి సంబంధించిన బకాయిలు కూడా జరిమానాలతో కలిపి రూ.3,24,974 చెల్లించాల్సి ఉంది. ఈ వ్యవహారం బిహార్‌లో రాజకీయ దుమారం రేపుతోంది. బకాయిలు పేరుకుపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ.. తేజ్ ప్రతాప్ తన నివాసానికి పోస్ట్‌పెయిడ్ మీటర్‌నే కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం.. రూ.25వేల కంటే ఎక్కువ బిల్లు ఉంటే పోస్టుపెయిడ్ కనెక్షన్‌ను డీయాక్టివేట్ చేయాలి. కానీ తేజ్‌ప్రతాప్‌జ్ఞ ఇంటి వ్యవహారంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దీంతో బకాయి చెల్లింపులకు సంబంధించి చర్యలు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు.

మళ్లీ భగ్గుమన్న కిలోవేయ అగ్నిపర్వతం

హోనలులు: అమెరికాకు చెందిన హవాయి ద్వీపంలో అత్యంత క్రియాశీల అగ్నిపర్వతాల్లో ఒకటైన కిలోవేయ మరోసారి భగ్గుమంది. అగ్నిపర్వతం నుంచి లావా పెద్దఎత్తున ఉబికివచ్చి వంద అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతోంది. స్థానిక కాలమానం ప్రకారం శనివారం ఉదయం అగ్నిపర్వతం బద్దలైనట్టు అధికారులు తెలిపారు. హవాయి జాతీయ ఉద్యానవనం లోపలున్న కాల్డెరా (తాత్కాలికంగా ఏర్పడే పెద్ద గొయ్యి)లోనే లావా నిలి



చిపోయిందన్నారు. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటివరకు కిలోవేయ అగ్నిపర్వతం 38 సార్లు విస్ఫోటం చెందింది.

ఛత్తీస్‌గఢ్‌లో కారు-ట్రక్కు ఢీ ఐదుగురి మృతి

జశ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లోని జశ్‌పుర్ జిల్లాలో ఆదివారం రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారును ట్రక్కు ఢీకొట్టడంతో ఐదుగురు మృతిచెందారు. వారిలో 17 ఏళ్ల బాలుడు, నలుగురు పురుషులున్నారు. ఈ ఘటన దుల్‌దులా పోలీసుస్టేషన్ పరిధిలోని పత్రాటోలీ గ్రామ సమీపంలో తెల్లవారుజామున జరిగింది. వీరు మనోరా ప్రాంతంలో జరిగిన ఆర్కెస్ట్రా ప్రదర్శనను చూసి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో కారు నుజ్జునుజ్జు అయింది. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.



కొల్లాంలో మంటల్లో కాలిపోతున్న పడవలు

కేరళలో 10 పడవలు దగ్ధం

కొల్లాం: కేరళ రాష్ట్రంలోని కొల్లాం జిల్లా అష్టాముడి సరస్సులో నిలిపి ఉంచిన 10 పడవలు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ ఘటన అంచల్‌ముడ్ పోలీసుస్టేషన్ పరిధిలోని కుర్‌పురూ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. అకస్మాత్తుగా మంటలు చెలరేగి వరసగా నిలిపిన పడవలన్నింటికి మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదానికి గ్యాస్ సిలిండర్ పేలుడు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

మణిపూర్‌లో 10 మంది తీవ్రవాదుల అరెస్టు

ఇంఫాల్: మణిపూర్‌లో భద్రతా దళాలు పలు జిల్లాల్లో చేపట్టిన ఆపరేషన్లలో భాగంగా నిషేధిత ఉగ్రవాద సంస్థలకు చెందిన 10 మంది తీవ్రవాదులను అరెస్టు చేశారు. నిషేధిత యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్(కోయిరెంగ్)కు చెందిన ఇద్దరు, కేసీపీ(అపుణ్బా)కి చెందిన ముగ్గురు, కేసీపీ(ఎంఎఫ్ఎల్) సంస్థకు చెందిన మరో ఇద్దరు, పీఆర్ఈపీఏకేకు చెందిన ఒకరు, పీఆర్ఈపీఏకే(పీఆర్ఓ), కేసీపీ(తైబన్‌గంబ), కంగ్లే యావోల్ కన్న లూప్‌లకు చెందిన ఒక్కొక్కరు అరెస్టయిన వారిలో ఉన్నారు.

శత్రువును మరింత గట్టిగా దెబ్బతీసేవాళ్లం

- ఉద్దేశపూర్వకంగానే ఆపరేషన్ సిందూర్‌లో సంయమనం పాటించాం
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్య



లేహ్: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో మన బలగాలు శత్రువుపై మరింత ఎక్కువగా ప్రతాపం చూపి ఉండేవని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగానే నియంత్రణ పాటించాలని, సంయమనంతో ముందడుగు వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ ఆపరేషన్‌లో భారత బలగాలు ఘర్షణలను మరింత పెంచకుండానే ఉగ్రవాద ముఠాలను దెబ్బతీశాయని వివరించారు. మన సైనికుల సత్తా, క్రమశిక్షణకు ఇది దర్పణం పట్టిందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సరిహద్దు రోడ్ల సంస్థ (బీఆర్‌వో) పూర్తిచేసిన 125 మౌలిక ప్రాజెక్టులను ఆదివారం ఆయన ఇక్కడ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో సైనిక దళాలు, ప్రభుత్వ యంత్రాంగం మంచి సమన్వయంతో వ్యవహరించాయి. మన జవాన్లకు సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు సైతం అద్భుతంగా సహకారం అందించారు. అందుకు లద్దాఖ్‌తో పాటు ఇతర సరిహద్దు ప్రాంతాల వారికి అభినందనలు చెబుతున్నా. సరిహద్దు ప్రాంతాల్లో మెరుగైన సంధానత వల్ల సంక్లిష్ట భూభాగాల్లో భద్రతా దళాలు మెరుగ్గా కార్యకలాపాలు సాగించగలుగుతున్నాయి. రియల్‌టైమ్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఉపగ్రహ తోడ్పాటు, నిఘా నెట్‌వర్క్‌లు వంటి వాటివల్ల మన సైనికులు కఠోర భౌగోళిక ప్రాంతాల్లోనూ సమర్థంగా పనిచేయగలుగుతున్నాయి. బలమైన కమ్యూనికేషన్ వ్యవస్థ, చిట్టచివరి ప్రాంతాల వరకు అభివృద్ధి చేసిన మౌలిక వసతులు ఆపరేషన్ సిందూర్ విజయంలో కీలకపాత్ర పోషించాయి. ఇవి ప్రజలకు కేవలం భద్రతను అందించడమే కాకుండా, ఆర్థిక వృద్ధికీ దోహదపడుతున్నాయి" అని రక్షణ మంత్రి వివరించారు. 2014లో దేశీయ ఆయుధ ఉత్పత్తి రూ.46వేల కోట్లు కాగా ఇప్పుడు అది రూ.1.51 లక్షల కోట్లకు చేరిందన్నారు. అదే సమయంలో ఆయుధ ఎగుమతులు కూడా రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.24వేల కోట్లకు పెరిగాయని తెలిపారు.

బెనిన్‌లో సైనిక తిరుగుబాటు విఫలం

కొటోనౌ: ఆఫ్రికా పశ్చిమ ప్రాంతంలోని బెనిన్ దేశంలో సైనిక గ్రూపు ఒకటి తిరుగుబాటుకు విఫల యత్నం చేసింది. 'ఆదివారం తెల్లవారగానే కొద్ది మంది సైనికులతో కూడిన గ్రూపు.. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించింది. అది విఫలమైంది. బెనిన్ సైనిక దళాలు, వాటి నాయకత్వం దీనిని తిప్పికొట్టింది. ప్రభుత్వానికి సైన్యం కట్టుబడి ఉంది' అని ఆ దేశ హోంశాఖ మంత్రి అలస్సాన్ సీడో ఓ వీడియో సందేశంలో తెలిపారు. అంతకుముందు కొంత మంది సైనికుల గ్రూపు.. ప్రభుత్వ టీవీ ఛానల్‌లో ఒక ప్రకటన చేసింది. పశ్చిమ ఆఫ్రికాలో పలు దేశాల్లో మాదిరిగానే ప్రభుత్వాన్ని కూల్చేశామని ప్రకటించింది. మిలిటరీ కమిటీ ఫర్ రీఫౌండేషన్ పేరుతో ఏర్పాటైన ఈ గ్రూపు అధ్యక్షుడిని తొలగించామని, అన్ని సంస్థల అధిపతులను పదవీచ్యుతులను చేశామని, లెఫ్టినెంట్ కర్నల్ పాస్కల్ టిగ్రిని అధ్యక్షుడిగా ప్రకటించామని వెల్లడించింది. ఆ తర్వాత హోం మంత్రి తిరుగుబాటు విఫలమైనట్లు ప్రకటించారు. అధ్యక్ష భవనంలో కాల్పులు జరిగాయి.



కొటోనౌలోని రేడియో, టెలివిజన్ కేంద్రం వద్ద సైనికుల పహరా

అయితే అధ్యక్షుడు పాట్రిస్ టాలోన్ గురించి ఎటువంటి సమాచారం వెల్లడి కాలేదు. 1960లో ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందిన బెనిన్‌లో సైనిక తిరుగుబాట్లు కొత్తకాదు. 1991లో మార్క్సిస్ట్-లెనినిస్టు నేత మాథ్యూ కెరెకో అధికారంలోని వచ్చిన 2 దశాబ్దాలపాటు పాలించారు. ఆ సమయంలోనే దేశంలో స్థిరత్వం నెలకొంది. మిగిలిన సమయంలో తిరుగుబాట్లు భారీగా జరిగాయి.

తల్లి పక్కన నిద్రిస్తున్న శిశువును లాక్కెళ్లిన తోడేలు

బహరాయిచ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లాలో ఓ తోడేలు 4 నెలల శిశువును ఎత్తుకెళ్లింది. కైసర్‌గంజ్ ప్రాంతంలోని మల్లాహన్‌పుర్వా గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తల్లిపక్క నిద్రిస్తున్న పసికందును శనివారం అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో తోడేలు నోట కరుచుకుని పారిపోయింది. గ్రామస్థులు దాన్ని వెంటాడినా ఉపయోగం లేకపోయింది. అటవీ అధికారులు శిశువు కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టారు. గత తొమ్మిది రోజుల్లో ఆ ప్రాంతంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇది మూడోసారి.

త్వరలో గాజా కాల్పుల విరమణ రెండో దశ: నెతన్యాహు

టెల్ అవీవ్: కాల్పుల విరమణ ఒప్పందం రెండో దశ త్వరలోనే ప్రారంభం కానుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. హమాస్ ఇంకో బందీ మృతదేహాన్ని అప్పగించాల్సి ఉంది. అది పూర్తయితే రెండో దశ ప్రారంభమవుతుంది. ఈ దశలో హమాస్ నిరాయుధీకరణ, గాజా నిస్సైనికీకరణ, అంతర్జా



తీయ దళాల మోహరింపు, పాలస్తీనా ప్రభుత్వాన్ని నడిపేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో అంతర్జాతీయ బోర్డు ఏర్పాటు.. తదితర అంశాలు ఉన్నాయి. నెతన్యాహు ఆదివారం ఇజ్రాయెల్ పర్యటనకు వచ్చిన జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిచ్ మెర్జ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నెతన్యాహు మాట్లాడుతూ.. "ఒప్పందంలో తొలి దశ పూర్తయినా, రెండో దశ అసాధ్యమని చాలా మంది అంటున్నారు. ఈ సందర్భంగా ఒకటి చెప్పదలచుకున్నా. ఒప్పందంలో మూడో దశ కూడా ఉంది. అందులో భాగంగా గాజా నుంచి తీవ్రవాదం దూరం చేయాలి. అది కూడా అసాధ్యమని చాలా మంది అంటున్నారు. కానీ జర్మనీలో జరిగింది. జపాన్‌లో సాధ్యమైంది. గల్ఫ్ దేశాల్లో కూడా జరిగింది. గాజాలో కూడా జరుగుతుంది. అయితే అందుకు హమాస్‌ను నాశనం చేయాలి" అని పేర్కొన్నారు.

లక్ష మందితో ఖురాన్ పఠనం నిర్వహిస్తా హుమయూన్ కబీర్

కోల్‌కతా: లక్ష మందితో ఫిబ్రవరిలో ఖురాన్ పఠన కార్యక్రమాన్ని చేపడతామని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) బహిష్కృత ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ ఆదివారం తెలిపారు. అయోధ్యలోని బాబ్రీ మసీదు లాంటి మరో మసీదు నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో దాన్ని



నిర్మించనున్నారు. ఖురాన్ పఠన కార్యక్రమం నిర్వహించిన తర్వాతే మసీదు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. అందులో పాల్గొన్న వారికి బిర్యానీని విందుగా ఇస్తామన్నారు. ఈ నిర్మాణంపై ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య స్పందించారు. మొగల్ చక్రవర్తి బాబర్ పేరు మీద నిర్మించే ఎలాంటి నిర్మాణానికైనా తీవ్రవ్యతిరేకత వస్తుందని చెప్పారు.

వసుంధర

vasundhara@eenadu.in

వృత్తి జీవితంలో విజయం అంత సులభం కాదు. ముఖ్యంగా మహిళలకు ఇది కత్తిమీద సామే. సరైన ప్రణాళిక, వ్యూహాలతో సవాళ్లను అధిగమించడం ఇక్కడ కీలకం. వీటి గురించి తమ అమూల్యమైన అనుభవ పాఠాలను 'ఈనాడు-వసుంధర' ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వెబినార్‌లో పంచుకున్నారీ నిపుణులు.

కెరియర్ నిర్మాణంలో... నైపుణ్యాలే కీలకం!

పెళ్లి అడ్డంకి కాదు!



'ముందు పెళ్లి చేసుకో. ఆపై నచ్చితే కెరియర్ కొనసాగించు'... చాలామంది అమ్మాయిలకు వచ్చే సలహానే. ఇది తప్పని చెప్పను. అయితే పెళ్లయ్యాక చేయనిస్తారా? ఒకవేళ సరేనన్నా ఎలా? ఇద్దరి కెరియర్లకీ సమాన ప్రాధాన్యమిస్తారా అన్న స్పష్టత తెచ్చుకోవాలి. నిజానికి నన్నూ మావారు అలా చెప్పే పెళ్లి చేసుకున్నారు. తరవాత ప్రోత్సహించారు కాబట్టే, కెరియర్‌లో కొనసాగగలుగుతున్నా. నేనే కాదు, నాకు తెలిసిన ఎంతోమంది చదువయ్యాక పెళ్లి చేసుకోవడం లేదంటే ఉద్యోగాన్ని పక్కన పెట్టడం చేశారు. అయితేనేం తరవాత కెరియర్‌ని నిర్మించుకున్నారు. వాళ్లకైనా, నాకైనా పనిచేసిన ఒకే సూత్రం నేర్చుకోవడం. మొదట బోధన రంగంలో పని చేశా. ఆపై ఏపీటీఎస్‌లో సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్‌కి మారా. అక్కడా ఎన్నో హోదాల్లో పని చేశా. హోదాకి తగ్గట్టుగా సర్టిఫికేషన్లు చేసుకుంటూ వెళ్లా. అక్కడ నాకు కష్టమైన, ఫెయిలైన ప్రాజెక్టులే అప్పగించేవారు. ఒకానొక దశలో నేనూ భయపడ్డా. అయితే ప్రాజెక్టు ఎంత కష్టమైనదైతే అంత అనుభవం సంపాదించొచ్చు అని అర్థమైంది. అలా సవాళ్లను స్వీకరిస్తూనే ప్రభుత్వ విభాగం నుంచి ప్రైవేటు సంస్థలకి మారా. వయసు, అనుభవ లేమి, కుటుంబ బాధ్యతలు వంటివి ఎవరికీ అడ్డు కావు. ఆసక్తి, చదివిన చదువును బట్టి తగిన కోర్సులేవో తెలుసుకుని నేర్చుకోండి. అవకాశాలు ఎప్పుడూ ఉంటాయి. అయితే అందుకు తగ్గట్టుగా మీరు కష్టపడాలి. అవసరమైతే నిద్ర, ఇతర వ్యాపకాలు వంటివి త్యాగం చేయాలి. 'సీయింగ్ ఈజ్ బిలీవింగ్' అంటారు కదా! మీరలా కష్టపడగలిగితే తగిన సపోర్ట్ కూడా దొరుకుతుంది. ప్రతిభ చూపితే సంస్థలైనా అమ్మాయి, అబ్బాయన్న తేడా చూపించవు. పైగా భావోద్వేగ ప్రజ్ఞ, మల్టీ టాస్కింగ్, కమిట్‌మెంట్‌తో పనిచేయడం వంటి ఎన్నో సానుకూలాంశాలు మన సొంతం. ఎన్ని చేసినా తగిన గుర్తింపు రావట్లేదనిపిస్తే అక్కడే ఆగొద్దు. అవకాశాలను వెతుక్కుంటూ మరోదాన్ని ప్రయత్నించడమే!

> వృత్తి, జీవితం వేర్వేరు కాదు. కుటుంబం, పిల్లలు, సమాజం, ఆధ్యాత్మిక చింతన మాదిరిగానే పని కూడా జీవితంలో భాగమే. అన్నింటినీ కలిపి ఒకే కోణంలో చూస్తే సమర్థంగా చేయగలం. ఏ పని చేసినా దానిమీద పూర్తి దృష్టి పెట్టండి.



– అన్నపూర్ణ కూచిభట్ల, సీటీవో, బజాజ్ ఎలక్ట్రానిక్స్

రిస్కు తీసుకుంటేనే ఎదుగుదల!



తృతీయ శ్రేణి నగరం కర్నూలు నుంచి వచ్చా. ఏదైనా సాధించాలనే తపన ఉండేది. తిరుపతిలో ఇంజినీరింగ్‌లో చేర్పించారు. అక్కడా హాస్టల్‌లో మొదట ఇమడలేక పోయా. ఇంజినీరింగ్ తర్వాత బెంగళూరులో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నప్పుడు... జనాల్ని చూసి వీళ్లతో పోటీ పడగలనా అని భయపడ్డా. మా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఒక మహిళ. ఆమెను చూశాకే మహిళలూ ఉన్నత స్థానానికి చేరొచ్చని అర్థమైంది.

ప్రతి కొత్త ప్రయాణంలో భయాలు, సందేహాలూ వస్తాయి. రిస్కు ఉందంటే... మనం సరైన దిశలో వెళ్తున్నట్టు. ఓటమి ఎదురవ్వదని కాదు, కానీ నేర్చుకోవడం పెరుగుతుంది. తర్వాత కాలంలో ఏదైనా క్లిష్టమైన పరిస్థితి ఎదురైతే... ఇది కూడా వెళ్లిపోయేదే అన్న ఆత్మవిశ్వాసం వస్తుంది. నాయకత్వ స్థానంలో ఉన్నా కూడా అపనమ్మకం వెంటాడుతుంది. ఒక సమస్యకు మిగతావాళ్ల కంటే ఎంత మంచిగా పరిష్కారం చూపిస్తున్నాం అన్నదాన్నిబట్టి... ఆత్మవిశ్వాసం వస్తుంది. మన దగ్గర ఉన్న ప్రొడక్ట్ కంటే, కస్టమర్‌కు ఏం కావాలో తెలుసుకుని అందించడం ముఖ్యం. అంకుర సంస్థ సహ వ్యవస్థాపకురాలిగా, సీఈఓగా రోజులో 18 గంటలు పనిచేస్తున్నా. కష్టపడి పనిచేయడానికి ప్రత్యామ్నాయం లేదు.

సవాళ్లు, కష్టపడి పనిచేయడం కంటే సంతోషంగా ఉండటం ముఖ్యం అన్నట్లుగా ఉన్నారు జెన్ జీలు. వాళ్ల నుంచి ఇదీ నేర్చుకోవాలి. ఎవరికైనా శారీరక, మానసిక ఆరోగ్యం ముఖ్యం. నాకు ఇద్దరు పిల్లలు. తల్లిగా వాళ్లకు సమయం కేటాయించలేకపోతున్నానని గిల్టీగా ఉంటుంది. అవసరమైనప్పుడు కుటుంబ సభ్యుల నుంచి సాయం తీసుకోవాలి. సొంత సంస్థ పెట్టాలనేది నా కల. కొన్నాళ్ల కిందట అవకాశం వచ్చింది. వెంటనే సిద్ధమయ్యా. నేర్చుకోవడం అనేది రాజీలేని ప్రక్రియ. అదే మనల్ని ముందుంచుతుంది.

> ఏఐ కాలమైనా ఉద్యోగ భద్రత గురించి అనవసర ఆందోళన అక్కర్లేదు. క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, నేర్చుకోవాలన్న ఉత్సుకత... వీటికి ప్రత్యామ్నాయాలు లేవు. మనం పోటీలో ఉండాలంటే టెక్ నైపుణ్యాలతోపాటు ఇవీ నేర్చుకోవాలి.

– శాంతి కూరపాటి, సహ-వ్యవస్థాపకులు, సీడ్లింగ్ ల్యాబ్స్

అవకాశాలకి లింగభేదం లేదు..!



ఒక చిన్న ప్రారంభం, కొంత ప్రోత్సాహం, సాధించగలనన్న నమ్మకం చాలు... మహిళలు కెరియర్‌లో రాణించేందుకు. ప్రొఫెసర్, పరిశోధకురాలు, గ్రీన్ అకౌంటింగ్ నిపుణురాలుగా నేనీ స్థాయికి రావడానికీ అవే కారణం. పీహెచ్‌డీ చేయడానికి ముంబయి వెళతా అన్నప్పుడు వద్దన్న వాళ్లే ఎక్కువ. అయితే ఏడాది సమయం ఇవ్వమని అడిగా. దాంతో కాదనలేక పంపారు. ఇలాంటి పరిస్థితి చాలామందికి అనుభవమే. అప్పుడు, మనకోసం మనమే మాట్లాడాలి. అవసరమైతే పోట్లాడాలి. నిర్ణయం మీద స్పష్టత ఉంటే అదే మనలో పట్టుదలను పెంచుతుంది. కాదన్న వారిని ఒప్పించేలా చేస్తుంది. కొత్తగా మొదలుపెట్టేటప్పుడు భయం సహజమే. అయితే ఈ దశను దాటితేనే కదా, అనుకున్న దిశగా మొదటి అడుగు పడేది. ముంబయి వెళ్లినప్పుడు నేనూ భయపడ్డా. అలాంటిది ఇక్కడే ఐఐటీ బాంబేలో ఎకనామిక్స్ విభాగానికి చైర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. మొదట్లో 'ఎకనామిక్స్ పురుషాధిక్య రంగం నీకు అవసరమా?' అని ఎందరన్నా పట్టించుకోలేదు. చదువైనా, వృత్తైనా మన రంగంలో అన్నీ తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. నైపుణ్యాల్ని అందిపుచ్చుకోవాలి. ఊరు దాటడానికే భయపడిన నన్ను గ్లోబల్ వేదిక మీద పరిచయం చేసిందీ నైపుణ్యాలే. మనం ఎంత విజయం సాధించినా పెళ్లి, పిల్లలు, కుటుంబ బాధ్యతలు వృత్తిగత వెనకబాటుకి కారణం అవుతాయి. అలాంటప్పుడు మన అవసరం ఎక్కడ? ఎంత ఉందనేది లాజికల్‌గా ఆలోచించగలగాలి. నేనదే చేశా. కాన్ఫరెన్సులకి దేశవిదేశాలు వెళ్లాను. అప్పుడు మా అబ్బాయిని నాతో తీసుకువెళ్లేదాన్ని. దీనివల్ల నా ప్రపంచం వాడికి పరిచయం చేసినట్లూ అయ్యింది, నా కష్టం కూడా తెలిసింది. దొరికిన దాంతో ఎప్పుడూ తృప్తి పడి ఆగిపోవద్దు. మహిళను కాబట్టే ఎదుగుదలకు, పదోన్నతులకు దూరం అవుతున్నా అన్న ఆలోచనలూ వద్దు.

> ఎందుకు, ఏమిటి, ఎలా అని అడిగి తెలుసుకోవాలి. అప్పుడే ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. ఒక పనిని చేయగలనా, లేదా... అనే విషయాన్ని ఎవరికి వాళ్లు ఆలోచించుకోవాలి. సలహాలు తీసుకోవద్దని కాదు, అవి ఏ మేరకు ఉపయోగపడతాయో సరిచూసుకోండి!

– డాక్టర్ హరిప్రియ గుండిమెడ

పెద్ద కలలు కనండి!



చాలామంది కెరియర్ గురించి పెద్దగా కలలు కూడా కనరు. పెద్ద కలలు ఎలా కనాలో కూడా తెలీదు. కారణం అవగాహన లేకపోవడం. నేను గుంటూరులో ఇంటర్మీడియెట్ వరకూ చదువుకున్నా. అప్పుడు ఇంజినీరింగ్ తర్వాత ఉద్యోగం సంపాదించి, నా ఖర్చులకు సంపాదిస్తే చాలనుకునేదాన్ని. ఇంజినీరింగ్ కోసం హైదరాబాద్ వచ్చాక స్నేహితులతో మాట్లాడుతుంటే తెలిసింది మన కలలు ఇంకా పెద్దగా ఉండాలని. ఐటీలో కొన్నాళ్లు ఉద్యోగం చేసి ఆపైన ఐఎస్‌బీ నుంచి ఎంబీఏ చేశా. ఇప్పుడు ఓ పెద్ద బహుళజాతి సంస్థలో పనిచేస్తున్నా. సీటీఓ కావాలి, ఆంత్రప్రెన్యూర్ అవ్వాలన్న లక్ష్యాలూ ఉన్నాయి. చదువుకునేటప్పుడే పెద్ద లక్ష్యాలు పెట్టుకుంటే ఎంతో మేలు. అందుకే పెద్ద కలల్ని కనండి. ఆత్మవిశ్వాసంతో ఉండండి. శక్తిమేరకు కష్టపడండి. ఫలితం వెంటనే వస్తుందనుకోవద్దు. దానికోసం నమ్మకంతో వేచి ఉండండి. 'నాకెవరూ మెంటార్లు లేరు. ఏ ఉద్యోగం చేయాలో తెలియడం లేదు' అంటుంటారు. లింక్డిన్‌లో మీ ప్రొఫైల్‌ను పెడితే ఫలితం ఉంటుంది. అలాగే అక్కడున్న ఎంతోమంది అనుభవాలు మంచి పాఠాలు. మీ కెరియర్‌కు ఉపయోగపడతాయి. మెంటార్‌లను కూడా పొందొచ్చు. ఇంటర్నెట్ ఉండాలే కానీ స్కిల్స్ నేర్చుకోవడానికి ఎన్నో అవకాశాలు. టెక్, నాన్ టెక్... ముందు మీకు కెరియర్‌లో ఏ రకమైన నైపుణ్యాలు కావాలన్న దానిపైన స్పష్టత తెచ్చుకోండి. ఒత్తిడికి దూరంగా ఉండండి.

– మానస ఐనంపూడి, సీనియర్ సొల్యూషన్స్ కన్సల్టెంట్, గూగుల్

చల్ చల్ గుర్రం చలాకీ గుర్రం... అంటూ చిన్నప్పుడు పాడుతూ ఆడుకున్నవాళ్లమే! నిజమైన గుర్రం మీద స్వారీ అంటే మాత్రం భయపడతాం. డాక్టర్ సువర్ణ మాత్రం గుర్రపుస్వారీ నేర్చుకోవడమే కాదు, జాతీయస్థాయిలో గుర్తింపునీ తెచ్చుకున్నారు. ఇప్పుడు శిక్షకురాలిగానూ మారారు. ఆ ప్రయాణం ఆమె మాటల్లోనే...





ఈ డాక్టర్... రైడర్ కూడా!

చిన్నప్పుడు గుర్రాల్ని సినిమాల్లో, టీవీల్లో తప్ప బయట ఎప్పుడూ చూడలేదు. గన్నవరంలోని ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్‌లో చదువుతున్నప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లకు గుర్రపు స్వారీ నేర్పేవారు. గుర్రంతో ఫొటో దిగడం కోసం ఎన్‌సీసీలో చేరాను. అందులో టిమోర్ అనే గుర్రంతో బాగా అనుబంధం పెరిగింది. నన్ను ఎక్కడున్నా గుర్తుపట్టేది. నా సైగలను అర్థం చేసుకునేది. దీంతో మా కల్నల్ ఆ గుర్రాన్ని నా శిక్షణ కోసం ప్రత్యేకంగా సిద్ధం చేశారు. సరదాగా కళాశాలలో స్వారీ చేయడమే కదా అనుకున్నా. నా రైడింగ్ సామర్థ్యం చూసి పోటీల్లో పాల్గొనమన్నారు కల్నల్. ఇంట్లో చెబితే... 'అలాంటివి వద్దు. గుర్రంపైనుంచి కిందకు పడి చెయ్యో, కాలో విరిగితే నిన్నెవరు పెళ్లి చేసుకుంటారు? చక్కగా చదువుకో' అని వారించారు. వాళ్లతో అలాగేనని చెప్పి... 2015-16లో రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ గుర్రపు స్వారీ పోటీల్లో పాల్గొని విజయం సాధించా. జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో హైదరాబాద్‌లో నెలరోజులు శిక్షణ తీసుకోవాలన్నారు. అప్పుడు అమ్మానాన్నలకు చెబితే... మొదట కోప్పడినా, మా కల్నల్ భరోసా ఇవ్వడంతో అనుమతించారు. శిక్షణలో టాపర్‌గా నిలవడంతో జాతీయస్థాయి రిపబ్లిక్ డే క్యాంప్(ఆర్‌డీసీ) పోటీలకు ఎంపిక చేశారు. 2017 జనవరిలో జరిగిన ఈ పోటీలకు అబ్బాయిలూ వచ్చారు.

మొదటి అమ్మాయిని

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఎన్‌సీసీ హార్స్ రైడింగ్ బృందం తరపున గుర్రంపై ఖడ్గంతో సెల్యూట్ చేసే అవకాశం నాకు దక్కింది. ఈ ఘనత దక్కించుకున్న మొదటి అమ్మాయిని నేనేనని మా కల్నల్ చెబితే ఎంతో గర్వంగా అనిపించింది. ఈ పోటీల సమయంలోనే పరీక్షలు మొదలయ్యాయి. ఏం చేయాలో తెలియక నాన్నని అడిగితే... 'పోటీలకు వెళ్లు. పరీక్షల సంగతి తర్వాత చూద్దాం' ని చెప్పారు. విజేతగా నిలిచాక సీఎం చంద్రబాబు అభినందించారు. దాంతో మా కాలేజీ పేరు వార్తల్లో నిలిచింది. ఆ తర్వాత నాకోసం ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. 2018 లోనూ జాతీయ పోటీల్లో పతకం సాధించా. చదువయ్యాక కాకినాడలో పెట్ క్లినిక్ పెట్టుకున్నా. ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే పశు సంచార వైద్యశాలలో ఒప్పంద వైద్యురాలిగా పనిచేస్తున్నా. 2022 నుంచి 2024 వరకు వరుసగా ఉత్తమ డాక్టర్ అవార్డునూ అందుకున్నా. ఖాళీ సమయాల్లో హైదరాబాద్‌లోని 'రాంచ్ రైడింగ్ క్లబ్‌'లో గుర్రాల ఆరోగ్య తనిఖీలకు వెళ్లి అక్కడ శిక్షణ ఇస్తుంటా. 'కాకినాడ సెవెన్ రైడింగ్ క్లబ్‌'లోనూ గుర్రపు స్వారీ పాఠాలు చెబుతుంటా. కాకినాడ నుంచి ఒక్కరైనా జాతీయస్థాయి పోటీలకు వెళ్లేలా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.

– బొడ్డల పైడిరాజు, కాకినాడ



పీచులా మారిన జుట్టుకి పోషణ!

వాతావరణంతోపాటు పోషకాల లోపం, వయసు, అనారోగ్య సమస్యలు, వాడే మందులు, సరైన పోషణ లేకపోవడం వంటివెన్నో జుట్టు పొడిబారడానికి కారణాలు. ఇంటి చిట్కాలతోనే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. తిరిగి కురులను మెరిపించొచ్చు.

- రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరినూనెకు చెంచా ఆముదం కలిపి వేడి చేయాలి. దీన్ని తలస్నానం చేయడానికి గంట ముందు మాడుకి రాసి మృదువుగా మర్దన చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే జుట్టు పట్టులా మెత్తగా మారుతుంది.
- ఒకటిన్నర చెంచాల యాపిల్ సిడార్ వినెగర్‌ను లీటరు నీళ్లల్లో కలిపి... వాటితో తలను తడపండి. ఆపై అరగంట ఆరనిచ్చి తలస్నానం చేస్తే సరి. శిరోజాలు మృదువుగా మెరిసిపోతాయి.
- గుడ్డులోని తెల్లసొనకు అరకప్పు పెరుగు కలిపి కుదుళ్లనుంచి కురుల చివరి వరకూ పట్టించాలి. ఇది ప్రొటీన్ బూస్టలా పనిచేస్తుంది. అరగంట తరవాత తలస్నానం చేస్తే సరి. జుట్టు నిగనిగలాడుతుంది. మీ సమస్యా దూరమవుతుంది.

చూపుడు వేలూ కాపాడుతుంది!





ఆపద వేళ చూపుడు వేలినీ ఆయుధం చేసుకోవచ్చు. చెవి తమ్మెకీ, దవడకీ మధ్య చిన్న ఖాళీ ఉంటుంది కదా! ఆ ప్రాంతంలో ప్రెజర్ పాయింట్ ఉంటుంది. ఎదుటివాళ్ల రెండు చెవుల వద్దా ఆ ప్రాంతంలో చూపుడు వేళ్లతో గట్టిగా నొక్కండి. నొప్పిని తట్టుకోలేరు. ఆ సమయం తప్పించుకోవడానికి సాయపడుతుంది. అయితే జాగ్రత్త! ఎక్కువ వ్యాయామాలు సాధన చేసేవారి మీద ఈ టెక్నిక్ పని చేయదు. ఎందుకంటే వాళ్లలో నొప్పి భరించే శక్తి ఎక్కువగా ఉంటుంది.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

మహిళా... నిద్రపో!



కెరియర్‌లో పెరిగిన బాధ్యతలతో వచ్చే ఒత్తిడి, టీనేజ్ లేదా పిల్లల భవిష్యత్తు గురించిన ఆందోళనలు ఒకెత్తయితే; మెనోపాజ్‌లో హార్మోన్లు సృష్టించే గందరగోళం మరోకెత్తు. వీటన్నింటి ఫలితం 45 దాటిన మహిళల్లో అత్యధిక శాతం నిద్రకు దూరమవుతున్నారు. ఆ వయసులో ఇదంతా సహజమే అనీ చాలా మంది సర్దిచెప్పుకొంటూ దాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. కానీ దీని ప్రభావం దీర్ఘకాలంలో తీవ్రంగా ఉంటున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. పిట్స్‌బర్గ్ యూనివర్సిటీ నిపుణులు చేసిన ఓ అధ్యయనంలో- మెనోపాజ్‌లో నిద్రలేమికి గురయిన ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు హృద్రోగ సమస్యల్ని ఎదుర్కొంటున్నట్లు తేలింది. కెరోటిడ్ ధమని మందంగా మారడంతోపాటు కొందరిలో హార్ట్‌ఎటాక్సనీ స్ట్రోక్సనీ గుర్తించారు. అదేసమయంలో రోజుకి ఎనిమిది లేదా తొమ్మిది గంటలపాటు ప్రశాంతంగా నిద్రపోయేవాళ్లలో గుండె ఆరోగ్యం బాగుందట. దీని ఆధారంగా మధ్య వయసులో మహిళలు నిద్రలేమిని తేలికగా తీసుకోవద్దని చెబుతున్నారు.

నాన్న మారిపోయారు!

నీకు ఎవరంటే ఇష్టమని ఎవరైనా అడిగితే ఠక్కున నాన్న అనే చెబుతా. నాకు అన్నింట్లో అంతగా సపోర్టుగా ఉంటారు. అలాంటి నాన్న మారిపోయారు. పదో తరగతిలో నాకు 70 శాతమే మార్కులొచ్చాయి. అది ఆయనకు అవమానంగా అనిపించిందట. అప్పట్నుంచీ నాతో ప్రేమగా లేరు. ఇంటర్లో చిన్న పరీక్ష జరిగినా మార్కులెంతో తెలుసుకుని, కాస్త తగ్గినా కొడుతున్నారు. భయమేస్తోంది... ఏం చేయాలి?

- ఓ సోదరి

సాధారణంగా ఆడపిల్లలంతా నీలా నాన్న కూచీలే. తండ్రులూ చాలావరకూ కూతుళ్లకు అన్నివిధాలుగా తోడ్పాటు ఇస్తుంటారు. అవసరమైతే పోట్లాడి అయినా కూతుళ్లను గెలిపించే తండ్రులూ ఎక్కువే. ఆ రకంగా నువ్వు అదృష్టవంతురాలివే. కాకపోతే మీ నాన్నలో మార్పు వచ్చింది. నీకన్నా మార్కులకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారని బాధపడుతున్నావు. నీ బాధ, సందిగ్ధత నేను అర్థం చేసుకోగలను. బహుశా మీ నాన్న మీద చుట్టూ ఉన్నవారి ప్రభావం పడి ఉండొచ్చు. ఆఫీసు, కుటుంబ వేడుకలు ఏవైనా పిల్లల చదువులు, మార్కులపైనే చర్చలు జరుగుతుంటాయి కదా? అక్కడ నీ మార్కుల విషయంలో అవమానంగా భావించి ఉండొచ్చు. అయితే మీ నాన్న చేస్తోందీ కొంతవరకూ తప్పే. చేయి చేసుకోవడం కాకుండా నీ నుంచి ఏం ఆశిస్తున్నారో, నువ్వు బాగా చదివితే ఎంత ఆనందిస్తారో చెప్పాల్సింది. నువ్వూ మార్కుల గురించే ఆలోచిస్తున్నావు కాబట్టి, భయపడుతున్నావు. చదువు, ర్యాంకులు అవసరమే. కానీ అంతకన్నా వ్యక్తిత్వం ప్రధానం. దాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటూనే ఎక్కడ పొరపాటు చేస్తున్నావో గమనించుకుని అధిగమించు.. విజ్ఞానం, తద్వారా మార్కులు పెరుగుతాయి. నాన్న తీరుకు భయపడకు, బాధపడకు. ఆయన గర్వించేలా ఏం చేయాలో చూడు. అవసరమైతే ఆయనతో నీ బాధని పంచుకో. ఇద్దరూ కలిసి ప్రయత్నిస్తే ఈ దశ దాటడం చాలా సులువే. కాబట్టి, ఓసారి మాట్లాడు.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

బోన్సాయ్ చెట్టు ఇంట్లోనే!







ఇంటి అలంకరణ మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తుంది కదా! అందుకే వాకిలి నుంచి బెడ్‌రూమ్ వరకూ అడుగడుగునా అందంగా కనిపించాలని కోరుకుంటున్నారు. అభిరుచి, ఆలోచనలకు అనుగుణంగానే ఇంటిని అలంకరించుకుంటోందీ తరం . ప్రకృతి ప్రేమికులైతే ఇంటినే నందనవనంగా తీర్చిదిద్దుకుంటున్నారు. దానికోసం ఇంటిపైనా, చుట్టూ మొక్కల్ని పెంచేస్తున్నారు. ఏ సాయంత్రమో టీ తాగడానికి గార్డెన్‌లో ఉండే చెట్టుకింద చేరిపోతున్నారు. మరి అంత వెసులుబాటు లేని ప్రకృతి ప్రేమికుల మాటేంటి? ప్రస్తుతం పట్టణీకరణ దృష్ట్యా ఫ్లాట్లు, అపార్ట్‌మెంట్లలో నివసించేవారే ఎక్కువ. ఆ అనుభూతిని వారికీ అందించాలనుకున్నారు డిజైనర్లు. అందుకే ఇంటిలోపలే కూర్చున్నచోటుకే ప్రకృతిని తీసుకొస్తున్నారు. హాలు, బెడ్‌రూమ్, లివింగ్ రూమ్, ఆఫీస్, గార్డెన్ అనే తేడాలేకుండా అన్నిచోట్లా కుదురుకునేలా వీటిని తయారుచేస్తున్నారు. బోన్సాయ్ సోఫాలు, బుక్ షెల్ఫ్‌లు, నైట్ ల్యాంప్ టేబుళ్లు, పాట్ షెల్ఫ్‌లతో అచ్చంగా ఇంట్లోనే బోన్సాయ్ మొక్క పెరిగిందా అన్నట్లు గోడ లేదా దాని కార్నర్స్‌లో వీటిని అమర్చేస్తున్నారు. కూర్చున్నచోటే ప్రకృతి అందాలను ఆస్వాదించే విధంగా కోరుకున్న పరిమాణం, ఆకారం, రంగులతో వీటిని తయారుచేస్తున్నారు. మీరూ ప్రకృతి ప్రేమికులేనా... అయితే వీటిపై ఓ లుక్కేయండి!





టీ బానిసలేనా... అయితే ఆపాల్సిందే!

అలవాట్లు, ఇష్టాలు ఏవైనా హద్దుల్లోనే ఉండాలి. లేదంటే అవి తెచ్చే సమస్యలు వర్ణనాతీతం. రోజూ ఉదయం మనల్ని పలకరించే చాయ్‌కి కూడా ఇది వర్తిస్తుంది. అసలే శీతకాలం... వేడివేడిగా టీ తాగితే వచ్చే ఉత్తేజం మాటల్లో చెప్పలేం. అందుకే నిద్ర లేచాక ఒక కప్పు టీతోనే మొదలవుతుంది మహిళల రోజు. ఇలా ఉదయం, సాయంత్రం, మహా అయితే అలసట ఎక్కువైనప్పుడో ఓ కప్పు టీ తాగితే పర్వాలేదు కానీ... కొంతమంది చాలాసార్లు తాగుతుంటారు. చుట్టాలు వచ్చారు, స్నేహితులకి కంపెనీ ఇవ్వాలి, తల నొప్పి వస్తోంది... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ చాంతాడంత ఉంటుంది కారణాల జాబితా. వీటన్నింటివల్లా శరీరంలో కెఫీన్ స్థాయిలు ఎక్కువవుతున్నాయి. మానసిక సమస్యలు దీని పర్యవసానమే అంటున్నారు నిపుణులు. ప్రశాంతత, నిద్రను ప్రోత్సహించే అడెనోసిన్ గ్రాహకాలను అడ్డుకుంటుంది కెఫీన్. దాంతో నిద్రలేమి సమస్యలతో బాధపడుతుంటారు. హృదయ స్పందన రేటు మీదా దీని ప్రభావం పడుతుందట. టీ తయారీలో వాడే పాలు, చక్కెర జీవక్రియా రేటుని దెబ్బతీస్తాయి. దాంతో అజీర్తి, ఉబ్బరం వంటి జీర్ణసంబంధిత సమస్యలూ పెరుగుతాయి. పైగా, ఇప్పటికే యాంగ్జయిటీతో బాధపడుతున్నవారు టీ ఎక్కువగా తాగడం వల్ల అందులోని కెఫీన్ నాడీ వ్యవస్థ పనితీరును దెబ్బతీస్తుంది. పర్యవసానంగా... మానసిక రుగ్మతలు ఇంకా పెరుగుతాయి. అందుకే రోజుకు కెఫీన్ పరిమితి 400మి.గ్రా.కి మించకూడదంటున్నారు నిపుణులు. వయసును బట్టీ దీనిలో మార్పులు ఉంటాయట. గర్భిణులు, యాంగ్జయిటీ సమస్యలున్న వారు అయితే 200మి.గ్రా.కి మించకుండా చూసుకోవాలట. గమనించుకుంటారుగా మరి!



జూనియర్ హాకీ ప్రపంచకప్

ఛాంపియన్స్



ఒక సిరీస్.. ఎన్నో పాఠాలు!

ఏడాది వ్యవధిలో సొంతగడ్డపై టెస్టుల్లో రెండో వైట్‌వాష్ ఎదురు కావడంతో.. భారత క్రికెట్ జట్టు సామర్థ్యంపై ఎన్నో సందేహాలు! కానీ టెస్టు పరాభవం నుంచి కాస్త ఉపశమనాన్నిస్తూ వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికాను ఓడించింది టీమ్ఇండియా. కేవలం సిరీస్ విజయం మాత్రమే కాదు.. భారత్‌కు సంతోషాన్నిచ్చిన విషయాలు మరి కొన్ని ఉన్నాయి. టీమ్ఇండియాకు కొన్ని విలువైన పాఠాలు కూడా నేర్పింది ఈ సిరీస్!

ఈనాడు క్రీడావిభాగం

సీనియర్లను విస్మరిస్తే..?

కొన్ని నెలల వ్యవధిలో అశ్విన్, రోహిత్, కోహ్లి టెస్టులకు గుడ్‌బై చెప్పేయడంతో భారత టెస్టు జట్టు ఒక్కసారిగా బలహీనపడ్డ మాట వాస్తవం. వయసు పెరిగిందని, ఫామ్ తగ్గిందని.. వారి అవసరం జట్టుకు లేదనే అనుకుంది టీమ్ మేనేజ్మెంట్! కానీ ఇటీవల దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో జట్టు ప్రదర్శన చూస్తే.. సీనియర్లు లేని లోటు స్పష్టంగా కనిపించింది. అదే దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో గొప్పగా రాణించిన కోహ్లి, రోహిత్ తమ విలువేంటో చాటి చెప్పారు. వీరి అపార అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడింది. సిరీస్‌లో వీరి చురుకుదనం, బ్యాటింగ్ నైపుణ్యం చూశాక టెస్టుల నుంచి రిటైరై తప్పు చేశారనే అభిప్రాయం బలపడింది. రో-కో అయిష్టంగానే టెస్టుల నుంచి తప్పుకొన్నారనే అభిప్రాయం అభిమానుల్లో బలంగా ఉంది. వాళ్లిద్దరూ తిరిగి టెస్టు జట్టులోకి రావాలన్న డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు 2027 వన్డే ప్రపంచకప్ వరకు వీరు కొనసాగగలరా అనే సందేహాలకూ తెర పడింది. కొన్నాళ్ల పాటు ఈ చర్చే ఉండకపోవచ్చు!


యశస్వి

‘టెస్టు’ ముద్ర నుంచి బయటికి..

కొన్నేళ్లుగా ఐపీఎల్‌లో నిలకడగా రాణిస్తున్నాడు యశస్వి జైస్వాల్. అవసరమైతే ఎంత దూకుడుగా అయినా ఆడగలడు. ఐపీఎల్‌లో అతను మూడు శతకాలు సాధించగా.. వాటిలో దేనికీ 60 బంతులకు మించి తీసుకోలేదు. ఇలాంటి దూకుడైన ఓపెనర్‌ను టెస్టులకే పరిమితం చేసేసింది జట్టు యాజమాన్యం. ఒక్క వన్డే మాత్రమే ఆడాడు. టీ20ల్లో 23 మ్యాచ్‌ల్లో అవకాశం దక్కింది. చాన్నాళ్లుగా అతడికి పరిమిత ఓవర్ల జట్టులో చోటు దక్కట్లేదు. అయితే శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో తుది జట్టులో ఆడే అవకాశం దక్కింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో 18, 22 పరుగులే చేయడంతో యశస్వి సామర్థ్యంపై సందేహాలు కలిగాయి. కానీ మూడో మ్యాచ్‌లో చక్కటి శతకంతో తన సత్తాను చాటి చెప్పాడు యశస్వి. ఎంతో నేర్పుగా ఇన్నింగ్స్‌ను నిర్మిస్తూ.. రోహిత్, కోహ్లి లాంటి సీనియర్ బ్యాటర్లతో భాగస్వామ్యాలు నెలకొల్పిన తీరు తన పరిణతిని చాటింది. ఈ ఇన్నింగ్స్‌తో అతడిపై టెస్టు ఆటగాడిగా ఉన్న ముద్ర తొలగినట్లే. ఇకపై వన్డేలు, టీ20ల్లోనూ అతణ్ని ఆడించక తప్పదు. కానీ శుభ్‌మన్, శ్రేయస్ తిరిగొచ్చాక వన్డే తుది జట్టులో అతడికి ఎలా చోటు కల్పిస్తారన్నదే ప్రశ్నార్థకం. టీ20 జట్టులోనూ పోటీ తీవ్రంగానే ఉంది.


హర్షిత్ రాణా

పేస్ బలం పెరగాలి

కొన్నేళ్ల ముందు వరకు ప్రపంచంలోనే అత్యుత్తమ పేస్ దళాల్లో భారత్‌ది ఒకటి. షమి, బుమ్రా, భువనేశ్వర్, సిరాజ్‌లతో పేస్ విభాగం ప్రత్యర్థులకు సవాలు విసిరేది. కానీ భువి, షమి ఒకరి తర్వాత ఒకరు జట్టుకు దూరం కాగా.. బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలతో తరచుగా మ్యాచ్‌లు ఆడలేని పరిస్థితికి చేరుకోవడంతో భారత పేస్ బలహీన పడింది. సిరాజ్ విదేశాల్లోనే రాణిస్తున్నాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, హర్షిత్ రాణా పేస్ బాధ్యతలు పంచుకున్నారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో పేసర్లు ధారాళంగా పరుగులు ఇచ్చేశారు. తొలి వన్డేలో 350 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. రెండో మ్యాచ్‌లో 358 లక్ష్యాన్ని కూడా నిలబెట్టుకోలేకపోయారు. మూడో మ్యాచ్‌లో పేసర్లు మెరుగుపడ్డారు. కానీ బుమ్రా లేకపోతే భారత పేస్ పరిస్థితి ఏంటి అనే సందేహాలను ఈ సిరీస్ రేకెత్తించింది. ప్రతిభావంతులైన యువ పేసర్లను గుర్తించి, అంతర్జాతీయ క్రికెట్‌కు తగ్గట్లు తీర్చిదిద్దుకోవాల్సిన అవసరాన్ని ఈ సిరీస్ గుర్తు చేసింది.


నిఖార్సయిన ఆల్‌రౌండరెక్కడ?


సుందర్

ఆల్‌రౌండర్ల వల్ల జట్టుకు ఒనగూరే ప్రయోజనం ఎక్కువే. నిఖార్సయిన ఒక ఆల్‌రౌండర్ జట్టులో ఉంటే.. ఒక అదనపు బ్యాటర్ లేదా బౌలర్‌ను ఎంచుకునే సౌలభ్యం ఉంటుంది. కానీ ఆల్‌రౌండర్ల పేరుతో జట్టులోకి వచ్చే ఆటగాళ్లు.. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణించకపోతే.. ఏదో ఒక్కదాంట్లోనే రాణిస్తే కష్టం. ఇటీవల టెస్టు సిరీస్‌లో అదే చూశాం. వాషింగ్టన్ సుందర్ బ్యాటుతో పర్వాలేదనిపించినా.. బౌలింగ్‌లో విఫలమయ్యాడు. నితీశ్ కుమార్ రెడ్డి రెండింట్లోనూ తేలిపోయాడు. వన్డే సిరీస్‌లోనూ ఇదే జరిగింది. సుందర్ పూర్తిగా నిరాశపరిచాడు. ఆల్‌రౌండర్ల పేరుతో జట్టులోకి వస్తున్న ఆటగాళ్లను బౌలింగ్ లేదా బ్యాటింగ్‌లో పూర్తిగా ఉపయోగించుకోలేనపుడు స్పెషలిస్టు బౌలర్ లేదా బ్యాటర్‌ను ఆడించడం మేలు. లేదంటే రెండు విధాలా రాణించే నిఖార్సయిన ఆల్‌రౌండర్లను తయారు చేసుకోవడంపై దృష్టి సారించాలి.

రో-కో అనుభవం జట్టుకు అవసరం

విశాఖపట్నం: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి అనుభవం భారత జట్టుకు ఎంతో అవసరమని.. వాళ్లిద్దరూ వన్డే ఫార్మాట్లో ఇలాగే స్థిరంగా రాణించాలని కోరుకుంటున్నానని కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ విజయంలో కోహ్లి, రోహిత్ కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో గంభీర్ ఇలా స్పందించాడు. ‘‘రోహిత్, కోహ్లి నాణ్యమైన ఆటగాళ్లు. ప్రపంచ స్థాయి బ్యాటర్లు. ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పా. అలాంటి ప్లేయర్లు 50 ఓవర్ల ఫార్మాట్లో జట్టుకు ఎంతో అవసరం. సుదీర్ఘ కాలంగా రోహిత్, కోహ్లి సత్తా చాటుతున్నారు. ఇదే స్థిరత్వాన్ని ముమ్ముందు కొనసాగించాలని కోరుకుంటున్నా. డ్రెస్సింగ్‌రూమ్‌కు ఇది ఎంతో మేలు చేస్తుంది’’ అని గౌతి పేర్కొన్నాడు. బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్లకు విశ్రాంతి ఇవ్వడం వల్ల యువ ఆటగాళ్ల సత్తాను పరీక్షించే అవకాశం వచ్చిందని గంభీర్ అన్నాడు. ‘‘సీనియర్లు లేని సమయంలో కుర్రాళ్లను పరీక్షిస్తున్నాం. హర్షిత్ రాణానే ఇందుకు ఉదాహరణ. అతడు బంతితో రాణించడంతో పాటు ఎనిమిదో స్థానంలో వచ్చి బ్యాట్‌తోనూ మెరుపులు మెరిపించగలడు. అతడిని బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దితే జట్టుకు ఎంతో మేలు చేస్తుంది. వన్డేల్లో పెద్దగా అనుభవం లేకపోయినా దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో అర్ష్‌దీప్, హర్షిత్, ప్రసిద్ధ్ రాణించారు. టెస్టుల్లో వాషింగ్టన్ సుందర్ కూడా అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాడు. ఏ స్థానంలో బ్యాటింగ్‌కు దిగినా సత్తా చాటుతున్నాడు’’ అని గంభీర్ తెలిపాడు. స్థిరమైన బ్యాటింగ్ ఆర్డర్ ఉండాల్సిన అవసరం లేదని భారత కోచ్ అభిప్రాయపడ్డాడు. ‘‘పరిమిత ఓవర్ల క్రికెట్లో ఒకే రకమైన బ్యాటింగ్ ఆర్డర్ ఉండాలన్న అభిప్రాయంతో నేను ఏకీభవించను. ఓపెనింగ్ జోడీ మాత్రమే ఇందుకు మినహాయింపు. టెస్టులకు మాత్రమే స్థిరంగా ఒకే బ్యాటింగ్ లైనప్ ఉండాలి’’ అని గంభీర్ అన్నాడు. పదే పదే బ్యాటింగ్ ఆర్డర్‌ను మారుస్తున్నందుకు తనపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో గంభీర్ ఇలా స్పందించాడు.


గంభీర్

అవును.. స్మృతి పెళ్లి రద్దయింది!


స్మృతి


పలాష్

దిల్లీ: తన పెళ్లిపై వస్తున్న ఊహాగానాలకు భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన తెరదించింది. సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌తో తన వివాహం రద్దు చేసుకున్నట్లు ఆదివారం సామాజిక మాధ్యమం వేదికగా స్మృతి ప్రకటించింది. ఈ విషయాన్ని పలాష్ కూడా ధ్రువీకరించాడు. నవంబరు 23న స్మృతి, పలాష్ పెళ్లి జరగాల్సి ఉండగా.. అనూహ్య పరిణామాల మధ్య ఆ వేడుక ఆగిపోయింది. స్మృతి తండ్రి శ్రీనివాస్ మంధాన అనారోగ్యం వల్లే పెళ్లి వాయిదా ఆగినట్లు ముందుగా వార్తలు వచ్చాయి. కానీ కొన్ని రోజుల తర్వాత ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక కూడా స్మృతి పెళ్లి గురించి ఏ సమాచారం లేకపోయింది. పెళ్లి ఆగిపోవడానికి వేరే కారణాలున్నాయని.. పలాష్‌తో మొత్తంగా వివాహాన్నే రద్దు చేసుకోవాలని, అతడితో బంధాన్ని తెంచుకోవాలని స్మృతి నిర్ణయించుకుందని వార్తలు వచ్చాయి. ఈ ప్రచారానికి తగ్గట్లే ఇప్పుడు స్మృతి ప్రకటన చేసింది. ‘‘పెళ్లి రద్దయినట్లు స్పష్టం చేయాలనుకుంటున్నా. ఈ విషయాన్ని ఇక్కడితో ముగించాలని భావిస్తున్నా. అందరూ అలాగే చేయాలని వేడుకుంటున్నా. గత కొన్ని వారాలుగా నా జీవితం చుట్టూ చాలా ఊహాగానాలు సాగాయి. ఇలాంటి సమయంలో నేను మాట్లాడటం ముఖ్యం. నా వ్యక్తిగత జీవితం గురించి గోప్యంగా ఉండాలని భావించే వ్యక్తిని. రెండు కుటుంబాల గోప్యతను గౌరవిస్తూ.. ముందుకు సాగేందుకు సహకరించాలని అభ్యర్థిస్తున్నా. అత్యున్నత స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే నా లక్ష్యం. వీలైనంత కాలం భారత్ తరఫున ఆడుతూ ట్రోఫీలు గెలవాలని ఆశిస్తున్నా. నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు. ముందుకు సాగాల్సిన సమయమిది’’ అని స్మృతి తెలిపింది. వివాహం రద్దును ధ్రువీకరించిన పలాష్.. తన పరువుకు నష్టం కలిగించేలా ఊహాగానాల్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నాడు.


జ్యోతి సురేఖ

జ్యోతి కంచు గురి

తైపీ: అంతర్జాతీయ ఆర్చరీలో స్థిరంగా రాణిస్తున్న తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ.. మరోసారి సత్తా చాటింది. తైపీ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో జ్యోతి కాంస్యంతో మెరిసింది. కాంస్య పతక పోరులో ఆమె 149-143తో సో చావోన్ (కొరియా)ను ఓడించింది. ఇటీవల చైనాలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్ టోర్నీలో జ్యోతి కాంస్యం నెగ్గింది. కాంపౌండ్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా ఆర్చర్‌గా ఘనత సాధించింది.

సిమ్రన్‌ప్రీత్‌కు స్వర్ణం.. తోమర్‌కు రజతం


సిమ్రన్‌ప్రీత్


తోమర్


దోహా: ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్ ఫైనల్స్‌లో భారత యువ క్రీడాకారిణి సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్, స్టార్ ఆటగాడు ఐశ్వరీ ప్రతాప్‌సింగ్ తోమర్ మెరిశారు. ప్రతిష్ఠాత్మక పోటీల్లో సిమ్రన్‌ప్రీత్ స్వర్ణం, తోమర్ రజత పతకాలతో సత్తా చాటారు. ఆదివారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్‌లో సిమ్రన్‌ప్రీత్ అద్భుత ప్రదర్శనతో అగ్రస్థానం కైవసం చేసుకుంది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో ఇషా సింగ్ 7, మను బాకర్ 9 స్థానాల్లో నిలిచి ఫైనల్ బెర్తులకు దూరమయ్యారు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో తోమర్ రెండో స్థానం సాధించాడు.

ఆ వీడియోకు 10 కోట్ల వీక్షణలు


కోహ్లి, అర్ష్‌దీప్

విశాఖపట్నం: దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ విజయానంతరం టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, యువ పేసర్ అర్ష్‌దీప్ కలిసి చేసిన రీల్ సామాజిక మాధ్యమాలను ఊపేసింది. ఒక్క రోజు వ్యవధిలో ఆ రీల్‌కు 10 కోట్ల వీక్షణలు రావడం విశేషం. సిరీస్‌లో తొలి రెండు వన్డేల్లో శతకాలు సాధించిన కోహ్లి.. మూడో మ్యాచ్‌లో ఆ అవకాశం రాలేదు. అతను బ్యాటింగ్‌కు వచ్చేసరికి చేయాల్సిన పరుగులు 116కు తగ్గిపోయాయి. అయినా సరే చెలరేగి ఆడిన విరాట్.. 45 బంతుల్లో 65 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ నేపథ్యంలో అర్ష్‌దీప్.. ‘‘లక్ష్యం చిన్నది కావడం వల్ల సెంచరీ చేయలేకపోయావు కదా’’ అని విరాట్‌ను అడిగాడు. బదులుగా కోహ్లి.. ‘‘టాస్ గెలిచాం కాబట్టి సరిపోయింది. లేదంటే ఈ మంచులో నువ్వు సెంచరీ కొట్టేవాడివి’’ అనడంతో నవ్వులు విరిశాయి. ఈ రీల్‌ను అర్ష్‌దీప్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయగా.. భారీగా వీక్షణలు వస్తున్నాయి.

నమీబియా సలహాదారుగా కిర్‌స్టెన్


కిర్‌స్టెన్

దిల్లీ: నమీబియా క్రికెట్ జట్టు సలహాదారుగా గ్యారీ కిర్‌స్టెన్ నియమితుడయ్యాడు. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌నకు నమీబియాను సిద్ధం చేయడానికి ప్రధాన కోచ్ క్రెయిగ్ విలియమ్స్‌తో కలిసి ఈ దక్షిణాఫ్రికా మాజీ స్టార్ పని చేయనున్నాడు. ‘‘నమీబియా జట్టుతో పని చేయడానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. ప్రపంచ క్రికెట్లో ఆ జట్టు స్థిరంగా రాణిస్తోంది. వచ్చే టీ20 ప్రపంచకప్‌నకు ఆ జట్టును సిద్ధం చేయడానికి నా వంతు కృషి చేస్తా’’ అని కిర్‌స్టెన్ అన్నాడు. 2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు కిర్‌స్టెన్ కోచ్‌గా పని చేసిన సంగతి తెలిసిందే. 2024లో పాకిస్థాన్ కోచ్‌గానూ అతడు సేవలందించాడు. ఇప్పటి వరకు 2021, 2022, 2024 టీ20 ప్రపంచకప్‌లకు నమీబియా అర్హత సాధించింది. 2026 టీ20 కప్‌నకు దక్షిణాఫ్రికా, జింబాబ్వేతో కలిసి నమీబియా ఆతిథ్యం ఇవ్వనుంది.


మ్యాచ్‌లో ఓ దృశ్యం

భారత్ కల చెదిరె

సెమీస్‌లో జర్మనీ చేతిలో ఓటమి

చెన్నై: భారత్ కల భగ్నమైంది. సుదీర్ఘ విరామం తర్వాత జూనియర్ హాకీ ప్రపంచకప్‌ను సాధించాలన్న ఆశ తీరలేదు. ఆదివారం సెమీఫైనల్లో భారత్ 1-5తో డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ చేతిలో ఓడింది. ఆద్యంతం దూకుడుగా ఆడిన జర్మనీ.. ఆతిథ్య జట్టుకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. తొలి అరగంట ఆటలోనే భారత్ 0-3తో వెనుకబడింది. 14వ నిమిషంలో వెక్స్ టిటాస్ చేసిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన జర్మనీ.. లుకాస్ (15వ, 30వ) రెండుసార్లు బంతిని నెట్‌లోకి పంపడంతో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. ఆ తర్వాతా జర్మనీనే ఆధిపత్యం ప్రదర్శించింది. భారత్ రక్షణ శ్రేణిని ఛేదిస్తూ పదే పదే దాడులు చేసింది. ఫలితం మరో రెండు గోల్స్ ఆ జట్టు ఖాతాలో పడ్డాయి. జొనాస్ (40వ), బెన్ (49వ) ఈ గోల్స్ కొట్టారు. భారత ఆటగాడు అన్మోల్ (51వ) ఓ గోల్ సాధించినా.. జర్మనీ అప్పటికే విజయాన్ని ఖాయం చేసుకుంది. పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకోకపోవడం, బలహీనమైన డిఫెన్స్, ఫినిషింగ్ లోపం భారత్‌ను ముంచాయి. బుధవారం మూడో స్థానం కోసం జరిగే పోరులో అర్జెంటీనాతో భారత్ తలపడనుంది.

తుదిపోరుకు స్పెయిన్: స్పెయిన్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. సెమీఫైనల్లో 2-1తో అర్జెంటీనాను ఓడించింది. తొలి క్వార్టర్‌లో రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. కానీ 17వ నిమిషంలో జోక్విన్ రుయిజ్ సఫలం కావడంతో స్పెయిన్ ఖాతా తెరిచింది. అర్జెంటీనా వెంటనే పుంజుకుంది. జువాన్ ఫెర్నాండెజ్ (21వ) గోల్‌తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత అర్జెంటీనాకు రెండు గోల్ అవకాశాలు (28వ, 43వ) వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆట చివరి క్వార్టర్‌కు చేరడంతో మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు మళ్లేలా కనిపించింది. అయితే 56వ నిమిషంలో అల్బర్ట్ సెరాహిమా గోల్ కొట్టి స్పెయిన్ విజయాన్ని ఖాయం చేశాడు. రెండు సెకన్లలో ఆట ముగుస్తుందనగా అర్జెంటీనాకు పెనాల్టీ కార్నర్ లభించినా.. వృథా చేసుకుంది. 5-6 స్థానాల కోసం జరిగిన పోరులో బెల్జియం 3-2తో ఫ్రాన్స్‌ను ఓడించింది.

ఆసీస్ చేతిలో ఇంగ్లాండ్ చిత్తు

యాషెస్ రెండో టెస్టు


నీసర్ 5/42

బ్రిస్బేన్: యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా ఆధిపత్యం కొనసాగుతోంది. రెండో టెస్టులోనూ ఇంగ్లాండ్‌ను మట్టికరిపించింది. ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో ఆసీస్ 8 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసి.. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఓవర్‌నైట్ స్కోరు 134/6తో నాలుగో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 75.2 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (50; 152 బంతుల్లో 4×4), విల్ జాక్స్ (41; 92 బంతుల్లో 2×4) పోరాడినా ఫలితం లేకపోయింది. పేసర్ మైకెల్ నీసర్ (5/42) బౌలింగ్‌లో కెప్టెన్ స్టీవ్ స్మిత్ అద్భుతమైన క్యాచ్‌తో విల్ జాక్స్‌ను వెనక్కి పంపాడు. దీంతో స్టోక్స్, జాక్స్‌ల ఏడో వికెట్ భాగస్వామ్యానికి 96 పరుగుల వద్ద తెరపడింది. కాసేపటికే స్టోక్స్ సైతం నీసర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. తర్వాత ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సమయం పట్టలేదు. అనంతరం 65 పరుగుల లక్ష్యాన్ని 10 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఆసీస్ అలవోకగా ఛేదించింది. ట్రావిడ్ హెడ్ (22; 22 బంతుల్లో 2×4, 1×6), జేక్ వెదరాల్డ్ (17 నాటౌట్; 23 బంతుల్లో 2×4), స్మిత్ (23 నాటౌట్; 9 బంతుల్లో 2×4, 2×6) రాణించారు. బౌలింగ్, బ్యాటింగ్‌లో అదరగొట్టిన మిచెల్ స్టార్క్ (6/75, 77, 2/64)కు ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది. మూడో టెస్టు అడిలైడ్‌లో ఈ నెల 17న మొదలవుతుంది.


వెర్‌స్టాపెన్

నోరిస్

వెర్‌స్టాపెన్ గెలిచినా.. నోరిసే ఛాంపియన్

అబుదాబి: ఈ ఏడాది ఫార్ములావన్ డ్రైవర్ ఛాంపియన్‌షిప్‌ను లాండో నోరిస్ (మెక్‌లారెన్) కైవసం చేసుకున్నాడు. అబుదాబి గ్రాండ్‌ప్రిలో మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) విజేతగా నిలిచినప్పటికీ.. ఈ రేసులో మూడో స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా నోరిస్ 423 పాయింట్లతో ఓవరాల్‌గా అగ్రస్థానం సాధించాడు. వెర్‌స్టాపెన్ (421) రెండో స్థానానికి పరిమితమయ్యాడు. ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్, 410) మూడో స్థానం దక్కించుకున్నాడు. నోరిస్‌కు కెరీర్‌లో ఇదే తొలి ఫార్ములావన్ డ్రైవర్ టైటిల్. గత నాలుగేళ్లూ వెర్‌స్టాపెనే ఛాంపియన్‌గా నిలిచాడు. అబుదాబి రేసులో నోరిస్ టాప్-3లో నిలవకపోతే మరోసారి వెర్‌స్టాపెన్‌కే డ్రైవర్ ఛాంపియన్‌షిప్ దక్కేది. 58 ల్యాప్‌ల రేసును వెర్‌స్టాపెన్ గంట 26 నిమిషాల 7 సెకన్లలో పూర్తి చేసి టైటిల్ కైవసం చేసుకున్నాడు. పియాస్ట్రి (గంట 12 నిమిషాల 59 సెకన్లు), నోరిస్ (గంట 16 నిమిషాల 57 సెకన్లు) తర్వాతి రెండు స్థానాలు సాధించారు.



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ కె.సురేష్‌రెడ్డి దంపతులు తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి ఆదివారం శ్రీవేంకటేశ్వర స్వామి సేవలో పాల్గొన్నారు. శనివారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి మెట్టుమార్గంలో తిరుమలకు చేరుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల న్యాయమూర్తి మాట్లాడుతూ.. తన పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

పెంచిన లారీల ఫిట్‌నెస్ ఫీజులను తగ్గించాలి

- లేదంటే 10 వేల వాహనాలను ఆపేసి నిరసనకు దిగుతాం
- ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్

ఈనాడు, అమరావతి: కేంద్రప్రభుత్వం పెంచిన లారీల టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులను తగ్గించకుంటే 12 ఏళ్లు దాటిన వాహనాలను నడపకుండా ఆపేస్తామని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు తెలిపారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు "20 ఏళ్లు దాటిన వాహనాలపై ఫీజును కేంద్రం రూ.33,040కు పెంచింది. 12 ఏళ్లు దాటిన లారీలకూ రుసుములు భారీగా పెరిగాయి. ఫలితంగా వాహనాల యజమానులు నష్టపోతున్నారు. కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రాష్ట్రప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాల్సిన అవసరం లేదు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఈ నెల 9 నుంచి నిరసనకు దిగుతాం. సరకు రవాణా, రైల్వే గూడ్స్ షెడ్‌లు, షిప్‌యార్డుల్లో వినియోగించే 10వేల వాహనాలను ఆపేస్తాం'' అని చెప్పారు. మరోవైపు అన్ని వాహనాలకు లొకేషన్ ట్రాకింగ్ డివైజ్‌లు (వీఎల్‌టీడీ) ఏర్పాటుచేయాలని కేంద్రం నిర్దేశించిందని, సరకు రవాణా వాహనాలకు వీఎల్‌టీడీ ఏర్పాటుకు మరికొంత సమయం ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు.

స్క్రబ్ టైఫస్‌తో మరో ఇద్దరి మృతి

ఈనాడు, అమరావతి: స్క్రబ్ టైఫస్‌తో గుంటూరు జీజీహెచ్‌లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడికి చెందిన లూర్థమ్మ (59), బాపట్ల జిల్లా దేగావారిపాలేనికి చెందిన డి.నాగేంద్రమ్మ (73) ఆదివారం మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. లూర్థమ్మ నవంబరు 28న చికిత్స కోసం జీజీహెచ్‌లో చేరగా.. ఈమె కిడ్నీ సంబంధ వ్యాధితోనూ బాధపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. నాగేంద్రమ్మ అధికజ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో చేరగా.. ఇద్దరికీ పరీక్షల్లో స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. ఇదే వ్యాధితో శనివారం రాత్రి ప్రకాశం జిల్లా యర్రగొండపాలేనికి చెందిన ధనమ్మ(64) మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో కలిపి గుంటూరు జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ మృతుల సంఖ్య మూడుకు చేరింది. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 50 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదుకావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం 14 మంది ఈ వార్డులో చికిత్స పొందుతుండగా.. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు క్షేత్రస్థాయిలో కట్టడికి చర్యలు ముమ్మరం చేశాయి.

అమెరికా అగ్ని ప్రమాద ఘటనలో మరో భారతీయుని మృతి

న్యూయార్క్ : అమెరికాలోని అల్బనీ ప్రాంతంలో ఇటీవల ఓ భవనంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మరో భారతీయుడు ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర గాయాలపాలైన అన్వేష్ అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు అమెరికాలోని భారత రాయబార కార్యాలయం పేర్కొంది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన సహజారెడ్డి మృతి చెందినట్లు ఇటీవల ప్రకటించిన న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్.. తాజాగా అన్వేష్ సైతం ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. బాధితుని కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన సాయం అందిస్తామని తెలిపింది. న్యూయార్క్‌లోని అల్బనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో డిసెంబరు 4న అగ్నిప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. తెలుగు విద్యార్థులు నివాసముంటున్న పక్క భవనానికి మంటలు వ్యాపించడంతో విషాదం చోటుచేసుకుంది.




టీ బ్యాగ్‌కు స్వస్తి పలకండి

ఇటీవల కాలంలో నిర్వహించిన ఓ అధ్యయనంలో 77 శాతం రక్త పరీక్షల్లో ఊపిరితిత్తులు, మెదడు, మావిలోను ప్లాస్టిక్ ఆనవాళ్లు ఉంటున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ మన శరీరంలో చేరకుండా వీలైనంతగా కృషి చేయండి. మొదటగా టీ బ్యాగ్‌ల వాడకాన్ని తక్షణం ఆపేయండి. ఒక్క బ్యాగ్‌ను 95 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడిగల నీటిలో ముంచినప్పుడు దాని నుంచి 11.6 బిలియన్ సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు విడుదలవుతాయి. బదులుగా టీ పొడి, తేయాకులను నేరుగా వాడుకోండి.

– డోమినిక్, న్యూరోసైంటిస్ట్

ఒక చెట్టు.. 100+ ఉత్పత్తులు



కొబ్బరి చెట్టు ఉంటే ఇంట్లో పెద్ద కొడుకు ఉన్నట్లే అంటారు. ఆర్థికంగానే కాదు హార్దికంగా కూడా అన్ని రకాల ప్రయోజనాలుంటాయి మరి. తాటి చెట్టు కూడా అంతే... కొబ్బరికి ఏమాత్రం తీసిపోని బహుళ లాభదాయిని. అయితే దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలిసుండాలి. ఆ విషయాలనే నేర్పుతాం రమ్మని ఆహ్వానిస్తుంది అఖిలభారత తాటి పరిశోధనా కేంద్రం.

ఊరి చివర్లోనో, పొలం గట్ల మధ్యనో హుందాగా ఎదిగే తాటి చెట్టు మనకు చాలా రకాలుగా ఉపయోగపడుతుంది. తాటికాయతో జెల్లీ వస్త్రాల వరకూ చాలా తయారుచేయొచ్చు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలోని పందిరిమామిడి అఖిల భారత తాటి పరిశోధన కేంద్రం చాలా పరిశోధనలు చేస్తోంది. అనేక మందికి శిక్షణనిచ్చి వ్యాపారవేత్తలుగా మార్చుతోంది. ఇక్కడ 272 తాటి రకాలను సేకరించి పెంచుతున్నారు. తక్కువ ఎత్తు, ఎక్కువ దిగుబడినిచ్చే రకాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు.

చెట్టు నుంచి ఏటా రూ.10 వేల ఆదాయం...

రోబోటిక్స్, ఆటోమేషన్, మెకనైజేషన్‌తో తాటి ఉత్పత్తుల రూపకల్పనపై పరిశోధనలు చేస్తున్నాం. తాటాకుతో 150 రకాల అల్లికలు తయారుచేయొచ్చు. కొబ్బరి ఆధారిత పరిశ్రమపై ఉన్న 50శాతం సబ్సిడీ దీనికీ వర్తింపజేయాలి. తాటి మొక్కల అవసరాన్ని ఇప్పుడిప్పుడే మన వాళ్లు గుర్తిస్తున్నారు. వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు మొక్కల కోసం సంప్రదిస్తున్నాయి. ఒక చెట్టు నుంచి ఏడాదికి రూ.10-15 వేల వరకూ ఆదాయం రాబట్టవచ్చు. పామ్ విభాగంలో ఈ ఏడాది మా కేంద్రం 'నేషనల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' అవార్డు అందుకుంది. అగ్రికల్చర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నాం. తాటి ఆధారిత అంకుర సంస్థలకు మార్గనిర్దేశం చేస్తున్నాం. – **డాక్టర్ వెంగయ్య, సీనియర్ శాస్త్రవేత్త, పరిశోధన కేంద్రం అధిపతి**

ఏడాదంతా శిక్షణ...

- పందిరిమామిడి పరిశోధనా కేంద్రంలో తాటిని వాణిజ్య ఉపయోగాల కోసం ఎలా ఉపయోగించవచ్చనేదానిపై దృష్టి సారించారు. కల్లు గీత కోసం ఆధునిక పద్ధతిలో నిచ్చెనలు వినియోగించడం నేర్పిస్తున్నారు.
- కూల్‌బాక్స్ విధానంలో నీరా పులియకుండా సేకరించే సాంకేతికతను అభివృద్ధి చేశారు. తాటి బెల్లం, పొడి తయారీని నేర్పుతున్నారు. ఇందులో చక్కెర శాతం తక్కువగా ఉండడంతో మంచి గిరాకీ ఉంటుంది.
- 'వన్ మంత్ వన్ ప్రొడక్ట్' పేరుతో ఏడాదంతా తాటి ముంజెలు, పండు గుజ్జు, తేగల నుంచి ఆహార ఉత్పత్తుల తయారీపై శిక్షణా తరగతులు నిర్వహిస్తారు.
- చెట్టు నుంచి 100 రకాల సహజ, స్వచ్ఛమైన ఆహార ఉత్పత్తులతో పాటు ముంజెలతో జామ్, జెల్లీ, ఫ్రూట్ బార్ చేయొచ్చు. పండు గుజ్జులో మామిడిలో ఉండే పోషకాలు ఉంటాయి. వంటకాల్లోనూ వాడొచ్చు.
- గుజ్జును తీసే పరికరాన్నీ ఇక్కడ అభివృద్ధి చేశారు. తేగల నుంచి తీసిన పిండి, రవ్వను బేకరీ, కుకీస్, బిస్కెట్స్‌లో మైదాకు బదులుగా 50 శాతం ఉపయోగించడమెలాగో ఇక్కడ నేర్పుతారు.
- గుజ్జును వేరుచేయగా వచ్చిన పీచుకు కుషనింగ్ లక్షణం ఉండడంతో క్రాఫ్టింగ్ ఫ్యాబ్రిక్‌గా, కాగితం, దుస్తుల తయారీలోనూ వాడుతున్నారు.
- తాటిలో మధుమేహులకు మేలు చేసే 35-35 గ్లైసిమిక్ ఇండెక్స్ గల సహజ పీచు, బుర్ర గుజ్జులో అధిక ప్రొటీన్ ఉంటుంది. దీంతో వివిధ ఆహార పదార్థాల తయారీ నేర్పుతారు.
- శిక్షణ కావాలనుకుంటే 7382633663, 0864-3243577 నంబర్లకు ఫోన్‌చేస్తే వివరాలు చెబుతారు.

వినియోగ శాతం తక్కువే..



దేశవ్యాప్తంగా 15 కోట్ల తాటి చెట్లు ఉన్నాయని అంచనా. తమిళనాడులో 6-7 కోట్లు, ఏపీలో 3.5కోట్లు, తెలంగాణలో 2.5కోట్లు, దక్షిణ బిహార్‌లో కొద్దిగా ఉన్నాయి. ఇందులో మన దగ్గర కేవలం 0.1శాతం కూడా వినియోగంలోకి తీసుకురావడంలేదు.

నరికితే నాన్ బెయిలబుల్ కేసు..


తమిళనాడు రాష్ట్ర వృక్షం తాటి చెట్టు. ఇక్కడ తాటి బెల్లం తయారీ పెద్ద పరిశ్రమ. ప్రభుత్వమే పరికరాల్ని అందిస్తూ, ఉత్పత్తుల్ని కొంటోంది. ఇక్కడ ఈ చెట్లను కొడితే, నాన్ బెయిలబుల్ కేసు. ఏటా లక్ష చెట్లు నాటుతున్నారు. కల్లు అమ్మకం నిషిద్ధం. కేవలం నీరా తీయాలి. ప్రభుత్వం, ప్రజలు ఒకే తాటిపైకి రావడంతో విజయం సాధిస్తున్నారు.

- వసుంధర డెస్క్

రెవెన్యూలో అర్జీలకు మోక్షమేది?

- అర్జీల పరిష్కారానికి నెలలు.. ఏళ్లు
- క్షేత్రస్థాయి సిబ్బంది తీరుతో రైతులకు వెతలు
- మితిమీరిన రాజకీయ జోక్యమూ మరో కారణం
- రెవెన్యూ మంత్రి దృష్టి పెట్టేది.. ఇంకెప్పుడు?

ఈనాడు, అమరావతి: రేషన్ కార్డు మొదలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి జాగా, వ్యవసాయ భూమి, పరిశ్రమలకు స్థల కేటాయింపులు వంటి అనేక ప్రభుత్వ సంబంధిత పనులకు సామాన్యులైనా, పారిశ్రామికవేత్తలైనా రెవెన్యూ కార్యాలయాల తలుపు తట్టాల్సిందే. కానీ, అక్కడ నెలకొన్న నిర్లిప్తత, అవినీతి, రాజకీయ జోక్యం జనాలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. కుప్పలుతెప్పలుగా పేరుకుపోయిన పెండింగ్ దరఖాస్తులకు ఓ తార్కిక ముగింపునిచ్చే దిక్కులేకుండా పోయింది. ప్రభుత్వానికి వచ్చే మొత్తం ఫిర్యాదుల్లో 70 శాతానికి పైగా రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయి. వాటిలో రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్ఓఆర్), రీసర్వే, నిషేధ భూముల వివాదాలే అధికం. 80 శాతానికి పైగా పాత దరఖాస్తులనే మళ్లీమళ్లీ సమర్పిస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలే వీటికి మూలకారణం. అప్పట్లో అధికార యంత్రాంగంలో కొరవడిన జవాబుదారీతనం, పెచ్చుమీరిన రాజకీయ జోక్యం, అవినీతి.. భూవివాదాలకు కారణం కాగా, నేటికీ వాటికి పరిష్కారం దొరక్కపోవడం సామాన్యులను వేధిస్తోంది. ఆటో మ్యుటేషన్, వెబ్‌లాండ్, మనమిత్ర లాంటి ఎన్నో సంస్కరణలు చేశామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో ఫలితాలివ్వడం లేదు. అందుకే రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాల్సిందేనని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నారు.



ఊరికో సర్వేయర్ ఉన్నా ఉపయోగమేమి?

వైకాపా హయాంలో చేసిన రీసర్వే ఇప్పటికీ పీటముడే. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామసభలు నిర్వహించగా, 2.59 లక్షల ఫిర్యాదులొచ్చాయి. వాటికి పరిష్కారం మాత్రం దొరకలేదు. జాయింట్ ఎల్‌పీఎం, భూమి విస్తీర్ణం తగ్గిందన్న ఫిర్యాదులపై అధికారులు స్పందించడానికి ఏళ్లు పడుతోంది. పశ్చిమగోదావరి జిల్లా చినమామిడిపల్లిలో ఏకంగా 850 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో గల్లంతైంది. రీసర్వే చేసిన గ్రామాల్లో పంపిణీకి కొత్త పాసుపుస్తకాలు ముద్రించగా, కొన్నిచోట్ల చనిపోయిన రైతుల పేర్లు కూడా ఉన్నాయి. సబ్‌డివిజన్, విస్తీర్ణం, పేర్లలోనూ తప్పులున్నాయి. సొంత పార్టీ నేతల, కార్యకర్తల రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా గత వైకాపా ప్రభుత్వం ఫ్రీహోల్డ్ నిబంధన తెచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 5.75 లక్షల ఎకరాల్లో అక్రమాలు జరిగాయి. కొన్నిచోట్ల రైతుల సొంత భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. వాటికి రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో చిన్న రైతులు క్రయవిక్రయాలకు ఇబ్బంది పడుతున్నారు.

పరిష్కారమంటే ఇదా?

రెవెన్యూలో 48 శాతానికి పైగా ఇబ్బందులకు అందులోని సంక్లిష్ట విధానాలే కారణం. ఎక్కడ అర్జీ ఇచ్చినా, సమస్య ఎక్కడుందో తిరిగి అక్కడికే పంపిస్తున్నారు. అదే అధికారులు మళ్లీ సాకులు చెప్పి ఆ అర్జీలను పక్కన పడేస్తున్నారు. అందుకే ఒకే సమస్యపై మళ్లీమళ్లీ అర్జీలు వస్తున్నాయి. గ్రీవెన్స్ రీఓపెన్ చేయొచ్చంటున్నా, ఫలితం లేదు. 2024 జూన్ నుంచి రాష్ట్రంలో 5.20 లక్షల దరఖాస్తులు రాగా, 90% పరిష్కరించినట్లు చూపిస్తున్నారు. నిజానికి వాటిలో పరిష్కరించినవి 20 శాతానికి మించవు. ఉదాహరణకు, అ, ఆ, ఇతరులు, అన్‌క్లెయిమ్డ్ తదితర పేర్లలో ఒక్కో గ్రామంలో వందల కొద్దీ ఎకరాలున్నాయి. రీసర్వే చేసినా ఇవి కొలిక్కి రాలేదు. పట్టాదారు పాసుపుస్తకాలు, ధ్రువపత్రాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా, మళ్లీ వాటిని తీసుకెళ్లి తహసీల్దారు కార్యాలయంలో ఇచ్చి, వ్యక్తిగతంగా కలిస్తేనే పని జరుగుతుంది.

సిబ్బందిలో సాంకేతిక పరిజ్ఞాన లేమి

గ్రామ, మండల స్థాయిలోని కొందరు రెవెన్యూ సిబ్బందికి సాంకేతికతపై అవగాహన లేదు. కొందరు కార్యదర్శులైతే సంతకం మినహా పత్రాలు రాయలేరు. వీరికి సామర్థ్య పెంపుపై శిక్షణ లేదు. రెవెన్యూలో పనిచేసే వీఆర్వోలు, సర్వేయర్లు.. ఎంపీడీవోల పర్యవేక్షణలోని సచివాలయాల్లో ఉంటున్నారు. దీంతో సమన్వయం లోపిస్తోంది. అర్జీల పరిష్కారంపై ఆర్డీవో, జేసీ, కలెక్టర్ల పర్యవేక్షణ లోపిస్తోంది. ఉన్నతాధికారులు గ్రామాలకు వెళ్లినప్పుడు అర్జీదారుల్ని కలిసి సమస్య ఎక్కడుందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. జిల్లాల పునర్విభజన తర్వాత అధికారుల పరిధి తగ్గింది. వీరు రోజుకు రెండు గ్రామాల్లో పరిశీలించినా, పదేపదే వచ్చే అర్జీలు తగ్గుతాయి. గతంలో జన్మభూమి నిర్వహించినప్పుడు గ్రామసభల్లో ప్రజల ఫిర్యాదులపై యంత్రాంగానికి జవాబుదారీతనం ఉండేది. వాటిని పరిష్కరించకపోతే తదుపరి గ్రామసభలో ప్రశ్నిస్తారన్న ఆలోచనతో వెంటనే స్పందించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

పెచ్చుమీరిన రాజకీయ జోక్యం

ఐదారేళ్లుగా రెవెన్యూలో రాజకీయ జోక్యం పెచ్చుమీరింది. తమకు తెలియకుండా పట్టాదారు పాసుపుస్తకం, మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ కొందరు ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు అధికారులకు ఆదేశాలిస్తున్నారు. అదే అదనుగా అధికారులు భారీగా వసూళ్లకు దిగుతున్నారు. తీవ్ర అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా ప్రజాప్రతినిధులే కాపాడుతున్నారు. కొందరు సబ్‌రిజిస్ట్రార్ల అవినీతికి కూడా నేతల మద్దతు పుష్కలంగా లభిస్తోంది.

రెవెన్యూ మంత్రి రంగంలోకి దిగితేనే

రెవెన్యూలో సమస్యల పరిష్కారంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆర్ఓఆర్, రీసర్వే, ఫ్రీహోల్డ్ తదితర సమస్యలపై క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో మాట్లాడితే వాటి తీవ్రత తెలిసే అవకాశముంది. ఒకే సమస్యపై పదేపదే ఎందుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు? వాటికి పరిష్కారమేంటన్నది యోచించవచ్చు. రెవెన్యూ డివిజన్ల వారీగా సమీక్షించొచ్చు. ఇవేవీ లేకపోవడంతో జిల్లాల్లో యంత్రాంగం మొక్కుబడిగా వ్యవహరిస్తోంది.

ఏఎంసీలకు ఆర్థిక భరోసా కల్పించాలి

- ఛైర్మన్ల పదవీకాలాన్ని మూడేళ్లకు పెంచాలి
- రాష్ట్రస్థాయి సదస్సులో పలు తీర్మానాలకు ఆమోదం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీల(ఏఎంసీ)ను నిర్వీర్యం చేసిందని.. కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించి ఆదుకోవాలని ఏఎంసీ ఛైర్మన్లు కోరారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో అమలైన విధానాలను పునరుద్ధరించాలన్నారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన విధానాలను రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు వ్యవసాయ మిషన్ వైస్‌ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆదివారం మంగళగిరిలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తెదేపా, జనసేన, భాజపాలకు చెందిన ఏఎంసీ ఛైర్మన్లు ఇందులో పాల్గొన్నారు. పలు తీర్మానాలు ఆమోదించారు. సంఘం అధ్యక్షుడిగా నంద్యాల ఏఎంసీ ఛైర్మన్ జి.హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియమించి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు అధికారాలు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేదని పలువురు ఏఎంసీ ఛైర్మన్లు ఈ సందర్భంగా వాపోయారు. "ఛైర్మన్లకు చెక్‌పవర్ ఇవ్వాలి. పదవీకాలం మూడేళ్లకు పెంచాలి. రాష్ట్రప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను ఏ, బీ కేటగిరీలుగా విభజించింది. ఏఎంసీ ఛైర్మన్లను 'బీ' గ్రేడ్‌గా పరిగణించాలి. తిరుమల శ్రీవారి దర్శనానికి ఏఎంసీ ఛైర్మన్లకు వారానికి కనీసం ఒక సిఫార్సు లేఖ ఇచ్చే అవకాశం ఇవ్వాలి. ఉల్లి, మిర్చి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులను ఆరబెట్టుకోడానికి, నిల్వ చేసుకోవడానికి ప్లాట్‌ఫాంలు, గోదాములు నిర్మించాలి. యార్డుల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు అనుసంధాన రహదారులు, డొంక రోడ్లను అభివృద్ధి చేయాలి" అని ప్రభుత్వాన్ని కోరారు.



సదస్సులో ప్రసంగిస్తున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి. చిత్రంలో నంద్యాల ఏఎంసీ ఛైర్మన్ జి.హరిబాబు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి తదితరులు

- జగన్ నిర్వీర్యం చేసిన వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరించడానికి, రైతులకు మేలు చేసేందుకు సీఎం చంద్రబాబు పంచసూత్రాలను ప్రవేశపెట్టారని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ అనేది పదవి కాదని.. బాధ్యతని గుర్తుచేశారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతుల్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

శ్రీసత్యసాయి జిల్లాలో ఆలయ ఈవో చేతివాటం

- వెండి ఆభరణాలు, చీరలు ఎత్తుకెళ్తూ పట్టుబడిన వైనం
- అరెస్టు చేసిన పోలీసులు



తీసుకెళుతున్న వెండివస్తువులు ఇవే..



ఈవో మురళీకృష్ణ

కదిరి గ్రామీణం, కదిరి పట్టణం, న్యూస్‌టుడే: అమ్మవారి వెండి ఆభరణాలు, ఖరీదైన చీరలను ఆలయ ఈవోనే చోరీ చేస్తూ పట్టుబడిన ఉదంతమిది. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. యర్రదొడ్డిలోని గంగమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు వెండి ఆభరణాలు, ఖరీదైన చీరలను సమర్పించారు. వీటిపై కన్నేసిన ఆలయ కార్యనిర్వహణాధికారి(ఈవో) మురళీకృష్ణ ఆదివారం భార్యతో కలిసి గుడికి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుంటున్నట్లు ఈవో నటించారు. అప్పటికే తన కార్యాలయంలో సుమారు 5 కిలోల వెండి ఆభరణాలు ఓ సంచిలో సిద్ధం చేసి ఉంచారు. మరో సంచిలో ఖరీదైన చీరలను పెట్టారు. అవి కనిపించకుండా పైన పూలమాలలు ఉంచి ఆటోలో బయలుదేరారు. ఉదయం నుంచి ఈవో కదలికలను గమనిస్తున్న భక్తులు అనుమానంతో ఆటోను అడ్డుకుని కదిరి గ్రామీణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత సంచుల్లో ఉన్న వెండి ఆభరణాలు, చీరలను బయటకు తీశారు. అమ్మవారి ఆభరణాలను కాపాడాల్సిన మీరే వాటిని అపహరిస్తారా అంటూ మురళీకృష్ణను స్థానికులు ప్రశ్నించారు. దానికి ఆయన స్పందిస్తూ.. లాకర్‌లో భద్రపరిచేందుకు వాటిని తీసుకెళ్తున్నట్లు చెప్పగా, స్థానికులు మండిపడ్డారు. ఆదివారం రోజు ఏ లాకర్‌లో పెడతారని నిలదీశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈవోపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వెండి ఆభరణాలు, చీరలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా, ఈవో మురళీకృష్ణ పనితీరు ఆది నుంచి వివాదాస్పదమని తెలిసింది. తాడిపత్రి నియోజకవర్గంలోని ఎ.కొండాపురం గ్రూప్ ఆలయాల్లో గతంలో ఈవోగా పనిచేసినప్పుడు విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

చోరీ ఘటనపై సీఎం ఆగ్రహం

ఈనాడు, అమరావతి: గంగమ్మ గుడిలో ఆలయ ఈవోనే చోరీకి పాల్పడ్డ ఘటనపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవో మురళీకృష్ణను సస్పెండ్ చేయాలని దేవాదాయశాఖ అధికారుల్ని ఆదేశించారు. వెంటనే కేసు నమోదు చేయాలని పోలీసులకు స్పష్టం చేశారు. ఈ మేరకు ఈవోను సస్పెండ్ చేస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్. చిత్రంలో లొంగిపోయిన మావోయిస్టులు జైలాల్, విమల, సీఆర్‌పీఎఫ్ కమాండర్ రోహిత్‌షా

పాడేరు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని దర్బా డివిజన్‌కు చెందిన ఇద్దరు మావోయిస్టులు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ ఎదుట ఆదివారం లొంగిపోయారు. పాడేరులోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఎస్పీ వెల్లడించారు. స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు దిరిదో విజ్జల్ అలియాస్ జైలాల్, అతని భార్య, డివిజనల్ కమిటీ సభ్యురాలు మడివి గంగి అలియాస్ విమల భీమేల లొంగిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో పునరావాస చర్యలు నచ్చి మావోయిస్టులు లొంగిపోతున్నారని ఈ సందర్భంగా ఎస్పీ చెప్పారు. ఈ ఇద్దరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా గగనపల్లి పంచాయతీ బోడెగుబ్బల్ గ్రామానికి చెందినవారన్నారు. విజ్జల్ 1994లో బాలసంఘంలో చేరి.. వివిధ కేడర్లలో పనిచేశాడు. పలు హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నాడు. విమల 20 సంవత్సరాలపాటు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసింది. ఎదురుకాల్పులు, అనేక హింసాత్మక ఘటనల్లో ఆమె పాల్గొన్నట్లు ఎస్పీ బర్దార్ వివరించారు. మావోయిస్టు పార్టీకి పట్టున్న ప్రదేశాల్లో పోలీసుల కూంబింగ్ పెరగడంతోపాటు కొత్త పోలీస్ క్యాంపులు పెట్టడంతో మావోయిస్టులు ప్రాణభయానికి గురవుతున్నారన్నారు. విలేకరుల సమావేశంలో సీఆర్‌పీఎఫ్ కమాండర్ రోహిత్‌షా పాల్గొన్నారు.

మావోయిస్టుల అడ్డాలో.. మొబైల్ టవర్



మొబైల్ టవర్ ఏర్పాటుపై గ్రామంలో సంబరాలు

చర్ల, న్యూస్‌టుడే: మావోయిస్టుల కంచుకోట అయిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపుర్ జిల్లా కొండపల్లి గ్రామంలో తొలిసారిగా మొబైల్ టవర్‌ను ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా బాహ్య ప్రపంచంతో సంబంధం లేని ఈ గ్రామంలో ఇటీవల ఎఫ్ఓబీ(ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్)ను భద్రతా బలగాలు ఏర్పాటు చేశాయి. తాజాగా సమాచార వ్యవస్థ అనుసంధానంలో భాగంగా ఈ మొబైల్ టవర్‌ను ఏర్పాటు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించారు. ఈ కీకారణ్య గ్రామంలో మొబైల్ సేవలు రావడంతో గిరిజనులు నృత్యాలు చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొబైల్ నెట్‌వర్క్ ఏర్పాటు ద్వారా త్వరలో బ్యాంకింగ్ ఇతరత్రా సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. "కొండపల్లిలో మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి రావడం హర్షణీయం. ఇది కేవలం కమ్యూనికేషన్ ప్రారంభం మాత్రమే కాదు.. విశ్వాసం, మార్పు, కొత్త అవకాశాల శకానికి ఆరంభం" అని ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గం



నూతన కమిటీ సభ్యులతో విద్యాసాగర్ తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వ కార్యాలయాల్లోని నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను ప్రభుత్వం భర్తీచేసి, పనిభారం తగ్గించాలని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ఎన్నిక, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ.. నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్జీవో అసోసియేషన్ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. వారికి న్యాయంగా దక్కాల్సిన పదోన్నతులు, వేతన సవరణలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా వి.ఎస్.సాయిరాం (ఎన్టీఆర్ జిల్లా), అధ్యక్షుడిగా ఎన్.చంద్రశేఖర్ (విశాఖ), సహాధ్యక్షుడిగా వి.శ్రీనివాసరావు (విజయనగరం), ఉపాధ్యక్షులుగా సిహెచ్.వీరవెంకయ్య (ఏలూరు), జి.శ్రీనివాసరావు (అనకాపల్లి), జి.నాగేశ్వరరావు (నెల్లూరు), కె.బాబూరావు (మన్యం), కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.బాలరాజు (కృష్ణా), ప్రచారకార్యదర్శిగా జి.గౌరీనాయుడు (పార్వతీపురం), సంయుక్త కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు (గుంటూరు), ఎం.బాలస్వామి (కర్నూలు) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డి.ఎస్.ఎన్.రెడ్డి వెల్లడించారు.

రాసుకుంటే.. లాభం!



ఎప్పుడూ ఉన్న అవసరాలే... కానీ వచ్చిన జీతం నాలుగు రోజుల్లో రూపాయి కూడా మిగలకుండా ఖర్చైపోయింది. ... ఈ వేదన చాలా మందికి ఉంటుంది.

కిరాణా సరకుల పట్టీ మొదలు... బయట చక్కబెట్టాల్సిన పనుల జాబితా వరకు.. భవిష్యత్తు ప్రణాళిక నుంచి.. నెలవారీ ఖర్చుల చిట్టా దాకా... ప్రతిదాన్నీ కాగితంపై పెట్టండి. మీ సమయం, డబ్బు ఎంత ఆదా అవుతుందో చూడండి...

కిరాణా సరకులతో మొదలు

- మనం ఏది కొనాలన్నా ఆ వివరాలు రాసే యండి, అప్పుడు ఏది, ఎంత అవసరమో అంతే కొనుగోలు చేస్తారు.
- ప్రస్తుతం సూపర్ మార్కెట్లు, రకరకాల మార్టులు రావడంతో అన్నీ కళ్ల ముందే కని పించడంతో వాటిని కొనేయాలనిపిస్తుంది.
- దీంతో అనవసర వస్తువులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ఖర్చు తడిసి మోపెడవుతోంది.
- జాబితా తయారు చేయకుండా సరకులు కొనడం వల్ల నిత్యావసరాల ఖర్చు గణనీ యంగా పెరుగుతుంది.

లెక్కలేనితనమే ప్రమాదం...

- ప్రస్తుతం నగదు రహిత లావాదేవీలు నడుస్తున్నాయి. జేబులో నుంచి డబ్బులు తీయాల్సిన అవసరం లేదు.
- దీంతో మంచినీళ్ల ప్రాయంగా డబ్బులు ఖర్చుచేస్తున్నా..ఇంత ఖర్చుచేశామా అన్న భావన ఇసుమంతైనా ఉండడం లేదు. దీంతో ఖర్చు విపరీతంగా పెరుగుతుంది.
- రోజువారీ ఖర్చులన్నీ రాసుకుంటే అప్రమత్త మవుతాం. ఆ రోజులో చేసిన వృథా ఖర్చులు ఏంటో తెలుస్తుంది. మరుసటి రోజు అప్రమత్తం అవుతాం.
- నెల తర్వాత ఖర్చుల చిట్టాపై సమీక్షిస్తే ఎక్కడ వృథా ఖర్చు అవుతోందో తెలుస్తోంది. ఇలా కొన్ని నెలలు చేస్తే ఇంటి బడ్జెట్‌పై పూర్తి పట్టుతో 10శాతం ఖర్చులు తగ్గించే నేర్పు వస్తుంది.

ఫాలోఅప్ రిజిస్టర్ ఉందా



- ఉద్యోగం, వ్యాపారం ఇలా ఏ వృత్తిలో అయిన ఏ పనులు ఎప్పుడు చేయాలో తెలియక వెనకబడిపోతుంటారు.
- తీరా సమయం ముంచుకొచ్చాక ఒత్తిడితో తప్పులు చేసి నష్టాలు చవి చూస్తున్నారు. ఈ సమస్యకు ఫాలోఅప్ రిజిస్టర్ చక్కని పరిష్కారం.
- భవిష్యత్తులో మనం చేయాల్సిన పనులను ఫాలోఅప్ రిజిస్టర్ గుర్తుచేస్తుంది.
- మరో పది రోజుల తర్వాత నెల తర్వాత చేయాల్సిన పనులు అందులో నమోదు చేసుకుంటే సకాలంలో అన్ని పనులూ సకాలంలో మొదలు పెట్టి ప్రణాళికతో పూర్తి చేయొచ్చు.
- పనుల ప్రాధాన్యతపై కూడా స్పష్టత వస్తుంది.

- ఈనాడు, అమరావతి

ఏసీ కాలేజ్ @ 140



వివిధ రంగాల్లో ప్రముఖులెందరినో ప్రపంచానికి అందించింది.. గుంటూరు నగరంలోని ఆంధ్ర క్రైస్తవ(ఏసీ) కళాశాల. మూడు విశ్వవిద్యాలయాలతో ముచ్చటైన అనుబంధం కొనసాగించిన చరిత్ర దీని సొంతం. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల హవా కొనసాగుతున్న ప్రస్తుత రోజుల్లోనూ 2 వేల మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. 1885లో మద్రాసు విశ్వవిద్యాలయం, ఆ తర్వాత ఆంధ్ర, 1976 నుంచి ఆచార్య నాగార్జున వర్సిటీకి అనుబంధంగా కొనసాగుతోంది. వర్సిటీలు మారినా బోధనలో నిత్యనూతనంగా దూసుకెళ్తోంది. మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, కాసు బ్రహ్మానందరెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి ఈ కళాశాలలోనే చదువుకున్నారు. సినీ దర్శకుడు కె.విశ్వనాథ్, నటులు శోభన్‌బాబు, జగ్గయ్య, గుమ్మడి, సాహితీవేత్తలు, కవులు కరుణశ్రీ, జంధ్యాల పాపయ్యశాస్త్రి, గుర్రం జాషువా ఇక్కడి నుంచే వచ్చారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ ఈ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహించారు. 'లాభాపేక్ష లేకుండా విద్యనందిస్తున్నాం. విద్యార్థులకు హాస్టల్ వసతీ ఉంది. 2025-26 విద్యాసంవత్సరంతో కళాశాల 140 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నాం. కళాశాల పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, సమన్వయకర్త ఎమ్మెల్యే ఆనందబాబు ఆధ్వర్యంలో వేడుకలకు ప్రయత్నాలు మొదలు పెట్టాం' అని ప్రిన్సిపల్ కొమ్మాలపాటి మోజెస్ తెలిపారు.

- ఈనాడు, గుంటూరు; న్యూస్‌టుడే, నగరంపాలెం



ఎన్టీఆర్ బీఏ చదువుకున్నప్పటి చిత్రం





1956లో ఏసీ కళాశాలలో బస చేసిన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి ★ 1980లో ఆంధ్రక్రైస్తవ కళాశాలలో నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో మిత్రులతో ప్రముఖ సినీ నటుడు గుమ్మడి

తేనెటీగల్లో మరో 'విష'యం!



తేనెటీగలున్న పెట్టె ముందు అమర్చిన ఎలక్ట్రిక్ పరికరం

తేనెటీగల నుంచి తేనె సేకరించడం తెలిసిందే. కానీ, పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం ఆవరణలోని సమీకృత తేనెటీగల పెంపక కేంద్రంలో వాటి నుంచి విషాన్ని సేకరిస్తున్నారు. బ్యాటరీ ఛార్జింగ్ కలిగిన బీ వీనం కలెక్టర్ (బీవీసీ) అనే ఎలక్ట్రానిక్ పరికరాన్ని తేనెటీగల పెట్టె ప్రవేశద్వారం చెంత అమర్చారు. పెట్టె వద్ద తేనెటీగలు రాకపోకలు సాగించేటప్పుడు అవి బీవీసీ కంపార్టుమెంట్‌పై వాలగానే ఎలక్ట్రిక్ వైబ్రేషన్‌కు గురై వాటికున్న స్టింగ్‌ల ద్వారా విషపూరిత స్రావాన్ని విడుదల చేస్తున్నాయి. ఆ స్రావాలు కంపార్టుమెంటులోని అద్దంపై మైనంలా ఏర్పడుతున్నాయి. వాటిని సేకరించి గాజుసీసాలో భద్రపరుస్తున్నారు. తేనెటీగలు కుట్టినప్పుడు విడుదల చేసే విషపూరిత స్రావాల్లో వివిధ రసాయనాలుంటాయని, వీటిని చర్మ సమస్యలు, అర్థరైటిస్ వంటి చికిత్సల్లో ఉపయోగిస్తారని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఒక గ్రాము విషాన్ని సేకరించడానికి సుమారుగా 10 వేల నుంచి 15 వేల తేనెటీగలను పరికరంలోకి పంపాల్సి ఉంటుందని చెప్పారు.

- ఈనాడు, తాడేపల్లిగూడెం





బీ వీనం కలెక్టర్ సేకరణ ప్రక్రియ ★ సేకరించిన విషం



లెమన్ వైన్ రుచి అదిరెన్!

లెమన్ వైన్ అని పిలిచే ఈ తీగ జాతి మొక్క కాక్టస్ జాతికి చెందినది. దీనికి కాసే పళ్లు కాస్త పుల్లగా, ఉప్పగా నిమ్మకాయ రుచికి దగ్గరగా ఉంటాయి. పక్వానికి వచ్చినప్పుడు పసుపు రంగులోకి మారతాయి. ప్రతి పండు చివర ఆకులు ఉండటం మరో ఆకర్షణ. విజయవాడకు చెందిన కమలాకర్ అనే వ్యక్తి కేరళ నుంచి తెప్పించి ఎంతో జాగ్రత్తగా వీటిని పెంచుతున్నారు.. ఇటువంటి ప్రత్యేకమైన మొక్కల గురించి అందరికీ తెలియాలన్న ఉద్దేశంతో నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రదర్శనలో ఉంచినట్లు ఆయన వివరించారు.

- ఈనాడు, అమరావతి



చెట్టు ఎక్కగలవా.. ఉడతా కాయ కొట్టగలవా?

తెగుళ్ల కంటే ఉడతలతోనే కొబ్బరి పంటకు ఎక్కువ నష్టం కలుగుతుంది. బొండాలు లేతగా ఉన్నప్పుడే ఉడతలు వాటికి కన్నాలు పెట్టి తినేస్తుంటాయి. దీంతో బొండాలు పైకి బాగానే కనిపించినా లోపలంతా డొల్లే ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా పెద్దాపురం మొక్కజొన్న పరిశోధనా కేంద్రంలో కొబ్బరి చెట్లకు స్టీలు తొడుగులు అమర్చారు. ఉడతలు చెట్లపైకి పాకుతూ స్టీలు తొడుగు దగ్గరకు వెళ్లేసరికి జారి పడిపోతున్నాయని, దీంతో పంట నష్టం తగ్గిందని సిబ్బంది వివరించారు.

- ఈనాడు, కాకినాడ

స్పీడూ.. వయసూ ఎనభయ్యే!

మలివయసులో యువకుడిలా బైక్‌పై దూసుకెళ్తున్న ఈ పెద్దాయన్ని చూశారా..! విజయవాడ బందరురోడ్డులో ఆయనలా వెళ్తుంటే స్థానికులు చూసి ఆశ్చర్యపోతున్నారు. 'బాబాయ్.. బండి బాగా నడిపిస్తున్నావ'ంటూ ఆపి మరీ సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈయన పేరు పైడా చలపతిరావు. వయసు 82 ఏళ్లు. ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్నబ్బాయి చనిపోవడంతో అతనికి గుర్తుగా తను వాడిన బైక్‌ను నడిపిస్తున్నారు. ఇప్పటివరకు బీపీ, షుగర్ లేకుండా ఆరోగ్యంగా ఉన్నానని.. చిన్నప్పటి నుంచి గంజి తాగడం, చద్దన్నం తినడం, సమయానికి భోజనం చేయడమే ఇందుకు కారణమని చలపతిరావు చెబుతున్నారు.

- ఈనాడు, అమరావతి



35 ఏళ్లుగా.. కథకు ప్రాణం పోస్తున్నారు

- ఎలాంటి ఫలాపేక్ష లేకుండా చేయడం గొప్ప విషయం
- 'కథ 2024' సంకలనం ఆవిష్కరణలో డాక్టర్ గురవారెడ్డి



సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో 'కథ 2024' పుస్తకావిష్కరణలో సత్యవతి, పాపినేని శివశంకర్, డా.మృణాళిని, వాసిరెడ్డి నవీన్, పి.లక్ష్మణరావు, డా.ఎ.వి.గురవారెడ్డి, ఆర్.ఎమ్.ఉమామహేశ్వరరావు, రమణమూర్తి

ఈనాడు, అమరావతి - కానూరు, న్యూస్‌టుడే: కళలు నేర్చుకుంటే వచ్చేవి కావని.. రచయితలు, కళాకారులు, చిత్రకారులు సృజనశీలురని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన.. 'కథ 2024' సంకలనం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 17 ఉత్తమ కథల సంకలనంగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురవారెడ్డి మాట్లాడుతూ తలచుకుంటే ఎవరైనా వైద్యుడు కావొచ్చని, కళాకారులు మాత్రం కాలేరన్నారు. ''35 ఏళ్లుగా ఎలాంటి ఫలాపేక్ష లేకుండా ఉత్తమ కథా సంకలనాలను అందిస్తుండడం సాధారణ విషయం కాదు. కథకు ప్రాణం పోస్తున్నారు. చిత్తం, విత్తం, బలం, బలగం, సమయం, సందర్భం ఇవన్నీ ఉంటేనే ఇది సాధ్యం. తెలుగు భాష, సాహిత్యమంటే నాకు ఎంతో ఇష్టం. హాస్యం, ఆత్మకథలు ఆసక్తిగా చదువుతాను. నేను చదువుకునే రోజుల్లో.. 'రెండు జడలు.. మూడు ముళ్లు.. నాలుగు కళ్లు..' అనే చమత్కార కథ రాశాను. దానికి అప్పట్లో మొదటి బహుమతి వచ్చింది. ఆ తర్వాతే మరిన్ని రాయాలనే ఆసక్తి నాలో కలిగింది. మాలాంటి వైద్యులు కథలు రాస్తే వైద్య పరిభాషే వస్తుంది'' అని చమత్కరించారు. కథ 2024 సంకలనంలోని తనకు నచ్చిన కథల గురించి డాక్టర్ గురవారెడ్డి వివరించారు.

వైవిధ్యమైన కథలొస్తున్నాయి..

పుస్తక సంకలనం ఆవిష్కర్త కేంద్ర సాహిత్య అకాడమీ ఈసీ మెంబర్ డాక్టర్ మృణాళిని మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా కథ సంకలనం ప్రస్థానం విజయవంతంగా సాగుతుండడం గొప్ప విషయమన్నారు. 'కవిత, కథ, నవల.. ఏదైనా సమగ్రంగా అర్థం చేసుకోవాలి. అంతేకానీ.. వస్తువు వేరు, రూపం వేరంటూ వేరుచేయడం సరికాదు. ప్రస్తుతం కథా రచనలు ఎంతో వైవిధ్యంగా ఉంటున్నాయి. భాష, కథా నిర్మాణం, ప్రారంభం, ముగింపు విషయంలో చాలా శ్రద్ధ పెడుతున్నారు. ఒకప్పటి మాదిరిగా ఒకే మూసలా కాకుండా.. వినూత్నంగా ఉంటున్నాయి. పాత్ర చిత్రణలో సునిశితమైన అవగాహన, వీక్షణం కనిపించడం ఆశాజనకం' అని పేర్కొన్నారు. సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షులు పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. తెలుగులో ఏటా వివిధ పత్రికల్లో మూడువేల కథలు వస్తుండగా, వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి సంకలనంగా తేవడం నిజంగా ఓ యజ్ఞమేనన్నారు. యువతరం నుంచి మరిన్ని మంచి కథలు రావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు.. నృత్య, సంగీతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సిద్ధార్థ అకాడమీ ఇక నుంచి ఈ తరహా సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తుందన్నారు. కథాసాహితి సంపాదకులు వాసిరెడ్డి నవీన్, కథా సంకలనం సంపాదకులు పాపినేని శివశంకర్, రచయిత పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో విరాట్ కోహ్లి





కోహ్లికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈవో ★ కప్ప స్తంభం వద్ద మొక్కుతున్న విరాట్ కోహ్లి

విశాఖపట్నం (సింహాచలం), న్యూస్‌టుడే: భారత క్రికెటర్లు విరాట్ కోహ్లి, వాషింగ్టన్ సుందర్, క్రికెట్ బృందంలోని ఇతర సభ్యులు విశాఖలోని సింహాద్రి అప్పన్నస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. వీరికి డిప్యూటీ ఈవో సింగం రాధ, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం కోహ్లి, సుందర్ తదితరులు కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో వారిని ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు. క్రికెటర్లతో పాటు భారత జట్టు మాజీ మేనేజర్ పి.వెంకట రామ్‌ప్రశాంత్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, ఏసీఏ ప్రతినిధి విష్ణులు కూడా ఆలయాన్ని సందర్శించారు.

సముద్ర సూక్ష్మజీవులపై నెల్లూరులో అధ్యయన కేంద్రం

- ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ ప్రకటన

ఈనాడు, అమరావతి: సముద్రాల్లో నివసించే సూక్ష్మజీవులపై అధ్యయనం చేసేందుకు 'డీప్ సీ మెరైన్ మైక్రోబియల్ రిపాజిటరీ' కేంద్రాన్ని నెల్లూరులో ఏర్పాటుచేస్తున్నట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ తెలిపారు. ఇది దేశంలోనే మొదటి పరిశోధన కేంద్రం అవుతుందని పేర్కొన్నారు. చెన్నైలో ఓ వార్తాసంస్థతో ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం విశిష్టతను వివరించారు. 'సముద్ర సూక్ష్మజీవులు అధిక హైడ్రోస్టాటిక్ పీడనం, తక్కువ ఉష్ణోగ్రత, సూర్యరశ్మి లేకుండా తట్టుకుని జీవించే స్వభావం కలిగి ఉంటాయి. వైద్య, పారిశ్రామిక, పర్యావరణ ప్రాముఖ్యత కలిగిన విస్తృత శ్రేణి మూలక సమ్మేళనాలను అవి ఉత్పత్తి చేస్తాయి. నెల్లూరులో ఏర్పాటుచేసే ఈ కేంద్రంలో శాస్త్రవేత్తలు పారిశ్రామిక, బయోమెడికల్ పరిణామాలకు సంబంధించి సూక్ష్మజీవులపై అధ్యయనం చేస్తారు. సముద్రజలాల నుంచి వేరుచేసిన సూక్ష్మజీవులను నిల్వ చేయడానికి వీలుగా అక్కడ క్రయోఫ్రీజర్లు, అత్యాధునిక పరికరాలు ఉంటాయి. మా అధ్యయన ఫలితాలతో రూపొందించే డాక్యుమెంట్లను పరిశోధకులకు, స్టార్టప్‌లు, వాణిజ్య ఉత్పత్తులు తయారుచేసే వారికి అందిస్తాం' అని బాలాజీ వివరించారు.



ఉల్లిపాయల వ్యాన్ దగ్గర వినియోగదారులు

కిలో రూ.15 అంటే ఖాళీ చేసేశారు..!

పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే: పండించిన ఉల్లికి రేటు తక్కువగా ఉండటంతో దళారుల దగ్గరకు వెళ్లడం ఇష్టం లేక.. ఓ రైతు వినూత్నంగా ఆలోచించారు. నేరుగా జనాల దగ్గరకే ఉల్లిపాయలను ట్రక్కులో తీసుకెళ్లి గంటలోనే అమ్మేశారు. కర్నూలు జిల్లాకు చెందిన చెందిన కరీం అనే రైతు ఉల్లి సాగుచేశారు. అక్కడి మార్కెట్లో దళారులు చెబుతున్న రేటుకు విక్రయిస్తే నష్టాలు తప్పవని గుర్తించారు. తన సొంత వాహనంలో ఒక సహాయకుడిని తీసుకొని డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో తిరుగుతూ నేరుగా వినియోగదారులకే అమ్ముతున్నారు. అలా ఆదివారం ఉదయం ట్రక్కు లోడుతో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు వచ్చారు. ఇక్కడ కిలో ఉల్లి ధర రూ.40 ఉండగా.. కరీం రూ.15కే ఇస్తానని బోర్డు పెట్టారు. వచ్చినవారికి పది కిలోలు రూ.150కి ఇచ్చేశారు. ఒక్కసారిగా వినియోగదారులు గుమిగూడి కొనుగోలు చేయడంతో గంటలోనే బండి ఖాళీ అయింది. దళారులు ఇస్తామన్న దానికన్నా ఎక్కువే దక్కుతోందని కరీం తెలిపారు.

సంబంధం చూపిస్తామంటూ... సొంతం లాగేస్తారు!

- నకిలీ మ్యాట్రిమోనియల్ సైట్లతో బురిడీ

ఈనాడు, హైదరాబాద్: రోజుకో తీరుతో రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్త తరహా మోసాలకు తెరతీశారు. మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ల పేరుతో ముగ్గులోకి దింపి కొల్లగొట్టడంతో పాటు క్యూఆర్ కోడ్ ద్వారా వాట్సప్ ఖాతాలోకి చొరబడి దోచుకుంటున్నారు. కొత్తగా జరుగుతున్న ఈ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ఇండియన్ సైబర్‌క్రైం కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు.

ఆన్‌లైన్లో దొరికే ఫొటోలతో ప్రొఫైల్స్..

వివాహ సంబంధాలు చూసిపెడతామని చెబుతూ దోపిడీ చేస్తున్న మ్యాట్రిమోనియల్ సంస్థల బాగోతం తెలిసిందే. ఇప్పుడు సైబర్ నేరగాళ్లు వివాహ సంబంధాలు చూస్తామంటూ ఏకంగా మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్లు ఏర్పాటు చేస్తున్నారు. యువకులను ఆకర్షించేందుకు యువతుల ప్రొఫైల్స్, యువతుల కోసం యువకుల ప్రొఫైల్స్ సృష్టిస్తున్నారు. ఆన్‌లైన్లో దొరికే ఫొటోలు, వివరాలతో విదేశాల్లోనో, బహుళజాతి సంస్థల్లోనో పనిచేస్తున్నట్లు ఈ ప్రొఫైల్స్‌లో పేర్కొంటున్నారు. వివాహానికి ఆసక్తి చూపే వారితో చాటింగ్ మొదలుపెడతారు. తర్వాత ఫోన్ నంబర్లు తీసుకొని మాట్లాడతారు. నమ్మకం కలిగాక క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అనతికాలంలోనే రూ.కోట్లు గడించవచ్చని తాను కూడా పెట్టానని నమ్మిస్తున్నారు. తటపటాయిస్తే తనది గ్యారంటీ అని, ఎలాగూ పెళ్లి చేసుకుంటున్నందున వచ్చే డబ్బు ఇద్దరికీ ఉపయోగపడుతుందని భావోద్వేగానికి గురిచేస్తుంటారు. పెట్టుబడులు పెట్టాక ముందు కొంత లాభం వచ్చినట్లు చూపిస్తారు. వాటిని డ్రా చేసుకునే అవకాశం మాత్రం ఇవ్వరు. గట్టిగా ప్రశ్నిస్తే అదే క్షణంలో దుకాణం కట్టేస్తారు. ఇలా మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ల ద్వారా వచ్చే ప్రతిపాదనల విషయంలో జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

హైదరాబాద్‌లో.. ట్రంప్ ఎవెన్యూ!

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులకు ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు, దిగ్గజ కంపెనీల పేర్లు పెట్టడానికి రంగం సిద్ధమవుతోంది. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వినూత్న ప్రతిపాదనతో ముందుకు వచ్చారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వద్ద రావిర్యాల నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్‌సిటీని అనుసంధానం చేసే 100 మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు 'రతన్ టాటా' పేరు పెట్టాలని నిర్ణయించారు. అలాగే హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో 'డొనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ' అని నామకరణం చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది.



సీఎం స్టాలిన్ సమక్షంలో ఎంవోయూలు మార్చుకున్న తమిళనాడు ప్రభుత్వ, రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు

తమిళనాడులో రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్

రూ.11,760 కోట్లతో ఏర్పాటుకు ఒప్పందం

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: రిలయన్స్ ఇండస్ట్రీస్ తమిళనాడులో రూ.11,760 కోట్లతో బయో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. మదురైలో ఆదివారం 'టీఎన్ రైజింగ్' పేరిట పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. ఇందులో మొత్తం రూ.36,660.35 కోట్ల పెట్టుబడులతో 56,766 మందికి ఉపాధి కల్పించేలా 91 ఒప్పందాలు జరిగాయి. పరిశ్రమలు, వాణిజ్యశాఖ తరఫున రూ.35,560.15 కోట్లతో 46 అవగాహన ఒప్పందాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ తరఫున రూ.1,100.20 కోట్ల విలువైన 45 ఒప్పందాలు కుదిరాయి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాల్లో బయో ఎనర్జీ ప్లాంటు ఏర్పాటుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది.

డోలాయమానంలో పీజీ మెడికల్ అభ్యర్థులు

- ఫ్రీ ఎగ్జిట్ ఇవ్వని ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్
- రాష్ట్రంలో రేపటితో ముగియనున్న ప్రవేశాల గడువు

విజయవాడ (ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పీజీ మెడికల్ ప్రవేశాలు పొందిన నాన్ సర్వీస్ కేటగిరీ అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ప్రతిభ ఆధారంగా ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్‌లో సీటు సాధించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ పీజీ మెడికల్ మొదటివిడత కౌన్సెలింగ్‌లో సీటు పొందినవారు 123 మంది ఉన్నారు. ఇక్కడ పీజీ మెడికల్ కౌన్సెలింగ్‌లో సీటు సాధించిన వారు ఈ నెల 9లోగా చేరాలని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీచేసింది. మరోవైపు ఆల్ ఇండియా కోటాలో సీటు సాధించి ఫ్రీ ఎగ్జిట్ ఇవ్వని కారణంగా అక్కడా.. ఇక్కడా సీట్లు పొంది కూడా వీరు గాల్లో ఉన్నారు. తమ పిల్లలను ఎక్కడ చదివించాలో తల్లిదండ్రులకు అంతుపట్టడం లేదు. ఆంధ్రలో కౌన్సెలింగ్ ప్రక్రియను ఆలస్యంగా చేపట్టడంతోనే ఈ సమస్య తలెత్తిందని వాపోతున్నారు. ఆల్ ఇండియా కోటాతో సమాంతరంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తే అన్యాయం జరగదని చెబుతున్నారు. దీనిపై విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డిని వివరణ కోరగా, 'ఆల్ ఇండియా కోటాకు సంబంధించి ఫ్రీ ఎగ్జిట్ ఆప్షన్ రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత ప్రకటించే అవకాశముంది. దీంతో ఇక్కడి చేరిక గడువును పెంచవచ్చు. రెండు చోట్లా సీట్లు సాధించిన అభ్యర్థులు ఎక్కడ చేరతారో నిర్ణయం తీసుకున్నాకే విశ్వవిద్యాలయం గడువును పొడిగించనుంది. విద్యార్థులకు నష్టం కలగకుండా చూస్తాం. రాష్ట్ర ప్రభుత్వం ఇన్ సర్వీస్, ఫీజుల జీవోలు ఆలస్యం చేయడంతో కౌన్సెలింగ్ ప్రక్రియను ఆపాల్సి వచ్చింది. ఆల్ ఇండియా కోటాలో సీటు పొందిన వారికి అన్యాయం జరగకుండా చూస్తాం' అని పేర్కొన్నారు.


EENADU Vol: 52, Issue: 118 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

స్పేస్‌ఎక్స్‌లో వాటా విక్రయించడం లేదు
స్పష్టం చేసిన ఎలాన్ మస్క్

రాకెట్, శాటిలైట్ తయారీ సంస్థ స్పేస్‌ఎక్స్ నిధులు సమీకరించడం లేదని కంపెనీ సీఈఓ ఎలాన్ మస్క్ స్పష్టం చేశారు. 800 బి.డాలర్ల (రూ.72 లక్షల కోట్లు) విలువ ప్రకారం స్పేస్‌ఎక్స్ వాటాలు విక్రయిస్తోందన్న వార్తలను ఖండించారు. స్పేస్‌ఎక్స్ వద్ద చాలా ఏళ్లుగా సానుకూల నగదు నిల్వలు ఉన్నాయని 'ఎక్స్' పోస్టులో తెలిపారు. ఉద్యోగులు, పెట్టుబడిదార్లకు నగదు లభ్యత పెంచేందుకు ఏడాదిలో రెండు సార్లు షేర్ల బైబ్యాక్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 800 బి.డాలర్ల విలువను సాధిస్తే, అమెరికాలో అత్యంత విలువైన ప్రైవేట్ కంపెనీగా స్పేస్‌ఎక్స్ నిలిచి, ఓపెన్‌ఏఐను వెనక్కి నెట్టనుంది. మదుపర్లు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న స్పేస్‌ఎక్స్ ఐపీఓ, వచ్చే ఏడాది రావొచ్చని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి.




విద్యుత్ పంపిణీ రంగంలో ఏఐ, ఎంఎల్ యాప్‌లు కీలకం
కేంద్ర మంత్రి మనోహర్ లాల్



దిల్లీ: వినియోగదారు-కేంద్రీకృత, తెలివైన, స్వీయ ఆప్టిమైజింగ్ పంపిణీ నెట్‌వర్క్‌లను నిర్మించడంలో కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) ఆధారిత అప్లికేషన్లు కీలక పాత్ర పోషించనున్నాయని కేంద్ర విద్యుత్ మంత్రి మనోహర్‌లాల్ ఆదివారం వెల్లడించారు. విద్యుత్ పంపిణీ రంగంలో ఏఐ/ఎంఎల్ సాంకేతికతల వినియోగంపై రెండు రోజుల సమావేశంలో మంత్రి ప్రసంగించారు. ఏఐ/ఎంఎల్ ఆధారిత పరిష్కారాలు, స్మార్ట్ మీటర్ అనలిటిక్స్, డిజిటల్ ట్విన్స్, ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్, దొంగతనం గుర్తించే మేధ, ఉపకరణాల స్థాయి వినియోగదారు ఇన్‌సైట్స్, ఆటోమేటెడ్ అవుటేజ్ ప్రిడిక్షన్, జెన్‌ఏఐ ఆధారిత నిర్ణయ మద్దతు వంటివి.. వినియోగదారు అనుభవాన్ని, కార్యాచరణ సామర్థ్యాన్ని మార్చగలవని పేర్కొన్నారు. ఈ జాతీయ సమావేశంలో పరిశ్రమలు, రాష్ట్రాలు, ఆవిష్కర్తలు, విద్యావేత్తలు, సాంకేతిక భాగస్వాములు చురుగ్గా పాల్గొనడాన్ని మంత్రి ప్రశంసించారు. పంపిణీ సంస్థలు (డిస్కంలు), అడ్వాన్స్‌డ్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీస్ ప్రొవైడర్లు (ఏఎంఐఎస్‌పీలు), టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్లు (టీఎస్‌పీలు), హోమ్ ఆటోమేషన్ సొల్యూషన్ ప్రొవైడర్లు (హెచ్‌ఏఎస్‌పీలు) అందించిన ఏఐ/ఎంఎల్ పరిష్కారాలనుఆయన అభినందించారు. స్మార్ట్, విశ్వసనీయ, వినియోగదార్ల కేంద్రీకృత పంపిణీ వ్యవస్థల వైపు మారడానికి అన్ని డిస్కంలు వినియోగదార్లతో కలిసి పని చేయాలని మంత్రి కోరారు. వారిని ఇందులో చురుగ్గా నిమగ్నం చేయాలని తెలిపారు.

రూ.9 లక్షల కోట్లకు ఎస్‌బీఐ గృహ రుణాలు
బ్యాంక్ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి



ఈ ఏడాది నవంబరులో తమ తనఖా (గృహ) రుణాల విలువ రూ.9 లక్షల కోట్లను అధిగమించినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. రిటెయిల్, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈ (ఆర్‌ఏఎం) విభాగంలో జోరుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రుణాల వృద్ధి 14 శాతానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం రుణాల్లో ఆర్‌ఏఎం వాటా 67% కాగా, సెప్టెంబరులో ఇవి రూ.25 లక్షల కోట్ల మైలురాయిని మించాయి. 'దేశ ఆర్థిక వృద్ధి మెరుగుపడటంతో, 2025-26కు రుణాల వృద్ధి లక్ష్యాన్ని 12% నుంచి 14 శాతానికి పెంచాం. ఆర్‌ఏఎం విభాగం చూస్తే.. ఎంఎస్‌ఎంఈ విభాగం 17-18%, వ్యవసాయం, రిటెయిల్ విభాగాలు దాదాపు 14% చొప్పున వృద్ధి సాధిస్తున్నాయి' అని శెట్టి వెల్లడించారు. పసిడి తనఖా రుణాల్లో బ్యాంక్ మంచి వృద్ధి సాధిస్తోందని, వ్యక్తిగత రుణాలు కూడా రెండంకెల వృద్ధి నమోదు చేయొచ్చని అన్నారు. కార్పొరేట్ రుణాలు కూడా దిగువ రెండంకెల వృద్ధిని సాధించొచ్చని తెలిపారు. దీంతో మొత్తంగా రుణాల వృద్ధి 12-14% సాధ్యమేనని ధీమా వ్యక్తం చేశారు. ఆర్‌బీఐ తాజాగా రెపో రేటులో 0.25% కోత విధించినా.. 3% నికర వడ్డీ మార్జిన్ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు.

బాక్సైట్ తవ్వకాలు 2026లో ప్రారంభిస్తాం
నాల్కో సీఎండీ బ్రిజేంద్ర



దిల్లీ: బాక్సైట్ తవ్వకాలను వచ్చే జూన్ కల్లా ప్రారంభిస్తామని నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. ప్రధానమైన అల్యూమినియం వ్యాపారంతో పాటు ఒడిశాలోని పొట్టింగి బాక్సైట్ గనుల ద్వారా వ్యాపార విస్తరణ చేస్తామని వివరించారు. ఈ గనుల అభివృద్ధి, కార్యకలాపాల నిర్వహణ కోసం నిర్వహించిన బిడ్డింగ్‌లో దిలీప్ బిల్డ్‌కాన్ దక్కించుకుందన్నారు.

- ఒడిశా (కోరాపుట్ జిల్లా)లోని దామన్జోడి అల్యూమినా రిఫైనరీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతామన్నారు. దీని సామర్థ్యాన్ని ప్రస్తుత 22.75 లక్షల టన్నుల నుంచి మరో 10 లక్షల టన్నులకు పెంచాలన్నది తమ లక్ష్యంగా వివరించారు. ముడి పదార్థాల కోసం ఒడిశా ప్రభుత్వం నుంచి 697.979 హెక్టార్ల ప్రాంతాన్ని 50 సంవత్సరాలకు నాల్కో లీజుకు తీసుకుందని వెల్లడించారు.

రుణ రేట్లు తగ్గించిన పీఎన్‌బీ, బీఓఎం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన సమీక్షలో రెపో రేటును 0.25% తగ్గించిన నేపథ్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) రెపో అనుసంధానిత రుణ రేట్లు (ఆర్ఎల్ఎల్ఆర్) తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి.

- పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్‌ను 8.35% నుంచి 8.10 శాతానికి తగ్గిస్తున్నట్లు, ఈనెల 6 నుంచే అమల్లోకి వచ్చినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. నిధుల వ్యయం ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను మార్చలేదని పేర్కొంది.
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కూడా రెపో అనుసంధానిత రిటెయిల్ (గృహ, కారు, విద్య, ఇతర) రుణాలపై వడ్డీ రేటును 0.25% తగ్గిస్తున్నట్లు తెలిపింది. గృహ రుణ రేట్లు 7.10% నుంచి, కారు రుణ రేట్లు 7.45% నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది.

తమిళనాడులో హెచ్‌డీ హ్యుందాయ్ షిప్‌యార్డ్

దక్షిణ కొరియా షిప్ బిల్డింగ్ సంస్థ హెచ్‌డీ హ్యుందాయ్, మనదేశంలో తమ తొలి షిప్‌యార్డ్‌ను తమిళనాడులోని తూత్తుకుడిలో స్థాపించనుంది. ఇందుకు సంబంధించిన అవగాహనా ఒప్పందాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో కంపెనీ ప్రతినిధులు చేసుకున్నారు. షిప్‌యార్డ్ ఏర్పాటుకు పెట్టుబడి ఎంతో తెలియాల్సి ఉంది.

900 మంది పైలట్లు సమకూరుతారా!

- డీజీసీఏ నిబంధనల అమలుకు
- సత్వర నియామకాలపై దృష్టి



దేశీయ విమాన ప్రయాణికుల విపణిలో 63% వాటా కలిగిన అగ్రగామి విమానయాన సంస్థ ఇండిగో.. పౌర విమానయాన తాజా నిబంధనల అమలులో విఫలమై, భారీ సంక్షోభాన్ని చవిచూస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) 2024 జనవరిలో ఇచ్చిన నూతన ఆదేశాలు ఈ ఏడాది నవంబరు నుంచి అమలు చేయాలని తెలిసినా.. అందుకు తగినట్లుగా క్రూ సిబ్బంది, పైలట్లను నియమించుకోనందున.. రోజూ వందల సంఖ్యలో సర్వీసులు రద్దు చేస్తూ, నిత్యం వేల మంది ప్రయాణికులు నరకయాతన పడేందుకు కారణమవుతోంది. శీతాకాల రద్దీని దృష్టిలో పెట్టుకుని, నూతన నిబంధనల అమలును డీజీసీఏ వాయిదా వేయడంతో, ఆదివారం నుంచి సర్వీసుల స్థితి కొద్దిగా మెరుగవుతోంది. అయితే ఫిబ్రవరి 10 నుంచి పైలట్లు, క్రూ సిబ్బందికి నూతన నిబంధనలు అమలు చేయాల్సి ఉన్నందున.. భారీగా పైలట్లను నియమించుకోవడంపై కంపెనీ దృష్టి పెట్టింది. 2026 ఫిబ్రవరి 10కి 158 మందిని, 2026 డిసెంబరు కల్లా మరో 742 మంది (మొత్తం 900 మంది) పైలట్లను నియమించుకుంటామని ఇండిగో ప్రభుత్వానికి హామీ ఇచ్చిందని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. వచ్చే 12 నెలల్లో 300 మంది కెప్టెన్లు, 600 మంది జూనియర్ ఫస్ట్ అధికారులను నియమించుకుంటామని డీజీసీఏకు సంస్థ హామీ ఇచ్చింది. ప్రస్తుతం సంస్థ వద్ద 400కు పైగా విమానాలుండగా, కొత్తగా మరిన్ని జతచేరనుండటం.. రాత్రిపూట సర్వీసులను సంస్థ అధికంగా నిర్వహిస్తుండటం వల్లే, ఇంత భారీగా పైలట్లు కావాల్సి వస్తోంది.

డీజీసీఏకు ఇండిగో ఏం చెప్పిందంటే..

- ప్రస్తుతం ఇండిగో 250 మంది జూనియర్ ఫస్ట్ అధికార్లకు శిక్షణ ఇస్తోంది. మధ్యకాల వ్యవధిలో అవసరాల కోసం 300 మంది కెప్టెన్లు, 600 మంది ఫస్ట్ అధికారులను నియమించుకోవడం లేదా అప్‌గ్రేడ్ చేసే యోచనలో ఉంది.
- ఇండిగో ఎయిర్‌బస్ విమానాలనే ఇప్పటివరకు నిర్వహిస్తోంది. వీటికోసం కంపెనీ వద్ద 2,357 మంది కెప్టెన్లు, 2,194 మంది ఫస్ట్ అధికారులు ఉన్నారు. ఈ నెలాఖరుకు 25 మంది కెప్టెన్లు, 35 మంది ఫస్ట్ అధికారులను నియమించుకోనుంది.
- 2026 జనవరిలో 28 మంది కెప్టెన్లు, 35 మంది ఫస్ట్ అధికారులు, 2026 ఫిబ్రవరి 10కల్లా మరో 15 మంది కెప్టెన్లు, 20 మంది ఫస్ట్ అధికారులను తీసుకోనుంది. దీంతో డీజీసీఏ గడువు తేదీకి కంపెనీ ఆధ్వర్యంలో 2,425 మంది కెప్టెన్లు, 2,284 మంది ఫస్ట్ అధికారులు ఉంటారు.
- 2024-25 వార్షిక నివేదిక ప్రకారం.. ఇండిగోకు కెప్టెన్లు, ఫస్ట్ అధికారులతో కలిపి 5456 మంది పైలట్లు ఉన్నారు.

నియామక సవాళ్లు తప్పవా?

గడువులోగా పైలట్లను నియమించుకోవడం ఇండిగోకు కష్టమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒక సంస్థ నుంచి మారాలంటే కెప్టెన్ 12 నెలలు, కో-పైలట్ 6 నెలల ముందుగా నోటీసు ఇవ్వాలి అందువల్ల సత్వరం ఇతర కంపెనీల నుంచీ పైలట్లను భారీగా చేర్చుకోవడం ఇండిగోకు కష్టమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఫిబ్రవరి గడువు ఎందుకు ముఖ్యమంటే..

విమాన సిబ్బంది అలసిపోకుండా చూసేందుకు, వారి పనివేళలకు సంబంధించి డీజీసీఏ విధించిన నిబంధనలు నవంబరు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం వారంలో 2 రోజులు మాత్రమే పైలట్లు రాత్రి సమయం (రాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య)లో ల్యాండింగ్ చేయాలి. వరుసగా రెండు రాత్రిళ్లు పనిచేస్తే, తర్వాత రోజు విశ్రాంతి తప్పనిసరి. ఈ నిబంధనను విమానయాన సంస్థలన్నీ అమలు చేయాల్సిందే. మిగిలిన కంపెనీల రాత్రి విమాన సర్వీసులు తక్కువ కావడంతో పాటు.. నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది నియామకాలు జరపడంతో ఇబ్బందులు ఎదుర్కోవడం లేదు. సర్వీసులు ఎక్కువ కావడంతో పాటు, రాత్రి ల్యాండింగులు అధికం కనుకే ఇండిగోకు ఇబ్బందులు తలెత్తాయి.

విదేశీ పైలట్లు రావాలన్నా కనీసం 3 నెలల సమయం

విదేశీ పైలట్లను నియమించుకోవాలంటే కనీసం 3 నెలల సమయం అవసరమని విమానయాన నిపుణుడు మార్క్ మార్టిన్ అభిప్రాయపడ్డారు.

- *ప్రస్తుతం ఎయిర్‌బస్ ఏ320, ఏటీఆర్ విమానాలతో పాటు టర్కిష్ ఎయిర్‌లైన్స్ నుంచి వెట్ లీజుకు తీసుకున్న బోయింగ్ విమానంతో పాటు సరకు రవాణా చేసేందుకు వినియోగించేవి కలిపి మొత్తం 417 విమానాలు ఇండిగో వద్ద ఉన్నాయి. ప్రాట్ అండ్ విట్నీతో ఇంజిన్ సమస్యల కారణంగా దాదాపు 40 ఏ320 విమానాలు నిలిచిపోయాయి. దీంతో కార్యకలాపాలు సాగిస్తున్న ఏ320 విమానాల సంఖ్య 325కు తగ్గింది. ఒక్కో విమానాన్ని ప్రస్తుతం రోజుకు సగటున 14 గంటలు నడుపుతున్నారు. పరిశ్రమ సగటు 8.5 గంటల కంటే ఇది చాలా అధికం.*
- *ఒక విమానానికి పైలట్, కోపైలట్‌తో కలిపి సగటున 14 సెట్ల సిబ్బంది ఉంటారు. ఇండిగో వినియోగం ప్రకారం కనీసం 17 సెట్లు అవసరం ఉంటుంది.*
- *ఈ లెక్క ప్రకారం.. ఇండిగోకు 5,525 మంది సిబ్బంది అవసరం. డీజీసీఏ ప్రకారం డిసెంబరు కోసం సంస్థ వద్ద 4,551 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. అంటే 974 మంది తక్కువ.*
- *ఇండిగో ప్రతి విమానాన్ని 2.5 మంది పైలట్లతో నిర్వహిస్తోంది. ఎయిరిండియా (5.4 మంది), ఆకాశ ఎయిర్ (5.4 మంది)తో పోలిస్తే ఇది చాలా తక్కువ.*

యూబీఎస్‌లో 10,000 ఉద్యోగాల కోత!

స్విస్ బ్యాంక్ యూబీఎస్, 2027 కల్లా 9 శాతానికి సమానమైన 10,000 మంది ఉద్యోగులను తగ్గించుకోవచ్చని ఒక వార్తా సంస్థ తెలిపింది. 2023లో క్రెడిట్ సూయిస్‌ను కొనుగోలు చేశాక, కార్యకలాపాల ఖర్చులు తగ్గించుకునేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. స్వచ్ఛంద పదవీ విరమణ, సిబ్బంది వలసల రూపేణ.. సిబ్బంది తగ్గింపు చర్యలుంటాయని చెబుతున్నారు. ఖాళీ అయిన పోస్టుల్లో కొత్త నియామకాలు జరపక.. ఉన్న సిబ్బందితోనే సర్దుబాటు చేస్తారని సమాచారం. స్విట్జర్లాండ్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన కార్యాలయాల్లో ఉద్యోగ కోతను వీలైనంత తక్కువగా ఉంచేందుకు చూస్తున్నట్లు సంస్థ తెలిపింది. 2024 చివరికి సంస్థ ఉద్యోగుల సంఖ్య 1,10,000గా ఉండేది.

వేక్‌ఫిట్‌లోకి రూ.186 కోట్ల పెట్టుబడులు

ఐపీఓకు ముందే సెకండరీ మార్కెట్ లావాదేవీల ద్వారా వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్‌లోకి రూ.186 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. స్టెడ్‌వ్యూ రూ.101 కోట్లు, వైట్ఓక్ రూ.72 కోట్లు, క్యాపిటల్ 2బి రూ.13 కోట్లు పెట్టుబడి పెట్టాయి. ఒక్కో షేరు రూ.195 చొప్పున మొత్తం 95.57 లక్షల షేర్లను ఈ సంస్థలు కొనుగోలు చేశాయని వేక్‌ఫిట్ ప్రకటించింది. పీక్15 పార్ట్‌నర్స్, రెడ్‌వుడ్ ట్రస్ట్, వెర్లిన్వెస్ట్ ఎస్ఏ సంస్థల నుంచి ఈ నెల 3, 4 తేదీల్లో ఆయా కంపెనీలు ఈ షేర్లు కొనుగోలు చేశాయి. ఈనెల 5న యాంకర్ మదుపర్లయిన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్, ప్రుడెన్షియల్ హాంకాంగ్, 360 వన్, స్టెడ్‌వ్యూ క్యాపిటల్, అమండీ ఫండ్స్ న్యూ సిల్క్ రోడ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్‌ల నుంచి మరో రూ.580 కోట్లను వేక్‌ఫిట్ సమీకరించింది. ఐపీఓలో రూ.377.18 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు, ఓఎఫ్ఎస్‌లో రూ.912 కోట్ల విలువైన 4,67,54,405 షేర్లను విక్రయించనుంది. దీంతో మొత్తం ఇష్యూ పరిమాణం రూ.1,289 కోట్లు అవుతుంది.

ఓఎఫ్ఎస్‌లో ప్రమోటర్లు అంకిత్ గార్గ్, చైతన్య రామలింగేగౌడతో పాటు వాటాదార్లు నికితా గోయల్, పీక్15 పార్ట్‌నర్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ 6, రెడ్‌వుడ్ ట్రస్ట్, వెర్లిన్వెస్ట్ ఎస్ఏ, సాయి గ్లోబల్ ఇండియా ఫండ్, పారామార్క్ కేబీ ఫండ్ షేర్లను విక్రయించనున్నాయి. వాటా విక్రయ అనంతరం ప్రమోటర్ల వాటా ప్రస్తుత 43.70% నుంచి 37 శాతానికి తగ్గనుంది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ధరల శ్రేణి రూ.2,061–2,165

ఐసీఐసీఐ బ్యాంక్ అనుబంధ సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 12-16 తేదీల్లో ఉండనుంది. రూ.1 ముఖవిలువ కలిగిన షేరుకు ధరల శ్రేణిని రూ.2,061-2,165గా నిర్ణయించింది. రిటెయిల్ మదుపర్లు కనీసం 6 షేర్లకు దరఖాస్తు చేయాలి.

ఐపీఓ కోసం ఏస్‌వెక్టార్ దరఖాస్తు

సాఫ్ట్ బ్యాంక్ పెట్టుబడులున్న డిజిటల్-కామర్స్ ఎకోసిస్టమ్ ఏస్‌వెక్టార్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రావడానికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. రూ.300 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో 6.38 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదార్లు విక్రయించనున్నారు. ప్రమోటర్ స్టార్‌ఫిష్‌తో పాటు ఇతర వాటాదార్లు నెక్సస్, వండర్‌ఫుల్ స్టార్, కెన్నెత్ స్టార్ట్ గ్లాస్, జాసన్ అశోక్ కొఠారి, ప్రియాంకా శ్రీవార్ ఖైరుకా, రూపెన్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇండస్ట్రీస్, సెంటారస్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థలు ఓఎఫ్ఎస్‌లో భాగంగా షేర్లు విక్రయించనున్నాయి. ఏస్‌వెక్టార్ ప్రమోటర్లు, వ్యవస్థాపకులైన కునాల్ భల్, రోహిత్ బన్సల్‌కు కంపెనీలో 34.63% వాటా ఉన్నా, ఓఎఫ్ఎస్‌లో వారు పాల్గొనడం లేదు.


కోడి గుడ్లు
8న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	651	తూ/ప గోదావరి	650
వరంగల్	653	విశాఖపట్నం	640
విజయవాడ	670	చిత్తూరు	663

పసిడిలో లాభాల స్వీకరణ!


కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టులో ఈవారం అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటుచేసుకునే అవకాశం ఉంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం ఉండటం, ఇప్పటికే పసిడి మోతాదుకు మించి పెరగడం ఇందుకు కారణాలుగా చెప్పొచ్చు. సానుకూల ధోరణిలో చలిస్తే రూ.1,31,667 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,32,872; రూ.1,34,206 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ కిందకు వస్తే రూ.1,29,128 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,27,794; రూ.1,26,589 వరకు దిగిరావచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు రూ.1,80,001 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే.. సానుకూల ధోరణి కొనసాగొచ్చు. అందువల్ల ఈ స్థాయికి ఎగువన షార్ట్ సెల్ పొజిషన్లకు దూరంగా ఉండటం మేలు.

ప్రాథమిక లోహాలు



- రాగి డిసెంబరు కాంట్రాక్టు రూ.1,076 దిగువన ట్రేడ్ కాకుంటే.. కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. అయితే రూ.1,114.05 వద్ద నిరోధం ఎదురు కావచ్చు.
- సీసం డిసెంబరు కాంట్రాక్టు రూ.183.80 కంటే ఎగువన ట్రేడయితే రూ.184.55; రూ.185.75 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.181.75 కంటే కిందకు వస్తే రూ.180.55; రూ.179.75 వరకు దిగిరావచ్చు.
- జింక్ డిసెంబరు కాంట్రాక్టు రూ.314.60 కంటే ఎగువన ట్రేడ్ కాకుంటే, షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు.
- అల్యూమినియం డిసెంబరు కాంట్రాక్టు రూ.275.20 కంటే దిగువన చలించకుంటే.. రూ.281.65; రూ.284.65 వరకు పెరగొచ్చు.

ఇంధన రంగం



- ముడి చమురు డిసెంబరు కాంట్రాక్టు రూ.5,307 కంటే కిందకు వస్తే రూ.5,187; రూ.5,116 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.5,498 కంటే పైకి వెళితే రూ.5,569; రూ.5,689 వరకు పెరగొచ్చు.
- సహజవాయువు డిసెంబరు కాంట్రాక్టు రూ.444.70 కంటే కిందకు వస్తే రూ.401.40; రూ.376.30 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.513.10 కంటే పైకి వెళితే రూ.538.20; రూ.581.30 వరకు పెరగొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు డిసెంబరు కాంట్రాక్టు రూ.13,842 వరకు దిద్దుబాటు కావచ్చు. రూ.14,823 కంటే పైకి వెళ్తేనే రూ.15,234; రూ.15,521 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.
- జీలకర్ర డిసెంబరు కాంట్రాక్టుకు రూ.22,146 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, రూ.21,076 లక్ష్యంతో షార్ట్ సెల్ పొజిషన్లను అట్టేపెట్టుకోవడం మంచి వ్యూహమే.

– *ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్*

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/క్షీణత
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఫిబ్రవరి)	1,29,999	1,30,462	0.36
వెండి (మార్చి)	1,77,858	1,83,408	3.12
రాగి (డిసెంబరు)	1,038	1,093.35	5.33
సీసం (డిసెంబరు)	181.75	182.85	0.61
జింక్ (డిసెంబరు)	303.30	310.60	2.41
అల్యూమినియం (డిసెంబరు)	274.70	279.80	1.57
ముడి చమురు (డిసెంబరు)	5,366	5,427	1.14
సహజ వాయువు (డిసెంబరు)	431.90	488	12.99
పసుపు (డిసెంబరు)	14,900	14,412	-3.28
జీలకర్ర (నవంబరు)	22,470	21,450	-4.54

ఒక శ్రేణిలోనే కదలికలు

స్టాక్ మార్కెట్ ఈ వారం

- అమెరికా వడ్డీరేట్ల నిర్ణయం కోసం ఎదురుచూపులు
- టెలికాం, వాహన షేర్లపై సానుకూలతలు
- విశ్లేషకుల అంచనాలు

దేశీయ స్టాక్ మార్కెట్ల కీలక సూచీలు ఈవారం చాలా తక్కువ శ్రేణికి లోబడి కదలాడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈనెల 9-10 తేదీల్లో జరిగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ పరపతి విధాన సమావేశ నిర్ణయాలపై మదుపర్లు దృష్టి సారిస్తారు. విదేశీ మదుపర్ల ధోరణీ కీలకం కానుంది. ఈనెల తొలివారంలోనే విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు నికరంగా రూ.11,820 కోట్ల విక్రయాలు జరపగా, దేశీయ సంస్థాగత మదుపర్లు రూ.19,783 కోట్ల కొనుగోళ్లు జరపడం గమనార్హం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును తగ్గించడం, ఆశావహంగా ఉన్నా.. డాలర్ విలువ ఇంకా రూ.90 వద్దే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దేశీయ స్థూల ఆర్థిక పరిస్థితులు బలంగా ఉన్నందున, మార్కెట్లలో నష్టాలు పరిమితంగా ఉండొచ్చని.. సానుకూల ధోరణితో ఊగిసలాటకు అవకాశం ఉండొచ్చని సాంకేతిక నిపుణులు అంటున్నారు. రెపో రేటు కోతతో బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీ, స్థిరాస్తి, వాహన రంగాల కంపెనీల షేర్లు రాణించొచ్చని అంచనా. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు ఇలా..

- ప్రభావిత వార్తలు లేనందున **చమురు** కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణిలోనే కదలాడొచ్చు. రూపాయి క్షీణత వల్ల చమురు ఉత్పత్తిదార్ల మార్జిన్లు మెరుగ్గా ఉండొచ్చు. అయితే చమురు మార్కెటింగ్ కంపెనీలపై ఒత్తిడి పడనుంది.
- **టెలికాం** షేర్లలో ఇటీవలి విక్రయాల వల్ల, ప్రస్తుతం సానుకూలతలు కనిపిస్తున్నాయి. ఏజీఆర్ బకాయిల వార్తలపై దృష్టి పడొచ్చు.
- డిసెంబరు త్రైమాసిక ఆదాయాలు రాణిస్తాయన్న అంచనాల మధ్య **వాహన** షేర్లపై విశ్లేషకులు బుల్లిష్‌గా ఉన్నారు. జీఎస్‌టీ కోత, భారీ రాయితీల ఫలితంగా పెరిగిన విక్రయాలు.. వడ్డీరేట్ల కోతతో మరింత పుంజుకోవచ్చు.
- కీలక రేట్ల కోత, రూ.లక్ష కోట్ల ద్రవ్యలభ్యత నేపథ్యంలో నిఫ్టీ **బ్యాంక్** సూచీ ఈ వారం రాణించొచ్చు. బ్యాంక్ నిఫ్టీ 59,000 పైకి వెళ్తే.. తొలుత 60,200, ఆ తర్వాత 60,500 దాకా ర్యాలీ జరగొచ్చు.
- **ఎఫ్ఎంసీజీ** షేర్లు చాలా తక్కువ శ్రేణిలో ట్రేడవవచ్చు. రెండేళ్లుగా ఈ రంగ సూచీ స్తబ్దుగానే ఉంటోంది. ఎంపిక చేసిన షేర్లు పెరిగినా, ఈ ధోరణి కొనసాగొచ్చు. నిఫ్టీ ఎఫ్ఎంసీజీకి 54,700-54,800 వద్ద మద్దతు ఉంది.
- భారీ **ఔషధ** కంపెనీల షేర్లతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి సంస్థల షేర్లు రాణించొచ్చు. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల అనంతరం, తదుపరి సానుకూలతల కోసం ఈ రంగం వేచిచూస్తోంది. నిఫ్టీ ఫార్మా 22,700-22,500 శ్రేణిలో కదలాడొచ్చు. 23,150 దరిదాపుల్లో నిరోధం ఎదురుకావొచ్చు.
- దేశీయ, అంతర్జాతీయ సానుకూలతల మధ్య **ఐటీ** షేర్లు లాభాలు పొందొచ్చు. ఫెడ్ రేట్ల నిర్ణయం కోసం ఎదురుచూడాలి. వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా అధికారిక బృందం ఈ వారంలో మనదేశానికి రానుండడం, రూపాయి బలహీనతలు ఐటీ షేర్లకు సానుకూలాంశాలు.
- ప్రభుత్వ మూలధన వ్యయాలు మందగించడం, ప్రైవేటు కంపెనీల పెట్టుబడులు పుంజుకోవాల్సి ఉండడంతో **యంత్రపరికరాల** షేర్లపై ప్రభావం పడుతోంది. ఈ వారమూ ఇవి నష్టపోవచ్చు. లాభాలకు పరిమిత అవకాశం ఉంది.
- చాలా వరకు **సిమెంటు** షేర్లు పడొచ్చని కొంత మంది, షార్ట్ పొజిషన్లను కవర్ చేసే అవకాశం ఉందని మరికొంత మంది విశ్లేషకులు అంటున్నారు. సాంకేతికంగా చూస్తే సిమెంటు షేర్లలో ఊగిసలాట లేదా ప్రతికూలతలు కనిపించొచ్చు. 2025-26 ద్వితీయార్ధంలో కంపెనీలు బలమైన పనితీరు కనబరచవచ్చు.
- **లోహ** షేర్లు వరుసగా మూడో వారమూ రాణించొచ్చు. అంతర్జాతీయంగా ప్రాథమిక లోహాలతో పాటు రాగి ధరలు పెరగడం, డాలరు సూచీ బలహీనతలు, లోహాలకు గిరాకీ పెరగడం వంటివి ఇందుకు దోహదం చేయొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	160.86	162.30	158.80
బజాజ్ ఆటో	9,109.00	9,179.30	9,010.30
ఐషర్ మోటార్స్	7,208.00	7,313.00	7,018.00
హీరో మోటోకార్ప్	6,350.50	6,431.50	6,264.50
ఎం అండ్ ఎం	3,717.10	3,772.70	3,614.70
మారుతీ	16,282.00	16,558.70	15,840.70
టీవీఎస్ మోటార్	3,665.40	3,720.30	3,599.30

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5961.00	6060.00	5789.00
కోల్గేట్ పామోలివ్	2164.40	2193.80	2110.80
డాబర్ ఇండియా	510.10	516.20	499.30
ఇమామీ	525.30	539.70	504.10
హిందుస్థాన్ యునిలీవర్	2338.60	2484.40	2213.80
ఐటీసీ	404.95	407.50	400.80
మారికో	736.65	753.90	704.40

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	277.75	283.20	270.40
సీజీ పవర్	661.35	670.10	649.50
ఎల్ అండ్ టీ	4038.20	4093.30	3947.50
సీమెన్స్	3325.90	3420.20	3233.40
థెర్మాక్స్	2845.70	2905.60	2772.20

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1003.30	1018.30	982.70
ఐసీఐసీఐ బ్యాంక్	1392.50	1403.90	1375.30
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	80.87	82.40	78.90
ఇండస్‌ఇండ్ బ్యాంక్	870.10	885.20	848.60
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2154.90	2185.00	2117.00
పీఎన్‌బీ	121.71	123.70	118.20
ఎస్‌బీఐ	971.50	990.40	937.20

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1217.60	1235.10	1200.30
బయోకాన్	392.65	398.70	383.30
సిప్లా	1520.80	1535.20	1506.40
డాక్టర్ రెడ్డీస్	1275.20	1287.70	1265.30
గ్లెన్‌మార్క్ ఫార్మా	1968.20	2002.10	1940.10
నాట్కో ఫార్మా	933.60	953.70	918.20



లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	823.25	845.00	797.20
హిందుస్థాన్ జింక్	498.10	508.20	485.40
ఎన్ఎండీసీ	76.46	77.70	74.20
సెయిల్	132.54	134.70	129.60
టాటా స్టీల్	167.11	169.20	163.90
వేదాంతా	524.50	538.20	510.90


చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1540.60	1560.90	1510.50
బీపీసీఎల్	360.30	366.70	350.10
హెచ్‌పీసీఎల్	450.35	455.80	442.70
ఐఓసీఎల్	163.66	165.10	161.20
ఓఎన్‌జీసీ	241.23	244.10	239.50
ఆయిల్ ఇండియా	411.95	417.00	403.90

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1683.00	1715.00	1635.00
ఇన్ఫోసిస్	1616.20	1647.80	1584.20
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6520.50	6596.80	6389.80
టీసీఎస్	3238.20	3293.30	3194.90
టెక్ మహీంద్రా	1570.80	1596.50	1543.70
విప్రో	259.91	263.00	256.20

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1798.20	1836.00	1776.20
అంబుజా సిమెంట్స్	533.80	540.10	528.70
ఇండియా సిమెంట్స్	416.20	435.90	386.40
శ్రీ సిమెంట్	26075.00	26621.70	25741.70
అల్ట్రాటెక్ సిమెంట్	11597.00	11711.70	11503.70

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,108.80	2125.50	2081.70
ఎంటీఎన్ఎల్	36.47	37.70	35.50
టాటా కమ్యూనికేషన్స్	1837.90	1883.20	1794.40
వొడాఫోన్ ఐడియా	10.80	11.10	10.20

ఈనాడు సినిమా


పవన్ కల్యాణ్

ఉస్తాద్.. స్టెప్పేస్తే భూకంపమే

'ఉస్తాద్ భగత్ సింగ్'గా పవన్ కల్యాణ్ తన స్టెప్పులతో భూకంపం పుట్టిస్తారంటున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. వీళ్లిద్దరి కలయికలో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఆరంభంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే పాటలతో ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా ఈ చిత్ర తొలి పాట ప్రోమోను ఈ నెల 9న విడుదల చేయనున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈమేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. అందులో పవన్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యమందించగా.. విశాల్ దద్లాని ఆలపించారు. పూర్తి పాటను ఈనెల మూడో వారం విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

జోడీ కుదిరింది


రవి తేజ


ప్రియా భవానీ

రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా కోసం కథానాయికగా ప్రియా భవానీ శంకర్‌ను రంగంలోకి దించినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న టాకీ పార్ట్ చిత్రీకరణలో ఆమె పాల్గొంటున్నట్లు తెలిసింది. ఇది అందర్నీ థ్రిల్ చేసే ఓ ఆసక్తికర కథాంశంతో ముస్తాబవుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశముంది. ఇక ప్రస్తుతం రవితేజ నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సంక్రాంతి సందర్భంగా థియేటర్లలోకి రానుంది.

బంధుమిత్రుల అభినందనలు


వెంకటేశ్

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు త్రివిక్రమ్ కలయికలో ఓ చిత్రం రూపొందుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ సినిమా ఈనెలలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. కాగా, ఈ చిత్ర టైటిల్‌ను ఈనెల 13న వెంకటేశ్ పుట్టినరోజు సందర్భంగా ప్రకటించేందుకు చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. వినోదం, యాక్షన్, కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. దీనికి 'బంధు మిత్రుల అభినందనలతో' అనే పేరుతో పాటు మరో రెండు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు నెట్టింట ప్రచారం సాగుతోంది. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

60ఏళ్ల వయసులో మళ్లీ ప్రేమను ఊహించలేదు

ఓటీటీ ఒప్పందాలు బాలీవుడ్ భవిష్యత్తును దెబ్బతీస్తాయని అంటున్నారు అగ్రహీరో ఆమిర్ ఖాన్. వైవిధ్యమైన కథలతో మూడు దశాబ్దాలకు పైగా ప్రేక్షకుల్ని అలరిస్తున్న కథానాయకుడీయన. ఇటీవలే 'సితారే జమీన్ పర్'తో తెరపై సందడి చేశారు. ప్రస్తుతం నిర్మాతగా వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్న ఆమిర్.. అవకాశం వచ్చినప్పుడల్లా తన వ్యక్తిగత విషయాల గురించి కూడా చెప్తూ ఉంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన పెళ్లి, కెరీర్ తొలినాళ్ల గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకున్నారు


ఆమిర్ ఖాన్

"యాదోన్ కీ బారాత్' సినిమాతో నా కెరీర్ ప్రారంభమైంది. 'కయామత్ సే కయామత్ తక్'తో మంచి విజయాన్ని అందుకున్నా. ఇంత పెద్ద హిట్ కొట్టాక కూడా పరిశ్రమలో నా స్థానాన్ని నిలబెట్టుకోవడానికి కష్టపడాల్సి వచ్చింది. ఈ సినిమా తర్వాత చాలానే అవకాశాలు వచ్చాయి. కానీ నేను పనిచేయాలనుకున్న దర్శకుల నుంచి ఆఫర్లు రాలేదు. ఏ దర్శకుడు నన్ను సంప్రదించలేదు. ఒక వ్యక్తిగా, నటుడిగా నేను ఎదిగే కొద్దీ.. మంచి స్క్రిప్ట్, సరైన దర్శకుడు, మంచి నిర్మాతతో పని చేయడం మాత్రమే ముఖ్యమని తెలుసుకున్నా. పని విషయంలో రాజీ పడనని నాకు నేను ప్రమాణం చేసుకున్నా. ఆ రోజుల్లో ఒకేసారి 8నుంచి 9 చిత్రాలకు సంతకం చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ నటుడిగా నా ఎంపికల పట్ల చాలా అసంతృప్తిగా ఉన్నా. సెట్స్ నుంచి సాయంత్రం ఇంటికి వచ్చి ఏడ్చిన రోజులు ఉన్నాయి''.

దీనితో మంచి కన్నా హానే ఎక్కువ

"థియేటర్, ఓటీటీ విడుదలలే ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాటు పే-పర్‌వ్యూ పద్ధతిని కూడా ప్రవేశపెడితే బాగుంటుందని బాలీవుడ్ పరిశ్రమను కోరుతున్నా. దీనికి సినీరంగం నుంచి బలమైన ప్రోత్సాహం అవసరం. నేను ఈ మోడల్‌తో ఇంతకముందు ప్రయోగాలు చేశా. కానీ పరిశ్రమ సమష్టిగా దీన్ని స్వీకరించినట్లయితే నిజమైన ప్రభావం వస్తుంది. ఇది అందరికీ ప్రయోజనం చేకూరుస్తుంది. నిర్మాతలకు సంపాదించడానికి మరో మార్గమిది. ఓటీటీ ఒప్పందాలు కూడా బాలీవుడ్ భవిష్యత్తును దెబ్బతీస్తాయి. హిందీ సినిమాలను ఓటీటీలో విడుదల చేయడం వల్ల వచ్చే మంచి కంటే హానే ఎక్కువ జరుగుతుంది''.

వివాహాలు సఫలం కాకపోయినా..

"నా జీవితం గురించి అందరికి తెలిసే ఉంటుంది. నా మొదటి భార్య రీనా అద్భుతమైన వ్యక్తి. మేము భార్యాభర్తలుగా విడిపోయామే తప్పా.. మనుషులుగా కాదు. కిరణ్‌తో కూడా అంతే. కానీ నా 60ఏళ్ల వయసులో మళ్లీ ప్రేమ దొరుకుతుందని అనుకోలేదు. గౌరీ స్ప్రాట్ మంచి వ్యక్తి. నా జీవితంలోకి ప్రశాంతతను, స్థిరత్వాన్ని తెచ్చింది. ఆమెను కలవడం నా అదృష్టం. నా వివాహాలు సఫలం కాకపోయినా.. రీనా, కిరణ్, ఇప్పుడు గౌరీ... వీళ్లు నా జీవితంలోకి రావడం సంతోషంగా ఉంది. వారు ఒక వ్యక్తిగా నన్ను ప్రభావితం చేశారు. వారిని నేను చాలా విషయాల్లో ఆదర్శంగా తీసుకుంటాను".

లోకేశ్‌తో సినిమా

"ప్రస్తుతం నేను చాలా జాగ్రత్తగా ప్రాజెక్టులను ఎంచుకుంటున్నా. సంవత్సరానికి ఒక సినిమా చేయడమే నా ఉద్దేశ్యం. కానీ అది ఎప్పుడూ జరగలేదు. కథతో కనెక్ట్ అవ్వకపోతే.. సినిమాలో నటించలేను. దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ చిత్రం చేయాల్సి ఉంది. కొన్ని రోజుల క్రితమే దీని గురించి మాట్లాడుకున్నాం. ఆయన ముంబయికి వస్తా అన్నారు. అప్పుడు కథ గురించి మేము చర్చించి.. వివరాలతో పాటు అధికారికంగా ప్రకటిస్తాం".

భాగ్యనగరిలో భారీ పోరాటం


నాని

'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న రెండో చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ప్రారంభించుకుంది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ సెట్‌లో నాని, రాఘవ్‌లతో పాటు కొందరు ఫైటర్లపై పోరాట ఘట్టాన్ని చిత్రీకరిస్తున్నారు. ఇది సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఫైట్లలో ఒకటని.. నెలాఖరు వరకు ఈ షెడ్యూల్ కొనసాగే అవకాశముందని తెలిసింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రంలో.. జడల్ అనే శక్తిమంతమైన రా రస్టిక్ పాత్రలో నాని కనువిందు చేయనున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తున్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో నటి ప్రగతి మెరుపులు

సహాయ నటిగా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో విభిన్న పాత్రలతో మెప్పించారు ప్రగతి. ఇప్పుడామె క్రీడాకారిణిగానూ అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్నారు. తను తాజాగా టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్


ప్రగతి

- 2025లో నాలుగు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని ఆమె సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పోటీల్లో మొత్తంగా సిల్వర్ మెడల్ సాధించగా.. డెడ్ లిఫ్టునకు గోల్డ్ మెడల్, బెంచ్, స్క్వాట్ లిఫ్టింగ్‌నకు మరో రెండు సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం ఈ పోటీకి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. నిత్యామేనన్, రెజీనా తదితర సినీతారలు ఆమెకు అభినందనలు తెలుపుతూ పోస్టులు పెట్టారు. 2023 నుంచి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్న ప్రగతి.. గత రెండేళ్లుగా తెలంగాణ, ఏపీతో పాటు జాతీయ స్థాయిలో వరుస పతకాలు సాధిస్తూ సత్తా చాటారు. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన ఆమె.. కేరళలో జరిగిన నేషనల్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ బంగారు పతకం గెలుచుకున్నారు. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు.

సినిమా విడుదల్ని అడ్డుకోవడం బాధించింది: టీజీ విశ్వప్రసాద్


టీజీ విశ్వప్రసాద్

ఈనెల 5న ప్రేక్షకుల ముందుకు రావాల్సిన బాలకృష్ణ 'అఖండ 2: తాండవం' చిత్రం ఆఖరి క్షణంలో వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితి తననెంతో బాధించిందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఆదివారం సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా 'ది రాజాసాబ్' విడుదలపై వినిపిస్తున్న ఊహాగానాలపైనా ఆ పోస్ట్‌లో స్పష్టత ఇచ్చారు. "చివరి నిమిషాల్లో సినిమా విడుదలకు అంతరాయం కలిగించడం చాలా దురదృష్టకరం. ఇలాంటి చర్యల్ని తీవ్రంగా ఖండించాలి. ఇలా ఓ సినిమా విడుదలను అడ్డుకోవడం వల్ల ఆ ప్రభావం ఆ చిత్ర బృందంతో పాటు బయ్యర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతలు, టెక్నీషియన్స్ ఎంతో మందిపై పడుతుంది. వాళ్ల జీవనోపాధిని దెబ్బతీస్తుంది. ముఖ్యంగా పెద్ద సినిమాలతో పోటీ లేకుండా తమ చిత్రాల్ని సరైన సమయం చూసుకుని విడుదల చేసే చిన్న నిర్మాతలు ఈ అడ్డంకుల వల్ల నిరీక్షించాల్సి రావడం నన్ను తీవ్రంగా కలవరపెట్టింది. థర్డ్ పార్టీ వ్యక్తులు ఆఖరి నిమిషంలో సినిమాలకు అంతరాయం కలిగించకుండా స్పష్టమైన చట్టపరమైన మార్గదర్శకాలు తక్షణమే రూపొందించాల్సిన అవసరముంది. 'ది రాజాసాబ్' విడుదలపై కొన్ని రూమర్స్ వచ్చాయి. ఈ సినిమా కోసం మేము బయట నుంచి తెచ్చిన పెట్టుబడులన్నింటినీ మా అంతర్గత నిధులతో క్లియర్ చేశాం. ఇక మిగిలిన వడ్డీని కూడా త్వరలోనే చెల్లిస్తాం. 'అఖండ 2'తో పాటు డిసెంబరులో విడుదల కానున్న సినిమాలు.. 2026 సంక్రాంతికి రానున్న 'ది రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్‌గారు', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 'అనగనగా ఒక రాజు', 'నారీ నారీ నడుమ మురారి', 'జన నాయగన్', 'పరాశక్తి' తదితర చిత్రాలన్నీ విజయాలందుకోవాలని కోరుకుంటున్నా. సినిమా అంటే కేవలం వ్యాపారం మాత్రమే కాదు. ఇదొక కళ, సంస్కృతి, ఓ భావోద్వేగ ప్రయాణం. దాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత'' అని పేర్కొన్నారు. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'ది రాజాసాబ్' జనవరి 9న రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

నాకు ఎవరితోనూ పోటీ లేదు


కృతి సనన్

మన పనిని పది మంది మెచ్చుకున్నప్పుడు వచ్చే ఎనర్జీనే వేరని అంటోంది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. ఇటీవలే ధనుష్‌తో కలిసి 'తేరే ఇష్క్ మే' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిందీమె. ఇందులో ముక్తి పాత్రలో తనదైన నటనతో మెప్పించింది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి మాట్లాడుతూ.. ''తేరే ఇష్క్ మే' సినిమాకి ప్రశంసలు రావడం ఆనందంగా ఉంది. ఒక నటిగా నాకు ఇంతలా ప్రేమ దక్కుతుందని ఊహించలేదు. కెరీర్‌లో ఒక దశకు చేరుకున్నాక.. మన ప్రతి భేటీలో ప్రేక్షకులకు తెలుసు అనే నమ్మకం కలుగుతుంది. ప్రస్తుతం నేను ఈ దశలోనే ఉన్నాను. ఇక్కడ నేను ఎవరితోనూ పోటీ పడటం లేదు. బాక్సాఫీస్ నంబర్ల కోసం పరుగెత్తడం లేదు. నా పనిని ఆస్వాదిస్తున్నా. వృత్తిలో ఇంకా మెరుగుపడాలనుకుంటున్నా'' అని చెప్పుకొచ్చింది.

బాలన్ ముగించాడు


చిదంబరం

గతేడాది 'మంజుమ్మల్ బాయ్స్' సినిమాతో యువతను విశేషంగా ఆకట్టుకున్నారు మలయాళ దర్శకుడు చిదంబరం. ఈ చిత్రంతో స్నేహ బంధం విలువ తెలిపిన ఆయన మరో కథను తెరపై ఆవిష్కరించడానికి సిద్ధమవుతున్నారు. చిదంబరం దర్శకత్వంలో 'బాలన్:ది బాయ్' అనే సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ కథ అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ విజయవంతంగా పూర్తయినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు దర్శకుడు. త్వరలో నిర్మాణానంతర పనుల్ని ప్రారంభించనున్నారని, వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఈ సినిమా విడుదలయ్యే అవకాశాలున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది.

'మై లవ్' మొదలైంది


సంజోశ్, హర్షిత

సంజోశ్ తగరం హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'మై లవ్'. ఆర్.వి.శ్రీనివాస్ రావు నిర్మాత. హర్షిత కథానాయిక. ఈ సినిమా ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు క్లాప్ కొట్టగా.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ గౌడ్ కెమెరా స్విచ్చాన్ చేసి, గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఈ చిత్ర హీరో, దర్శకుడు సంజోశ్ మాట్లాడుతూ.. ''ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని వినూత్న కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. నేటి యువతకు మంచి సందేశాన్ని అందిస్తుంది. ఇది కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో హర్షిత, శ్రీనివాస్, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాతామనవళ్లుగా వీరిద్దరూ?


మోహన్‌లాల్


పృథ్వీరాజ్ సుకుమారన్

దర్శకుడిగా, నటుడిగా వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు పృథ్వీరాజ్ సుకుమారన్. ఆయన హీరోగా 'ఖలీఫా' అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. వైశాఖ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో మోహన్‌లాల్ అతిథి పాత్రలో మెరవనున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. ఆయన ఇందులో మంబరక్కల్ అహ్మద్ అలీ పాత్రలో కనిపించనున్నట్లు వెల్లడించింది. దీంతోపాటు ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తీర్చిదిద్దుతున్నట్లు మొదటి భాగం వచ్చే ఏడాది ఓనం సందర్భంగా విడుదల కానున్నట్లు సినీవర్గాలు వెల్లడించాయి. దీనికి ప్రీక్వెల్‌గా రాబోతున్న చిత్రంలో మోహన్‌లాల్ పాత్రనే కీలకంగా ఉండబోతుందని తెలుస్తుంది. గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, పృథ్వీరాజ్ తాతామనవళ్లుగా కనిపించనున్నట్లు సమాచారం. విద్యుత్ జైమ్వాల్, సత్యరాజ్, కృతి శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

మార్క్‌ని తాకితే నిప్పుతో ఆడుకున్నట్లే


కిచ్చా సుదీప్

"పులి పంజా విసరడం ఆలస్యమవుతుందేమో కానీ.. ఈ మార్క్ లేట్ చేయడు" అంటూ రంగంలోకి దిగారు కన్నడ నటుడు కిచ్చా సుదీప్. ఇదంతా ఆయన హీరోగా నటిస్తున్న 'మార్క్' సినిమా కోసమే. విజయ్ కార్తికేయ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఈ నెల 25న రాబోతుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు సుదీప్. "అజయ్ మార్కండేయ.. అలియాస్ మార్క్', 'మార్క్‌ని తాకితే నిప్పుతో ఆడుకున్నట్లే'' లాంటి సంభాషణలు సినీప్రియుల్ని ఆకర్షిస్తున్నాయి. క్రైమ్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో నవీన్ చంద్ర, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

పదో తరగతి విద్యార్హతతోనే యూనిఫాం ఉద్యోగాలకు అవకాశమొచ్చింది. కేంద్ర సాయుధ దళాల్లో 25487 కానిస్టేబుల్ జనరల్ డ్యూటీ పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ప్రకటన వెలువడింది. తెలుగులోనూ పరీక్ష రాసుకోవచ్చు. మహిళలూ అర్హులే. కంప్యూటర్ బేస్డ్, దేహదార్ఢ్య, శారీరక ప్రమాణ, ఆరోగ్య పరీక్షలతో ఎంపిక చేస్తారు. వీరిని శిక్షణ అనంతరం విధుల్లోకి తీసుకుంటారు. మొదటి నెల నుంచే సుమారు రూ.40,000 వేతనం అందుకోవచ్చు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు.

పదితో కేంద్ర కొలువు!

సాయుధ దళాల్లో 25,487 పోస్టులు

ఎస్ఎస్‌సీ దాదాపు ఏటా సాయుధ దళాల్లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేస్తోంది. పదో తరగతి విద్యార్హతతో, జనరల్ అభ్యర్థులు 23 ఏళ్ల వయసు వరకు పోటీ పడవచ్చు. అందువల్ల వీటిని లక్ష్యంగా చేసుకున్నవారు తక్కువ ప్రయత్నాల్లోనే విజయవంతం కావడానికి అవకాశం ఉంటుంది. ఎంపికైనవారు ఆసక్తి, మెరిట్ ప్రకారం.. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ), సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎఫ్ఎఫ్), అస్సాం రైఫిల్స్ (ఏఆర్)లో ఏదైనా ఎంచుకోవచ్చు. వీరంతా లెవెల్-3 మూలవేతనం రూ.21,700 పొందుతారు. దీనికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర ప్రోత్సాహకాలు దక్కుతాయి. తొలి నెల నుంచే సుమారు రూ.40వేలు జీతం అందుకోవచ్చు. అనుభవంతో హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై స్థాయికి చేరుకోవచ్చు. విధుల్లో ప్రతిభ, విద్యార్హతలు, శాఖాపరమైన పరీక్షలతో ఎస్సై, ఆపై స్థాయిలోనూ సేవలు అందించవచ్చు.



పరీక్ష ఇలా

ఆన్‌లైన్‌లో 160 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి ఒక గంట. 80 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ 2 మార్కులు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మ్యాథమేటిక్స్, ఇంగ్లిష్/హిందీ ఒక్కో విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష మాధ్యమంగా తెలుగు, ఇంగ్లిష్ లేదా ఏదైనా భాషను ఎంచుకోవచ్చు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో పదో తరగతి సిలబస్ స్థాయిలోనే ఉంటాయి. తప్పు జవాబుకు పావు మార్కు తగ్గిస్తారు. పరీక్షలో అర్హత కోసం జనరల్ అభ్యర్థులు 30, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్‌లు 25, ఎస్సీ, ఎస్టీలు 20 శాతం మార్కులు పొందాలి. ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్‌కు 5, బీ ఉంటే 3, ఏ ఉన్నవారికి 2 శాతం మార్కులు కలుపుతారు. ఇలా అర్హత మార్కులు పొందినవారి జాబితా నుంచి రాష్ట్రాలు, విభాగాల వారీ మొత్తం ఖాళీలకు 8 రెట్ల మందిని ఫిజికల్ టెస్టులకు పిలుస్తారు.

పీఈటీ, పీఎస్‌టీ

పీఈటీలో.. పురుషులు 5 కి.మీ. దూరాన్ని 24 నిమిషాల్లో, మహిళలు 1.6 కి.మీ. దూరాన్ని 8 1/2 నిమిషాల్లో చేరుకోవాలి. పీఎస్‌టీలో.. పురుషులు 170, మహిళలు 157 సెం.మీ. ఎత్తు ఉండాలి. ఎస్టీ పురుషులు 162.5, మహిళలు 150 సెం.మీ. ఉంటే చాలు. పురుషుల ఛాతీ విస్తీర్ణం 80 సెం.మీ. (ఎస్టీలకు 76) తప్పనిసరి. ఊపిరి పీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ. పెరగాలి. ఎత్తుకు తగ్గ బరువుండాలి. అన్ని విభాగాల్లోనూ అర్హులైనవారి జాబితా నుంచి పరీక్షల్లో సాధించిన మార్కుల మెరిట్ ప్రకారం కేటగిరీల వారీ ఖాళీలకు 2 రెట్ల మందిని మెడికల్ టెస్టుకు ఆహ్వానిస్తారు. అందులోనూ విజయవంతం కావాలి. తుది నియామకాలు పరీక్షల్లో సాధించిన మార్కుల మెరిట్, రాష్ట్రాలు, విభాగాల వారీ ఖాళీలు, రిజర్వేషన్ల ప్రకారం ఉంటాయి. దరఖాస్తు నింపినప్పుడే సర్వీసులవారీ ప్రాధాన్యం తెలపాలి. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్నవారు కానిస్టేబుల్ హోదాతో సేవలందిస్తారు.

సన్నద్ధత..

◆ పరీక్షలో విజయానికి ముందుగా చేయాల్సింది.. నోటిఫికేషన్‌లోని సిలబస్ వివరాలను శ్రద్ధగా గమనించి, అందులోని అంశాలనే బాగా చదవాలి. అధ్యయనంలో పరిమిత పుస్తకాలను ఎంచుకుని, వాటినే ఎక్కువ సార్లు అధ్యయనం చేయాలి.

◆ విభాగాలు, అందులోని అంశాల వారీ సన్నద్ధత కొనసాగించాలి. ప్రతి అంశంలోనూ వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి.

◆ గత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. దీంతో ప్రశ్నల స్థాయి తెలుస్తుంది. విభాగాల వారీ ఏ అంశాలకు ప్రాధాన్యం ఉందో గ్రహించాలి. సాధన అందుకు అనుగుణంగా మలుచుకోవాలి.

◆ 60 నిమిషాల్లో 80 ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. అంటే ప్రతి ప్రశ్నకూ 45 సెకన్లే ఉంటాయి. అందువల్ల తక్కువ వ్యవధిలో వీలైనన్ని సరైన సమాధానాలు గుర్తిస్తేనే విజయం సాధించగలరు.

◆ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంటెలిజెన్స్ విభాగాల ప్రశ్నలకు సమాధానం గుర్తించడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి.. పరీక్షకు ముందు వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయడం, సూత్రాలు ఉపయోగించే విధానం, షార్ట్ కట్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి.

◆ పరీక్షకు ముందు కనీసం 20 మాక్ టెస్టులైనా రాయాలి. పరీక్షల వారీ ఫలితాలను సమీక్షించుకుని, చేసిన తప్పులే మళ్లీ చేయకుండా, వెనుకబడుతోన్న అంశాలకు ప్రాధాన్యమిస్తే స్కోరు మెరుగవుతుంది.

◆ రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివాటిని వదిలేయాలి. అలాగే సమాధానం కోసం ఎక్కువ సమయం అవసరమయ్యే ప్రశ్నలను చివరలోనే ప్రయత్నించాలి.

◆ పరీక్షకు ముందు ఎస్ఎస్‌సీ వెబ్‌సైట్‌లో ఉంచిన మాక్ టెస్ట్ రాస్తే ప్రయోజనం.

◆ ఎస్ఎస్‌సీ ఎంటీఎస్ పాత ప్రశ్నపత్రాలు సాధన చేస్తే ప్రయోజనమే ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్. అగ్నివీర్ పరీక్షల ప్రశ్నపత్రాలూ అధ్యయనంలో ఉపయోగపడతాయి

◆ పరీక్ష తేదీకి వారం రోజుల ముందు నుంచీ నేర్చుకున్నవన్నీ ఒకసారి పునశ్చరణ చేసుకోవాలి. ముఖ్యాంశాలు మరోసారి చదవాలి.

వివరాలు

ఖాళీలు: 25,487. వీటిలో 2020 మహిళలకు కేటాయించారు.
అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత
వయసు: జనవరి 1, 2026 నాటికి 18-23 ఏళ్ల మధ్య ఉండాలి. 02.01.2003 - 01.01.2008 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు తేదీ: డిసెంబరు 31
దరఖాస్తు ఫీజు: రూ.వంద. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు లేదు.
పరీక్ష: ఫిబ్రవరి- ఏప్రిల్ మధ్య నిర్వహిస్తారు. తేదీలు తర్వాత ప్రకటిస్తారు.
వెబ్‌సైట్: https://ssc.gov.in/

సైంటిస్టులు

సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా.. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● సైంటిస్ట్: 28 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగాల్లో ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీలతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వేతనం:** నెలకు రూ.1,32,600.
వయసు: 32 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: విద్యార్హతలు, ఇంటర్వ్యూతో
దరఖాస్తు ఫీజు: రూ.500, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 29-12-2025.
వెబ్‌సైట్: https://www.cgcri.res.in/announcements/employment/

సీనియర్ మేనేజర్లు

నేషనల్ హైవేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో 48 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● సీనియర్ మేనేజర్ (టెక్నికల్): 21
● డిప్యూటీ జనరల్ మేనేజర్ (టెక్నికల్): 15
● జనరల్ మేనేజర్ (టెక్నికల్): 07
● సీనియర్ జనరల్ మేనేజర్ (టెక్నికల్): 05

అర్హత: బీటెక్(సివిల్)తో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 38-48 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు సీనియర్ మేనేజర్‌కు రూ.70,000 - రూ.2,00,000, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.80,000 - రూ.2,20,000, జనరల్ మేనేజర్‌కు రూ.90,000 - రూ.2,40,000, సీనియర్ జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000 - రూ.2,60,000.
ఆన్‌లైన్ దరఖాస్తులు: 15.12.2025 నుంచి 13.01.2026 వరకు స్వీకరిస్తారు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://www.nhidcl.com/current-jobs

గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, బెంగళూరు.. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● బీఈ/బీటెక్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ జనవరి-2026 బ్యాచ్
ఇంజినీరింగ్ విభాగాలు: మెకానికల్, ఇండస్ట్రియల్, ప్రొడక్షన్, మెకట్రానిక్స్, మెటీరియల్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి-కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సివిల్, కెమికల్. **అర్హత:** 01.02.2021 తర్వాత బీఈ/ బీటెక్ పూర్తిచేసుకున్నవారే అర్హులు. **స్టైపెండ్:** నెలకు రూ.12,300.
ఇంటర్వ్యూ తేదీలు: 17.12.2025 నుంచి 20.12.2025 వరకు
వేదిక: టెక్నికల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్, సురంజన్‌దాస్ రోడ్, బెంగళూరు.
వెబ్‌సైట్: https://hal-india.co.in/career

స్టెనోగ్రాఫర్లు

నేషనల్ మెటలర్జికల్ ల్యాబొరేటరీ.. స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● జూనియర్ స్టెనోగ్రాఫర్: 05 పోస్టులు

అర్హత: ఇంటర్మీడియట్.
వయసు: 27 ఏళ్లలోపు ఉండాలి..
వేతన శ్రేణి: నెలకు రూ.25,500 - రూ.81,100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.12.2025.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలు, ఈఎస్ఎంలకు ఫీజు లేదు.
ఎంపిక: పరీక్ష, స్కిల్ టెస్టుతో.
వెబ్‌సైట్: https://nml.res.in/permanent-career-lists

ఎంఈసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. ఆ తర్వాత సీఏ లేదా ఐఐఎంలలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ చేయాలనుంది. ఈ రెండిటిలో ఏ కోర్సులో చేరితే భవిష్యత్తు బాగుంటుంది. - శరత్


సీఏ, ఎంబీఏ.. ఏది బాగు?

■ ఇప్పటి పోటీ ప్రపంచంలో ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, ఐదు సంవత్సరాల ఎల్ఎల్‌బీ ప్రోగ్రాంలతో పాటు, సీఏ (చార్టర్డ్ అకౌంటెన్సీ), ఐఐఎంలు అందించే ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌ల గురించీ ఆలోచిస్తున్నారు. సీఏ, ఎంబీఏ.. ఈ రెండిటి స్వభావం, కాలవ్యవధి, కెరియర్ అవకాశాలు భిన్నంగా ఉంటాయి.

✦ భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, వృత్తిపరమైన కోర్సుల్లో సీఏ ఒకటి. ఇది ఫైనాన్స్, అకౌంటింగ్, ఆడిటింగ్, టాక్సేషన్, కంపెనీ చట్టాలు వంటి రంగాల్లో లోతైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది. సీఏ పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందడంతో పాటు నైపుణ్యాలు, క్రమశిక్షణ, పట్టుదల, అంకెలపై ఆసక్తి చాలా అవసరం. ఈ పరీక్షలు కఠినంగా ఉండటం వల్ల ఉత్తీర్ణత శాతం తక్కువ. అయినప్పటికీ, సీఏ పూర్తయ్యాక అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. పరిశ్రమలు, బ్యాంకులు, బహుళ జాతి సంస్థలు, అంతర్జాతీయ ఆడిట్ సంస్థల్లో మంచి ఉద్యోగాలు లభిస్తాయి. అంతేకాకుండా, వ్యక్తిగతంగా ప్రాక్టీస్ ప్రారంభించి సొంతంగా ఆడిట్ సంస్థను నడపడం, కాలక్రమంలో సీఏగా ఉన్నతమైన హోదా, ముఖ్యంగా సీఎఫ్ఓ లాంటి పదవులను కూడా పొందే అవకాశం ఉంది.

✦ ఐఐఎంలు అందించే ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు స్వభావం సీఏకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇది ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా భారతదేశంలోని అత్యుత్తమ మేనేజ్‌మెంట్ సంస్థలైన ఐఐఎంలలో చేరడానికి రూపొందించిన ఐదేళ్ల ప్రోగ్రాం. ఇందులో మొదటి మూడేళ్లూ బిజినెస్ ఫండమెంటల్స్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, సైకాలజీ,

ఉద్యోగావకాశాల పరంగా పరిశీలిస్తే.. సీఏ పూర్తి చేసినవారికి.. ఫైనాన్స్, టాక్సేషన్, ఆడిటింగ్, అకౌంట్స్ వంటి రంగాల్లో నిపుణులుగా ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఇంటిగ్రేటెడ్ ఎంబీఏతో.. కన్సల్టింగ్, మార్కెటింగ్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, డేటా అనలిటిక్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా మెకిన్సే, బీసీజీ, గోల్డ్‌మన్ సాక్స్, అమెజాన్, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు అధిక వేతనాలతో ఐఐఎం విద్యార్థులను నియమించుకోవడంతో ఈ ప్రోగ్రాం ప్రాధాన్యం పెరుగుతోంది.



అనలిటికల్ థింకింగ్ వంటి అంశాలు బోధిస్తారు. చివరి రెండేళ్లలో ఎంబీఏ విద్యార్థులకు అత్యున్నత మేనేజ్‌మెంట్ శిక్షణ ఇస్తారు. ఈ ప్రోగ్రాంలో పరిశ్రమ అనుభవం, ఇంటర్న్‌షిప్పులు, ఫీల్డ్ ప్రాజెక్టులు, వివిధ సంస్థలతో కలిసి పనిచేసే అవకాశాలు ఎక్కువగా ఉండటం వల్ల విద్యార్థులు వ్యాపార ప్రపంచాన్ని దగ్గరగా గమనించే అవకాశం ఉంటుంది. అందువల్ల కార్పొరేట్ రంగంలో నాయకత్వ స్థానాలకు ఎదగాలనుకొనే వారికి ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ అత్యుత్తమ ఎంపిక.

✦ అకౌంటింగ్, టాక్సేషన్ వంటి విషయాలపై ఆసక్తి ఉండి, క్రమశిక్షణతో దీర్ఘకాలికంగా కష్టపడే సామర్థ్యం ఉన్నవారు సీఏ గురించి ఆలోచించడం మంచిది. వ్యాపార ప్రపంచం, నాయకత్వం, బృందాలతో పనిచేయడం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పెద్ద సంస్థల్లో నాయకత్వ స్థానాలు లక్ష్యంగా పెట్టుకున్నవారు ఇంటిగ్రేటెడ్ ఎంబీఏను ఎంచుకోవడం మంచిది. మీ వ్యక్తిత్వం, ఆసక్తి, దీర్ఘకాలిక కెరియర్ లక్ష్యాలను బట్టి ఈ రెండిటిలో ఏది ఉపయోగకరంగా ఉంటుందో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఎంతో ఆసక్తికరమైన.. పరీక్షా పే చర్చా-2026 కార్యక్రమంలో భాగం కావడానికి అవకాశమొచ్చింది. ఎంపికైనవారు ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ప్రేరణ పొందడంతోపాటూ సర్టిఫికెట్ అందుకోవచ్చు. ఈ అవకాశం మీకు దక్కాలంటే ఏం చేయాలో తెలుసా?

ప్రధానితో చర్చ.. పాల్గొంటారా మరి!



పరీక్షా పే చర్చా-2026

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాసిన “ఎగ్జామ్ వారియర్స్” పుస్తకం ఆధారంగా ప్రారంభించిన పరీక్షా పే చర్చా(పీపీసీ) కార్యక్రమం తెలుగులోనూ అందుబాటులోకి వచ్చింది. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడం, సానుకూల దృక్పథం పెంపొందించడం, పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనేలా మార్గనిర్దేశం చేయడం వంటివి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు. ఇందులో విద్యార్థుల ప్రశ్నలకు ప్రధాని నరేంద్ర మోదీ సమాధానాలు ఇస్తారు. పరీక్షలు ధైర్యంగా ఎలా రాయాలో సూచనలివ్వడంతోపాటూ తల్లిదండ్రులూ, ఉపాధ్యాయుల పాత్రలపైనా చర్చ కొనసాగుతుంది. అలాగే చదువు, క్రమశిక్షణ, సమయపాలనలపై విలువైన సూచనలు అందిస్తారు. ‘పట్టుదలతో చదువు- ప్రశాంతంగా పరీక్ష’ అనే భావాన్ని పెంపొందిస్తారు.

తొమ్మిదో ఎడిషన్ ప్రత్యేకత

● ప్రధాని మోదీ ఎగ్జామ్ వారియర్స్ పుస్తకం విద్యను జీవిత ప్రయాణంలా, ఆనందంగా స్వీకరించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తుంది. అదే విధంగా నమో యాప్‌లో ఈ పుస్తకానికి ఇంటరాక్టివ్ టెక్ మాడ్యూల్‌ను జోడించారు. ఈ కొత్త మాడ్యూల్‌లో ప్రధానమంత్రి రాసిన ప్రతి సూత్రం చిత్ర రూపంలో ఉంటుంది. విద్యార్థులతో పాటూ తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ ఆ సూత్రాలను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

● పీపీసీ 2026 కార్యక్రమంలో పరీక్షల గురించే కాకుండా.. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సమగ్ర అభివృద్ధిపైన దృష్టి పెడతారు. భవిష్యత్తు తరాలను బలోపేతం చేయడమే దీని ప్రధాన ఉద్దేశం.

● పరీక్షా పే చర్చా ఎనిమిదో ఎడిషన్‌ను దిల్లీలోని భారత్ మంటపంలో నిర్వహించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. పీపీసీకు దాదాపు 3.5 కోట్లకు పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రిజిస్టర్ అయ్యారు. అలాగే ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ఫిట్‌నెస్ ఐకాన్ మేరీ కోమ్, నటి దీపికా పదుకోణ్, ఆధ్యాత్మిక గురువు సద్గురు హాజరయ్యారు. విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు.

● వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన 35 మంది విద్యార్థులు ప్రధాని మోదీతో నేరుగా చర్చించే అవకాశం పొందారు. “జీవితంలో పరీక్షలను సహజంగా చూడాలి. ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి. మొబైల్ ఫోన్, సోషల్ మీడియాను మితిమీరి వినియోగించకూడదు ”అని పరీక్షల గురించి మోదీ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని టెలివిజన్ ఛానళ్లు, యూట్యూబ్, సోషల్ మీడియా ద్వారా ప్రసారం చేశారు.

దరఖాస్తు ఇలా

✦ అధికారిక పోర్టల్ innovateindia1.mygov.in లోకి వెళ్లాలి.“పరీక్షా పే చర్చా 2026” లేదా “PPC MCQ competition” విభాగాన్ని ఎంచుకోవాలి. స్టూడెంట్/పేరెంట్/టీచర్ విభాగాన్ని సెలెక్ట్ చేయాలి. మీ వివరాలు (పేరు, ఈ-మెయిల్, మొబైల్, స్కూల్) నమోదు చేయాలి. మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. చివరిగా ఎమ్‌సీక్యూ ఆధారిత పోటీలో పాల్గొని ఫామ్‌ను సబ్‌మిట్ చేయాలి.

✦ పోటీలో ఎక్కువ మార్కులు పొందినవారు ఎంపికవుతారు. ప్రధానితో ప్రత్యక్షంగా చర్చలో పాల్గొనే అవకాశం వీరికే దక్కుతుంది.

ఎవరు అర్హులు: ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎవరైనా ఇందులో భాగం కావచ్చు.
వివరాల నమోదుకు చివరి తేదీ: 11-01-2026
వెబ్‌సైట్: https://innovateindia1.mygov.in/

– మిడియం శ్రీవాణి, ఈజేఎస్.

హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌లో..

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, బెంగళూరు.. ఏడాది కాలానికి డిప్లొమా అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● డిప్లొమా అప్రెంటిస్ జనవరి-2026 బ్యాచ్
విభాగాలు: ఏరోనాటికల్, ఏరోస్పేస్, ఏవియేషన్, ఏవియానిక్స్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటనెన్స్, మెకానికల్, ఇండస్ట్రియల్, ప్రొడక్షన్, మెకట్రానిక్స్, మెటీరియల్ సైన్స్, టూల్ అండ్ డై మేకింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ.. తదితరాలు.
అర్హత: 01.02.2021 తర్వాత డిప్లొమా పూర్తిచేసుకున్నవారే అర్హులు.
స్టైపెండ్: నెలకు రూ.10,900.
ఇంటర్వ్యూ తేదీలు: 08.12.2025 నుంచి 13.12.2025.
వేదిక: టెక్నికల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్, సురంజన్‌దాస్ రోడ్, బెంగళూరు.
వెబ్‌సైట్: https://www.hal-india.co.in/career

ఐటీఐతో..

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్.. ఏడాది ట్రేడ్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● ట్రేడ్ అప్రెంటిస్
ట్రేడులు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్.. తదితరాలు.
అర్హత: ఐటీఐ ఉత్తీర్ణత
వయసు: డిసెంబరు 15, 2025 నాటికి 23 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు: ఎన్ఏటీ పోర్టల్ ద్వారా.
ఎంపిక: విద్యార్హతల మెరిట్‌తో.
దరఖాస్తుకు చివరి తేదీ: 15-12-2025.
వెబ్‌సైట్లు:
https://hal-india.co.in/career
https://www.apprenticeshipindia.gov.in/

ఇండియా మీటియొరాలజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ), న్యూదిల్లీ... 134 ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనుంది. ముందుగా ఏడాది కాలానికి ఎంపిక చేసినప్పటికీ పనితీరు ఆధారంగా పొడిగించే అవకాశం ఉంటుంది. ఎమ్మెస్సీ/ ఇంజినీరింగ్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

ఐఎండీలో ప్రాజెక్ట్ సైంటిస్టులు

మొత్తం ఖాళీల్లో.. ప్రాజెక్ట్ సైంటిస్ట్ (ఇ)-1, ప్రాజెక్ట్ సైంటిస్ట్-3 13, ప్రాజెక్ట్ సైంటిస్ట్-2 29, ప్రాజెక్ట్ సైంటిస్ట్-1 64, సైంటిఫిక్/ అడ్మిన్ అసిస్టెంట్-25, అడ్మిన్ అసిస్టెంట్-1 ఉన్నాయి.



ఎంపిక: విద్యార్హతలు, అనుభవంతో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఈ వివరాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. అర్హతలు, అనుభవానికి సంబంధించిన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఇంటర్వ్యూ సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.

✦ సంబంధిత విభాగంలో పొందిన డాక్టరేట్ డిగ్రీని మూడేళ్ల అనుభవంగా పరిగణిస్తారు.

గమనించాల్సినవి: ఒకరు ఎన్ని పోస్టులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీలకు వయసు, ఉద్యోగానుభవాల్లో సడలింపులు ఉంటాయి. తాజా సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

ఎవరు అర్హులు

ప్రాజెక్ట్ సైంటిస్ట్-2, ప్రాజెక్ట్ సైంటిస్ట్-1: 60 శాతంతో ఫిజిక్స్/ మేథమెటిక్స్/ మీటియొరాలజీ/ అట్మాస్ఫియరిక్ సైన్స్‌తో ఎమ్మెస్సీ లేదా ఫిజిక్స్/ మేథమెటిక్స్/ మీటియొరాలజీ/ అట్మాస్ఫియర్ సైన్స్‌తో బీఈ/ బీటెక్. మీటియొరాలజీ సైన్స్‌లో డాక్టరేట్ డిగ్రీ లేదా ఎంఈ/ఎంటెక్ చేసినవారికి ప్రాధాన్యం.

సైంటిఫిక్/ అడ్మిన్ అసిస్టెంట్: ఫిజిక్స్ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ లేదా కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిగ్రీ. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ పాసవ్వాలి.

వయసు: ప్రాజెక్ట్ సైంటిస్ట్-2కు 40 సంవత్సరాలు, ప్రాజెక్ట్ సైంటిస్ట్-1కు 35 ఏళ్లు, సైంటిఫిక్/ అడ్మిన్ అసిస్టెంట్‌కు 30 సంవత్సరాలు మించకూడదు. ప్రత్యేక వర్గాలకు చెందినవారికి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

వేతనం: నెలకు.. ప్రాజెక్ట్ అసిస్టెంట్-2కు రూ. 67,000. ప్రాజెక్ట్ సైంటిస్ట్-1కు రూ.56,000. సైంటిఫిక్/ అడ్మిన్ అసిస్టెంట్‌కు రూ.29,200. అన్ని పోస్టులకూ హెచ్ఆర్ఏ అదనం. పనితీరు ఆధారంగా ప్రతి రెండేళ్లకూ వేతనంలో 5 శాతం పెరుగుదల ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.12.2025 **వెబ్‌సైట్:** https://mausam.imd.gov.in/

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ 2025 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతిని ఎవరికి ప్రకటించారు?

జ: మరియా కొరినా మచాడో

(వెనుజువెలాలో ప్రజాస్వామ్యం, శాంతి స్థాపనను ప్రోత్సహించడానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈమెకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు.)

◆ 2025లో భారత వైమానిక దళ దినోత్సవాన్ని అక్టోబరు 8న ఏ థీమ్‌తో నిర్వహించారు? (1932 అక్టోబరు 8న భారత వైమానిక దళాన్ని అధికారికంగా ఏర్పాటు చేశారు.

జ: ఆపరేషన్ సిందూర్

◆ భారత దేశంలో ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) అధికారిక రాయబారిగా ఇటీవల ఏ భారత క్రికెటర్ నియమితులయ్యారు. (దేశంలో ఫుట్‌బాల్ క్రీడకు ప్రజాదరణ పెంచే లక్ష్యంతో ఈపీఎల్ ఈ నియామకం చేపట్టింది.)

జ: సంజు శ్యామ్సన్

మరింత సమాచారం

◆ 2025 అక్టోబరు 8 నుంచి 11 వరకు ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ సమావేశాన్ని 'ఇన్నోవేట్ టు ట్రాన్స్‌ఫామ్' థీమ్‌తో ఎక్కడ నిర్వహించారు?

జ: న్యూదిల్లీ

◆ 2025 అక్టోబరు 6న భారత నేవీ ఏ నగరంలోని నావల్ డాక్ యార్డ్‌లో ఐఎన్ఎస్ ఆండ్రోత్‌ను ప్రారంభించింది. (భారత్‌లో నిర్మించిన రెండవ అత్యాధునిక యాంటీ- సబ్‌మెరైన్ వార్ ఫేర్ షాలో వాటర్‌క్రాఫ్ట్‌గా ఇది గుర్తింపు పొందింది.)

జ: విశాఖపట్నం

జూనియర్ ఇంటర్ రసాయనశాస్త్రం

రసాయన శాస్త్రంలో కొన్ని మౌలిక భావనలు

ఫైనల్ పరీక్షలు 2026 ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

I మార్కు

1. ఎజైడోథిమిడీన్ (AZT) మందును ఏ చికిత్సలో వాడతారు?

   1) క్యాన్సర్ 2) ఎయిడ్స్ 3) బ్రాంకైటిస్ 4) అల్సర్ **జ:** 2

2. విస్తారంగా లభించే ఐరన్ ఐసోటోపులు $^{54}Fe, ^{56}Fe, ^{57}Fe$ వరుసగా 5%, 90%, 5% అయితే Fe పరమాణు ద్రవ్యరాశి కిందివాటిలో ఏది?

   1) 55.85 2) 55.95 3) 55.75 4) 56.05 **జ:** 2

3. ఒక వాయువు సాంద్రత STP వద్ద 1.25 gL^{-1} అయితే ఆ వాయువు అణుద్రవ్యరాశి

   1) 14 2) 28 3) 16 4) 32 **జ:** 2

4. కిందివాటిలో అధిక సంఖ్యలో అణువులను కలిగి ఉండే స్థితి?

   1) 448 లీటర్ల O_2 STP వద్ద
   2) 440 లీటర్ల CO_2 STP వద్ద
   3) 22.4 లీటర్ల H_2O STP వద్ద
   4) 2.24 లీటర్ల H_2O STP వద్ద **జ:** 3

5. 10 గ్రాముల 90% శుద్ధ లైమ్ స్టోన్ (సున్నపురాయి)ని పూర్తిగా వేడి చేస్తే వెలువడే CO_2 ఘనపరిమాణం (లీటర్లలో) STP వద్ద

   1) 22.4 గ్రా. 2) 2.24 గ్రా. 3) 20.16 గ్రా. 4) 2.016 గ్రా. **జ:** 4

6. ఒక amu సంఖ్యాపరంగా .... కు సమానం

జ: 1.66×10^{-24} లేదా 1/N g

7. అవగాడ్రో సంఖ్య విలువ సంఖ్యాపరంగా ....

జ: 6.02×10^{23} (atoms/molecules/ions) $mole^{-1}$

8. 64 గ్రాముల సల్ఫర్ (S_8)లోని పరమాణువుల సంఖ్య **జ:** 2N

2 మార్కులు

1. 540 గ్రాముల గ్లూకోజ్‌లో ఎన్ని మోల్‌ల గ్లూకోజ్ ఉంది?

జ: $\text{మోల్‌ల సంఖ్య} = \frac{\text{భారం}}{\text{అణుభారం}}$

గ్లూకోజ్ అణుభారం $= 6 \times 12 + 12 \times 1 + 6 \times 16 = 180$ గ్రా./మోల్‌ల

$\text{మోల్‌ల సంఖ్య} = \frac{540}{180} = 3$ మోల్‌లు.

2. 0.1 మోల్ సోడియం కార్బొనేట్ భారాన్ని లెక్కగట్టండి.

జ: $\text{మోల్‌ల సంఖ్య} = \frac{\text{భారం}}{\text{అణుభారం}}$

భారం = మోల్‌ల సంఖ్య × అణుభారం

$= 0.1 \times 106$ (Na_2CO_3 అణుభారం)

$= 10.6$ గ్రాములు $= 2 \times 23 + 1 \times 12 + 3 \times 16 = 106$)

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు

3. సార్థక అంకెలు అంటే ఏమిటి?

జ: కచ్చితంగా తెలిసిన అర్థవంతమైన అంకెలను సార్థక అంకెలు అంటారు.



రచయిత: డాక్టర్ పి. త్రినాథరాజా

పద్ధతులు వేరైనా.. బంధం ఒక్కటే!



ఆనాటి నుంచి ఆధునిక కాలం వరకు వర్ధిల్లిన అన్నిరకాల సమాజాల్లోనూ చెక్కుచెదరని, ప్రాధాన్యం తగ్గని బంధమే వివాహం. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య ముడిపడిన సంబంధం మాత్రమే కాదు. వ్యక్తులకు, కుటుంబానికి, సమాజానికీ పునాది వంటిది. అందుకే వివాహం ఒక సామాజిక సంస్థగా తరతరాలుగా సమాజం మనుగడలో ముఖ్యపాత్ర పోషిస్తోంది. వ్యక్తులకు భద్రత, మద్దతుతో పాటు కుటుంబ స్థిరీకరణ, సమాజ స్థిరత్వం, పిల్లల సంరక్షణ తదితరాలన్నీ వివాహం ద్వారానే జరుగుతాయి. సామాజిక నిర్మాణాలకు మూలమైన వివాహం ఉద్దేశాలను, అవి అందిస్తున్న ప్రకార్యాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. మనుగడలో ఉన్న వివిధ వివాహాలు, పాటిస్తున్న సమాజాలు, వాటికి ఉన్న ఆమోదయోగ్యతనూ అర్థం చేసుకోవాలి.

వివాహం ప్రకార్యాలు - రకాలు

మానవ సమాజ నిర్మాణంలో వివాహం అత్యంత ప్రాథమికమైన, సార్వత్రికమైన, శక్తిమంతమైన సామాజిక సంస్థ. ఇది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, సమాజంలో వారసత్వం, చట్టబద్ధమైన సంతానోత్పత్తి, లైంగిక సంబంధాల నియంత్రణ, ఆర్థిక సహకారం తదితర అనేక కీలకమైన ప్రకార్యాలను నిర్వర్తించే వ్యవస్థ. వివాహం ద్వారా ఏర్పడే కుటుంబమే ప్రతి వ్యక్తికీ తొలి సామాజికీకరణ వేదిక. వివిధ సంస్కృతులు, భౌగోళిక ప్రాంతాలు, చారిత్రక కాలాల్లో సమాజ అవసరాలకు అనుగుణంగా వివాహ వ్యవస్థ ఎన్నో వైవిధ్య రూపాలను సంతరించుకుంది.

వివాహ వ్యవస్థ సామాజిక, ఆర్థిక, లైంగికత, సంస్కృతి ఆధారంగా మారుతూ ఉంది. ఆలస్య వివాహాలు, సహజీవన వివాహాల వంటి కాలానుగుణ పరివర్తనలూ కనిపిస్తున్నాయి.

వివాహం ప్రకార్యాలు

వివాహం సమాజానికి అనేక రకాలైన ఆవశ్యక ప్రకార్యాలను అందిస్తోంది.

1) జైవిక ప్రకార్యాలు: వివాహ వ్యవస్థ ద్వారా స్త్రీ, పురుషులు భార్యాభర్తలుగా గుర్తింపు పొంది, తమ లైంగిక వాంఛలు తీర్చుకుంటారు. సమాజంలో వ్యక్తుల మధ్య ఉన్న లైంగిక వాంఛను వివాహం క్రమబద్ధీకరిస్తుంది. అయితే స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధం ఉన్నంత మాత్రాన దానిని వివాహంగా భావించడానికి వీల్లేదు. వివాహం అనేది అన్ని నియమాలను అనుసరిస్తూ ఏర్పడిన శాశ్వత సంబంధం. వీటిని సమాజాలే ఏర్పాటు చేస్తాయి. వివాహ వ్యవస్థ.. వివాహానికి ముందు, వివాహానంతరం వివాహేతర, అక్రమ లైంగిక సంబంధాలను నిషేధిస్తుంది.

2) ఆర్థిక ప్రకార్యాలు: వివాహ వ్యవస్థ స్త్రీ, పురుషుల మధ్య శ్రమ విభజనను ఏర్పరుస్తుంది. తమ మనుగడ కొనసాగించడానికి తగిన



సౌకర్యాలను కలుగజేస్తుంది. పిల్లలను పెంచి పోషించాల్సిన బాధ్యతను కూడా తల్లిదండ్రులకు వివాహం నిర్దేశిస్తుంది. తల్లిదండ్రులు నిర్వహించాల్సిన కర్తవ్యాలనూ తెలియజేస్తుంది. అంటే వివాహ వ్యవస్థ వ్యక్తులు నిర్వహించాల్సిన ఆర్థిక కార్యకలాపాలను సూచిస్తూ, తద్వారా వ్యక్తుల అవసరాలను తీర్చడానికి దోహదం చేస్తుంది.

3) సామాజిక ప్రకార్యాలు

వివాహం కుటుంబ రూపకల్పనకు మూలాధారం. వివాహం, కుటుంబ వ్యవస్థల ద్వారా ఒక మౌలిక, సాంఘిక వ్యవస్థ ఏర్పడుతుంది. వివాహం అనేది పుట్టిన బిడ్డకు సమాజంలో ఒక సుస్థిర స్థానాన్ని, అంతస్తును కల్పిస్తుంది. ఈ సాంఘిక అంతస్తు ద్వారానే శిశువు ఇతర వ్యక్తులతో సంబంధాలను ఏర్పరచుకుంటాడు. వివాహం ద్వారానే వ్యక్తి తన వంశాన్ని కొనసాగించుకుంటాడు.

4) విద్యాప్రకార్యాలు: వివాహ సంస్థ ద్వారా

భారతీయ సమాజం

కుటుంబ సంస్థ ఏర్పడుతుంది. కుటుంబ సంస్థే వ్యక్తికి జీవితంలో మొదటి పాఠశాల. కుటుంబంలోనే పిల్లలు సమాజానికి సంబంధించిన విలువలను, ప్రమాణాలను, సంప్రదాయాలను, సంస్కృతిని అలవరచుకుంటారు. పిల్లలు సరైన రీతిలో సాంఘికీకరణ పొందే విధంగా చూసే బాధ్యత తల్లిదండ్రులదే.



వివాహ రకాలు

వివిధ సమాజాల సాంఘిక పరిస్థితులు, సంస్కృతులు, వికాసాలపై ఆధారపడి వివాహం అనేక రకాలుగా ఉంది. వివాహం ప్రధానంగా ఏక వివాహం, బహువివాహం అని రెండు రకాలు.

1) ఏక వివాహం: ఒక పురుషుడు, ఒక స్త్రీని మాత్రమే వివాహం చేసుకునే విధానం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు చాలా సమాజాల్లో ఏకవివాహ పద్ధతి అమలులో ఉంది. భారతదేశంలో పూర్వకాలం నుంచి అధికంగా ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు. వాస్తవికంగా అన్ని వివాహ పద్ధతుల్లోనూ ఇదే ఉత్తమమైందని భావిస్తారు. ఏక వివాహాన్ని అనుసరించే కుటుంబాల్లో భార్యాభర్తల మధ్య ఎక్కువ ప్రేమానురాగాలు ఉంటాయి. నేటి ఆధునిక, సాంఘిక, ఆర్థిక వ్యవస్థల్లో ఈ వివాహం పటిష్టమైందిగా, లాభదాయకమైందిగా, సర్వజనామోదితమైందిగా భావిస్తున్నారు. ఆధునిక సమాజాలన్నీ ఏక వివాహ పద్ధతినే అనుసరిస్తున్నాయి.

2) బహు వివాహం: ఒక పురుషుడు ఒకరి కంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకోవడం లేదా ఒక స్త్రీ ఒకరి కంటే ఎక్కువమంది పురుషులను వివాహం చేసుకుంటే బహువివాహం అంటారు. బహు వివాహం తిరిగి బహుభార్యత్వం, బహు భర్తృత్వం అని రెండు రకాలు.

ఎ) బహు భార్యత్వం



ఒక పురుషుడు ఒకరి కంటే ఎక్కువ స్త్రీలను వివాహం చేసుకునే పద్ధతి. ప్రపంచవ్యాప్తంగా కొన్ని సమాజాల్లో బహు భార్యత్వం ఉంది. భారత్‌లో ఆదిమ తెగలైన నాగాలు, గోండు, బైగాలు పాటిస్తున్నాయి. ఆ సమాజాలలో పురుషుల కంటే స్త్రీల సంఖ్య ఎక్కువ ఉండటం, ఎక్కువమంది భార్యలను హోదాగా పరిగణించడం, ఆస్తి కాపాడుకోవడం, వారసుల నిమిత్తం, పురుషుడికి అనేక మంది స్త్రీల పట్ల లైంగికాసక్తి లాంటివి ఈ పద్ధతి కొనసాగేందుకు కారణాలు. భారత ప్రభుత్వం 1955లో హిందూ వివాహ చట్టంతో బహుభార్యత్వాన్ని నిషేధించింది. కానీ ఈ చట్టం ముస్లింలకు వర్తించదు. అయితే బహుభార్యత్వాన్ని చాలా సమాజాలు ఆమోదించకపోవడంతో ఆచరణలో లేదు.

బి) బహు భర్తృత్వం



ఒక స్త్రీ ఒకరి కంటే ఎక్కువ మంది పురుషులను వివాహం చేసుకునే పద్ధతి. ఇది సోదర బహు భర్తృత్వం, బహు భర్తృత్వం అని రెండు రకాలు.

◆ ఒక స్త్రీని సోదరులందరూ వివాహం చేసుకుని ఆ స్త్రీకి భర్తలుగా ఉంటే 'సోదర బహుభర్తృత్వం'. కానీ ఒక స్త్రీ భర్తలందరూ సోదరులు కాకపోతే 'సోదరేతర బహుభర్తృత్వం' అంటారు. దక్షిణ భారతదేశంలోని నీలగిరి కొండల్లో నివసించే తోడాలు, ఈశాన్య ప్రాంతాల్లో నివసిస్తున్న ఖాసా లాంటి ఆదిమ తెగలు బహుభర్తృత్వ పద్ధతిని నేటికీ పాటిస్తున్నాయి. పురుషుల సంఖ్య స్త్రీల సంఖ్య కంటే ఎక్కువ ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని చెబుతారు. ప్రధాన సమాజంలో బహుభర్తృత్వ వివాహం అమలులో లేదు.



రచయిత: బద్దం పురుషోత్తంరెడ్డి

శీతోష్ణస్థితి మార్పు - సత్వర చర్యలు

'సూర్యుడు ఎప్పుడూ అస్తమించడు!'

ఒక దేశం, ప్రాంతానికే పరిమితం కాకుండా మొత్తం మానవాళి ఎదుర్కొంటున్న సమస్య శీతోష్ణస్థితి మార్పులు. మానవ చర్యలతో హానికర వాయువులు వాతావరణంలో కలిసి భూతాపం పెరగడంతో ఆ ప్రభావం ప్రతి ఒక్కరిపై పడుతోంది. వ్యవసాయం, మానవ ఆరోగ్యం, ప్రకృతి వనరులు, జీవవైవిధ్యం తదితరాలన్నింటినీ దెబ్బతీస్తున్న శీతోష్ణస్థితి మార్పులను అరికట్టడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసి కొన్ని ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ప్రకృతివనరుల సహజ స్థితిని కాపాడటానికి పర్యావరణవేత్తలు పోరాటాలు చేస్తున్నారు. ఈ పరిణామక్రమం, పలు ఒప్పందాల్లోని ముఖ్యాంశాలు, లక్ష్యాలపై పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. దేశంలో పర్యావరణ పరిరక్షణకు జరుగుతున్న సంస్థాగత ప్రయత్నాలు, అందుకోసం ఏర్పాటైన వ్యవస్థలు, సంస్థలు, వాటి కేంద్రస్థానాల గురించి తెలుసుకోవాలి.

పర్యావరణ అంశాలు

1. వాతావరణ మార్పుపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక వివిధ మిషన్ల లక్ష్యాల్లో సరైనవి.

   ఎ) 2022 నాటికి 100 గిగావాట్ గ్రిడ్ - అనుసంధాన సౌర విద్యుత్తు ప్లాంట్లను స్థాపించడం నేషనల్ సోలార్ మిషన్ లక్ష్యం.

   బి) వివిధ చర్యల ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని 25 శాతానికి పెంచడం నేషనల్ వాటర్ మిషన్ లక్ష్యం.

   సి) అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచడం, దేశవ్యాప్తంగా అటవీ, అటవీయేతర, బంజరు భూముల్లో 10 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు పెంచి కార్బన్ డయాక్సైడ్ స్థాయిని గణనీయంగా తగ్గించడం గ్రీన్ ఇండియా మిషన్ లక్ష్యం.

   1) బి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

2. కింది పర్యావరణవేత్తలకు సంబంధించిన అంశాలను జతపరచండి.



పర్యావరణవేత్త	బిరుదు
1) మరిముత్తు యోగనాథన్	ఎ) ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియా
2) మాధవ్ ధనంజయ గాడ్గిల్	బి) వెస్టర్న్ ఘాట్స్ ఎకాలజీ ఎక్స్‌పర్ట్ ప్యానెల్ హెడ్
3) మహేష్ చంద్ర మెహతా	సి) గ్రీన్ లాయర్ ఆఫ్ ఇండియా
4) జస్టిస్ కులదీప్ సింగ్	డి) గ్రీన్ జడ్జ్ ఆఫ్ ఇండియా

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
   3) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ 4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి

3. ప్రసిద్ధ పర్యావరణవేత్తలకు సంబంధించిన అంశాలను జతపరచండి.

పర్యావరణవేత్త	బిరుదు
1) వందనా శివ	ఎ) ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా
2) సలీం అలీ	బి) బర్డ్‌మ్యాన్ ఆఫ్ ఇండియా
3) రాజేంద్ర సింగ్	సి) వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా
4) జాదవ్ పయెంగ్	డి) నవధాన్య ఉద్యమ నాయకురాలు

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
   3) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ 4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి

4. పర్యావరణవేత్తలకు సంబంధించిన అంశాలను జతపరచండి.

పర్యావరణవేత్త	ప్రసిద్ధిగాంచిన అంశం
1) అమృతా దేవి	ఎ) బిష్ణోయ్ ఉద్యమం
2) సుందర్‌లాల్ బహుగుణ	బి) నర్మదా ఉద్యమం
3) మేధా పాట్కర్	సి) చిప్కో ఉద్యమం
4) పాండురంగ హెగ్డే	డి) అప్పికో ఉద్యమం

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
   3) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ 4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి

5. నేషనల్ అడాప్టేషన్ ఫండ్ ఫర్ క్లైమేట్ ఛేంజ్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి?

   ఎ) ఇది 2015-16లో ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వ పథకం.

   బి) వాతావరణ మార్పు ప్రతికూల ప్రభావాలను తగ్గించే కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం దీని లక్ష్యం.

   సి) దీన్ని నాబార్డ్ నిర్వహిస్తుంది.

   1) బి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

6. కోయలిషన్ ఫర్ డిజాస్టర్ రెసిలెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీడీఆర్ఐ) కు సంబంధించిన అంశాల్లో సరైనవి.

CDRI Coalition for Disaster Resilient Infrastructure

   ఎ) సీడీఆర్ఐ అనేది విపత్తులను తట్టుకునే మౌలిక సదుపాయాలను ప్రోత్సహించే లక్ష్యంతో అనేక దేశాలు, ఐక్యరాజ్యసమితి ఏజెన్సీలు, బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకులు, ప్రైవేట్ రంగం, విద్యాసంస్థల కలయికతో ఏర్పడిన అంతర్జాతీయ కూటమి.

   బి) విపత్తు ప్రమాద తగ్గింపుపై 2016లో న్యూదిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఆసియా మంత్రుల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ సీడీఆర్ఐని తొలిసారిగా ప్రతిపాదించారు.

   సి) 2024, సెప్టెంబరులో జరిగిన యూఎన్ క్లైమేట్ యాక్షన్ సమ్మిట్‌లో నరేంద్ర మోదీ దీన్ని ప్రారంభించారు.

   డి) న్యూదిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఎన్‌క్లేవ్‌లోని ఎన్‌డీఎంఏ ప్రధాన కార్యాలయాన్ని సీడీఆర్ఐ తాత్కాలిక సచివాలయంగా నిర్ణయించారు.

   1) ఎ 2) సి, డి 3) ఎ, సి, డి 4) ఎ, బి, డి

7. వన్ సన్ – వన్ గ్రిడ్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి?

   ఎ) వన్ సన్ - వన్ వరల్డ్ - వన్ గ్రిడ్ అనేది అంతర్జాతీయ విద్యుత్తు గ్రిడ్. 2018లో జరిగిన అంతర్జాతీయ సౌర కూటమి మొదటి సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఆలోచనను ప్రతిపాదించారు.

   బి) ఈ చొరవ వెనుక ఉన్న దృష్టి 'సూర్యుడు ఎప్పుడూ అస్తమించడు' అనే మంత్రం.

   సి) గ్లాస్గోలో జరిగిన కాప్-26 వాతావరణ సదస్సులో, భారతదేశం 'వన్ సన్ - వన్ వరల్డ్ - వన్ గ్రిడ్'ని ప్రారంభించింది. యునైటెడ్ కింగ్‌డమ్, ఐఎస్ఏ, ప్రపంచ బ్యాంక్ గ్రూప్ భాగస్వాములయ్యాయి.

   1) బి, సి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

8. అంతర్జాతీయ సౌర కూటమి – 1000 వైపు వ్యూహంలోని లక్ష్యాలను గుర్తించండి.

   ఎ) 2030 నాటికి 1000 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సమకూర్చుకోవడం.

   బి) 2030 నాటికి 1000 గిగావాట్ల సౌరశక్తి ఉత్పత్తి చేయడం.

   సి) 2030 నాటికి 1000 మిలియన్ల జనాభాకు సౌరశక్తి సరఫరా ద్వారా ఏటా 1000 మిలియన్ టన్నుల ఉద్గారాలు తగ్గించడం.

   1) ఎ, బి, సి 2) ఎ 3) ఎ, బి 4) బి, సి

9. కింది సంస్థలను, వాటి ప్రధాన కార్యాలయాలను జతపరచండి.



సంస్థ పేరు	ప్రధాన కార్యాలయం
1) నేషనల్ జూలాజికల్ పార్కు	ఎ) న్యూదిల్లీ
2) ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా	బి) దేహ్రాడూన్
3) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ వెల్ఫేర్	సి) బల్లాబ్‌గఢ్
4) బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా	డి) కోల్‌కతా
5) జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా	ఇ) కోల్‌కతా

   1) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ, 5-ఇ
   2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి, 5-ఇ
   3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి, 5-ఇ
   4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి, 5-ఇ

10. లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి?

   ఎ) 2021లో గ్లాస్గోలో జరిగిన 26వ ఐక్యరాజ్య సమితి క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్ సందర్భంగా 'లైఫ్' ఆలోచనను భారత్ ప్రవేశపెట్టింది.

   బి) ఈ ఆలోచన పర్యావరణ స్పృహతో కూడిన జీవనశైలిని, వ్యర్థమైన వినియోగానికి బదులుగా బుద్ధిపూర్వక, ఉద్దేశపూర్వక వినియోగంపై దృష్టి పెడుతుంది.

   సి) 'ప్రో-ప్లానెట్ పీపుల్' అనే గ్లోబల్ నెట్‌వర్క్ రూపొందించడానికి ఈ మిషన్ పనిచేస్తుంది.

   1) సి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

11. వాతావరణ మార్పుపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్ఏపీసీసీ)కు సంబంధించిన అంశాల్లో సరైనవి.

   ఎ) దీన్ని 2018, జూన్ 30న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు.

   బి) భారతదేశంలో 10 రకాల మిషన్స్ చేపట్టి గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించి సుస్థిరాభివృద్ధిలో భాగం కావడం దీని లక్ష్యం.

   సి) క్లైమేట్ ఛేంజ్ యాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ పథకాన్ని 2025-26 వరకు పొడిగించారు.

   1) సి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

12. వాతావరణ మార్పుపై జాతీయ కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన 8 రకాల మిషన్స్‌లో సరైనవి ఏవి?

   ఎ) లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్
   బి) నేషనల్ అడాప్టేషన్ ఫండ్ ఫర్ క్లైమేట్ ఛేంజ్
   సి) నేషనల్ వాటర్ మిషన్
   డి) నేషనల్ మిషన్ ఫర్ సస్టైనింగ్ హిమాలయన్ ఎకోసిస్టమ్
   ఇ) నేషనల్ మిషన్ ఫర్ స్ట్రాటజిక్ నాలెడ్జ్ ఆన్ క్లైమేట్ ఛేంజ్
   ఎఫ్) నేషనల్ సోలార్ మిషన్
   జి) నేషనల్ మిషన్ ఆన్ సస్టైనబుల్ హాబిటాట్

   1) ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్, జి
   2) సి, డి, ఇ, ఎఫ్, జి
   3) ఎ, బి, సి, ఇ 4) బి, సి, ఇ, జి

13. కేంద్ర పర్యావరణ, అటవీ, శీతోష్ణస్థితి మార్పు మంత్రిత్వశాఖ కింద పనిచేస్తున్న సంస్థలను, వాటి ప్రధాన కార్యాలయాలను జతపరచండి.

సంస్థ పేరు	ప్రధాన కార్యాలయం
1) జి.బి.పంత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్	ఎ) అల్మోరా
2) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్	బి) బెంగళూరు
3) ఇండియన్ ప్లైవుడ్ ఇండస్ట్రీస్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్	సి) భోపాల్
4) ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్	డి) దేహ్రాడూన్
5) వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా	ఇ) దేహ్రాడూన్



   1) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ, 5-ఇ
   2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి, 5-ఇ
   3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి, 5-ఇ
   4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి, 5-ఇ

14. కింది సంస్థలను, వాటి ప్రధాన కార్యాలయాలను జతపరచండి.

సంస్థ పేరు	ప్రధాన కార్యాలయం
1) సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్	ఎ) చెన్నై
2) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్	బి) అహ్మదాబాద్
3) సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ ఆఫ్ డిగ్రేడెడ్ ఎకోసిస్టమ్	సి) న్యూదిల్లీ
4) సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ	డి) కోయంబత్తూర్
5) ట్రాపికల్ బొటానిక్ గార్డెన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్	ఇ) తిరువనంతపురం

   1) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ, 5-ఇ
   2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి, 5-ఇ
   3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి, 5-ఇ
   4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి, 5-ఇ

15. అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ)కి సంబంధించిన అంశాలలో సరికానివి.

   ఎ) ఉష్ణమండల దేశాలన్నీ కలిపి భారీ స్థాయిలో సౌరశక్తిని ఉత్పత్తి చేసుకోవాలనే లక్ష్యంతో 2020లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కూటమిని ప్రారంభించారు.

   బి) ఐఎస్ఏ ప్రధాన కార్యాలయం భోపాల్‌లో ఉంది.

   సి) ఇటీవల మాల్టా దేశం ఇందులో చేరిన 119వ దేశంగా అవతరించింది.

   1) బి, సి 2) ఎ, బి, సి 3) ఎ, బి 4) ఎ, సి

సమాధానాలు

1-2; 2-1; 3-3; 4-2; 5-2; 6-4; 7-2; 8-1; 9-3; 10-2; 11-1; 12-2; 13-2; 14-4; 15-3.

పైపులు - తొట్టెలు

ముఖ్యాంశాలు

- ఒక పైపు ఒక తొట్టెను x గంటలో నింపితే, గంటలో నిండే భాగం $\frac{1}{x}$ అవుతుంది.
- ఒక పైపు ఒక తొట్టెను x గంటలో, మరో పైపు అదే తొట్టెను y గంటలో నింపితే, రెండు పైపులను ఒకేసారి తెరచినప్పుడు గంటలో అవి నింపే భాగం $= \frac{1}{x} + \frac{1}{y} = \frac{x+y}{xy}$
- ఆ రెండు పైపులు తొట్టెను నింపేందుకు పట్టేకాలం $\frac{xy}{x+y}$ రోజులు.
- ఒక పైపు ఒక తొట్టెను x గంటలో నింపుతుంది. మరో పైపు అదే తొట్టెను y గంటలో ఖాళీ చేస్తుంది. రెండు పైపులు తెరచి ఉంటే ఆ తొట్టె పూర్తిగా నిండేందుకు పట్టే కాలం $T = \frac{xy}{x-y}$
- T విలువ (+) అయితే తొట్టె నిండుతుంది, (−) అయితే తొట్టె ఖాళీ అవుతుంది.
- మూడుపైపులు ఒక తొట్టెని వరసగా x, y, z లలో నింపుతాయి. 3 పైపులను ఒకేసారి తెరిస్తే ఆ తొట్టె నిండేందుకు పట్టే సమయం $\frac{xyz}{xy+yz+zx}$ గంటలు.
- ఒక పంపు తొట్టెను x గంటల్లో నింపగలదు. అయితే లీకు ఉండటంతో తొట్టె y గంటల్లో నిండుతుంది. తొట్టె నిండుగా ఉన్నప్పుడు లీకు ద్వారా పూర్తిగా ఖాళీ అయ్యేందుకు పట్టే కాలం $= \frac{xy}{y-x}$

మాదిరి ప్రశ్నలు

1. A, B అనే రెండు పైపులు ఒక ట్యాంకును 6 గంటలు, 12 గంటల్లో నింపగలవు. రెండు పైపులను ఒకేసారి తెరిస్తే ట్యాంకు నిండేందుకు పట్టే సమయం? (గంటల్లో)

1) 4 2) 6 3) 5 4) 8

సాధన: ఒక గంటలో A నింపగలిగే భాగం $= \frac{1}{6}$

ఒక గంటలో B నింపగలిగే భాగం $= \frac{1}{12}$

A, Bలు కలసి ఒక గంటలో నింపగలిగే భాగం

$$= \frac{1}{6} + \frac{1}{12} = \frac{3}{12} = \frac{1}{4}$$

సమాధానం: 1

2. ఒక పైపు ఒక తొట్టెను 6 గంటల్లో నింపితే, మరో పైపు ఆ తొట్టెను 8 గంటల్లో ఖాళీ చేస్తుంది. రెండు పైపులు ఒకేసారి తెరిస్తే ఆ తొట్టె నిండేందుకు పట్టే సమయం? (గంటల్లో)

1) 24 2) 26 3) 48 4) 25

సాధన: మొదటి పైపు గంటలో నింపే భాగం $= \frac{1}{6}$


రెండో పైపు గంటలో ఖాళీ చేసే భాగం $= \frac{1}{8}$

రెండు పైపులు ఒకేసారి తెరిస్తే ఆ తొట్టె గంటలో నింపే భాగం $= \frac{1}{6} - \frac{1}{8} = \frac{8-6}{48} = \frac{2}{48} = \frac{1}{24}$

తొట్టె నిండేందుకు పట్టేకాలం = 24 గంటలు

సంక్షిప్త పద్ధతి: $\frac{8 \times 6}{8-6} = \frac{48}{2} = 24$ గంటలు

సమాధానం: 1



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

ఆ రెండింటితో పోల్చితే.. మూడో కుళాయి పనితీరు?

3. మూడు కుళాయిలను ఒకేసారి తెరిస్తే తొట్టె 12 గంటల్లో నిండుతుంది. వీటిలో ఒక కుళాయి 10, మరొకటి 15 గంటల్లో తొట్టెను నింపుతాయి. అయితే మూడో కుళాయి పనితీరు ఏమిటి?

1) 12 గంటల్లో నింపుతుంది 2) 10 గంటల్లో నింపుతుంది
3) 12 గంటల్లో ఖాళీ చేస్తుంది 4) 10 గంటల్లో ఖాళీ చేస్తుంది.

సాధన: మూడో కుళాయికి పట్టే కాలం x గంటలు అనుకుందాం.

$$\frac{10 \times 15 \times x}{10 \times 15 + 15x + x \times 10} = 12 \text{ గంటలు}$$

$$\frac{150x}{150 + 25x} = 12 \Rightarrow 50x = 600 + 100x$$

$$= 100x - 50x = -600 \Rightarrow 50x = -600$$

$$x = \frac{-600}{50} = -12 \text{ గంటలు}$$

సమాధానం: 3

4. A, B అనే పైపులు ఒక ట్యాంకును వరసగా 12 నిమిషాలు, 16 నిమిషాల్లో నింపగలవు. రెండు పైపులను తెరచిన తర్వాత ట్యాంక్ 9 నిమిషాల్లో నిండాలంటే ఎంత సమయం తర్వాత పంపు Bని నిలిపివేయాలి? (నిమిషాలలో)

1) 3 2) 4 3) 5 4) 6

సాధన: Bని x నిమిషాల తర్వాత మూసివేశామనుకుందాం.

(A + B)తో x నిమిషాల్లో నిండిన భాగం + A తో (9 − x) నిమిషాల్లో నిండిన భాగం = 1

$$x\left(\frac{1}{12} + \frac{1}{16}\right) + (9 - x) \times \frac{1}{12} = 1$$

$$x\left(\frac{4+3}{48}\right) + (9 - x) \times \frac{1}{12} = 1$$

$$\frac{7x}{48} + \frac{9-x}{12} = 1$$

$$\Rightarrow 7x + 36 - 4x = 48$$

$$\Rightarrow 3x = 12 \Rightarrow x = 4$$

సమాధానం: 2



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్,
విషయ నిపుణులు

5. రెండు పైపులు ఒక తొట్టెను వరసగా 10, 12 గంటల్లో నింపుతాయి. మరో పైపు 20 గంటల్లో ఆ తొట్టెను ఖాళీ చేస్తుంది. మూడు పైపులను ఒకేసారి తెరిస్తే ఆ తొట్టె నిండేందుకు పట్టే కాలం ఎంత?

1) 8 గంటలు 2) 8 గంటల 30 నిమి.
3) 9 గంటలు 4) 7 గంటల 30 నిమి.

సాధన: ఒక గంటలో మొత్తం తొట్టె నిండిన భాగం

$$= \left(\frac{1}{10} + \frac{1}{12} - \frac{1}{20}\right) = \frac{8}{60} = \frac{2}{15}$$

తొట్టె నిండేందుకు పట్టేకాలం $= \frac{15}{2} = 7$ గంటల 30 నిమి.

సమాధానం: 4

6. ఒక పైపు ఒక తొట్టెను 15 గంటల్లో నింపుతుంది. అడుగున రంధ్రం ఉండటంతో ఆ తొట్టె 20 గంటల్లో నిండింది. రంధ్రం కారణంగా నిండుగా ఉన్న తొట్టె ఖాళీ అయ్యేందుకు పట్టే సమయం? (గంటల్లో)

1) 50 2) 55 3) 60 4) 67

సాధన: గంటలో రంధ్రం ద్వారా బయటకు వెళ్లే నీరు

$$= \left(\frac{1}{15} - \frac{1}{20}\right) = \frac{1}{60}$$

తొట్టె ఖాళీ అయ్యేందుకు పట్టే సమయం = 60 గంటలు

సమాధానం: 3

7. ఒక పైపు ఒక తొట్టెను 6 గంటల్లో ఖాళీ చేస్తే, మరో పైపు ఆ తొట్టెను 3 గంటల్లో ఖాళీ చేస్తుంది. రెండింటినీ ఒకేసారి తెరిస్తే ఆ తొట్టె ఖాళీ కావడానికి పట్టే సమయం? (గంటల్లో)

1) 5 2) 2 3) 3 4) 90

సాధన: రెండు పైపులు ఒక గంటలో ఖాళీచేసే భాగం $= \frac{1}{6} + \frac{1}{3}$

$$= \frac{1+2}{6} = \frac{3}{6} = \frac{1}{2}$$ (తొట్టె ఖాళీకి పట్టే కాలం 2 గంటలు)

సమాధానం: 2

Word of the Day 854

Malediction

Telugu meaning: శాపం, దూషణ

English meaning: The word malediction (మేల్‌డిక్షన్) is a noun that means a curse or a spoken expression wishing harm upon someone.

Synonyms: Curse, Imprecation; *Antonyms:* Blessing, Benediction

Usage: **1.** The ancient legend warned that anyone entering the temple would face a terrible malediction.

2. Angered by betrayal, he muttered a malediction under his breath as he walked away.

కరెంట్ అఫైర్స్



ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల పరపతి విధాన కమిటీ రెపోరేటు (బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద తీసుకునే రుణాలకు చెల్లించే వడ్డీ)ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25 శాతానికి చేర్చాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. 2024 డిసెంబరు 6న రెపోరేటు 6.50% కాగా.. ఏడాది తర్వాత ఇప్పుడు 5.25 శాతానికి దిగివచ్చింది. అంటే 2025లో రెపోరేటు 1.25% (ఫిబ్రవరిలో 0.25%, ఏప్రిల్‌లో 0.25%, జూన్‌లో 0.50%, డిసెంబరులో 0.25% చొప్పున) తగ్గింది.



అరుదుగా పుష్పించే పరాన్నజీవి మొక్కను 175 ఏళ్ల తర్వాత కేరళలో పరిశోధకులు మళ్లీ కనుక్కున్నారు. 'క్యాంప్‌బెలియా ఆరంటియాకా'గా ఈ మొక్కను గుర్తించారు. వయనాడ్ జిల్లాలోని థొల్లాయిరాం ప్రాంతంలో ఇది కనిపించింది. ఈ జాతి మొక్కను మొదట 1849కి ముందు తమిళనాడులోని నడువట్టం వద్ద స్కాటిష్ వృక్ష శాస్త్రవేత్త రాబర్ట్ విట్ చూశారు. అయితే, దీనికి సంబంధించిన విశ్వసనీయమైన రికార్డులేవీ లేవు.



పోషకాహారం కొరవడటంతో ఎదుగుదల లేక అయిదేళ్ల వయసులోపే మరణించే బాలల సంఖ్యలో నైజీరియా మొదటి స్థానంలో ఉంటే, భారత్ రెండో స్థానంలో, కాంగో మూడో స్థానంలో ఉన్నాయని లాన్సెట్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం తెలిపింది. బరువు తక్కువగా ఉండటం, కృశించిపోవడం, ఎదుగుదల లేక గిడసబారిపోవడం లాంటి రుగ్మతలు నీళ్ల విరేచనాలకు, శ్వాసకోశ సమస్యలకు, మలేరియా, పొంగు వంటి వ్యాధులకు దారితీస్తాయి.

☛ ప్రపంచంలో 2023లో ఎదుగుదల కొరవడి అయిదేళ్లలోపే మరణించిన బాలల సంఖ్య 10 లక్షలైతే, వాటిలో 1,88,000 మరణాలతో నైజీరియా, లక్ష మరణాలతో భారత్, 50,000 మరణాలతో డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో మొదటి మూడు స్థానాలను ఆక్రమిస్తున్నాయి.

మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి.త్రివిక్రమరావు (విక్రమ్)ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025, డిసెంబరు 5న ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్లు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సార్క్ చార్టర్ డే

డిసెంబరు 8
చరిత్రలో ఈనాడు

ప్రపంచ దేశాల మధ్య సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సహకారాన్ని సాధించే లక్ష్యంతో అనేక అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటయ్యాయి. ఇవి ప్రాంతాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు కృషి చేయడంతోపాటు అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరచడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. వీటిలో ప్రధానంగా చెప్పుకోవాల్సిన సంస్థ 'దక్షిణాసియా ప్రాంతీయ సహకార మండలి - సార్క్ (South Asian Association for Regional Cooperation - SAARC). ఇది ఏర్పడిన తేదీని పురస్కరించుకుని ఏటా డిసెంబరు 8న 'సార్క్ చార్టర్ డే'గా (SAARC Charter Day) నిర్వహిస్తారు. దక్షిణాసియా దేశాల మధ్య అభివృద్ధి, సహకారాన్ని పెంపొందించడంలో సార్క్ పాత్రను గుర్తించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

సార్క్ నేపథ్యం

దక్షిణాసియా దేశాల మధ్య పరస్పర ప్రాంతీయ సహకారం, అభివృద్ధిని పెంపొందించాలని బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ భావించారు. దీనికోసం 'దక్షిణాసియా ప్రాంతీయ సహకార మండలిని (సార్క్) ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

✦ ప్రారంభంలో ఇందులో 7 సభ్య దేశాలు ఉన్నాయి. అవి: బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక. 2007, ఏప్రిల్‌లో న్యూదిల్లీలో జరిగిన 14వ సార్క్ సమావేశాల్లో ఎనిమిదో సభ్య దేశంగా అఫ్గనిస్థాన్ చేరింది. దీని చేరికతో ప్రస్తుతం సార్క్‌లోని సభ్యదేశాల సంఖ్య ఎనిమిదికి చేరింది.



చారిత్రక నేపథ్యం

1985, డిసెంబరు 8న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో నిర్వహించిన సమావేశంలో సార్క్‌ను ఏర్పాటుచేశారు. దీనికి సంబంధించిన చార్టర్‌పై సభ్యదేశాలు సంతకాలు చేశాయి. సార్క్ దేశాల్లో ప్రజల జీవితాలను మెరుగుపరచడం, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, స్వావలంబనను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. దీని ఏర్పాటుకు గుర్తుగా ఏటా ఆ తేదీన 'సార్క్ చార్టర్ డే'గా నిర్వహిస్తారు.

సార్క్ లక్ష్యాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

జాతీయ సమైక్యత - సమస్యలు - సవాళ్లు

ఒక దేశంలోని భిన్నత్వంలో ఏకత్వమే జాతీయ సమైక్యత. ప్రజల్లో కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలు లేకుండా అంతా ఒకటే అనే భావన కలిగినప్పుడే జాతీయ సమైక్యత ఏర్పడుతుంది. దీనికి అనేక అంశాలు అవరోధాలుగా నిలుస్తున్నాయి.

జాతీయ సమైక్యత సాధించడానికి సూత్రాలు


రాజకీయ పక్షాలు కుల, మత, భాషా వర్గాల్లోని భిన్నత్వాలను రెచ్చగొట్టే చర్యలకు ఉపక్రమించరాదు.

✦ శాంతిభద్రతలకు హాని కలిగించే ఉద్యమాలు, ఆందోళనలు ప్రారంభించి తమ భాషా, ప్రాంతీయ మత సమస్యల పరిష్కారానికి ప్రయత్నించరాదు.

కులతత్వం: భారత సమాజంలో అనేక కులాలు, ఉపకులాలు ఉన్నాయి. దేశంలోని అనేకుల్లో కులంపై ప్రత్యేక అభిమానం ఉంటుంది. కానీ అది కులతత్వంగా పరిణమించినప్పుడే జాతి సమైక్యతకు ప్రమాదంగా తయారవుతుంది.

✦ దేశ ప్రయోజనాలను పక్కనపెట్టి సొంత కులానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, ఇతర కులాలపై ఈర్ష్య, పక్షపాతం చూపడమే కులతత్వం.

ప్రాంతీయతత్వం: ఒక రాష్ట్రంలో/నిర్దిష్ట ప్రాంతంలోని ప్రజలు రాజకీయంగా ఏకమై, సాంఘిక, ఆర్థిక ప్రయోజనాల కోసం జరిపే ఉద్యమాన్ని ప్రాంతీయవాదం అంటారు.



జాతీయ సమగ్రతా మండలి, విడిపోయే ధోరణులు, ద్రవిడనాడ్ ప్రత్యేక రాజ్యవాదన, మిజో సమస్య, నాగాలాండ్ సమస్య మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సుల్లో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Diploma Engineering Trainee Posts

Udupi Cochin Shipyard Limited (UCSL), Karnataka, is inviting applications for the Diploma Engineering Trainee posts in various departments. The total no. of posts is 16. The application fee is Rs. 600. Eligible candidates can apply online before 18 December 2025.

Act Apprentice Posts

Railway Recruitment Cell, South Eastern Railway, Kolkata, invites online applications for engagement of Act Apprentices in the designated trades at various Workshops of South Eastern Railway for the year 2025-26. The total no. of posts is 1,785. The application fee is Rs.100. The last date for online applications is 17 December 2025.

Jobs in the Intelligence Bureau

The Intelligence Bureau has released a notification for the recruitment of Multi-Tasking Staff (MTS) posts across the country on a direct recruitment basis. The total no. of posts is 362. The application fee is Rs. 650. The last date for receipt of online applications is 14 December 2025.

Did You Apply..?

Today (December 8) is the last date for the following Jobs/ Apprentice posts

☛ 177 Senior Resident posts in AIIMS Guwahati. *Qualification:* PG (MD/MS/DNB), MSc, PhD.

☛ 156 Apprentice posts in BDL, Kanchanbagh, Hyderabad. *Eligibility:* 10th, ITI.

For more information and other notifications - scan QR code

Synonyms

Directions (Qs. 1 - 11): *In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with four options to choose from. Choose the appropriate synonym from those options that suits the word given in bold letters.*

1. The activist delivered a **vehement** speech condemning the misuse of public funds by local authorities.
A) Mild B) Forceful
C) Quiet D) Casual

2. The villagers were **ecstatic** after hearing that a long-awaited irrigation project had finally been approved by the authorities.
A) Calm B) Sad
C) Angry D) Overjoyed

3. His **tacit** approval of the plan encouraged the team to move forward without hesitation.
A) Silent B) Loud
C) Delayed D) Explicit

4. Despite several obstacles, her **resolute** determination helped her clear the exam on her third attempt.
A) Weak B) Firm
C) Confused D) Tired

5. His remarks were filled with **acrimony**, creating tension among the otherwise friendly group members.
A) Sweetness B) Bitterness
C) Friendship D) Clarity

6. The detective's **astounding** observations helped uncover details that everyone else had overlooked.
A) Ordinary B) Amazing
C) Harsh D) Wrong

7. The manager tried to remain **equanimous** even when employees became emotional during the discussion.
A) Calm B) Impatient
C) Worried D) Angry

8. The factory was shut down after the inspection team found **egregious** violations of safety protocols.
A) Minor B) Outstanding
C) Severe D) Confusing

9. Her writing style is known for its **ornate** descriptions that paint vivid pictures for readers.
A) Simple B) Decorative
C) Harsh D) Limited

10. His **candid** confession during the inquiry surprised everyone in the room.
A) Honest B) Secret
C) Polished D) Forced

11. The CEO took a **proactive** approach to resolving internal conflicts before they escalated.
A) Reactive B) Delayed
C) Preventive D) Passive

SSC Exams
English

Directions (Qs. 12 - 26): *In each of the questions given below, a word is given in bold letters and four options are presented. Choose the appropriate synonym from those options that suits the word given in bold letters.*

12. Prowess
A) Skill B) Confusion
C) Weakness D) Fear

13. Conceit
A) Honesty B) Shyness
C) Vanity D) Modesty

14. Intrepid
A) Timid B) Fearless
C) Confused D) Weak

15. Sabotage
A) Assist B) Protect
C) Support D) Undermine

16. Subterfuge
A) Honesty B) Deception
C) Clarity D) Simplicity

17. Propitious
A) Dangerous B) Hostile
C) Favourable D) Hopeless

18. Chunky
A) Smooth B) Tiny
C) Flat D) Bulky

19. Abjure
A) Renounce B) Accept
C) Gather D) Approve

20. Barrier
A) Path B) Obstacle
C) Entrance D) Channel

21. Conspicuous
A) Hidden B) Noticeable
C) Secret D) Ordinary

22. Fervour
A) Coldness B) Doubt
C) Indifference D) Passion

23. Languish
A) Strengthen B) Weaken
C) Rise D) Improve

24. Vicious
A) Kind B) Gentle
C) Brutal D) Polite

25. Dwindle
A) Increase B) Diminish
C) Multiply D) Expand

26. Humility
A) Pride B) Arrogance
C) Modesty D) Ego

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

విశాఖ అందాలు వీక్షిద్దామా.. తిరుపతి ఆలయాలు దర్శిద్దామా?

ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ 'లోకల్ టూరిజం' ప్యాకేజీలు ● వాల్తేరు తీరంలో ప్రత్యేక ఆకర్షణగా డబుల్ డెక్కర్ బస్సులు

విశాఖ అందాలను వీక్షిద్దామనుకుంటున్నారా? ఇక్కడి నుంచి రైలు, రోడ్డు మార్గంలో అరకు వెళ్లాలనుకుంటున్నారా? ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలోని ప్రసిద్ధ దేవాలయాల్లో దర్శనం చేసుకోవాలనుకుంటున్నారా? ఇంకెందుకు ఆలస్యం.. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ నిర్వహించే 'లోకల్ టూరిజం' పేరుతో ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చింది. పర్యాటకాభివృద్ధి సంస్థ వెబ్‌సైట్‌లో మీకు కావలసిన తేదీల్లో టికెట్లు రిజర్వు చేసుకుంటే చాలు.. రైలు, బస్సుల్లో ఆయా ప్రదేశాలను చుట్టేయొచ్చు. విశాఖలో ఇటీవల ప్రారంభించిన డబుల్ డెక్కర్ బస్సుల్లోనూ బీచ్ రోడ్డులో విహరించొచ్చు.

ఈనాడు-అమరావతి

విశాఖలో అందాలు చూడొచ్చిలా.. (పెద్దలకు రూ.880, పిల్లలకు రూ.700)

విశాఖలో రోజూ ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరి కైలాసగిరి, సింహాచలం, తొట్లకొండ, ఫిషింగ్ హార్బర్ (బోటింగ్ పాయింట్), ఆర్కే బీచ్, విశాఖ మ్యూజియం మీదుగా జాతర శిల్పారామం వరకు వెళుతుంది. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను గైడ్ వివరిస్తారు. మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు ఈ యాత్ర ముగుస్తుంది.

విశాఖ–అరకు రోడ్డు మార్గంలో.. (పెద్దలకు రూ.1,590, పిల్లలకు రూ.1,270)

రోజూ ఉదయం 7 గంటలకు విశాఖపట్నం నుంచి నాన్ ఏసీ బస్సు బయలుదేరుతుంది. అరకులో పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, అనంతగిరి కాఫీ తోటలు, గాలికొండ వ్యూ పాయింట్, బొర్రా గుహలు చూడొచ్చు. గిరిజనుల థింసా నృత్యంతో టూర్ ముగుస్తుంది. తిరిగి మళ్లీ రోడ్డు మార్గంలోనే రాత్రి 9 గంటలకు విశాఖ తీసుకొస్తారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం చిరుతిళ్లు, తేనీరు ప్యాకేజీలో భాగంగా సమకూర్చుతారు.

విశాఖ–అరకు రైల్‌లో.. (పెద్దలకు రూ.1,710, పిల్లలకు రూ.1,370)

విశాఖ నుంచి అరకుకు రైల్‌లోనూ వెళ్లొచ్చు. చుట్టూ తోటలు, పచ్చని సొరంగాల మధ్య గుహల్లో నుంచి రైలు వెళుతుంది. అరకులో పలు సందర్శనీయ ప్రాంతాలకు వాహనాల్లో తీసుకెళ్లి, తిరిగి రోడ్డు మార్గంలో విశాఖ తీసుకొస్తారు.



విశాఖ ఆర్కే బీచ్‌లో డబుల్ డెక్కర్ బస్సు

డబుల్ డెక్కర్ బస్సుల్లో రయ్ రయ్.. (టికెట్ ధర రూ.250)

విశాఖ వచ్చే పర్యాటకులకు సరికొత్త అనుభూతి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెండు డబుల్ డెక్కర్ బస్సుల్ని ప్రారంభించింది. వీటిల్లో నగరంలోని 11 ముఖ్యమైన ప్రాంతాలను చుట్టేయొచ్చు. ఆర్కే బీచ్‌లో ఉదయం 9 గంటలకు బస్సు ప్రయాణం మొదలై రాత్రి 8 గంటలకు ముగుస్తుంది. బీచ్‌కి అనుకుని ఉన్న మ్యూజియంలు, సబ్‌మెరైన్, కైలాసగిరి రోప్‌వే, జూపార్కు, రుషికొండ, తొట్లకొండ ఇలా పలు సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లిరావొచ్చు. పర్యాటకుల రద్దీ దృష్ట్యా మరో ఓపెన్ టాప్ బస్సుని ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

తిరుపతిలో ప్రధాన ఆలయాలకు బస్సుల్లో.. (టికెట్ ధర రూ.250)

తిరుపతిలోని ఆరు ప్రధాన దేవాలయాలకు బస్సులో వెళ్లి రావొచ్చు. ప్రతి గంటకూ ఓ బస్సు బయలుదేరుతుంది. తిరుపతిలో విష్ణు నివాసం వద్ద ప్రారంభమై తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, పేరూరులోని వకుళమాత, తొండవాడలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, తిరుపతిలోని జీవకోన స్వామి, గోవిందరాజస్వామి ఆలయాలకు తీసుకెళ్లి దర్శనం కల్పిస్తారు.

మరో 7 దేవాలయాలకు (టికెట్ ధర రూ.550)

తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లోని మరో ఏడు ప్రసిద్ధ ఆలయాలకు బస్సుల్లో వెళ్లి దర్శనం చేసుకోవచ్చు. తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద ఉదయం 8.30, 9.30 గంటలకు రెండు ప్యాకేజీల కింద బస్సు ప్రయాణం మొదలవుతుంది. కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయం, సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర స్వామి, నాగలాపురంలోని వేదనారాయణ స్వామి, నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి, అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి, నగరిలోని కరియ మాణిక్యస్వామి, బుగ్గలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాలను సందర్శించొచ్చు.

తిరుపతి–శ్రీకాళహస్తి: (ఒకరికి రూ.450)

ప్రతి రోజూ ఉదయం 9.30 గంటలకు బస్సు తిరుపతిలో బయలుదేరుతుంది. తిరుచానూరు పద్మావతి ఆలయం, విశ్వరూప సంతాన వేంకటేశ్వరస్వామి, తొండమనాడు వెంకటేశ్వరస్వామి, శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాలు దర్శించొచ్చు.

తిరుపతి–ఒంటిమిట్ట (మనిషికి రూ.800)

శని, ఆది, సోమవారాల్లో ఉదయం 8 గంటలకు బస్సు బయలుదేరుతుంది. ఒంటిమిట్ట కోదండ రామస్వామి, నందలూరు సౌమ్యనాథ స్వామి, తాళ్లపాక చెన్నకేశవస్వామి (అన్నమయ్య జన్మస్థలం) దర్శనం చేసుకోవచ్చు.

తిరుపతి–కాణిపాకం (మనిషికి రూ.550)

రోజూ ఉదయం 9.30 గంటలకు తిరుపతిలో బస్సు బయలుదేరుతుంది. తిరుచానూరు పద్మావతి ఆలయం, వకుళమాత ఆలయం (పేరూరు) కల్యాణ వేంకటేశ్వరస్వామి (శ్రీనివాస మంగాపురం) కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయం, కపిలతీర్థం వెళ్లి రావొచ్చు.

9న ఎంఎస్ఎంఈల బలోపేతంపై కార్యశాల

● మంత్రి కొండపల్లి



ఈనాడు, అమరావతి: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం సాంకేతికత, వినూత్న ఆవిష్కరణలు, మేధోసంపత్తి హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 9న కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ (ఎన్‌ఆర్‌డీసీ), ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తాయని పేర్కొన్నారు. 'టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, కమర్షియలైజేషన్ ద్వారా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లను బలోపేతం చేసే అంశం'పై మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో కార్యశాల ఉంటుంది. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు అవగాహన కల్పించే లక్ష్యంతో ర్యాంప్ కార్యక్రమం కింద దీన్ని నిర్వహిస్తున్నారు. సాంకేతికత వినియోగించడం, వినూత్న ఆవిష్కరణలు, మార్కెటింగ్ వంటి అంశాల్లో అవగాహన కల్పిస్తారు. ఎంఎస్ఎంఈ ఇన్నోవేషన్ పథకం కింద కేంద్రం అందించే ప్రోత్సాహకాల గురించి వివరిస్తారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. సమస్యలు ఉంటే 99495 68527, 98101 04163 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కశ్మీర్‌లో.. విశాఖ ఎల్ఈడీ విధానం!

జమ్మూ-కశ్మీర్ జెరా ఛైర్మన్ సతీష్‌చంద్ర

ఈనాడు, అమరావతి: ఇంధన సామర్థ్య చర్యల అమలులో భాగంగా ఎల్ఈడీ వీధిదీపాల సాంకేతికతను విశాఖ మాదిరిగా అమలు చేస్తామని జమ్మూ-కశ్మీర్ జెరా ఛైర్మన్ సతీష్‌చంద్ర పేర్కొన్నారు. జమ్మూలో ఇంధన పొదుపు అమలుపై ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సీఈవో అఖిలేష్ కుమార్ తయారుచేసిన నివేదికను జమ్మూలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌చంద్ర మాట్లాడుతూ.. "2019 వరకు ఏపీ సీఎం కార్యాలయ ప్రత్యేక సీఎస్ హోదాలో పని చేసినప్పుడు అక్కడ అమలుచేసే ఇంధన సామర్థ్య విధానాలను నిశితంగా పరిశీలించా. వాటినే జమ్మూ-కశ్మీర్ గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖకు సూచించా. విశాఖలో ఎల్ఈడీ వీధిదీపాల ఏర్పాటుతో విద్యుత్తు వినియోగం 40% ఆదా అయ్యింది. ఇదే తరహలో జమ్మూ-కశ్మీర్‌ను ప్రపంచంలో మొదటి ఇంధన సామర్థ్య పర్యాటక రాజధానిగా తీర్చిదిద్దాలని నిర్ణయించాం" అని సతీష్‌చంద్ర పేర్కొన్నట్లు ఈఈఎస్ఎల్ ఓ ప్రకటనలో తెలిపింది.

చెత్త తెస్తే గుడ్లు, అన్నం

పశ్చిమ బెంగాల్‌లోని భద్రేశ్వర్ మున్సిపాలిటీ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. చెత్తను సేకరించుకుని వచ్చిన వారికి డబ్బుకు బదులుగా గుడ్లు, అన్నం అందిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'మా క్యాంటీన్'ను ఏర్పాటు చేసింది. చెత్తను ఏరుకునేవారు కేజీ చెత్త తెచ్చి ఇస్తే.. 2, 2 కేజీల చెత్తను తెస్తే 5 ఆహార కూపన్లను అందిస్తోంది. ఈ కూపన్లను మా క్యాంటీన్‌లో ఇస్తే గుడ్లు, అన్నం ఇస్తారు. దీనివల్ల వీధుల్లో నివసించేవారికి ఆహారం అందించడంతోపాటు చెత్త శుభ్రమవుతుందని అధికారులు చెబుతున్నారు.



17 నుంచి రాష్ట్రపతి శీతాకాల విడిది

బొల్లారం, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దక్షిణాది శీతాకాల విడిది ఖరారైంది. ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆమె విడిది చేయనున్నారు. 19న రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 20న గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో గ్లోబల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. 21న వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశం అవుతారు. అనంతరం నిర్వహించే తేనీటి విందులో పాల్గొంటారు. 22న ఉదయం దిల్లీకి బయలుదేరి వెళ్తారు.

10న క్లాట్ ప్రాథమిక 'కీ' విడుదల

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా 156 పరీక్షా కేంద్రాల్లో కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్-2026) ఆదివారం జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 92,344 మంది దరఖాస్తు చేసుకున్నారు. అండర్ గ్రాడ్యుయేట్‌కు 75,009 మంది దరఖాస్తు చేయగా.. 97 శాతం మంది హాజరయ్యారు. పీజీకి 17,335 మందికి గాను 92.45 శాతం మంది పరీక్ష రాశారని నేషనల్ లా యూనివర్సిటీస్ కన్సార్షియం తెలిపింది. ఈ నెల 10న సాయంత్రం ప్రాథమిక కీ విడుదల చేస్తామని, అభ్యంతరాలుంటే 12వ తేదీ వరకు పంపవచ్చని పేర్కొంది.



దోర్బల ప్రభాకరశర్మకు ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న కె.యాదగిరి, శ్రీరంగాచార్య, రవ్వా రమేశ్, మసన చెన్నప్ప, రఘునాథశర్మ, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెల్చాల కొండలరావు, పిల్లలమర్రి రాములు ✦ పురస్కార గ్రహీత గుంజి వెంకటరత్నం

సంస్కృతంతో సంస్కృతిని వ్యాప్తి చేసిన ఆచార్య రవ్వా శ్రీహరి

● ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: సంస్కృతం ద్వారా సంస్కృతిని వ్యాప్తి చేసిన ఘనత ఆచార్య రవ్వా శ్రీహరిదే అని ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. సంస్కృత పండితుడు, కొవ్వూరు ప్రాచ్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డా.దోర్బల ప్రభాకరశర్మ, తెలుగు భాషా సాహిత్య పరిశోధకుడు డా.గుంజి వెంకటరత్నంలకు ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేయడంతో పాటు నగదు బహుమతి అందజేశారు. తెలుగు అకాడమీ పూర్వ సంచాలకుడు ప్రొఫెసర్ కె.యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ భాషలకు కీలకమైన వ్యాకరణ, ఛందస్సు శాస్త్రాలను అధ్యయనం చేసిన మహానుభావుడు రవ్వా శ్రీహరి అని కొనియాడారు. విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు డా.కొండలరావు వెల్చాల మాట్లాడుతూ... రవ్వా శ్రీహరిని రుషిగా అభివర్ణించారు. సంస్కృత అధ్యయనంలో ప్రతిభ కనబరచిన 10 మంది విద్యార్థులకు యువ సంస్కృత ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రొ.పిల్లలమర్రి రాములు, ఆచార్య మసన చెన్నప్ప, ఆచార్య శలాక రఘునాథశర్మ, డా.శ్రీరంగాచార్య, రవ్వా రమేశ్ తదితరులు ప్రసంగించారు.

క్యాబ్‌లో మైనర్‌పై అత్యాచారం.. భారత సంతతి డ్రైవరుకు ఏడేళ్ల జైలుశిక్ష

● న్యూజిలాండ్‌లో ఘటన

వెల్లింగ్టన్: క్యాబ్‌లో మైనర్ ప్రయాణికురాలిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో భారత సంతతికి చెందిన డ్రైవరు సత్వీందర్ సింగ్(37)కు న్యూజిలాండ్ కోర్టు ఏడేళ్ల 2 నెలల జైలుశిక్ష విధించింది. 2023 ఫిబ్రవరిలో హామిల్టన్ ప్రాంతంలో 17 ఏళ్ల బాధితురాలు రాత్రి సమయంలో సత్వీందర్ నడుపుతున్న క్యాబ్‌ను బుక్ చేసుకుంది. ఒంటరిగా క్యాబ్ ఎక్కిన బాధితురాలిని నిందితుడు లైంగికంగా వేధించాడు. కారు జీపీఎస్‌ను ఆఫ్ చేసి దారి మళ్లించాడు. కారు తలుపులు లాక్ చేసి ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. అతడి నేరం రుజువు కావడంతో కోర్టు అతడికి శిక్ష విధిస్తూ తాజాగా తీర్పు వెలువరించింది.

పోక్సో చట్టం కింద ఓ వ్యక్తికి 20 ఏళ్ల శిక్ష

థాణె: పోక్సో చట్టం కింద ఓ వ్యక్తికి థాణె కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 2021లో 13 ఏళ్ల అమ్మాయి గర్భానికి కారణమైన 34 ఏళ్ల సాహిద్ మహమ్మద్ రంజాన్ హష్మీ అనే వ్యక్తిపై నమోదైన కేసులో శుక్రవారం ఈ తీర్పు వెలువరించింది. జైలు శిక్షతో పాటు అతనికి రూ.50,000 జరిమానా విధించింది.


పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లో గెలుస్తాం

● అమిత్ షా స్పష్టీకరణ



అహ్మదాబాద్: పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. 2029లో అంతర్జాతీయ పోలీసు, 2030లో కామన్‌వెల్త్ క్రీడలను అహ్మదాబాద్‌లో విజయవంతంగా నిర్వహిస్తామని, 2036లో ఒలింపిక్స్‌నూ ఇక్కడ నిర్వహిస్తామని తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఆదివారం ఆయన రూ.1,500 కోట్లతో నిర్మించే 3 క్రీడా సముదాయాలతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. '2014 లోక్‌సభ ఎన్నికల నుంచి 2025 దాకా భాజపా వరుస విజయాలను సాధిస్తూ వస్తోంది. 2024 ఎన్నికల్లో గెలిచి మోదీ మూడోసారి ప్రధాని అయ్యారు. మహారాష్ట్ర, హరియాణా, దిల్లీ, బిహార్‌లలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. ఈ వేదిక నుంచి మమతా బెనర్జీ, స్టాలిన్‌కు ఒకటే చెప్పదలచుకున్నా. సిద్ధంగా ఉండండి. మీ రాష్ట్రాల్లో ఎన్డీయే గెలవబోతోంది. తృణమూల్, డీఎంకే తుడిచిపెట్టుకుపోతాయి' అని పేర్కొన్నారు. అయోధ్యలో రామాలయం పూర్తయిందని, త్వరలో బిహార్‌లోని సీతామఢిలో సీతాదేవి మందిరం పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

సూపర్ బుర్రల గుట్టు వీడింది



వయసు మీదపడుతున్నకొద్దీ మెదడు పనితీరు నెమ్మదించడం సహజమని భావిస్తుంటాం. కొందరు 'సూపర్ ఏజర్ల'కు ఈ సూత్రం వర్తించదు. ముదిమిలోనూ వారి జ్ఞాపకశక్తి ఏమాత్రం సన్నగిల్లదు. వారి మెదడు ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. దీనికి కారణాలను అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గుర్తించారు. హానికారక మెదడు ప్రొటీన్లు పేరుకుపోకుండా వీరి మెదళ్లు నిలువరించడం కానీ వాటి ప్రభావానికిలోను కాకుండా ఉండటం కానీ జరుగుతోందని తేల్చారు. దీంతో అల్జీమర్స్, ఫ్రాంటోటెంపోరల్ క్షీణత వంటి నాడీ సంబంధ వ్యాధులతో ముడిపడిన తీవ్ర మతిమరుపును నివారించడం లేదా జాప్యం చేసే కొత్త చికిత్సలను రూపొందించడానికి మార్గం సుగమమవుతుందని వారు చెబుతున్నారు.

80 ఏళ్లు పైబడినప్పటికీ 30 ఏళ్ల లోపు వారి తరహా మెదడు పనితీరును కనబరిచే వారిని సూపర్ ఏజర్లుగా పిలుస్తారు. వయసు మీదపడేకొద్దీ మానసిక సామర్థ్యం క్షీణించడం సహజమన్న భావనకు వీరు పెద్ద సవాల్. దీన్నిబట్టి అసాధారణ స్థాయిలో విషయగ్రహణ సామర్థ్యాన్ని జీవితకాలం కాపాడుకోవడానికి అవకాశం ఉందని స్పష్టమవుతోంది. అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు.. 290 మంది సూపర్ ఏజర్లను పాతికేళ్ల పాటు పరిశీలించారు. వారి మెదళ్లు అంత చురుగ్గా ఎలా పని చేస్తున్నాయన్నది శోధించారు. వారిలో కొన్నిరకాల జీవన శైలి, వ్యక్తిత్వ సంబంధ లక్షణాల్లో సారూప్యతలను గుర్తించారు.

- ● భిన్న జీవనవిధానాలు, వ్యాయామ తీరుతెన్నులు ఉన్నప్పటికీ సూపర్‌ఏజర్లలో సామాజిక బంధాలు ఎక్కువ. వీరు సమాజంతో కలివిడిగా ఉంటారు.
- ● చురుకైన జీవనశైలిని కలిగి ఉంటారు.

మెదళ్లలో గుట్టు..

పరీక్షార్థుల్లో 77 మంది మరణానంతరం తమ మెదళ్లను పరిశోధనల కోసం దానమిచ్చారు. వీటిని పరిశోధకులు పరిశీలించారు. అందులో ఆశ్చర్యకరమైన అంశం వెలుగుచూసింది.

- ● కొందరిలో అమైలాయిడ్, టావ్ ప్రొటీన్లు ఉన్నాయి. వీటిని పూడికలు, ట్యాంగిల్స్ అంటారు. ఇవి అల్జీమర్స్ వ్యాధికి సూచికలు.
- ● మిగతావారి మెదళ్లలో ఇవి పేరుకుపోయిన జాడలేదు.
- ● ఈ నేపథ్యంలో సూపర్ ఏజర్ కావడానికి రెండు అంశాలు దోహదపడుతున్నట్లు వెల్లడైంది. 1. పూడికలు, ట్యాంగిల్స్ అసలు ఏర్పడకపోవడం. 2. కొందరిలో ఇవి ఏర్పడినప్పటికీ వారి మెదళ్లపై ఎలాంటి ప్రభావాన్నీ చూపకపోవడం.

నవ యవ్వనంగానే మెదడు నిర్మాణం: వార్ధక్య మెదడుకు భిన్నంగా సూపర్ ఏజర్లలోని కార్టెక్స్ (మెదడులోని వెలుపలి భాగం) గణనీయ స్థాయిలో పలుచబడుతున్న దాఖలాలు లేవు. వీరిలో యాంటీరియర్ సింగులేట్ కార్టెక్స్.. యువకుల కన్నా దళసరిగా ఉంది. ఇది మెదడులో కీలక భాగం. నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగం, ప్రేరణతో ముడిపడిన సమాచారాన్ని అనుసంధానించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

విశిష్ట కణ లక్షణాలు: సూపర్ ఏజర్లలో వాన్ ఎకనోమో నాడీ కణాలు ఎక్కువగా ఉన్నాయి. సామాజిక వ్యవహారశైలితో ఇవి ముడిపడి ఉన్నాయి. అలాగే భారీగా ఎంటోర్హైనల్ న్యూరాన్లు ఉన్నాయి. ఇవి జ్ఞాపకశక్తికి కీలకం.

- ఈనాడు ప్రత్యేక విభాగం

కావాల్సినంత మేరకే కాలువల నుంచి నీళ్లు

- ● శాటిలైట్ డేటా ఆధారంగా అవసరాల గుర్తింపు
- ● కాలువల నిర్వహణకు పక్కా వ్యవస్థ రూపకల్పన

ఈనాడు–అమరావతి: రాష్ట్రంలో కాలువల నిర్వహణ వ్యవస్థను శాస్త్రీయంగా రూపుదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా ఖరీఫ్, రబీ కాలాల్లో నిర్ణయించిన మేరకు గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, వంశధార వంటి డెల్టా వ్యవస్థలోనే కాకుండా ఇతరత్రా కూడా ఆయకట్టుకు కాలువల ద్వారా నీళ్లు అందిస్తుంటారు. కొన్నిసార్లు చివరి ఆయకట్టుకు నీళ్లందక రైతులు విలవిల్లాడిన పరిస్థితులు ఉంటున్నాయి. మరికొన్నిసార్లు భూగర్భజలాలను అవసరానికి మించి వినియోగించి నష్టపోతున్నారు. వీటన్నింటినీ అధిగమించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా నీళ్లు ఇచ్చే వ్యవస్థకు రూపకల్పన చేస్తోంది. ముఖ్యమంత్రి జలవనరుల శాఖ అధికారులతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఈ అంశాలపై చర్చించారు. 'ఏపీ వారిమ్స్' ఈ ప్రణాళిక రూపకల్పనపై దృష్టి సారిస్తోంది.

ఏమిటీ తాజా విధానం?


- ✦ ఏ కాలంలో ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో శాటిలైట్ డేటా ఆధారంగా లెక్కలు తీస్తారు. పంట ఎక్కడ ఏ దశలో ఉందో కూడా సమాచారం సమీకరిస్తారు. ఏ సమయంలో ఎంత నీరు అవసరం ఉందో లెక్కలు వేస్తారు.
- ✦ నీటి అవసరం, పంటల రకం, వాతావరణ సరళి ఆధారంగా అంచనాలు రూపొందిస్తారు.
- ✦ పంటలు వేసిన పొలాల్లో నీటి తేమ ఎంత ఉందో సెన్సర్ల ద్వారా సమాచారం సేకరిస్తారు.
- ✦ కాలువల్లో నీటి మట్టాలు తెలుసుకునేందుకు సెన్సర్లు ఏర్పాటు చేస్తారు. ఏ కాలువలో ఎంత నీరు ప్రవహిస్తోందో గమనిస్తారు.
- ✦ ప్రస్తుత, భవిష్యత్తు నీటి డిమాండ్‌ను లెక్కించి విడుదల ప్రణాళిక రూపొందిస్తారు.
- ✦ పంట సాగు చేసినచోట ఎంత తేమ ఉంది? ఆ పంట ఏ దశలో ఉంది? ఇంకా ఎంత నీటి అవసరం ఉంది? వర్షం పడే అవకాశం ఉందా, పడితే ఆ తడి సాగుకు సరిపోతుందా అనే అంశాలను పరిశీలిస్తారు.
- ✦ వీటి ఆధారంగా కాలువల నుంచి ఎంత మేర నీరు, ఎక్కడికి సరఫరా చేయాలనే ప్రణాళిక రూపొందిస్తారు.
- ✦ ఎక్కడైనా లోటు ఉంటుందని గమనిస్తే అక్కడ బోర్ల ద్వారా నీటి వినియోగంపై దృష్టి సారిస్తారు.

వైద్యులకు రూ.2.50 కోట్లకు సైబర్ నేరగాళ్ల టోకరా!

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు వైద్యులకు టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వరంగల్ కమిషనరేట్ సైబర్ విభాగం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత వారం కిందట హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన వైద్యులకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మోనార్క్ నెట్‌వర్క్ క్యాపిటల్ పేరుతో ప్రకటన వచ్చింది. ముగ్గురు వైద్యులు వేర్వేరుగా దానిని తెరిచి చూసి అందులో తమ వివరాలను పొందుపర్చారు. కొద్దిసేపటి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు వాట్సప్ ద్వారా వైద్యులకు కాల్ చేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని చెప్పి వారి వాట్సప్ గ్రూప్‌లో వైద్యుల నంబర్లను యాడ్ చేశారు. ముందుగా వైద్యులు కొంత డబ్బులు పెట్టుబడి పెట్టగా..కొంత తిరిగి చెల్లించారు. వాట్సప్ గ్రూప్‌పై నమ్మకం పెరిగిన తర్వాత మరిన్ని డబ్బులు పెట్టుబడి పెట్టాలని చెప్పడంతో ముగ్గురు వైద్యులు వేర్వేరుగా సుమారు రూ.2.50 కోట్లు పెట్టుబడి పెట్టారు. సదరు నగదు ఆ గ్రూపునకు సంబంధించిన ఖాతాలో కనిపిస్తున్నా వాటిని తీసుకునే వీల్లేకపోవడంతో మోసపోయామని గ్రహించిన వైద్యులు ఈ నెల 3న వరంగల్ కమిషనరేట్ సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం దర్యాప్తు చేపట్టారు.

3 కోర్ బ్రాంచీలుంటేనే అదనపు బీటెక్ సీట్లు

- ● ఏప్రిల్ 30 నాటికి ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతులు జారీ
- ● ఆగస్టు 14 నుంచి ఫస్టియర్ తరగతులు ప్రారంభం: ఏఐసీటీఈ వెల్లడి



బీటెక్ సీట్లు పెంచుకోవాలంటే ఈసారి కేవలం నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) ఉంటే సరిపోదు. కచ్చితంగా మూడు కోర్ ఇంజినీరింగ్ బ్రాంచ్ కోర్సులు తప్పనిసరి. ఇప్పటికే ఈ నిబంధన ఉన్నా అందులో కనీసం రెండు కంప్యూటరేతర బ్రాంచీలు తప్పనిసరిగా ఉండాలి. ఈ మేరకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం(2026-27) ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతుల విధాన పత్రాన్ని తాజాగా విడుదల చేసింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌కు సంబంధం లేనివి కనీసం రెండు కోర్ బ్రాంచీలు ఉంటేనే అదనపు సీట్లు మంజూరు చేస్తామని పేర్కొంది.

కోర్ బ్రాంచీలను మూసివేస్తున్నారని, ఇంజినీరింగ్ కళాశాల అంటే కంప్యూటర్ సైన్స్ అన్నట్లు పరిస్థితి మారిపోయిందన్న ఆందోళన నిపుణుల్లో వ్యక్తమవుతోంది. కోర్ అయిన ఈసీఈ, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ వంటి వాటి స్థానంలో సీఎస్ఈ- ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర స్పెషలైజేషన్లను ప్రవేశపెడుతున్నారు. ఈక్రమంలోనే ఏఐసీటీఈ ఈ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది వరకు ఎన్‌బీఏ గుర్తింపు ఉంటే అదనపు సీట్లు పెంచుకునే వీలుండేది. ఈసారి నుంచి అది కుదరదు.

ముందుగానే అనుమతులు...

ఏఐసీటీఈ జారీ చేసే అనుమతుల షెడ్యూల్‌ను పరిశీలిస్తే ఈసారి చాలా ముందుగానే కళాశాలలకు అనుమతులను జారీ చేయనున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుత సంవత్సరం అది జూన్ వరకు కొనసాగింది. ఈసారి ఏప్రిల్ 30 నాటికి ఏఐసీటీఈ అనుమతులు ఇస్తుంది. ఆయా వర్సిటీలు మే 31 నాటికి అనుబంధ గుర్తింపు జారీ చేయాలి. బీటెక్ ప్రథమ సంవత్సరం తరగతులు ఆగస్టు 14 నుంచి ప్రారంభమవుతాయి.

■ ఇప్పటివరకు వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం సాయంత్రం కోర్సులు ప్రవేశపెట్టాలంటే ఆ కళాశాలలో మూడేళ్ల పాటు రెగ్యులర్ సీట్లు సగటున 80 శాతం నిండాలి. అప్పుడే ఏఐసీటీఈ అనుమతి ఇచ్చేది. ఈసారి ఆ నిబంధనను ఎత్తివేశారు. నిబంధనల ప్రకారం కళాశాలలు నడుపుతుంటే చాలు... సాయంత్రం కోర్సులను మంజూరు చేస్తారు.

■ అనుభవపూర్వక అభ్యసన కోర్సులను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టనున్నారు. అంటే పరిశ్రమల్లోనే 50 శాతం అనుభవాన్ని పొందుతారు. లేదా పని ఆధారంగా నేర్చుకుంటారు. అక్కడ ప్రాజెక్టు ఆధారంగా నేర్చుకోవడం, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమల ఎసైన్‌మెంట్లు చేస్తుంటారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్(ఉద్యోగులు) లేదా నైపుణ్యాలను పెంచుకునే వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ జాబితాలో ఉన్న వాటికే ఈ కోర్సులకు అనుమతిస్తారు. ఆ కళాశాలలు రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న పరిశ్రమలతో ఎంఓయూ కుదుర్చుకోవాల్సి ఉంటుంది. సిలబస్ సైతం కళాశాలలు, పరిశ్రమల నిపుణులు కలిసి రూపొందిస్తారు.

■ ఇప్పటివరకు యూజీ, పీజీ కోర్సుల్లో విదేశీ విద్యార్థులకు సూపర్‌న్యూమరరీ కింద 15 శాతం సీట్లు కేటాయించేవారు. ఇక నుంచి ఇంజినీరింగ్ పీజీ, ఇంజినీరింగేతర కోర్సులకు సంబంధించి యూజీ, పీజీలో 25 శాతానికి పెంచారు.

- ఈనాడు, హైదరాబాద్



కశ్మీర్‌లో మైనస్ 4.3

దిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో చలి చంపుతోంది. అమర్‌నాథ్ యాత్ర బేస్ క్యాంపు వద్ద ఆదివారం మైనస్ 4.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లలో 3 నుంచి 7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో సోమ, మంగళవారాల్లో చలి తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని ఐఎండీ వెల్లడించింది. దిల్లీలో ఆదివారం కనిష్ఠ ఉష్ణోగ్రత 8 డిగ్రీలుగా ఉంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 24.7 డిగ్రీలుగా నమోదైంది.